అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శనివారం 23-3-2024
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 10 సంచిక : 82
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
14 పేజీలు వెల : 6.50

సీఏఏపై పోరు ఆగదు




- కొజికోడ్ బీచ్ ర్యాలీలో కేరళ సీఎం విజయన్ 6లో..

కవితకు చుక్కెదురు..




- బెయిల్ నిరాకరించిన సుప్రీంకోర్టు
- ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సూచన
- కవిత నిందితురాలు కాదు.. బాధితురాలే
- పార్టీలను, నేతలను లొంగదీసుకునేందుకే ఈడీ దాడులు
- కవిత, కేజ్రీవాల్ అరెస్ట్ అప్రజాస్వామికం : బీఆర్ఎస్ ఎంపీలు

వివరాలు 3లో

ఆరు రోజుల ఈడీ కస్టడీకి కేజ్రీవాల్



- రౌస్ ఎవెన్యూ కోర్టు ఆదేశాలు
- ఈ కేసులో కేజ్రీవాల్ కింగ్‌పిన్
- ఇది రూ. 600 కోట్ల స్కామ్
- కేజ్రీవాల్‌కు అందినవి రూ. 300 కోట్లు : ఈడీ తరపున సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వివరణ
- ఢిల్లీలో ఆప్ ఆందోళనలు... మంత్రుల అరెస్టు

వివరాలు 6లో

టార్గెట్ 14 సీట్లు

మూడంచెలుగా సమన్వయ కమిటీలు



- బూత్ కమిటీలో ఐదుగురు కీలక సభ్యులు
- లోక్‌సభ ఎన్నికలపై కాంగ్రెస్ స్పెషల్ ఫోకస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 14 ఎంపీ సీట్లను గెలిచి తీరాలని కాంగ్రెస్ పార్టీ టార్గెట్‌గా పెట్టుకుంది. అందులో భాగంగా అందుబాటులో ఉన్న పార్టీ ముఖ్య నేతలతో టీపీసీసీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఎన్నికలయ్యేంత వరకు ముఖ్య నేతలందరూ కలిసికట్టుగా బాధ్యతలను పంచుకోవాలనీ, కార్యకర్తల వెన్నంటి ఉండాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. గతంలో తమకు విజయం తెచ్చిపెట్టిన మల్కాజిగిరి ఎన్నికల మోడల్‌ను రాష్ట్రమంతటా అనుసరించా లని ఇప్పటికే పార్టీ ముఖ్యులకు రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు. అందులో భాగంగా ఒకట్రెండు రోజుల్లోనే అన్ని నియోజకవర్గాల్లో సమన్వయ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.

పార్లమెంట్ , అసెంబ్లీ, బూత్ స్థాయిల్లో మూడంచెలుగా పార్టీ సమన్వయ కమిటీలను ఏర్పాటు చేస్తారు. పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కమిటీలో ఏఐసీసీ పరిశీలకులతో పాటు అక్కడి పార్టీ ముఖ్యులు సభ్యులుగా ఉంటారు. రాష్ట్రంలో ఒక్కో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. నియోజకవర్గ స్థాయి కమిటీలో ఎమ్మెల్యే లేదా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ, ప్రతి మండలం నుంచి ముఖ్య నేతలుంటారు.


బూత్ స్థాయి కమిటీల్లో ఆ పరిధిలోని చురుకైన పార్టీ సభ్యులు ఐదుగురికి అవకాశం కల్పిస్తారు. బూత్ కమిటీలో ఉండే ఐదుగురే ఈ సారి ఎన్నికల్లో అత్యంత కీలక పాత్ర పోషించనున్నారు. ఈ ఎన్నికలకు వీరే సైనికులుగా నిలబడతారని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. పార్టీ అభ్యర్థికి ఆ బూత్‌లో వచ్చిన ఓట్ల సంఖ్య బూత్ కమిటీ సభ్యుల పని తీరుకు ప్రాతిపదికగా ఉంటుందని అన్నారు.

బూత్ కమిటీల్లో ఉన్న సభ్యులకు భవిష్యత్తులో తగిన గుర్తింపునిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య నేతలతో ఈ సందర్భంగా చెప్పారు. పనితీరును బట్టి త్వరలో నియమించే ఇందిరమ్మ కమిటీల్లో వారికే ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామ స్థాయిలో ప్రభుత్వ పథకాల అమలు, అర్హులైన లబ్దిదారుల ఎంపికను పర్యవేక్షించే బాధ్యతలను నిర్వహించేందుకు ఆయా కమిటీలను ఏర్పాటు చేస్తామంటూ సీఎం ఇప్పటికే ప్రకటించిన సంగతి తెలిసిందే.

ప్రతిపక్షాలే లక్ష్యంగా..

కేంద్ర ఏజెన్సీలతో దాడులు

- లోక్‌సభ ఎన్నికల ముందు బీజేపీ వ్యూహాలు
- రాజకీయంగా గుప్పెట్లో పెట్టుకునే యత్నాలు
- లిక్కర్ స్కామ్‌లో ఇప్పటికే కేజ్రీవాల్ సహా పలువురు ముఖ్యనేతల అరెస్ట్
- భూ-కుంభకోణంలో జార్ఖండ్ సీఎం హేమంత్ సొరెన్
- మహారాష్ట్రలో సంకీర్ణ ప్రభుత్వంలోకి అజిత్ వర్గం
- తమిళనాడులోని డీఎంకే నాయకులపై దాడులు
- 'ఇండియా' కూటమిని బలహీనపర్చే యత్నం
- ఇలాంటి చర్యలతో బీజేపీపై ప్రజల్లో అసంతృప్తి
- రాజకీయ పరిశీలకులు, మేధావుల విశ్లేషణ



భారత్‌లో లోక్‌సభ ఎన్నికలు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల తేదీలు దగ్గరపడుతున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ నేతృత్వ ఎన్డీయే ప్రభుత్వం ఎలాగైనా మళ్లీ అధికారంలోకి రావాలని చూస్తున్నది. 400కు పైగా లోక్‌సభ సీట్లను గెలవటమే లక్ష్యంగా పెట్టుకున్నది. సిద్ధాంత పార్టీగా గొప్పలు చెప్పుకునే ఆ పార్టీ.. అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నది. ఇతర పార్టీల నుంచి నాయకులను తీసుకొచ్చి టికెట్లు ఇస్తున్నది. సొంత పార్టీ నాయకులనే చిన్న చూపు చూస్తున్నది. ఇక కేంద్ర దర్యాప్తు సంస్థలను బీజేపీ తన రాజకీయ లబ్ది కోసం ప్రత్యర్థులపై ఆయుధంగా వాడుకుంటున్నది.

న్యూఢిల్లీ : సీబీఐ, ఈడీ, ఐటీ సంస్థలను ప్రతిపక్ష పార్టీల నాయకులపై ఉసిగొల్పుతూ, వారిపై కేసులు బనాయిస్తూ జైళ్లకు పంపేలా మోడీ సర్కార్ వ్యూహాలు పన్నుతున్నది. నాయకులను బెదిరించి పార్టీల్లో చీలికలు తేవటం, ప్రభుత్వాలు కూల్చటం, నాయకులను తమ పార్టీలోకి చేర్చుకోవటం వంటి చర్యలను...13లో

మోడీ జేబు సంస్థగా ఈడీ



- అరెస్టులు, వేధింపులతో కూటమిని బలహీనపర్చాలన్నదే బీజేపీ కుట్ర
- ఎన్నికల బాండ్లతో మోడీ సర్కార్ క్విడ్ ప్రోకో : సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ప్రతిపక్ష నేతలను వేటాడేందుకు బీజేపీ ప్రభుత్వం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)ను ఉపయోగిస్తోందని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్ విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం నాడిక్కడ బృందా కరత్ మీడియాతో మాట్లాడుతూ ...13లో

కేకే ఇంటికి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ




- దీపాదాస్ మున్షీతో మాటామంతి
- కేశవరావు పార్టీ మారతారని ప్రచారం?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కె.కేశవరావును కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ కలిశారు. శుక్రవారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని కేకే నివాసానికి ఆమెతో పాటు ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు రోహిన్‌రెడ్డి వెళ్లారు. దాదాపు 40 నిమిషాల పాటు జరిగిన రాజకీయ చర్చల్లో జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి కూడా పాల్గొన్నారు. లోక్‌సభ ఎన్నికల అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు సాగుతున్న సమయంలో కేకేను కాంగ్రెస్ నేతలు కలవడం రాజకీయంగా ప్రాధాన్యతను సంతరించుకుంది. కేకేతో పాటు ఆయన కూతురు, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి కూడా పార్టీ మారే అవకాశాలు ఉన్నట్టు ప్రచారం జరుగుతోంది. రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్‌లో చేరికలు ఊపందుకున్న సంగతి తెలిసిందే. చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, వికారాబాద్ జిల్లా పరిషత్ చైర్మెన్ సునీతా మహేందర్‌రెడ్డి, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హస్తం పార్టీలో చేరి లోక్‌సభ టికెట్లు దక్కించుకున్నారు. ఈ నేపథ్యంలో...13లో

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు..

కేజ్రీవాల్ అరెస్టుపై కేసీఆర్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆప్ అధినేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేసిన నేపథ్యంలో దేశ చరిత్రలో గురువారం మరో చీకటి రోజుగా మిగిలిపోనుందని మాజీ సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టుగా పరిణమిస్తున్న బీజేపీ చర్యలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. ఈ మేరకు కేసీఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. కేజ్రీవాల్ అరెస్టును ఒక రాజకీయ ప్రేరేపిత చర్యగా ఆయన అభివర్ణిం చారు. ఢిల్లీ సీఎంపై నమోదు చేసిన అక్రమ కేసులను వెంటనే వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన్ను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రతిపక్షాలను నామరూపాల్లేకుం...13లో

బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన

- నాగర్ కర్నూల్‌కు ఆర్ఎస్పీ..
- మెదక్‌కు వెంకట్రామిరెడ్డి

వివరాలు 13లో

మోడీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులపై నేడు నిరసన కార్యక్రమాలు



వామపక్ష పార్టీల సమావేశం పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులకు వ్యతిరేకంగా శనివారం నిరసన కార్యక్రమాలను చేపట్టాలని వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. వాటిని జయప్రదం చేయాలని కోరాయి. వామపక్ష పార్టీల సమావేశాన్ని హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు గోవర్ధన్ అధ్యక్షతన శుక్రవారం...13లో

రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

ఎకరానికి రూ.20 వేల నష్టపరిహారం ఇవ్వాలి



- ఎండిన పొలాలను పరిశీలించిన మాజీమంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

నవతెలంగాణ-భూదాన్‌పోచంపల్లి

పంటలు ఎండిపోయి తీవ్రంగా నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం యాదాద్రిభువనగిరి జిల్లా పోచంపల్లి మండల పరిధిలోని దోతిగూడెం గ్రామంలో ఎండిన పంటపొలాలను పరిశీలించి రైతులను ఓదార్చారు. ఈ సందర్భంగా ఆయన...13లో

మే 7 నుంచి ఎప్‌సెట్

11 వరకు నిర్వహణ

- జూన్ 5,6 తేదీల్లో ఐసెట్
- పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో షెడ్యూల్‌లో సవరణ : ఉన్నత విద్యామండలి చైర్మెన్ లింబాద్రి



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ (ఎంసెట్) రాతపరీక్షల షెడ్యూల్‌ను ఉన్నత విద్యామండలి సవరించింది. పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. మే తొమ్మిది నుంచి 12 వరకు ఎప్‌సెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో...13లో

సిగరెట్టు ప్యాకెట్లలో డ్రగ్స్



బొల్లారం పీఎస్ఎన్ మెడికేర్ ప్రయివేట్ లిమిటెడ్‌లో అధికారుల సోదాలు

- రూ.9 కోట్ల డ్రగ్స్ పట్టివేత
- ముగ్గురి అరెస్ట్

నవతెలంగాణ - ఐడీఏ బొల్లారం

సంగారెడ్డి జిల్లా బొల్లారం పారిశ్రామికవాడలో డ్రగ్స్ కలకలం రేపింది. పారిశ్రామిక వాడలోని పీఎస్ఎన్ మెడికేర్ ప్రయివేట్ లిమిటెడ్ పరిశ్రమలో శుక్రవారం ఇంటర్ పోల్ సమాచారంతో అధికారులు దాడులు చేపట్టారు. పరిశ్రమల్లో...13లో

భారత స్టార్టప్‌లకు పైసల కష్టాలు



ఫండింగ్‌కు విదేశీ సంస్థల విముఖత

తగ్గించుకుంటున్న పెట్టుబడులు

- నిరుత్సాహంలో ఔత్సాహికవేత్తలు

భారత్‌లోని స్టార్టప్ సంస్థలు గడ్డుకాలాన్ని ఎదుర్కొంటున్నాయి. నిధుల సమీకరణలో తీవ్ర సవాళ్లను చవి చూస్తున్నాయి. గతేడాది నిధుల లభ్యత భారీగా తగ్గిపోయింది. భారత ఆర్థిక వ్యవస్థ దూసుకుపోతోందని మోడి ప్రభుత్వం చేస్తున్న ప్రచారానికి.. స్టార్టప్‌ల్లో పెట్టుబడులకు పొంతన లేకుండా పోతోంది. ఒకప్పుడు భారతీయ టెక్ వెంచర్లలో వందల కోట్ల డాలర్ల పెట్టుబడికి ఆసక్తిని చూపిన ఇన్వెస్టర్లు ఇటీవల నెమ్మదించారు. దీంతో నిధుల కొరతతో ఔత్సాహిక వ్యాపారవేత్తలు నిరాశ చెందుతున్నారు.

న్యూఢిల్లీ : ప్రముఖ డిజిటల్ చెల్లింపుల వేదిక పేటియంలో చోటు చేసుకున్న పరిణామాలు ఇన్వెస్టర్లల్లో విశ్వాసాన్ని మరింత దెబ్బతీశాయి. వందలాది ప్రారంభ దశ స్టార్టప్‌ల్లో పెట్టుబడులు పెట్టిన ఇండియాస్ బ్లూమ్ వెంచర్స్ మేనేజింగ్ పార్టనర్ కార్తిక్ రెడ్డి గతేడాదిలో 12 డీల్‌లతో పోలిస్తే ఈ ఏడాది దాదాపు ఎనిమిది మాత్రమే కొత్త ఒప్పందాలు చేయాలని తమ సంస్థ యోచిస్తోందని చెప్పారు. మరిన్ని కంపెనీలలో నిధులను విస్తరించడానికి బదులుగా తనకు నమ్మకంగా ఉన్న సంస్థలలో పెద్ద మొత్తాలను పెట్టుబడి పెట్టాలని యోచిస్తున్నామన్నారు. ప్రస్తుతం పోర్టుపోలియో లాభాలను పరిశీలించినప్పుడు మరింత ఇన్వెస్ట్ చేయడానికి ఉత్సాహంగా లేమని రాయిటర్స్‌తో ఆయన అన్నారు. రాయిటర్స్ ఇటీవల...13లో

బీజేపీ-బీజేడీ బంధం ముక్కలు

- లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో వేరువేరుగా ఇరు పార్టీల పోటీ



భువనేశ్వర్ : ఒడిషాలో అధికార బిజూ జనతా దళ్ (బీజేడీ), బీజేపీ మధ్య బంధం ముక్కలయింది. రాష్ట్రంలో త్వరలో జరిగే మొత్తం 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ ఎన్నికల స్థానాల్లో ఈ రెండు పార్టీలు వేరువేరుగా పోటీ చేయనున్నాయి. వచ్చే ఎన్నికల్లో ఒడిషాలో బీజేపీ ఒంటరిగానే పోటీ చేస్తుందని పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మన్మోహన్ సమల్ ప్రకటించారు. 'ఈసారి, రాష్ట్రంలోని మొత్తం 21 లోక్‌సభ, 147 అసెంబ్లీ స్థానాల్లో బీజేపీ స్వతంత్రంగా పోటీ చేస్తుంది. ఒడిషాలోని 4.5 కోట్ల మంది ప్రజల ఆశలు, ఆకాంక్షలు సాకారం చేయడమే లక్ష్యం' అని సోషల్ మీడియా ఎక్స్‌లో సమల్ పోస్ట్ చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు ఒడిషాలో క్షేత్రస్థాయికి చేరుకోవడం లేదని, ఒడిషాలో పేద సోదరులు, సోదరీమణులు ప్రయోజనం పొందడం లేదని ఆయన విమర్శించారు. 'మేం అనేక అంశాలపై ముఖ్యంగా ఒడిషా గుర్తింపు, ఒడిషా ప్రైడ్, ఒడిషా ప్రజల ప్రయోజనం.. వంటి అంశాలపై రాష్ట్ర ప్రభుత్వంతో ఏకీభించడం లేదు' అని కూడా తెలిపారు.

అయితే గత పదేండ్లలో అనేక అంశాలపై కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చినందుకు బీజేడీకి కృజత్ఞలు తెలిపారు. అలాగే బీజేడీతో బీజేపీ బంధం ముక్కలైన విషయాన్ని ఆ పార్టీ సీనియర్ నాయకులు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కూడా ధ్రువీకరించారు. సోషల్ మీడియాలో ఈ విషయాన్ని పోస్టు చేశారు. కాగా, ఈ ప్రకటనతో బీజేపీ-బీజేడీతో మధ్య పొత్తుపై గత 17 రోజులుగా కొనసాగుతున్న ఊహాగానాలకు తెరపడినట్లయింది. అయితే ఈ నెల 6న బీజేడీ నుంచి వచ్చిన ఒక ప్రకటనతోనే ఈ రెండు పార్టీల మధ్య పొత్తు ఉండదనే విషయం ప్రజలకు స్పష్టమయింది. '2036 నాటికి అంటే ఒడిషా రాష్ట్రం అవతరించి 100 ఏండ్ల పూర్తయ్యేనాటికి బీజేడీ, ముఖ్యమంత్రి సాధించిన వల్సిన ప్రధాన లక్ష్యాలు ఉన్నాయి.

ఈ లక్ష్యాలు సాధించడానికి, ఒడిషా, ఒడిషా ప్రజల ప్రయోజనాల కోసం చేయాల్సిన ప్రతిదీ బీజేడీ చేస్తోంది' అని ఆ ప్రకటనలో తెలిపింది. కాగా, బీజేడీ- బీజేపీ మధ్య సంబంధాలు తెగిపోవడం ఇదే మొదటిసారి కాదు. ముందుగా 1998 నుంచి 2009 నుంచి ఈ రెండు పార్టీలు ఎన్‌డీఏ కూటమిలో ఉన్నాయి. నవీన్ పట్నాయక్ వాజ్‌పేయ్ క్యాబినెట్‌లో మంత్రిగా కూడా పనిచేశారు. అయితే 2008, 2009లో జరిగిన క్రైస్తవ వ్యతిరేక హింసాకాండతో ఈ రెండు పార్టీలు వీడిపోయాయి. ఈ హింసాకాండను బీజేపీ ప్రోత్సహించడం, పాల్గొనడంతో ఆ పార్టీతో బీజేడీ తెగదెంపులు చేసుకుంది. దీంతో 2009, 2014 ఎన్నికల్లో బీజేపీ ఒంటరిగానే పోటీ చేసింది. దారుణమైన ఫలితాలను ఎదుర్కొంది. మళ్లీ 2019 ఎన్నికల్లో ఈ రెండు పార్టీలు జట్టు కట్టాయి. కలిసి పోటీ చేశాయి.

నేటినుంచి గ్రూప్స్-1 దరఖాస్తుల సవరణ

- ఆన్‌లైన్‌లో 27 వరకు అవకాశం
- టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 దరఖాస్తుల సవరణ ప్రక్రియ శనివారం ఉదయం పది గంటల నుంచి ప్రారంభమవుతుందని తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ప్రకటించింది. ఈ మేరకు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఈ నవీన్ నికోలస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. టీఎస్‌పీఎస్సీ (www.tspsc.gov.in) వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో సవరణ చేసేందుకు ఈనెల 27న సాయంత్రం ఐదు గంటల వరకు అవకాశముందని తెలిపారు. బయోడేటాలో తప్పులు, పేరు, పుట్టిన తేదీ, జెండర్, విద్యార్హతలు, ఫొటో, సంతకం వంటివి మార్పులుంటే చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తు ఫారంలో ఏమైనా మార్పులు చేసుకోవచ్చని వివరించారు. అందుకు సంబంధించిన ధ్రువపత్రాలను అప్‌లోడ్ చేయాలని అభ్యర్థులను కోరారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీఎస్‌పీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1కు 4.03 లక్షల దరఖాస్తులొచ్చాయి. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను జూన్ తొమ్మిదిన, మెయిన్స్ రాతపరీక్షను అక్టోబర్ 21న నిర్వహించనున్నట్టు టీఎస్‌పీఎస్సీ ప్రకటించింది.

సిరిసిల్ల పవర్‌లూమ్ పరిశ్రమను తెరిపించాలి

- కార్మికులకు ఉపాధి కల్పించి ఆత్మహత్యలను నివారించాలి : సీఐటీయూ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సంక్షోభంలోకి కూరుకుపోయి రెండునెలలుగా మూతపడ్డ సిరిసిల్ల పవర్‌లూమ్ పరిశ్రమను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తెరిపించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం టెస్కో ద్వారా కార్మికులకు ఇవ్వాల్సిన రూ.485.89 కోట్ల రూపాయలను వెంటనే విడుదల చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. అక్కడి కార్మికులకు ఉపాధి కల్పించి ఆత్మహత్యలను నివారించాలని కోరింది. ఈ మేరకు శుక్రవారం సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కరాములు, పాలడుగు భాస్కర్ ఒక ప్రకటన విడుదల చేశారు. పరిశ్రమ మూతతో ఉపాధి లేక, ఆర్థిక ఇబ్బందులు తాళలేక వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయని వాపోయారు. ఈనెల 11న సిరిసిల్లలో తడుక శ్రీనివాస్ (42) అనే పవర్‌లూమ్ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని గుర్తుచేశారు. నెల నుంచి కార్మికులు ఆందోళన చేస్తున్నా రాష్ట్ర సర్కారు పట్టించుకోకపోవడం సరిగాదని పేర్కొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు న్యాయం జరిగేలా ఆర్పీఎస్ 2017 ఉండాలి

ఆర్పీఎస్ 2013లోని ఎనామలీస్‌ను సరిచేయాలి

- కనీసవేతనం రూ.26వేలుగా నిర్ణయించాలి
- బేసిక్‌పై ఐదు శాతం ఇంక్రిమెంట్ రేట్‌ను నిర్ణయించాలి : ఆర్టీసీ ఎమ్‌డీకి ఎస్‌డబ్ల్యూఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీ కార్మికులకు న్యాయం చేసేలా ఆర్పీఎస్ 2017ను రూపొందించాలని ఆర్టీసీ యాజమాన్యాన్ని ఎస్‌డబ్ల్యూఎఫ్ కోరింది. 2013లోని ఎనామలీస్‌నూ సరిచేయాలని విన్నవించింది. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఉండేలా నిర్ణయించాలని విజ్ఞప్తి చేసింది. ప్రతిస్థాయిలోనూ బేసిక్‌పై ఐదు శాతం ఇంక్రిమెంట్ రేట్‌ను నిర్ణయించాలని డిమాండ్ చేసింది. శుక్రవారం ఈ మేరకు ఆర్టీసీ ఎమ్‌డీ వీసీ సజ్జనార్‌కు ఎస్‌డబ్ల్యూఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వీరాంజనేయులు, వీఎస్‌రావు వినతిపత్రం అందజేశారు. అందులో ముఖ్యాంశాలను మీడియాకు వివరించారు. ఆర్టీసీ కార్మికులకు ప్రస్తుతం ఉన్న రూ.10,880 కనీస వేతనాన్ని రూ.26 వేలుగా నిర్ణయించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వోద్యోగుల మాదిరిగానే మాస్టర్‌స్కేల్‌ను అమలు చేయాలని కోరారు. ప్రతి స్థాయిలోనూ బేసిక్‌పై 5 శాతం ఇంక్రిమెంట్ రేటును నిర్ణయించాలన్నారు. ప్రతి మూడేండ్లకోసారి ఇంక్రిమెంట్లు మారేలా చూడాలని కోరారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకుని అని రకాల అలవెన్స్‌లను ఐదురెట్లు పెంచాలన్నారు. ఇంటి అద్దె అలవెన్స్ తగ్గింపు వలన ఆర్టీసీ కార్మికులకు జరిగే నష్టాన్ని పూడ్చేందుకు ఫిట్‌మెంట్‌ను 30 శాతానికి పెంచాలని కోరారు.

ఆర్పీఎస్-2017 ఆరియ ర్స్‌ను ఎటువంటి వడ్డీ లేకుండా ఉద్యోగ విరమణ సమయంలో చెల్లిస్తామన్న నిర్ణయం సరిగాదన్నారు. సుదీర్ఘకాలం సంస్థలో పనిచేస్తూ, మరో 15-20 ఏండ్ల తర్వాత రిటైరస్ అయ్యే వారికి ఆనాటికి పెరిగే ధరలు, ద్రవ్యోల్బణాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఆ డబ్బులు అప్పుడు ఏ అవసరానికి ఉపయోగ పడవని తెలిపారు. ఆ నిర్ణయాన్ని మార్చి నాలుగేండ్ల లోపులోనే వడ్డీతో సహా చెల్లించాలని కోరారు. రిజిష్టర్డ్ ట్రేడ్ యూనియన్లతో చర్చించి, సర్వీసు కండిషన్లపై ఒప్పందం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటివరకు విడుదల చేసిన డీఏలను జనవరి, జులై నెలల నుండి వర్తింపచేస్తూ, పేస్కేలు ఏరియర్స్ గణన చేయాలని కోరారు. రిటైర్డ్ ఉద్యోగులకూ దీన్నే వర్తింపజేయాలన్నారు. స్టాగ్నేషన్ ఇంక్రిమెంట్లను 12/20 స్థానంలో 6/12/18/24/30లను అమలు చేయాలని కోరారు. ఎస్‌ఆర్బీఎస్‌కు ఆర్టీసీ యాజమాన్యం ఇవ్వాల్సిన రూ.100 కోట్లను వెంటనే ఇవ్వాలన్నారు. రిటైర్డ్ ఉద్యోగులకు చెల్లించాల్సిన డబ్బులను చెల్లించాలని కోరారు. పీఎఫ్, ఎస్‌ఆర్బీఎస్, ఎస్బీటీల ట్రస్ట్‌బోర్డులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. సీసీఎస్ సంస్థ ప్రతినిధుల కోసం ఎన్నికలు నిర్వహించడానికి యాజమాన్యం అనుమతించాలనీ, సీసీఎస్‌కు చెల్లించాల్సిన రూ.1150 కోట్లను వెంటనే ఇచ్చి కార్మికుల కుటుంబాలకు భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. 2014 నుంచి రావాల్సిన ఎన్‌క్యాష్‌మెంట్‌ను చెల్లించాలనీ, లీవుల పొదుపుపై వున్న సీలింగ్‌ను ఎత్తేయాలని విన్నవించారు. రిటైర్మెంట్ సమయంలో 300 ఎర్న్ లీవులు లేనివారికి వారి ఖాతాలో వున్న మెడికల్ /పర్సనల్ హాఫ్ పే లీవుల నుంచి తీసుకుని చెల్లించాలని కోరారు. రెగ్యులేషన్‌ను సవరించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. బ్రీత్ ఎనలైజర్స్ పరీక్షలో ఎం.వి.యాక్ట్ నిర్దేశిస్తున్న, పోలీసులు పాటిస్తున్న (30ఎం.జి. / 100 ఎంఎల్) ప్రమాణాన్ని ఆర్టీసీ పాటించి, కండీషన్లో లేని బ్రీత్ ఎనలైజర్స్‌తో వేధింపులు ఆపాలనీ, క్రొత్త బ్రీత్ ఎనలైజర్‌లను కొనుగోలు చేయాలని సూచించారు. మహాలక్ష్మి ఉచిత ప్రయాణ పథకం అమలు నేపథ్యంలో అన్ని సర్వీసులకు శాస్త్రీయ పద్ధతిలో రూటు సర్వే ద్వారా రన్నింగ్ టైము నిర్ణయించాలని కోరారు.

రాజకీయకక్షలో భాగంగానే కేజ్రీవాల్ అరెస్ట్

- టీజేఎస్ అధ్యక్షులు, ప్రొఫెసర్ ఎం.కోదండరామ్
- విద్యారంగంపై బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ దాడి: పౌరహక్కుల నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్



నవతెలంగాణ-హిమాయత్ నగర్

ప్రభుత్వ పాఠశాలలను బాగు చేసిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే అరెస్టు చేశారని టీజేఎస్ అధ్యక్షులు ప్రొ.కోదండరామ్ అన్నారు. గుజరాత్‌లో నేరాలు చేసిన వారిని మాత్రం నిర్దోషులుగా క్షమాభిక్ష పెడుతున్నారన్నారు. శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో "ఉద్యమ ఆకాంక్షలు, విద్యా ప్రమాణాలు, ప్రభుత్వ కర్తవ్యాలు" అంశంపై కోదండరామ్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, యూనివర్సిటీల్లో అంతర్జాతీయ స్థాయిలో విద్యా ప్రమాణాలు తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అధ్యాపకులు, యూనివర్సిటీ ప్రొఫెసర్ల పోస్టులను భర్తీ చేయాలని, అన్ని యూనివర్సిటీలకు పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యావ్యవస్థను బలోపేతం చేయడంలో గత ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కేజీ టు పీజీ ఉచిత విద్య నినాదానికే పరిమితమైందని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో విద్యారంగం బలోపేతం అవుతుందనే నమ్మకం ఉందన్నారు. పౌరహక్కుల నేత, ప్రొఫెసర్ జి.హరగోపాల్ మాట్లాడుతూ.. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ విద్యారంగంపై సామాజిక దాడులకు పాల్పడుతున్నాయని విమర్శించారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేస్తే సామాన్యులలో ప్రశ్నించేతత్వం పెరుగుతుందనే దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. యూజీసీకి ఏటా రూ.6 వేల కోట్లు కేటాయించేవారని, వాటిని రూ.2 వేల కోట్లకు తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. కర్ణాటకలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత విద్యుత్ వల్ల ఆదా అవుతున్న డబ్బులను తల్లిదండ్రులు పిల్లల విద్య కోసం కేటాయిస్తున్నామని ప్రకటించడం అభినందనీయమన్నారు. తెలంగాణలోనూ విద్యారంగానికి అనుకూల వాతావరణం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం విద్యారంగాన్ని బలోపేతం చేస్తుందనే నమ్మకం ఉందన్నారు. అందుకోసం విద్యార్థి సంఘాలు, మేధావులు కూడా సంఘటితం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీవీవీ నగర ఉపాధ్యక్షులు డాక్టర్ ఈ.ఉపేందర్, ప్రొఫెసర్ పీఎల్.విశ్వేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న నిరుద్యోగం

- వేతనాలు తగ్గుతున్నాయి
- ఉద్యోగాల్లో కానరాని నాణ్యత
- స్వయం ఉపాధిని వెతుక్కుంటున్న ప్రజానీకం
- మోడీ పదేండ్ల పాలనలో సాధించిన 'ప్రగతి' ఇదే



న్యూఢిల్లీ : ఉద్యోగ కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తామని 2014 లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ తన మేనిఫెస్టోలో ఊదరగొట్టింది. ఉత్పత్తి, మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణ రంగాల్లో ఉద్యోగావకాశాలు అధికంగా ఉన్నాయని, లక్ష్య సాధన కోసం వీటిపై దృష్టి కేంద్రీకరిస్తామని చెప్పింది. అయితే బీజేపీ మాటలకు, దాని చేతలకు ఏ మాత్రం పొంతన ఉండదు.

2017-18లో దేశంలో నిరుద్యోగ రేటు 45 సంవత్సరాల్లో ఎన్నడూ లేనంతగా గరిష్టంగా 6.1%కి పెరిగింది. కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన పీరియాడిక్ లేబర్ సర్వే ప్రకారం ఈ రేటు 2020 ఏప్రిల్-జూన్‌లో...అంటే కోవిడ్ సమయంలో 20.8%కి చేరుకుంది. అయితే అది 2022-23 నాటికి 3.2%కి తగ్గడం కొంత ఊరట కలిగించే విషయం.

ప్రభుత్వం చెబుతున్న లెక్కల కంటే నిరుద్యోగ రేటు బాగా ఎక్కువగా ఉన్నదని సెంటర్ ఫర్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సీఎంఐఈ) అనే ప్రైవేటు సంస్థ తెలిపింది. ఈ సంస్థ నెలవారీగా సర్వేలు నిర్వహిస్తుంది. ఆర్థికవేత్తలు, విధానాలపై పరిశోధనలు చేసే వారు సీఎంఐఈ సమాచారం పైనే ఆధారపడుతుంటారు. ప్రభుత్వం వద్ద తగినంత సమాచారం సకాలంలో లభ్యం కాకపోవడమే దీనికి కారణం. ప్రతి ఏటా నిర్వహించే ఉద్యోగ-నిరుద్యోగ సర్వేను మోడీ ప్రభుత్వం 2017లో రద్దు చేసింది. అంతేకాదు...లేబర్ బ్యూరో అందించే త్రైమాసిక ఎంటర్‌ప్రైజ్ సర్వేను కూడా 2018 మార్చిలో నిలిపివేసింది.

ఉత్పత్తి రంగంలో తగ్గిన ఉపాధి

మోడీ ప్రభుత్వం 2014లో 'మేకిన్ ఇండియా', 2020లో 'ఆత్మనిర్భర్ భారత్' కార్యక్రమాలు చేపట్టింది. కార్మికులకు ఉపాధి కల్పించే ఉత్పత్తి రంగానికి ఊతమివ్వడమే ఈ కార్యక్రమాల ఉద్దేశం. అయితే కేంద్రం ఎన్ని ప్రయత్నాలు చేసినప్పటికీ 2016-2021 మధ్యకాలంలో ఉత్పత్తి రంగంలో ఉద్యోగాలు సగానికి సగం పడిపోయాయి. ఈ రంగంలో ఉపాధి కోవిడ్-19కి ముందున్న కాలం నాటికి తగ్గిపోయిందని విశ్లేషకులు తెలిపారు. ఉత్పత్తి రంగంలో లభించిన ఉద్యోగాల్లో చాలా వరకూ తక్కువ జీతంతో కూడుకున్నవే. ఆ తరహా ఉద్యోగాల వల్ల ఉత్పాదకతలో పెద్దగా మార్పు ఉండదు.

నిర్మాణ రంగంలో పెరుగుతున్న కార్మికులు

మౌలిక సదుపాయాలు, గృహ నిర్మాణ రంగాల్లో ఉద్యోగావకాశాలు అధికంగా ఉన్నాయని 2014 మ్యానిఫెస్టోలో బీజేపీ తెలిపింది. దేశంలోని కార్మికుల్లో 10.6 శాతం మంది మాత్రమే నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారు. ఈ రంగం మౌలిక సదుపాయాలు, హౌసింగ్‌లో ఉద్యోగాలు కల్పిస్తుంది. పీరియాడికల్ లేబర్ ఫోర్స్ తాజా సర్వే ప్రకారం నిర్మాణ రంగంలో ఉపాధి పొందుతున్న కార్మికుల సంఖ్య 2022-23లో 13 శాతానికి పెరిగింది. ప్రస్తుతం దేశంలో ఏడు కోట్ల మందికి పైగా నిర్మాణ రంగంలో పనిచేస్తున్నారు. 2030 నాటికి వీరి సంఖ్య 10 కోట్లకు చేరుతుందని అంచనా.


వ్యవసాయంలో ఉపాధి తప్పుడు సంకేతమే

వ్యవసాయం, దాని అనుబంధ రంగాల్లో సంప్రదాయక ఉపాధి మూలాలను పెంచడమే తన లక్ష్యమని 2014 నాటి బీజేపీ మేనిఫెస్టో చెప్పుకుంది.

స్వయం ఉపాధి బాటలో...

స్వయం ఉపాధి పొందుతున్న కార్మికుల సంఖ్య నానాటికీ పెరుగుతుండడంపై ఆర్థికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ నిర్దేశించిన ప్రమాణాలకు ఇది భిన్నంగా ఉంది. దేశంలోని కార్మికుల్లో స్వయం ఉపాధి పొందుతున్న వారు 2013-14లో 49.5 శాతం మంది ఉండగా 2022-23 నాటికి వారి సంఖ్య 57.3 శాతానికి పెరిగింది. ఇదే కాలంలో నెలవారీ జీతాలు పొందుతున్న వారి సంఖ్య 23.1 శాతం నుంచి 20.9 శాతానికి తగ్గిపోయింది

ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడం, సరైన ఉద్యోగాలు లభించకపోవడం వల్లనే అనేక మంది భారతీయులు స్వయం ఉపాధిని వెతుక్కుంటున్నారు.



ఈ రంగంలో ఉపాధి పెరిగిన మాట వాస్తవమే. అయితే కోవిడ్ సమయంలో ఉపాధి కోల్పోయిన వేలాది మంది పట్టణ, నగర వాసులు గ్రామాల బాట పట్టడమే దీనికి కారణం.

వ్యవసాయ రంగంలో కార్మికుల సంఖ్య పెరగడం తప్పుడు సంకేతమని ఆర్థికవేత్తలు అంటున్నారు. 2004-05, 2011-12 మధ్యకాలంలో అంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వ్యవసాయంలో కార్మికుల వాటా 58.5 శాతం నుంచి 48.9 శాతానికి తగ్గిపోయింది. ఆ తర్వాతి ఐదు సంవత్సరాల్లో కూడా ఈ రేటు మరింత తగ్గి 2018-19లో 42.5 శాతానికి చేరింది. అయితే అప్పటి నుండీ అది పెరుగుతూ 2021-22లో 45.5 శాతానికి చేరుకుంది.

వేతనాల్లో వృద్ధి ఏది?

2014-15, 2021-22 మధ్యకాలంలో దేశంలోని కార్మికుల వేతనాలు (ద్రవ్యోల్బణంతో సర్దుబాటు చేసిన) 1 శాతం కంటే తక్కువే పెరిగాయి. బీజేపీ మేనిఫెస్టో కేంద్రీకరించిన వ్యవసాయం, నిర్మాణ రంగాల్లో వేతనాల పెరుగుదల 0.9 శాతం, 0.2 శాతం మాత్రమే. 2004-05, 2011-12 మధ్యకాలంలో, 2011-12, 2017-18 మధ్యకాలంలో ఆదాయ వృద్ధిని పోల్చుతూ ఓ పరిశోధనా పత్రం 2020లో ప్రచురితమైంది. దీని ప్రకారం 2011-12, 2017-18 మధ్యకాలంలో వేతనాల్లో వృద్ధి జరగలేదు. అంతేకాదు...అనేక ఉపాధి రంగాల్లో వేతనాలు తగ్గాయి కూడా. 2022-23లో గ్రామీణ ప్రాంతాల్లో వాస్తవ వేతన వృద్ధి తిరోగమనంలో ఉన్నదని ఆర్థిక సర్వేలో ప్రభుత్వం అంగీకరించింది.



కాంట్రాక్ట్ వచ్చింది....
విరాళం ఇచ్చింది

న్యూఢిల్లీ : 2019 డిసెంబరులో కాశ్మీర్ లోయలో ఓ టన్నెల్ నిర్మాణానికి లక్నోకు చెందిన ఆఫ్కో ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్ట్ పొందింది. ఈ కంపెనీ గండర్‌బాల్ జిల్లాలో 6.4 కిలోమీటర్ల పొడవైన జడ్-మార్గ్ టన్నెల్ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. దీని నిర్మాణ వ్యయం రూ.2,716 కోట్లు. వాతావరణం ప్రతికూలంగా ఉన్నప్పటికీ సోనామార్గ్ హిల్ స్టేషన్‌కు ఈ టన్నెల్ ద్వారా చేరుకోవచ్చు. శ్రీనగర్-లేహ్ జాతీయ రహదారిపై ఉండడంతో ఇది దేశ భద్రత దృష్ట్యా కూడా వ్యూహాత్మకమైన ప్రాజెక్టే. ప్రాజెక్ట్ కాంట్రాక్ట్ దక్కించుకొని నెల రోజులైనా కాకముందే ఈ కంపెనీ 2020 జనవరి 15న ఒక్కోటీ కోటి రూపాయల విలువైన పది ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది. ఆరు రోజుల తర్వాత ఆ బాండ్లను బీజేపీ నగదుగా మార్చేసుకుంది. 2019 ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూకాశ్మీర్ బీజేపీ నేతృత్వంలోని కేంద్ర పాలన కిందికి వచ్చిన విషయం తెలిసిందే.

ఆఫ్కో ఇన్‌ఫ్రాటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కేవలం 2020లోనే బాండ్లను కొనుగోలు చేయలేదు. 2022లో కూడా రూ.10 కోట్ల విలువైన బాండ్లను కొన్నది. 2023లోనూ అంతే మొత్తంలో బాండ్లను కొనుగోలు చేసింది. అంటే మొత్తంమీద రూ.30 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసి, బీజేపీకి అందజేసిందన్న మాట. ఎన్నికల కమిషన్ గురువారం బయటపెట్టిన వివరాల్లో ఈ సమాచారం ఉంది. ఆఫ్కో నిర్మాణ సంస్థ చేతిలో ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, ఉత్తర భారతదేశంతో పాటు పొరుగున ఉన్న నేపాల్‌లోనూ అనేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు ఉన్నాయి. 2022 జనవరిలో ఈ కంపెనీ రూ.10 కోట్ల విలువైన బాండ్లను బీజేపీకి అందజేసింది. ఏడు నెలల తర్వాత నేషనల్ హైవే అథారిటీ నుండి ఓ కాంట్రాక్ట్ పొందింది.

జీవో 6 రద్దు పట్ల హర్షం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కార్మికులకు వ్యతిరేకంగా ఇచ్చిన జీవో 6ను రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఆదేశాల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నామని తెలంగాణ స్టేట్ పవర్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎంఎ వజీర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సంస్థల చైర్మెన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ఎం రిజ్వీకి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. గత యాజమాన్యానికి ఇదే విషయమై ఎన్నో సార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని వాపోయారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత ఈ జీవోను రద్దు చేయటంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

గులాబీ బోర్డు తొలగింపు

- బీఆర్ఎస్‌కి బై బై చెప్పే సంకేతాలు ఇచ్చిన తెల్లం
- ఇక కార్ స్టీరింగ్ రావులపల్లికే..!



నవతెలంగాణ-భద్రాచలం రూరల్

భద్రాచలం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం హస్తగతమైనట్టేనా.. అంటే అవుననే సంకేతాలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పటికే పలుమార్లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మరో అడుగు ముందుకేసి తన క్యాంపు కార్యాలయం ముందు ఉన్న గులాబీ బోర్డులను తొలగించారు. నెలరోజుల నుంచి బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న తెల్లం.. ఎమ్మెల్సీ కవిత అరెస్టు విషయంలోనూ స్పందించ లేదు. వ్యక్తిగత కారణాలతో బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నానని మీడియా ప్రతినిధులతో స్పష్టత ఇస్తూనే, భద్రాచల నియోజకవర్గ అభివృద్ధి కోసం ఎటువంటి నిర్ణయానికైనా వెనుకాడనని సంకేతాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం తన క్యాంపు కార్యాలయానికి ఉన్న గులాబీ రంగు బ్యానర్లను, బోర్డులను తొలగించారు. దీంతో బీఆర్ఎస్ పార్టీకి బై బై చెప్పినట్టేనన్న సంకేతాలు స్పష్టంగా ఇస్తున్నారని పలువురు అభిప్రాయపడుతున్నారు. అధికారికంగా తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలో చేరటానికి కొన్ని సాంకేతిక సమస్యలు వస్తున్నప్పటికీ రానున్న పార్లమెంటు ఎన్నికల్లో మాత్రం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గెలుపు కోసమే పనిచేస్తారని ఎమ్మెల్యే ప్రధాన అనుచరులు బహిరంగంగానే చెబుతున్నారు.

ఇక కారు స్టీరింగ్ రావులపల్లి చేతికే..?

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు బీఆర్ఎస్ పార్టీని వీడతారన్న స్పష్టమైన సంకేతాల నేపథ్యంలో నియోజకవర్గ పార్టీ బాధ్యతలను సీనియర్ నేత రావులపల్లి రాంప్రసాద్‌కి అప్పజెప్పే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. సీపీఐలో భద్రాచలం డివిజన్ కార్యదర్శిగా పనిచేసిన అనుభవం.. మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్‌కి సమీప బంధువవడంతో పాటు జిల్లా ఇన్‌చార్జి తాతా మధుకి అత్యంత నమ్మకస్తుడిగా రావులపల్లికి పేరుంది. రానున్న కాలంలో ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రతిపక్ష స్థాయిలో పోరాడాలంటే రావులపల్లి రాంప్రసాద్‌కే ఈ నియోజకవర్గ బాధ్యతలు ఇస్తే ప్రజా సమస్యలపై పోరాడేందుకు అవకాశాలు ఎక్కువ లభిస్తాయని ఆ పార్టీ అధినాయకత్వం భావిస్తున్నట్టుగా తెలుస్తుంది. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావుతో నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద స్థాయిలో గులాబీ పార్టీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీకి వలస వెళ్లటం ఖాయమని తెలుస్తోంది. ఇప్పటికే తిప్పన సిద్దులు వంటి సీనియర్ నేత సైతం ఆ పార్టీకి రాజీనామా చేసిన నేపథ్యంలో ఇటువంటి కష్టకాలంలో పార్టీని నిలబెట్టేందుకు రావులపల్లి రాంప్రసాద్ వంటి సీనియర్ నేత సేవలు వినియోగించుకోక తప్పదని భద్రాచల నియోజకవర్గ ఇన్‌చార్జి.. ఎమ్మెల్సీ తాత మధు నిర్ణయానికి వచ్చి ఆ వైపుగానే అడుగులు వేస్తున్నట్టుగా తెలుస్తుంది. రానున్న పార్లమెంట్ ఎన్నికల లోపే కారు స్టీరింగ్ రావులపల్లి చేతికి అప్పజెప్పేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెలుస్తుంది.

కవితకు చుక్కెదురు..

- బెయిల్ నిరాకరించిన సుప్రీంకోర్టు
- ట్రయల్ కోర్టుకు వెళ్లాలని సూచన
- కవిత నిందితురాలు కాదు.. బాధితురాలే
- లిక్కర్ పాలసీపై దర్యాప్తు సంస్థల తీరు సరికాదు
- పార్టీలను, నేతలను లొంగదీసుకునేందుకే ఈడీ దాడులు
- కవిత, కేజ్రీవాల్ అరెస్ట్ అప్రజాస్వామికం : బీఆర్ఎస్ ఎంపీలు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) కస్టడీలో ఉన్న కవితకు సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ కేసులో కవితకు బెయిల్ ఇవ్వడానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. బెయిల్ కోసం ట్రయల్ కోర్టుకు వెళ్లాలని స్పష్టం చేసింది. లిక్కర్ స్కాంలో ఈడీ అరెస్ట్, కస్టడీని సవాల్ చేస్తూ కవిత సోమవారం సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సోదాల పేరుతో ఈడీ అధికారులు తనను అక్రమంగా అరెస్ట్ చేశారని, అనంతరం సీబీఐ స్పెషల్ కోర్టు కస్టడీకి అప్పగించడం రాజ్యాంగ విరుద్ధమని ఆరోపిస్తూ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ ఎంఎం సుందరేశ్‌తో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారించింది. కవిత తరపు సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, విక్రమ్ చౌదరీలు తమ వాదన వినిపించారు. తొలుత సిబల్ వాదనలు ప్రారంభిస్తూ... హైకోర్టుకు వెళ్లాలని మాత్రం సూచించొద్దని ధర్మాసనాన్ని కోరారు. కవితకు వ్యతిరేకంగా ఉన్న ప్రతి స్టేట్మెంట్‌ను ఈడీ అప్రూవర్ల నుంచి సేకరించింది తప్ప, ఒక్క చిన్న ఎవిడెన్స్ కూడా దర్యాప్తు సంస్థల దగ్గర లేదని అన్నారు. గతేడాది సెప్టెంబర్‌లో కవితను నిందితురాలిగా ఈడీ పేర్కొనలేదని, కానీ కవిత అరెస్ట్ రిపోర్ట్‌లో మాత్రం ఆగస్టులో కవితకు వ్యతిరేకంగా పలు ఆధారాలను చూపిందని తెలిపారు. మాగుంట రాఘవ్ ఇచ్చిన స్టేట్మెంట్ ఆధారంగా ఆమెను నిందితురాలిగా పేర్కొంటున్నట్లు వివరించారు. ఈడీ వ్యవహరించిన తీరు, ప్రస్తుత పరిణామాలు తమను కొంత కలిచి వేశాయన్నారు. దీనిపై స్పందించిన జస్టిస్ సంజీవ్ ఖన్నా, ఉద్వేగానికి గురి కావొద్దని సూచించారు. బెయిల్ విషయంలో ట్రయల్ కోర్టుకు వెళ్లాలని స్పష్టం చేశారు. అయితే జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ విషయంలో ట్రయల్ కోర్టుకు వెళ్తే ఏం జరిగిందని సిబల్ వాదనలు కొనసాగించారు. ట్రయల్ కోర్టులో ఏం జరగడం లేదన్నారు. ఈ వ్యాఖ్యలపై మరోసారి స్పందించిన ధర్మాసనం, కవిత రాజకీయ వ్యక్తి అయ్యినంత మాత్రాన ఆమె పిటిషన్‌ను నేరుగా స్వీకరించలేమని స్పష్టం చేసింది.

మధ్యలో కవిత తరపు మరో న్యాయవాది విక్రమ్ చౌదరి వాదిస్తూ... కవిత దాఖలు చేసిన గత పిటిషన్ అంశాలను ప్రస్తావించారు. ఆ పిటిషన్ పై విచారణ సందర్భంగా కవితను అరెస్ట్ చేయబోమని ఈడీ హామీ ఇచ్చిందని, అయితే అందుకు భిన్నంగా అధికారులు వ్యవహరించారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలపై జస్టిస్ బేలా ఎం త్రివేది స్పందిస్తూ... కవిత వేసిన ఆ పిటిషన్ పై ఎలాంటి తాత్కాలిక ఉపశమనం లేదన్నారు. తరువాత 4, 5 సార్లు విచారణ వాయిదా పడిందని గుర్తు చేశారు. ఈ సమయంలో ఎలాంటి అభ్యంతరాలను లేవనెత్తలేదని, దీంతో ఈడీ ఇచ్చిన స్టేట్మెంట్‌లో ఇంటర్ లింకింగ్ ఏర్పడిందని అన్నారు. ఈ నెల 19న ఈ కేసు చివరిసారి విచారణకు వచ్చిన సందర్భంలోనూ ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా, పిటిషన్ ఉపసంహరించు కున్నారని అన్నారు. మరోవైపు కవిత పిటిషన్‌లో లేవనెత్తిన రాజ్యాంగపరమైన అంశాలను పరిగణలోకి తీసుకున్న ధర్మాసనం, ఈడీకి నోటీసులు జారీ చేసింది. ఆరు వారాల్లో కవిత పిటిషన్ పై కౌంటర్ దాఖలు చేయాలని ఈడీని ఆదేశించింది. ఈడీ సమాధానంపై రిజాయిండర్ దాఖలు చేసేందుకు పిటిషనర్‌కు మరో ఆరు వారాల సమయం ఇచ్చింది.

కవిత నిందితురాలు కాదు.. బాధితురాలే

ఎమ్మెల్సీ కవిత నిందితురాలు కాదని, బాధితురాలని బీఆర్ఎస్ ఎంపీలు పేర్కొన్నారు. ప్రయివేటీకరణకు అనుబంధంగా పాలసీలు మారినప్పుడు, ఆకర్షణీయంగా ఉన్న విధానాలను బట్టి వ్యాపారం చేసేందుకు ఎవరైనా వస్తారని బీఆర్ఎస్ ఎంపీ నామా నాగేశ్వర్ రావు అన్నారు. అలాంటి ఆకర్షణ రీతిలో ఉన్న లిక్కర్ పాలసీపై ఈడీ వ్యవహరిస్తోన్న తీరు సరికాదన్నారు. లిక్కర్ స్కాంలో కవిత, కేజ్రీవాల్ అరెస్టులను ఖండిస్తూ శుక్రవారం నాడిక్కడ బీఆర్ఎస్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, కేఆర్ సురేశ్ రెడ్డి, వద్ది రాజు రవిచంద్ర, మన్నె శ్రీనివాస్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. కేంద్రం, రాష్ట్రంలో ప్రభుత్వాలు మారిన తరువాత పాలసీలు మార్చుకుంటాయని, కొత్త చట్టాలు తెస్తాయని అన్నారు. లిక్కర్ విధానం అనేది ఢిల్లీ సర్కార్ తెచ్చిన గవర్నమెంట్ పాలసీ అని తెలిపారు. కేంద్రంలోని బీజేపీ సర్కార్ కూడా గత పదేండ్లలో బొగ్గు గనులు, ఎయిర్ పోర్ట్‌లు, రోడ్లను ప్రయివేటీకరించిందని చెప్పారు. అయితే దేశ చరిత్రలో తొలిసారి కేంద్రంలోని అధికార పార్టీ పెద్ద ఎత్తున రాజకీయ కక్ష సాధింపునకు పూనుకుందని విమర్శించారు. అందులో భాగంగానే కవిత, కేజ్రీవాల్ అరెస్ట్ జరిగిందన్నారు. దేశంలోని ప్రాంతీయ పార్టీలను బలహీనం చేసి, లొంగదీసుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఎన్డీఏలో మొదటి నుంచి మిత్ర పక్షంగా ఉన్న శివసేన, అకాళీదల్‌ను కూడా బీజేపీ ఇబ్బందిపెట్టిందని గుర్తు చేశారు.


(ఫైల్)

లొంగని నేతలు, పార్టీలపై కక్ష సాధింపు... కేఆర్ సురేశ్ రెడ్డి

బీజేపికి లొంగని రాజకీయ పార్టీలు, పొలిటికల్ లీడర్లపై రాజకీయ కక్ష స్పష్టంగా కనిపిస్తుందని కేఆర్ సురేశ్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఈడీ సోదాలు రీజనల్‌గా జరిగాయని, ఇప్పుడు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వాటిని ఢిల్లీకి తీసుకొచ్చారని ఆరోపించారు. కవితకు డబ్బు ముట్టినట్టు, ఆమె ఖాతాలో పడ్డట్టు ఎక్కడ ఆధారాలు లేవన్నారు. చట్టంపై తమకు పూర్తి నమ్మకం ఉందని, కవితకు న్యాయ జరుగుతుందని అన్నారు. ఒకవైపు శక్తి పేరిట మహిళా లోకాన్ని గౌరవిస్తామని చెబుతోన్న మోడీ, మరో పక్క అదే ప్రభుత్వంలోని దర్యాప్తు సంస్థలు రాత్రి పూట మహిళైన కవితను అరెస్ట్ చేశాయని చెప్పారు.

రెండేండ్లు సాగదీత : వద్ది రాజు

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసు అంశాన్ని దాదాపు రెండేండ్లుగా బీజేపీ సర్కార్ టీవీ సీరియల్‌లాగా సాగదీసిందని ఎంపీ వద్దిరాజు రవిచంద్ర అన్నారు. తద్వారా లోక్‌సభ ఎన్నికల ముందు బీఆర్ఎస్‌ను బద్నాం చేసేందుకు కుట్ర పన్నిందని ఆరోపించారు. 2004 నుంచి 2014 వరకు దేశంలో కేవలం 150 -200 సీబీఐ, ఈడీ కేసులు ఉంటే... గత పదేండ్లలో ఆ కేసుల సంఖ్య 2954కు పెరిగిందని వివరించారు. కవిత బాధితురాలే కానీ, నిందితురాలు కాదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈడీ, సీబీఐ, ఐటీ సంస్థలను రిమోట్‌గా వాడుకొని రాష్ట్ర ప్రభుత్వాలను కూల్చాలని చూస్తోందని ఎంపీ మన్నె శ్రీనివాస్ రెడ్డి విమర్శించారు. తెలంగాణ, ఢిల్లీపై ఈడీ అరెస్‌ల పేరుతో అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు.

సుప్రీం ఆదేశాలను పట్టించుకోని పార్టీలు

దాతల వివరాలు ఇచ్చేందుకు విముఖత




న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది ఎవరు? వారు ఏ పార్టీకి విరాళాలు అందించారు? అనే ప్రశ్నలపై గత కొంతకాలంగా నెలకొన్న సస్పెన్స్‌కు ఎట్టకేలకు తెరపడింది. కీలకమైన యూనిక్ నెంబర్లను ఎస్‌బీఐ అందజేయడం, వాటిని వెంటనే ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైటులో ఉంచడం జరిగిపోయింది. అయితే యూనిక్ బాండ్ నెంబర్లను ఎస్‌బీఐ అందజేసే వరకూ దేశ పౌరులు ఎందుకు ఎదురు చూడాల్సి వచ్చింది అనేదే ఇక్కడ ప్రశ్న. ఎన్నికల బాండ్లపై ఉండే యూనిక్ నెంబర్లను బహిర్గతం చేయాల్సిందిగా ఈ నెల 18న ఎస్‌బీఐని సుప్రీంకోర్టు ఆదేశించింది. అయితే 2019 ఏప్రిల్ 12వ తేదీకి ముందు జారీ చేసిన బాండ్లకు సంబంధించి ఎస్‌బీఐకి ఆదేశాలు ఇచ్చేందుకు నిరాకరించింది. అలా చేస్తే ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధమంటూ ఫిబ్రవరి 14న ఇచ్చిన తీర్పును తిరగదోడడమే అవుతుందని తెలిపింది.

ఈ కేసులో 2019, 2023 సంవత్సరాల్లో సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఎన్నికల కమిషన్‌కు పూర్తి వివరాలు అందజేయాలని ఆ ఆదేశాలు చెబుతున్నాయి. ఏయే పార్టీలకు ఎవరు ఎంత మొత్తంలో విరాళాలు అందించారో చెప్పాల్సిన బాధ్యతను ఎన్నికల కమిషన్, రాజకీయ పార్టీలపై ఉంచాయి.

బీజేపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేడీ మినహా కొన్ని పార్టీలు తమకు అందిన విరాళాల సమాచారాన్ని సీల్డ్ కవరులో ఈసీకి అందజేశాయి. ఎన్సీపీ, ఆమ్‌ఆద్మీ, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, జనతాదళ్ (యు), గోవా ఫార్వర్డ్ పార్టీ, జనతాదళ్ (ఎస్), సిక్కిం డెమొక్రటిక్ పార్టీ 2019 మేలో ఎన్నికల కమిషన్‌కు అన్ని వివరాలూ అందజేశాయి. గత సంవత్సరం సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలు ఇచ్చిన తర్వాత డీఎంకే, అన్నా డీఎంకే పార్టీలు దాతల పేర్లు సహా వివరాలన్నీ సమర్పించాయి. అయితే బాండ్ల ద్వారా అత్యధికంగా విరాళాలు అందుకున్న బీజేపీ మాత్రం సుప్రీంకోర్టు మధ్యంతర ఆదేశాలను బేఖాతరు చేసింది. కీలక సమాచారాన్ని ఇవ్వకపోవడాన్ని సమర్థించుకుంది. బాండ్ల పథకంలోని నిబంధనలను సాకుగా చూపింది. దాతల వివరాలు గోప్యంగా ఉంచాల్సిన అవసరం ఉన్నదని తెలిపింది. ఈ నెల 18న సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం పార్టీలు అందజేసిన సీల్డ్ కవర్లను ఎన్నికల కమిషన్ తెరిచింది. తృణమూల్ కాంగ్రెస్, కాంగ్రెస్, టీడీపీ, వైసీపీ, బీఆర్ఎస్, బీజేడీ పార్టీలు కూడా తమకు బాండ్లను ఎవరు అందజేశారో వెల్లడించలేదు. 2019లో సుప్రీంకోర్టు ఇచ్చిన మధ్యంతర ఆదేశాలలోని కీలక కోణాన్ని ఆ పార్టీలు విస్మరించాయి. బడా పార్టీలు సీల్డ్ కవర్లలో సైతం సమాచారాన్ని ఇవ్వకపోవడంతో సార్వత్రిక ఎన్నికలకు ముందు కీలకమైన సమయాన్ని కోల్పోవాల్సి వచ్చింది.

సంపాదకీయం

ఎందుకింత భయం?



భయపడుతున్నట్టున్నారు..! సమస్త వనరులు, సకల సంపదలు, సర్వాధికారాలు వారి కనుసన్నల్లోనే ఉన్నాయి కదా.. అయినా ఎందుకీ భయం? బహుశా వారికి విజయం పట్ల నమ్మకం సన్నగిల్లుతోంది కాబోలు..! తమ పదేండ్ల పాలనా వైఫల్యాలు ప్రజాజీవితాన్ని, ప్రజాస్వామ్యాన్ని సంక్షోభంలో ముంచెత్తుతుంటే... రామాలయ రాజకీయాలు, శ్రీరాముని నామస్మరణలు మాత్రమే ఓట్లు తెచ్చిపెట్టబోవని బోధపడింది కాబోలు..! ప్రశ్నించేవారి గొంతునొక్కడం, ప్రతిపక్షాలను నిలువునా చీల్చడం, వారికి డబ్బుతో సహా ఏ వనరులూ అందుబాటులో లేకుండా చేయడం, అక్రమ అరెస్టులకు పాల్పడం.. ఇలా ఒకటేమిటి సకల దుర్నీతియోగాలకూ తెగబడుతున్నారు. ఆ మధ్య హేమంత్ సోరెన్, తాజాగా అరవింద్ కేజ్రీవాల్- సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముందు ఇద్దరు విపక్ష సీఎంలను అరెస్టు చేశారు. ఇదేమీ మొదలూ కాదు, చివరా కాదు...దీనికి ముందూ ఇలాంటి ఘటనలు ఉన్నాయి. వెనుక కూడా ఉంటాయి. ఇదంతా సాధారణమనే అభిప్రాయం దాదాపు స్థిరపడి పోయింది. కాకపోతే ఇలా వరుసగా ఉద్దేశపూర్వకంగా ప్రతిపక్ష నేతలను వేటాడం ఎప్పుడూ ఏలినవారిలోని నిరాశ నిస్పృహలనే సూచిస్తుంది. ఇప్పుడూ అంతే...లేదంటే మూడోసారీ మాదే విజయమని జబ్బలు చరుచుకుంటున్నవారికి ఇంతటి దిగజారుడుతనమెందుకు?

తమ నిజాయితీ ప్రశ్నార్థకమైన ప్రతిసారీ ప్రత్యర్థులను అప్రతిష్టపాలు చేయజూసే ఏలినవారు సైతం ఈ దుశ్చర్యల ఎత్తిచూపుతున్నారు. ఎలక్టోరల్ బాండ్లు రాజ్యాంగ వ్యతిరేకమంటూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పిన వెంటనే 'సీఏఏ'ను అమలులోకి తెచ్చి చర్చనీయాంశంగా మార్చారు. ఆతర్వాత బాండ్లరూపంలో వీరు భారీగా విరాళాలు దండుకున్న వ్యవహారం మార్చి 14న వెలుగులోకి రాగా ఆ మరుసటిరోజే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేశారు. తాజాగా ఆ బాండ్ల వివరాలు పూర్తిగా వెల్లడించడంలో ఇన్నాళ్లుగా పిల్లిమొగ్గలేస్తున్న ఎస్‌బీఐ చివరికి కోర్టు ఆగ్రహంతో యునిక్ నెంబర్లతో సహా అందజేసిన మరుక్షణమే కేజ్రీవాల్‌ను అరెస్టు చేశారు. బద్దలయిన తమ బాండ్ల బండారం నుంచి ప్రజల దృష్టిని మరల్చడం కూడా ఈ చర్యల వెనుక ఒక వ్యూహంగా మనకు కనిపిస్తోంది. ప్రత్యర్థులను రాజకీయంగా నేరుగా ఎదుర్కోలేక ఇలా దొడ్డిదారిన నిర్బంధాలకు గురిచేయడం వీరికొక ఆనవాయితీగా మారిపోయింది. తద్వారా ప్రత్యర్థి పార్టీల నేతలను లొంగదీసుకోవడం, ఎప్పుడు తమపై ఎటువంటి కేసులు నమోదవుతాయోననే భయాందోళనలో ముంచేయడం ఒక విధానంగా అమలు పరుస్తున్నారు.వెరసి లొంగినవారు పునీతులుగా మారడం, లొంగనివారు కటకటాలపాలవడం వీరి ఏలుబడికి ప్రతీకలుగా చెలామణీ అవుతున్నాయి. ఇక్కడ కేజ్రీవాల్ దోషా, నిర్దోషా అనే సంగతి కాసేపు పక్కనబెడితే...అతను వారికి లొంగివుంటే ఈ అరెస్టు జరిగేదా?

నిజంగా తమ పాలనలోని నిజాయితీ, సామర్థ్యాల మీద నమ్మకముంటే వీరికి ఇంతటి ఆగత్యమెందుకు? దీన్నిబట్టి వీరిని ఓటమి భయం ఎంతగా వెంటాడుతుందో అర్థం చేసుకోవచ్చు. ఎంత భయపడకపోతే చివరికి ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ బ్యాంకు అకౌంట్లను సైతం సీజ్ చేస్తారు..? వీరేమో అక్రమంగా భారీమొత్తంలో రాజకీయ విరాళాలను గుండుగుత్తగా సొమ్ముచేసుకోవచ్చు. పైగా ప్రభుత్వ వనరులను కూడా యథేచ్ఛగా ప్రచారానికి వాడుకోవచ్చు. అనేకానేక ఫిర్యాదుల తరువాత "వికసిత భారత్ సంపర్క్" పేర ప్రభుత్వ నిధులతో వీరు సాగిస్తున్న ప్రచారాన్ని నిలిపివేయాల్సిందిగా ఈసీనే ఆదేశించడం ఇందుకో తాజా ఉదాహరణ. కానీ, ప్రతిపక్షాలు మాత్రం వారికున్న అరకొర నిధుల్ని కూడా ఉపయోగించడానికి వీల్లేదు. ఇదెక్కడి న్యాయం? ఎన్నికల ప్రచారం కాదుగదా, రైలు టిక్కెట్లకూ తమకు డబ్బులు లేకుండా చేశారని కాంగ్రెస్ అగ్రనేతలు వాపోతున్నారు. ఇలా ప్రత్యర్థుల ఆర్థికవనరుల మీద కూడా దాడికి పాల్పడుతున్నారంటే ఇది దేనికి సూచిక? దీని ఉద్దేశ్యం వారికి ఎన్నికల్లో పాల్గొనే అవకాశాలను నిర్వీర్యం చేయడమే కదా! ఇక తమ బెదిరింపుల పర్వం ఇండియా కూటమిలో అనైక్యత సృష్టించడం, కుదరకపోతే నిలువునా చీల్చడం వంటివి సరేసరి. మహారాష్ట్ర, బెంగాల్ రాజకీయాల్లో ఇందుకు స్పష్టమైన ఉదాహరణలు కనిపిస్తాయి.

మూడోసారి కూడా తామే అధికారంలోకి రావాలని ఏలినవారు ముచ్చటపడితే ఎవరమూ కాదనలేం. కానీ అందుకు ఇంతకు దిగజారాలా? అయినా ఎన్నికల్లో రాజకీయ పార్టీల గెలుపోటములను నిర్ణయించాల్సింది ప్రజలు.

కానీ ప్రజలకు ఆ స్వేచ్ఛ, అవకాశం ఉన్నాయా? స్వేచ్ఛగా నిస్పక్షపాతంగా జరగాల్సిన ప్రజాస్వామ్య పోరును కేవలం ఓ పోల్ మేనేజ్‌మెంటుగా మార్చారు. పోటీ నిస్పక్షపాతంగా జరగాలంటే పోటీదారులందరికీ సమానావకాశాలుండాలి. ఆ అవకాశాలను కల్పించాల్సిన, కాపాడాల్సిన రాజ్యాంగ వ్యవస్థలన్నిటినీ తమ జేబుసంస్థలుగా "తీర్చిదిద్దారు". అందుకు 'ఈసీ' నుంచి 'ఈడీ' దాకా ఏదీ మినహాయింపు కాదు. దాని ఫలితమే ఈ అక్రమ అరెస్టులు, అనైతిక అప్రజాస్వామిక చర్యలు, దాడులూ దౌర్జన్యాలు... గెలుపు పట్ల ఎన్ని భయాలు కమ్ముకుంటే ఇన్ని దారుణాలకు తెగిస్తున్నారో కదా..!

> మూడోసారి కూడా తామే అధికారంలోకి రావాలని ఏలినవారు ముచ్చటపడితే ఎవరమూ కాదనలేం. కానీ అందుకు ఇంతకు దిగజారాలా? అయినా ఎన్నికల్లో రాజకీయ పార్టీల గెలుపోటములను నిర్ణయించాల్సింది ప్రజలు. కానీ ప్రజలకు ఆ స్వేచ్ఛ, అవకాశం ఉన్నాయా? స్వేచ్ఛగా నిస్పక్షపాతంగా జరగాల్సిన ప్రజాస్వామ్య పోరును కేవలం ఓ పోల్ మేనేజ్‌మెంటుగా మార్చారు. పోటీ నిస్పక్షపాతంగా జరగాలంటే పోటీదారులందరికీ సమానావకాశాలుండాలి. ఆ అవకాశాలను కల్పించాల్సిన, కాపాడాల్సిన రాజ్యాంగ వ్యవస్థలన్నిటినీ తమ జేబుసంస్థలుగా "తీర్చిదిద్దారు". అందుకు 'ఈసీ' నుంచి 'ఈడీ' దాకా ఏదీ మినహాయింపు కాదు.

వ్యక్తిగత హింస నుంచి విప్లవం వైపునకు..



నాదెండ్ల శ్రీనివాస్
9676407140

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ముగ్గురు భారత విప్లవానికి నిలువుటద్దం. బ్రిటీష్ దుర్మార్గపు పాలనలో చిక్కుకున్న భారత దేశానికి విముక్తి కలిగించేలా,దేశ ప్రజల్లో విప్లవ స్ఫూర్తిని నింపి భారత స్వాతంత్రోద్యమాన్ని కొత్త పంథా పట్టించారు. మన స్వాతంత్ర్యం మన చేతుల్లోనే ఉందని భావించిన ఆ ముగ్గురూ బ్రిటీష్ అధికారులపై తిరగబడ్డారు. ఆ ముగ్గురిలో దేశ ప్రజల్లో పోరాట స్ఫూర్తి జ్వాలను రగిలించే శక్తిని గ్రహించిన అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఆ పోరాటాన్ని అణచివేసే ప్రయత్నం చేసింది. స్వాతంత్రోద్యమ తీవ్రవాదులుగా పేర్కొంటూ ముగ్గుర్ని 1931 మార్చి 23న ఉరితీసింది బ్రిటిష్ ప్రభుత్వం. నేడు ఆ వీరుల 93వ వర్ధంతి.

చరిత్ర పునరావృతం కాదు. కానీ ఘటనలను పోలిన ఘటనలు జరుగుతూనే ఉంటాయి. ఆ విధంగా గత చరిత్రలో జరిగిన కొన్ని సంఘటనలు మరో రూపంలో ఇప్పుడు కూడా జరుగుతున్నాయా అనిపిస్తుంది. 1919లో మొదటి ప్రపంచ యుద్ధం ముగింపు దశలో ఉండగా భారతదేశంలో స్వాతంత్ర్యోద్యమం కొత్త ఉత్సాహంతో ఉరకలు వేసింది. దానికి ముఖ్యమైన కారణం ఆ యుద్ధ కాలంలో సామ్రాజ్యవాదం బలహీనపడి నూతన సోషలిస్టు రాజ్యమైన సోవియట్ యూనియన్ అవతరించడం, దాని ప్రభావంతో దేశ దేశాలలో వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యోద్యమాలు పుంజుకున్నాయి. దీనిని అదుపు చేయడానికి బ్రిటిష్ సామ్రాజ్యవాదం అవలంబించిన వ్యూహంలో హిందూ- ముస్లిం ఘర్షణలు సృష్టించి ప్రజల మధ్య చీలికలు పెట్టడం ఒకటి. అదే 1925లో ఆరెస్సెస్ పుట్టుకకు దారితీసింది. రౌలట్ చట్టం నిరసన తెలిపే హక్కు, ఊరేగింపులు, సభలు జరుపుకునే, సంఘాలు పెట్టుకునే హక్కు ఆఖరికి ప్రభుత్వాన్ని విమర్శించే హక్కును సైతం ఈ చట్టం లాగేసుకుంది. పౌరుల కదలికలపై తీవ్రమైన ఆంక్షలు విధించింది. విమర్శకులకు దేశద్రోహ ముద్ర వేసింది. రాజద్రోహం నేరం కింద జైళ్లలో కుక్కింది. ఈ చట్టానికి వ్యతిరేకంగా అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్‌లో ప్రజలు ఏప్రిల్ 14న సభ జరుపుకోవడానికి గుమిగూడారు. దీన్ని అదునుగా తీసుకుని నాటి పోలీసు అధికారి జనరల్ డయ్యర్ ప్రజలపై విచక్షణా రహితంగా కాల్పులు సాగించాడు. ఈ కాల్పుల్లో 1200 మంది అసువులు బాశారు. స్వాతంత్యోద్యమ చరిత్రలో ఇది రక్తాక్షరాలతో లిఖించిన అధ్యాయం.దీంతో భారత దేశం భగ్గుమంది. స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. దేశవ్యాప్తంగా హిందూ, ముస్లింలు భుజం భుజం కలిపి ఖిలాఫత్ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఖిలాఫత్ ఉద్యమం ద్వారా వచ్చిన ఐక్యత స్వాతంత్ర్యోద్యమంలో అత్యంత ప్రసిద్ధి గాంచిన సహాయ నిరాకరణోద్యమానికి నాంది పలికింది.

> జాతీయ విప్లవకారుల భావాలను ప్రభావితం చేయడానికి కమ్యూనిస్టు పార్టీకి చెందిన 'వాన్ గార్డ్' అనే పత్రికలో జాతీయ వాదులకు విజ్ఞప్తి పేరుతో ఒక వ్యాసం ప్రచురించారు. 1929 అక్టోబర్ 19న విద్యార్థి మహాసభకు సందేశం పంపుతూ ఇలా రాశారు. "పిస్టళ్లను, బాంబులను చేపట్టాల్సిందిగా ఈనాడు మనం యువకులను అడగ జాలం. పారిశ్రామిక ప్రాంతాల్లోని మురికి వాడల్లోనూ, గ్రామసీమల్లోని గుడిసెల్లోనూ నివసించే కోట్లాది ప్రజలను చైతన్యపరచాల్సి ఉంది. "నిజమైన విప్లవ సైనికులు గ్రామాల్లోని రైతుల్లో, ఫ్యాక్టరీల్లో ఉన్న కార్మికుల్లోనే ఉన్నారు" అంటూ "మార్క్స్, లెనిన్ రచనలను చదవాల్సిందిగా యువతకు సలహా ఇస్తున్నాను" అన్నాడు.

1921-22లో దేశమంతా స్వాతంత్ర్యోద్యమం కొత్త పుంతలు తొక్కింది. బ్రిటీష్ వారికి పన్నుల చెల్లింపు నిరాకరించడం మొదలుకొని విదేశీవస్తు బహిష్కరణ వరకు ఇది సాగింది. గాంధీ ఈ ఉద్యమాన్ని శాంతియుత సత్యాగ్రహ రూపంలో సాగించారు. అయితే 1922 ఫిబ్రవరిలో చౌరీచౌరాలో జరిగిన ఘటనను ఆసరా చేసుకుని గాంధీ సహాయ నిరాకరణోద్యమాన్ని ఉపసంహరించారు. అయితే యువతరంలో దీనిపై తీవ్ర నిరసన వ్యక్తమైంది. దీంతో అసంతృప్తికి గురైన యువ నాయకత్వం నూతన మార్గం కోసం అన్వేషించారు.ఈ క్రమంలోనే భగత్‌సింగ్, చంద్రశేఖర్ ఆజాద్, భటుకేశ్వరదత్ లాంటి జాతీయ విప్లవకారులు ఉద్భవించారు. జలియన్‌వాలాబాగ్ ఘటనతో చలించిపోయిన భగత్ సింగ్ తన 12వ యేటనే ఆ స్థలాన్ని సందర్శించి పోరాట స్ఫూర్తిని పొందాడు. 14వ యేటా స్కూలును బహిష్కరించి బ్రిటీషువారిపై తిరుగుబాటు చేశాడు. 1923లో హిందూస్థాన్ రిపబ్లికన్ ఆర్మీలో సభ్యుడుగా చేరాడు. 1925లో మొదటిసారి అరెస్ట్ వారెంట్ వచ్చింది. 1926 నుంచి నౌజవాన్ భారత సభలో చురుకైన పాత్ర పోషించాడు. 1928లో సైమన్ గోబ్యాక్ ఉద్యమంలో లాలా లజపతిరాయ్‌పై లాఠీఛార్జీ చేసి మరణానికి కారకుడైన ఎస్పీని చంపాలనుకుని పొరపాటున శాండర్స్‌ను హత్య చేయడంతో భగత్‌సింగ్ రాజకీయ జీవితం బయట ప్రపంచానికి వెల్లడైంది. తదనంతరం వ్యక్తిగత హత్యలతో స్వాతంత్ర్యం సాధించలేమని ప్రజలను కూడగట్టి రాజ్యాధికారాన్ని కూలదోస్తేనే స్వాతంత్ర్యం వస్తుందని జీవితానుభవం ద్వారా గ్రహించాడు. ఆ క్రమంలోనే సోషలిస్టు భావాలతో ప్రభావితుడయ్యాడు.పంజాబ్ కమ్యూనిస్టు నాయకుడు సోహన్ సింగ్ దేశితో పరిచయమైనాక మరింత పరిపక్వత సాధించాడు. సోషలిజమే జీవితాశయంగా బహిరంగంగా ప్రకటించాడు.తర్వాత 1928లో హిందూస్థాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీగా రూపాంతరం చెందింది.1931 మార్చి 23న ఉరికంభమెక్కబోయే ముందు జైలు గోడల మధ్య లెనిన్ జీవిత చరిత్రను చదువుతూ తానొక గొప్ప విప్లవకారునితో సంభాషిస్తున్నట్లుగా జైలు అధికారులతో భగత్‌సింగ్ చెప్పుకున్నాడు.

1928లో బ్రిటీషు ప్రభుత్వం కమ్యూనిస్టులను, కార్మికోద్యమాలను అణచడానికి ప్రజా భద్రతా బిల్లు, పారిశ్రామిక సంబంధాల బిల్లును తీసుకొచ్చింది. ఇవి రెండూ విప్లవ, కార్మికోద్యమాలను నిషేధించేవే. వీటికి వ్యతిరేకంగా ఏప్రిల్ 8న పార్లమెంటులో పొగబాంబులు వేసి సంచలనం సృష్టించాలని, ఈ నిరంకుశ బిల్లులకు వ్యతిరేకంగా చైతన్యం తీసుకురావాలని భగత్‌సింగ్ బృందం భావించింది. బటుకేశ్వర్ దత్తుతో కలిసి భగత్‌సింగ్ ఈ బాంబులు వేశారు.తప్పించుకోకుండా అక్కడే నిలబడి నినాదాలిచ్చారు. జాతీయ విప్లవకారుల భావాలను ప్రభావితం చేయడానికి కమ్యూనిస్టు పార్టీకి చెందిన 'వాన్ గార్డ్' అనే పత్రికలో జాతీయవాదులకు విజ్ఞప్తి పేరుతో ఒక వ్యాసం ప్రచురించారు. 1929 అక్టోబర్ 19న విద్యార్థి మహాసభకు సందేశం పంపుతూ ఇలా రాశారు. "పిస్టళ్లను, బాంబులను చేపట్టాల్సిందిగా ఈనాడు మనం యువకులను అడగజాలం. పారిశ్రామిక ప్రాంతాల్లోని మురికివాడల్లోనూ, గ్రామసీమల్లోని గుడిసెల్లోనూ నివసించే కోట్లాది ప్రజలను చైతన్యపరచాల్సి ఉంది. "నిజమైన విప్లవ సైనికులు గ్రామాల్లోని రైతుల్లో, ఫ్యాక్టరీల్లో ఉన్న కార్మికుల్లోనే ఉన్నారు" అంటూ "మార్క్స్, లెనిన్ రచనలను చదవాల్సిందిగా యువతకు సలహా ఇస్తున్నాను" అన్నాడు. వృత్తి విప్లవకారుల అవసరాన్ని ఆయన గుర్తించారు. తనను ఉరి తీయడానికి ఏడాది ముందు జైలు మిత్రులతో మాట్లాడుతూ "వాళ్లు నన్ను చంపి వేయవచ్చు. కానీ నా భావాలను వారు అణచివేయలేరు. దానితో చివరకు వారు ఇక్కడ నుంచి పారిపోవాల్సి వస్తుంది" అని ప్రగాఢమైన విశ్వాసంతో చెప్పాడు. "బ్రిటీష్ సామ్రాజ్యవాదులకు బతికున్న భగత్ సింగ్ కంటే చనిపోయిన భగత్‌సింగ్ మరింత ప్రమాదకారి. నన్ను ఉరితీసిన తర్వాత నా విప్లవ భావాలు ఈ సుందర భారతాన్ని నలుదిశలా వ్యాపిస్తాయి. యువత స్వాతంత్ర్యం కోసం, విప్లవం కోసం తపించేట్లు చేస్తాయన్నది భగత్ సింగ్ దృఢ విశ్వాసం. ఇది 1947 ఆగస్టు15 భారత దేశ విముక్తితో అక్షర సత్యమైంది.


76యేండ్ల తర్వాత మరలా నాటి బ్రిటీష్ వ్యతిరేక పోరాటం తరహాలో మరో స్వాతంత్ర్యోద్యమానికి నాంది పలకాల్సిన సమయమిది. బ్రిటీష్ నిర్బంధకాండ నుంచి భగత్‌సింగ్ ఆవిర్భవించినట్లుగానే నేడు బీజేపీ మతోన్మాద వ్యతిరేక పోరాటంలో నుంచి చరిత్రను తిరగరాసే కొత్త తరం ఆవిర్భవిస్తుంది. అయితే ఈతరం ఎటువైపు నిలబడాలో నిర్ణయించుకోవాలి. భగత్‌సింగ్‌లా పోరాడి దేశ సమైక్యతను కాపాడాలా? సంఘ్ పరివార్‌లా దేశ విచ్ఛిన్నకులుగా మారాలా? భగత్‌సింగ్ సాక్షిగా మార్పునకు స్వాగతం పలికే తరానికి ఇది చరిత్ర విసురుతున్న సవాల్. భగత్‌సింగ్ రాజకీయ జీవితం సుమారు ఏడేండ్లే. ఈ స్వల్ప రాజకీయ జీవిత కాలంలో విప్లవ దార్శని కతనీ, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ చైతన్యాన్నీ, విస్పష్టమైన సోషలిస్టు లక్ష్యాన్ని చాటడంతో పాటు వాటిని సాధించటానికి అవసరమైన అంకురిత దీక్షా తత్వాన్నీ, త్యాగ నిరతిని ప్రదర్శించాడు భగత్ సింగ్. కానీ ఆయన విప్లవస్ఫూర్తిని నేటి పాలకులు విస్మరించే పనిలోనే ఉన్నారు.తన ప్రతి రాజకీయ దశలోనూ నిజమైన లౌకికవాదిగా జీవించిన భగత్ సింగ్‌ను లౌకికవాదిగా స్మరించని బీజేపీ పాలకులు సావర్కర్‌ని ఒక వీరునిగా ప్రదర్శిస్తున్నారు. తన జీవిత కాలంలో మూడుసార్లు బ్రిటీష్ పాలకులకు, రెండుసార్లు కాంగ్రెస్ వారికి లొంగుబాట్లు ఇచ్చి జైలు నుండి బయటపడాలని చూసిన సావర్కర్, త్యాగజీవి భగత్‌సింగ్‌కు సాటిగా ఎలా నిలవగలుగుతాడు?

చిరునవ్వు చిందిస్తూ.. ఉరికంబమెక్కుతూ...



అనగంటి వెంకటేష్
9705030888

అది 1931 మార్చి 23. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌లకు చివరిరోజు. అప్పటివరకు భగత్‌సింగ్ సహచరుల ఉరిని ఆపాలని మహాత్మాగాంధీ మీద ఎంత ఒత్తిడి వచ్చినా ఆపలేకపోయాడు. పైగా కాంగ్రెస్ జాతీయ సమావేశాలు జరుగుతున్నందున ఒకరోజు ముందుకు గానీ, తర్వాతకుగానీ వాయిదా వేయాలని మాత్రమే బ్రిటిష్ వారికి గాంధీ లేఖరాశాడు. దాంతో గాంధీని నమ్ముకుంటే మెరికల్లాంటి దేశ ప్రేమికులు చనిపోతారని ప్రజలే రంగంలోకి దిగారు. కనుక ఆరోజున వారి ఉరిని ఆపాలని ఆ ప్రాంత ప్రజలంతా పెద్దఎత్తున జైలుకు వద్దకు వెళ్లాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలిసిన బ్రిటిష్‌వారు భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్‌లను జైలు నిబంధనలకు విరుద్ధంగా ఒకరోజు ముందే సాయంత్రానికి ఉరితీయాలని ఉత్తర్వులిచ్చారు. తలారి భగత్‌సింగ్ వద్దకు వచ్చి ప్రార్థన చేసుకోమని ఏదో పవిత్రగ్రంథమని అందించబోయాడు. భగత్‌సింగ్ అందుకు సున్నితంగా తిరస్కరిస్తూ తాను నాస్తికుడిగా బతికానని ఈ చివరి రోజు కూడా అలాగే ఉంటానని చెప్పాడు. భగత్‌సింగ్ ఆరోజంతా లెనిన్ రాసిన 'ఏం చేయాలి' పుస్తకాన్ని చదివాడు. జైలు అధికారి సాయంత్రం ఏడు గంటలకు ఉరికొయ్య దగ్గరికి తీసుకెళ్లడానికి అతడి గది వద్దకు వచ్చి బయలుదేరమన్నాడు. అప్పటికే ఏం చేయాలి పుస్తకం చదవడం పూర్తికాలేదు. "ఒక్క నిమిషం ఉండండి.ఒక విప్లవకారుడు మరొక విప్లవ కారుడితో మాట్లాడుతున్నాడు" అని ఆ పుస్తకంలోని చివరి పేజీలు కూడా చదివి నవ్వుతూ ఉరికొయ్య దగ్గరికి చేరుకున్నాడు. సామ్రాజ్యవాదం నశించాలి, విప్లవం వర్ధిల్లాలి అనే నినాదాలిచ్చారు. విప్లవకారులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ చిరునవ్వులతో 'దేశంపై ప్రేమ మరణానంతరం కూడా మా హృదయాన్ని వదిలిపోదు. దాని సువాసన మా బూడిదలో సైతం ఉంటుంది.' అంటూ పాటపాడుతూ అమరులయ్యారు.



స్వాతంత్ర్య సమరానికి, విప్లవాత్మక మార్పుకి ఒక శక్తివంతమైన చిహ్నం భగత్‌సింగ్. భారత యువత ఆకాంక్షల ప్రతిరూపం. ఈ దేశ విముక్తి కోసం ప్రజలు ఎంచుకోవాల్సిన సరైన మార్గం చూపడానికి తన చావునే ఆయుధంగా ప్రయోగించినటువంటి యోధుడు భగత్ సింగ్. ఆయనలాంటి అసమాన దేశభక్తుడి జీవితాన్ని, భావాలను, సిద్ధాంతాలను తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది. 1919 సంవత్సరం ఏప్రిల్ 13న అమృత్‌సర్‌లోని జలియన్ వాలాబాగ్ పార్కులో జనరల్ డయ్యర్ చేసిన మారణకాండ భగత్‌సింగ్‌ని తీవ్ర కోపోద్రిక్తుడిని చేసింది. విత్తులు నాటితే మొక్కలు మొలిచి పంట పండినట్టు, తుపాకులు నాటితే కూడా తుపాకుల పంటలు పండితే తన స్నేహితులకు పంచిపెట్టి బ్రిటిష్ దొరలను కాల్చివేయాలని బాల్యంలోనే కలలుగన్నాడు. అలాంటి కలలకు, తిరుగుబాట్లకు జలియన్ వాలాబాగ్ ఊచకోత ప్రతిఒక్క దేశాభిమానిని పురిగొల్పింది. దేశ స్వతంత్రం కోసం ఎన్ని జన్మలైనా ఎత్తి ఎన్నిసార్లైనా చావడానికి సిద్ధమని ప్రాణత్యాగం చేసిన కర్తార్‌సింగ్ శరభను యుక్త వయసులోనే భగత్‌సింగ్ ఆదర్శంగా తీసుకున్నాడు.

1923 సంవత్సరంలో భగత్‌సింగ్ వ్యవస్థాపక కార్యదర్శిగా హిందూస్థాన్ రిపబ్లిక్ అసోసియేషన్‌ని ఏర్పాటు చేశాడు. తదనంతర అయిదేళ్ల కాలంలో, అంటే 1928 సెప్టెంబర్28 నాటికే ఆ సంస్థ పేరును హిందూస్థాన్ సోషలిస్టు ఆర్మీ అని మార్చడం జరిగింది.

> భగత్‌సింగ్ ఆలోచనలకూ విరుద్ధంగా నేడు దేశంలోని పాలకులు మతాన్ని రాజకీయ సాధనంగా వాడుకుంటూ మతోన్మాద విధానాలతో తినే తిండిపై, కట్టే బట్టపై ఆంక్షలు పెడుతున్నారు. దేశంలో రచయితలు, మేధావులు, విద్యార్థులు, యువత, ప్రగతిశీల శక్తులు, దళితులు, మైనార్టీలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నాయి. భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో మతోన్మాదాన్ని అడుగుడుగునా వ్యతిరేకించాలి. మతసామరస్యం కోసం పాటుపడాలి.భగత్‌సింగ్ ఆర్థిక సమానత్వమే కాదు సామాజిక అసమానత్వానికి మూలమైన కులవ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించాడు. అందుకే భగత్ సింగ్ జైల్లో పాకీ పనిచేసే బోధ అనే దళితుడి చేతి వంట తినాలని ఉందని చివరి కోరిక కోరి ఆ బోధ చేతి కమ్మని వంట కడుపార తిని కుల పాపాన్ని కడిగేయాలనుకున్నాడు.

ఇక్కడే భగత్‌సింగ్ పరిణితి చెందిన తీరు, ప్రపంచ మానవుడిగా పరివర్తనమైన తీరుతెన్నుల తేడా మనకు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ దేశం రిపబ్లిక్ దేశంగా కంటే, సోషలిస్టు దేశంగా అవతరించాల్సిన అవసరతను భగత్‌సింగ్ నొక్కి చెప్పడం, లక్ష్యపరచడం మనకు తెలుస్తుంది. అలా తమ పోరాటం ఒక బ్రిటిష్ సామ్రాజ్యవాదం పైనే కాదు, మొత్తం సామ్రాజ్యవాదానికే వ్యతిరేక పోరాటమని, వర్గ రహిత సమాజ స్థాపన లక్ష్యమని ప్రకటించాడు. అందుకే విప్లవం వర్ధిల్లాలి అని ఎల్లప్పుడూ నినదించేవాడు. విప్లవం వర్ధిల్లాలి అనేది ఎల్లప్పుడూ సాయుధ పోరాటమే అనుకోనక్కరలేదు. అది బాంబులు, తుపాకుల పూజ కోసం కాదు. మార్పు సాధించడం అనే అర్థంలో మేము 'ఇంక్విలాబ్ జిందాబాద్ 'అని నినదిస్తున్నామని 1923 డిసెంబర్ 23న మోడ్రన్ రివ్యూ మాసపత్రికకు రాసిన లేఖలో పేర్కొన్నాడు.


1929 ఏప్రిల్ 8న బ్రిటిష్ పార్లమెంట్ మీద భగత్‌సింగ్, భట్ కేశ్వర్‌దత్ పొగబాంబులు విసిరారు. అక్కడే నిలబడి నినాదాలు చేస్తూ, కరపత్రాలు పంచుతూ అరెస్టయ్యారు. 'మాకు స్వాతంత్ర్యం కావాలని ఎంతగా పోరాడుతున్నా వినకుండా చెవిటితనం నటిస్తున్న బ్రిటిష్‌వాళ్లకు వినిపించేందుకే బాంబు శబ్దం అవసరమైందని తెలియజేస్తూ కరపత్రాలు పంచారు. ప్రజా భద్రత బిల్లు, పారిశ్రామిక బిల్లుతో పాటు వచ్చే సమావేశాల్లో పత్రికా స్వేచ్ఛను హరించే బిల్లు తీసుకువచ్చి పోరాటాలను ఆపాలనుకోవడం అసాధ్యమని ప్రకటించాడు. సమా జంలో అత్యంత కీలకంగా ఉన్న కార్మికులు పీడకుల చేతిలో దోపిడీకి గురవుతున్నారు. ప్రాథమిక హక్కులు సైతం కోల్పోతున్నారు. అందరికోసం ధాన్యం పండించే రైతు డొక్క మాడ్చుకుంటున్నాడు. ప్రపంచానికి బట్టలు నేసే నేతన్నకు తన బిడ్డల శరీరాలకు కప్పేందుకు జానెడు బట్ట లేదు. తాపీ పనివారు, వడ్రంగులు అద్భుతమైన భవనాలు నిర్మిస్తూ వారు మాత్రం మురికివాడల్లో జీవిస్తున్నారు. ఈ సమాజానికి పట్టిన చీడ పురుగుల్లాంటి పెట్టుబడిదారులు, దోపిడీదారులు లక్షలాది రుపాయాలను దుర్వినియోగం చేస్తున్నారు. ఈ దారుణమైన అసమానతలు, తారతమ్యాలు అల్లకల్లోలాలనికి దారితీస్తున్నాయి. ఇలాంటి వైషమ్యాలు లేని రాజ్యమే సోషలిస్టు రాజ్యం' అని వాదిస్తూ బ్రిటిష్ కోర్టులను సైతం విప్లవ ప్రచారకేంద్రాలుగా ఉపయోగించుకున్నారు. అలా భగత్‌సింగ్ భారతదేశంలో సోషలిజం నినాదానికి బాటలు వేశాడు.

భగత్‌సింగ్ ఒక మనిషి మరొక మనిషి దోచుకోబడని వ్యవస్థ కావాలని ఆకాంక్షించాడు. కానీ నేటి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను అంతా అదానీ, అంబానీలకు దోచిపెడుతోంది. బ్యాంకుల్లో అప్పులు తీసుకొని ఎగ్గొడుతున్న కార్పోరేట్లకు రాయితీలిస్తోంది. ఆ దోపిడీ దారులను దర్జాగా దేశం దాటిస్తుంది. నల్ల చట్టాలను అమలు చేస్తుంది. దేశమంతా కరోనాతో బాధ పడుతుంటే ఈ దేశ రైతాంగానికి నష్టం చేసే వ్యవసాయ నల్ల చట్టాలను తీసుకువచ్చింది. ఆ వ్యవసాయ, రైతు వ్యతిరేక నల్లచట్టాలను రద్దు చేయాలని భగత్‌సింగ్ పోరాట వారసత్వ స్ఫూర్తినందుకున్న పంజాబ్, హర్యానా రైతులు దేశరాజధాని ఢిల్లీని చుట్టిముట్టారు. ఏడాదిపాటు చలిలో, వానలో, ఎండలో ఉంటూ కేంద్ర ప్రభుత్వం నిర్బంధాలను ప్రయోగించిన లెక్కచెయ్యకుండా ప్రాణాలు పోతున్నా వెనకడుగు వెయ్యకుండా పాలకుల మెడలు వంచి దేశ ప్రధాని చేత క్షమాపణలు చెప్పించి నల్ల చట్టాలను అమలు కాకుండా చేశారు. ఇప్పుడు కనీస మద్దతు ధర పండించిన పంటకు అందించాలని పోరాడుతున్నారు. భగత్‌సింగ్ కుల, మతతత్వాలకు వ్యతిరేకంగా పోరాడాలని 1927లో నవజవాన్ భారత్ సభను పునర్వ్యవస్థీకరిస్తున్నపుడు స్పష్టంగా సహచరులకు తెలిపాడు. ఒకవేళ మతం ఉంటే అది వ్యక్తిగతంగా ఉండాలని, అయితే అది రాజకీయాల్లోకి చొరబడి మతోన్మాద రూపం తీసుకున్నప్పుడు దాన్ని ఒక పెద్ద శత్రువును ఎదుర్కొన్నట్లే ఎదుర్కొనాలని, మూఢనమ్మ కాల బంధనాల నుండి ప్రజలు విముక్తుల వ్వాలని భగత్‌సింగ్ కోరుకున్నాడు.

భగత్‌సింగ్ ఆలోచనలకూ విరుద్ధంగా నేడు దేశంలోని పాలకులు మతాన్ని రాజకీయ సాధనంగా వాడుకుంటూ మతోన్మాద విధానాలతో తినే తిండిపై, కట్టే బట్టపై ఆంక్షలు పెడుతున్నారు. దేశంలో రచయితలు, మేధావులు, విద్యార్థులు, యువత, ప్రగతిశీల శక్తులు, దళితులు, మైనార్టీలపై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు జరుగుతున్నాయి. భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో మతోన్మాదాన్ని అడుగుడుగునా వ్యతిరేకించాలి. మతసామరస్యం కోసం పాటుపడాలి.భగత్‌సింగ్ ఆర్థిక సమానత్వమే కాదు సామాజిక అసమానత్వానికి మూలమైన కులవ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించాడు. అందుకే భగత్ సింగ్ జైల్లో పాకీ పనిచేసే బోధ అనే దళితుడి చేతి వంట తినాలని ఉందని చివరి కోరిక కోరి ఆ బోధ చేతి కమ్మని వంట కడుపార తిని కుల పాపాన్ని కడిగేయాలనుకున్నాడు. అభివృద్ధి పథంలో నడవాలనుకున్న ప్రతి వ్యక్తి గతకాలపు విశ్వాసాలను విమర్శించాలి, ప్రశ్నించాలి అని భగత్ సింగ్ పిలుపునిచ్చాడు. గతకాలపు కులవ్యవస్థ ఈ దేశానికి పట్టిన పుండులాంటిదని అభిప్రాయపడ్డాడు. నేటి సమాజంలో కులోన్మాదం రెచ్చిపోతున్నది. మనుధర్మాన్ని నరనరాన ఎక్కించుకొని అంటరానితనం పేరుతో కుల దురంహకారంతో దాడులు,హత్యలు చేస్తున్నారు. యువత మనువాద భావాజాలంపై, అన్యాయాలపై స్పందించాలి.

దోపిడీ, అక్రమాలు, అవినీతిపై నిత్యం పోరాడుతూ భగత్ సింగ్ మార్గంలో నడవాల్సిన అవసరం ఉన్నది. అదేవిధంగా యువత అత్యంత ఆకర్షితులయ్యే సినిమాల ఎడల జాగ్రత్తతో ఉండాల్సిన అవసరం ఉన్నది. ఎందుకంటే ముగ్గులేసి కాషాయ ముగ్గులోకి దింపే సాంస్కృతిక కాలుష్యం సినిమాల ద్వారా వెదజల్లే ప్రయత్నం ఈ కాలంలో ప్రభుత్వమే దగ్గరుండి చేయిస్తుంది. అలాంటి యాక్టర్లను ప్రత్యేకంగా కలవడం, ఆ సినిమాలను అధికారిక హోదాలో చూసి ప్రమోట్ చేయడం మనం చూస్తూనే ఉన్నాం. అలాంటి అన్ సైన్టిఫిక్, హిస్టరీ ఇర్రిలవెంట్, క్షుద్ర కథలు రాసేవారిని ప్రోత్సహిస్తూ వారికి రాజ్యసభ పదవులను సైతం కట్టబెడుతున్నారు. వారికి "ది లెజెండ్ ఆఫ్ భగత్ సింగ్, రంగ్ దే బసంతి, ఉద్ధంసింగ్" లాంటి నిజమైన చారిత్రాత్మక సైన్టిఫిక్ సినిమాలు కనబడవు. ఇది నిజంగా సాంస్కృతిక దాడి. ఈ దాడికి బీజేపీ ప్రభుత్వం నాయకత్వం వహిస్తుంది. ఇలాంటి విషయాలను విమర్శనాత్మకంగా ఆలోచిస్తూ, చర్చిస్తూ యువత ముందడుగు వేయాల్సిన అవసరం ఉన్నది.

మతతత్వం శత్రువన్న భగత్‌సింగ్



కోట రమేష్
9618339490

'మతం వ్యక్తిగత అంశంగా ఉండాలి. అయితే అది రాజకీయాల్లో చొరబడి మతోన్మాద రూపం తీసుకున్నప్పుడు దాన్ని ఒక పెద్ద శత్రువుని ఎదుర్కొన్నట్టుగానే ఎదుర్కోవాలి' అని భగత్‌సింగ్ చెబుతుండేవాడు. మతం, మూఢ నమ్మకాల బంధనాల నుండి ప్రజలు తామంతట తాము విముక్తి అవ్వాలంటాడు. దేశ ప్రగతికి అంధ విశ్వాసాలు, మతమౌఢ్యము ఓ పెద్ద అడ్డంకిగా తయారయ్యాయని అని కూడా అన్నాడు. అవి మన మార్గానికి అడ్డంగా పడుతున్న రాతిబండలని, వాటిని ఎలాగైనా మనం తొలగించుకోవాలని, వీటిని అధిగమించడానికి అన్ని మతాల్లోని విప్లవోత్సాహం గల యువకులు ముందుకు రావాలంటూ పిలుపునిచ్చాడు భగత్‌సింగ్. నేడు దేశ పరిస్థితిని చూస్తే భగత్‌సింగ్ ఆనాడు చేసిన వ్యాఖ్యల వెనుక ఆవేదన ఎంత సరైందో అర్థమవుతుంది. ఇప్పుడు దేశంలో బుసలు కొడుతున్నది, వినాశకర పరిస్థితులు సృష్టిస్తున్నది, కార్పొరేట్ల బంధంతో మిలాఖత్ అయిన మతతత్వం. దేశానికి పొంచి ఉన్న మతతత్వ ప్రమాదాన్ని, తొంభై యేండ్ల క్రితమే భగత్‌సింగ్ గుర్తించగలిగాడు. స్వాతంత్రోద్యమ పోరాటంలో విప్లవకారునిగా త్యాగం, ధైర్య సాహసాలకు మారుపేరుగా, దేశం గర్వించదగ్గ గొప్ప దేశభక్తుడు భగత్‌సింగ్. బ్రిటిష్ వలసవాద సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతూ, దేశవిముక్తి కోసం నవ్వుతూ ఉరికంబమెక్కిన అసమాన స్వాతంత్ర్య పోరాటయోధుడైన భగత్‌సింగ్ అతని సహచరులు రాజ్‌గురు, సుకుదేవ్‌లను 1931 మార్చి 23న నాటి బ్రిటిష్ ప్రభుత్వం ఉరితీసిన రోజు ఇది.

భగత్‌సింగ్ సామ్రాజవాదాన్ని, దోపిడీని వ్యతిరేకించడంతో పాటు తనను తాను నాస్తికుడిగానే భావించాడు. అన్నింటికీ భగవంతుని మీద భారం వేసి చేతులు ముడుచుకు కూర్చునే పద్ధతిని, కర్మ సిద్ధాంతం చాటున 'తలరాతనే ' అనే మత్తుమందును యువకులకు తాగించి పడుకోబెట్టే మార్గాన్ని తప్పుపట్టాడు. ఆ మార్గం ఎప్పటికీ తన మార్గం కాజాలదని, ఈ ప్రపంచాన్ని మిథ్యగా భావించేవారు, ఈ దేశాన్ని ప్రజల్ని మాయ అని చెప్పేవారు, ఎప్పటికీ ఈ దేశ స్వాతంత్ర్యం కోసం నిజాయితీతో పోరాడలేరనేది ఆయన భావన. దేశం ఒక సజీవమైన వాస్తవం, అందమైన యదార్థంగా గుర్తించాడు.' నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను, నాకు ఈ ప్రపంచం తప్ప వేరే ప్రపంచమో స్వర్గమో లేదు. కొంతమంది వ్యక్తులు ఈనాడు ప్రపంచాన్ని తమ స్వార్థం కోసం నరకంగా తయారు చేశారనేది నిజం. కానీ అంత మాత్రం చేత ఈ ప్రపంచాన్నే మిథ్య అని ప్రకటించి పారిపోవడం వల్ల ప్రయోజనం లేదు. దోపిడీదారులను, ఇతరులను బానిసత్వంలో బంధించి వారిని అంతం చేసి మనం ఈ ప్రపంచాన్నే స్వర్గంగా మార్చుకోవాలని' భగత్‌సింగ్ అంటాడు.

'అభ్యుదయం కోసం నిలబడే ప్రతివ్యక్తి పాత విశ్వాసాలలోని ఒక్కో అంశాన్ని మూఢంగా నమ్మకుండా, ఒకదాని తర్వాత మరొక దానిని సవాల్ చేయాలి. దానిపై వాదోపవాదాలకు సిద్ధపడాలి. కానీ కేవలం విశ్వసించడం, గుడ్డిగా నమ్మడం ప్రమాదకరం. అది మేధస్సును పనిచేయకుండా చేస్తుంది. వ్యక్తిని అభివృద్ధి నిరోధకంగా మార్చివేస్తుంది. వాస్తవికవాదినని చెప్పుకునే ప్రతివ్యక్తి విశ్వాసాలను సవాలు చేయాలి' అన్నాడు భగత్‌సింగ్. ఆయన చెప్పిన ఒక్కోమాట ఎంతో ఔన్నత్యం, ఆచరణతోనే సాగాయి. అన్నట్టుగానే ఆయన జీవితాంతం లౌకికవాదాన్నే ఆచరించాడు. లౌకికవాదాన్ని దాటుకుని మార్క్సిజం వైపు అడుగులు వేశాడు. జాతీయోద్యమానికి, దేశానికి మతతత్వం తెచ్చిపెట్టబోతున్న పెను ప్రమాదాన్ని ఆయన తన సమకాలీకులకంటే ముందుగానే ఊహించాడు. మతతత్వం వలన పాలనంతటి ప్రమాదకర మైనదని ఆయన పలు మార్లు పలు వేదికల నుంచి హెచ్చరించాడు. మతం వ్యక్తిగతం, మతతత్వం మన శత్రువని ఆయన ఆనాడే స్పష్టం చేశాడు.



"పెంపుడు కుక్కను ఒళ్లో కూర్చో బెట్టుకుంటాం.. కానీ సాటిమనిషిని ముట్టుకుంటే మైలపడి పోతాం. ఎంత సిగ్గుచేటు?" ఈ మాటలు 'షహీద్' భగత్‌సింగ్ రాసిన 'అఛూత్ కా సవాల్' (అంటరానితనం సమస్య)పై పంజాబ్ నుంచి వెలువడే 'కిర్తీ' అనే పత్రికలో 'విద్రోహి' (తిరుగుబాటుదారు) అనే కలం పేరుతో రాసిన వ్యాసంలో ఈ విషయాలు స్పష్టం చేశాడు. "మన దేశంలో ఉన్నంత దుర్భర పరిస్థితులు మరే దేశంలోనూ లేవు" అంటూ ఆయన వ్యాసం మొదలువుతుంది."ఇక్కడ చిత్రవిచిత్రమైన సమస్యలున్నాయి. వీటిలో ముఖ్యమైంది అంటరానితనం. సమస్యేంటంటే, 30కోట్ల జనాభా ఉన్న దేశంలో ఆరుకోట్ల మందిని అస్పృశ్యులుగా పరిగణి స్తున్నారు. వారిని ముట్టుకుంటే చాలు అధర్మం జరిగిపోతుందని చెబుతారు. వాళ్ళ గుడిలో అడుగుపెడితే దేవుళ్లకు కోపం వస్తుందంటారు. వారు బావి నుంచి నీటిని తోడితే బావి అపవిత్రమై పోతుందంటారు. ఇరవై శతాబ్దంలో కూడా ఈ సమస్య ఇలా కొనసాగుతోందంటే వినడానికే సిగ్గుగా ఉంది" అంటాడు.1928 జూన్‌లో, అంటే అంటరానితనాన్ని నిషేధిస్తూ నాటి నేషనల్ అసెంబ్లీలో చట్టం చేయడానికి సరిగ్గా 22 ఏళ్ల కిందట, ఈ వ్యాసం అచ్చుయ్యేనాటికి భగత్‌సింగ్ వయసు కేవలం ఇరవైయేండ్లే.

'మేము కేవలం యువకులకే విజ్ఞప్తి చేయడానికి కారణం.. యువకులు పరాక్రమ వంతులు, ఉదార ప్రవృత్తి కలిగిన ఆవేశపరులు, యువకులు దారుణ అమానుష వ్యదలని పెదాల మీద చిరునవ్వుతో భరిస్తారు. నిర్భయంగా మృత్యువుని ఎదుర్కొంటారు. కారణం మానవ పురోగమన చరిత్రంతా యువతీ యువకుల నెత్తురుతో రాయబడింది. సంఘ సంస్కారాలు యువకుల శక్తి సాహసాలతో, ఆత్మబలిదానాలతో, ఆత్మవిశ్వాసాలతోనే లభించాయి. యువకులకు భయమన్నది ఏమిటో తెలియదు. ఆలోచనల కన్నా అనుభవాలే ఎక్కువగా సంపాదిస్తారు వారు. స్వతంత్రంగా, గంభీరంగా, శాంతి సహనాలతో యువకులు ఆలోచించాలి. భారతదేశ స్వాతంత్ర్యం అనే ఆదర్శాన్ని తమ జీవిత లక్ష్యంగా వారు ఎంచుకోవాలి. తమ కాళ్ళ మీద తాము నిలబడుతూ, బాహ్య ప్రభావాలకు దూరంగా ఉంటూ సంఘటితపడాలి. క్లిష్ట పరిస్థితుల్లో ఆదర్శానికి నీళ్లు వదిలివేసే మోసగాళ్లతోను, నీతిమాలిన వాళ్లతోనూ స్నేహం చేయవద్దు. వాళ్లతో మీకు సారూప్యత ఏమిటి? గాంభీర్యంతో, నిజాయితీగా, సేవ త్యాగం బలిదానమనే వాక్యాన్ని మీ జీవితానికి ఆదర్శం, మార్గదర్శనం చేసుకోండి. ఒక జాతి నిర్మాణం కోసం వేలాది అజ్ఞాత స్త్రీ పురుషుల బలిదానం అవసరమని, వారు తమ శ్రేయస్సు కన్నా, తమ తమ ఆత్మీయుల ప్రాణాల కన్నా, దేశ శ్రేయస్సే ఎక్కువ ప్రాధాన్యతనిస్తారని గుర్తుపెట్టుకోండి.' అంటూ భగత్‌సింగ్ యువతను ఉద్దేశించి చెపుతాడు.నేటి యువత వాటిని అలవర్చు కోవడం, నేడున్న దేశ పరిస్థితులకు చాలా అవసరం.

నేడు దేశంలో మనువాద సిద్ధాంత పునాదుల మీద నిర్మితమైన, మతతత్వ బీజేపీ అధికారాన్ని శాసిస్తోంది.దాని అసలు లక్ష్యం లౌకిక భారతదేశాన్ని మత రాజ్యంగా మార్చడం.ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించి, మతతత్వం రెచ్చగొట్టి నిసిగ్గు రాజకీయాలకు పాల్పడటం. మరోసారి మతతత్వ బీజేపీ అధికారం చేపడితే దేశానికి, దేశ ప్రజలకే కాదు ప్రజాస్వామ్యం, రాజ్యాంగానికి ప్రమాదమే. స్వాతంత్రోద్యమ పోరాటస్ఫూర్తితో, భారతదేశ సార్వభౌమత్వాన్ని సామ్రాజ్య వాదులకు, పెట్టుబడిదారులు, కార్పొరేట్లకు అప్పగించే బీజేపీ మతోన్మాద రాజకీయాలకు వ్యతిరేకంగా దేశాన్ని కాపాడుకునేందుకు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల పోరాటస్ఫూర్తితో ముందుకు సాగడమే నేటి యువత కర్తవ్యం.

(నేడు భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 93వ వర్ధంతి)



హార్టికల్చర్ భూముల్లో హైకోర్టు భవన నిర్మాణం

- జీవో విడుదల • వనమూలికలు, మొక్కల ధ్వంసం
- యూనివర్శిటీ భూములు ఇవ్వొద్దంటూ విద్యార్థుల వినతి

నవతెలంగాణ-రాజేంద్రనగర్

రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్, హార్టికల్చర్ యూనివర్శిటీలోని భూమిలో హైకోర్టు భవన నిర్మాణానికి 100 ఎకరాలు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవోను విడుదల చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం జేసీబీలతో చదును చేశారు. ఈ భూమిలో ఉన్న విలువైన వనమూలికలు, ఔషధ మొక్కలను ధ్వంసం చేస్తూ పూర్తిగా నేలను చదును చేస్తున్నారు. బెంగళూరు జాతీయ రహదారికి ఆనుకొని ఉండటం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు దగ్గర ఉండటంతో ప్రభుత్వం ఇక్కడ హైకోర్టు భవనాన్ని నిర్మిస్తే.. అందరికీ అనుకూలంగా ఉంటుందని భావించి యూనివర్శిటీ భూములను కేటాయించింది. అయితే ఎంతో విలువైన ఈ భూములు.. విద్యార్థులు పరిశోధనలు చేయడానికి ఉపయోగపడాలని, ఎట్టి పరిస్థితిలోనూ హైకోర్టుకు ఇవ్వరాదని హార్టికల్చర్ విద్యార్థులు సుమారు 60 రోజులకు పైగా నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కానీ ప్రభుత్వం స్పందించలేదు. యూనివర్శిటీ భూముల్లో హైకోర్టు నిర్మించరాదని భవిష్యత్‌లో యూనివర్శిటీ ఉనికికే ప్రమాదం ఉందని ప్రతిపక్ష పార్టీలన్నీ విద్యార్థులకు మద్దతు తెలిపాయి. అయినా ఇవేమీ పట్టించుకోకుండా ప్రభుత్వం గురువారం భూమిని పూర్తిగా చదును చేసే కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నప్పుడు ఈ పనులు చేయడం సరియైనది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఎన్నికల నియమావళి ఇక్కడ వర్తించదా అని ప్రశ్నిస్తున్నారు. విద్యార్థులు మాత్రం ఇక్కడ హైకోర్టు నిర్మించరాదని మరోసారి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

బీజేపీకి నిధుల ప్రవాహం



- అగ్రదాతల్లో ఏడు సంస్థలు
- ఎలక్టోరల్ బాండ్ల ద్వారా కాషాయపార్టీకి వేల కోట్లు
- గత ఐదేండ్లలో భారీ మొత్తంలో సమకూర్చుకున్న కమలం పార్టీ
- ఒక్క రోజులోనే కోట్ల రూపాయలు

న్యూఢిల్లీ : కేంద్రంలోని మోడీ సర్కారు 2019 లోక్‌సభ ఎన్నికలకు ముందు తీసుకొచ్చిన ఎలక్టోరల్ బాండ్ల పథకం లోగుట్టు ఒక్కొక్కటిగా బయటపడుతున్నది. సుప్రీంకోర్టు ఆదేశాలతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) ఎన్నికల సంఘం(ఈసీ)కు సమర్పించిన సమాచారంతో అసలు విషయాలు బహిర్గతమవుతున్నాయి. ఎలక్టోరల్ బాండ్ల ద్వారా దేశంలోని మిగతా పార్టీల కంటే భారీగానే విరాళాలు అందుకున్న బీజేపీకి గత ఐదేండ్లలో ఏడు సంస్థల నుంచి అధిక మొత్తంలో నిధులు అందాయి. ఇక కొన్ని సంస్థలు ఒక్క రోజులోనే (వేర్వేరు తేదీల్లో) రూ.100 కోట్ల కంటే పైగానే ఎలక్టోరల్ బాండ్ల ద్వారా బీజేపీకి విరాళాలు అందించాయి. వీటిలో క్విక్ సప్లై చైన్, ఆదిత్య బిర్లా గ్రూప్, మెఘా ఇంజినీరింగ్ (ఎంఈఐఎల్)లు ఉన్నాయి.

క్విక్ సప్లై చైన్ ప్రయివేట్ లిమిటెడ్ నుంచి

బీజేపీ ఇచ్చిన ఎలక్టోరల్ బాండ్ విరాళాల జాబితా ప్రకారం.. 5 జనవరి, 2022న ఆ పార్టీ.. ముంబయిలో కొనుగోలు చేసిన రూ. 1 కోటి చొప్పున 200 బాండ్ల ద్వారా రూ. 200 కోట్ల విరాళాన్ని అందుకుంది. ఎలక్టోరల్ బాండ్‌లు అమలులోకి వచ్చిన ఆరేళ్లలో ఏ పార్టీకైనా ఒకే సంస్థ అందించిన అతిపెద్ద విరాళం ఇదే కావటం గమనార్హం. ముంబయికి చెందిన క్విక్ సప్లై చైన్ ప్రయివేట్ లిమిటెడ్, ఇది 5 జనవరి 2022న ఒక్కొక్కటి రూ. 1 కోటి విలువైన 225 బౌండ్‌లను కొనుగోలు చేసింది. బీజేపీ జాబితాలో ఇచ్చిన బాండ్ తేదీతో సమానంగా తేదీ ఉండటంతో, ఈ విరాళం రిలయన్స్-లింక్డ్ సంస్థ అయిన క్విక్ సప్లై చైన్ ప్రయివేట్ లిమిటెడ్ నుంచి వచ్చినట్టు స్పష్టమవుతున్నదని విశ్లేషకులు తెలిపారు

ఈ సంస్థ రెండోవసారి రూ.125 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్లను 11 నవంబర్ 2022న కొనుగోలు చేసింది. బీజేపీ రికార్డులు కూడా అదే రోజున అదే మొత్తంలో ముంబయి సంస్థ కొనుగోలు చేసిన బాండ్‌ను చూపుతుండటం గమనార్హం.

ADITYA BIRLA GROUP

మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ద్వారా

2023, ఏప్రిల్ 11న హైదరాబాద్‌లో కొనుగోలు చేసిన రూ. 1 కోటి చొప్పున విలువ చేసే 115 బాండ్ల ద్వారా బీజేపీ రూ. 115 కోట్ల విరాళం అందింది. హైదరాబాద్‌కు చెందిన మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఒకే రోజు రూ. 1 కోటి చొప్పున 140 బాండ్‌లను కొనుగోలు చేసినట్టు రికార్డులు చెప్తున్నాయి. ఆ రోజు ఏ ఇతర కంపెనీ కూడా ఆ పరిధికి దగ్గరగా బాండ్లను కొనుగోలు చేయలేదని స్పష్టమవుతున్నది. మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ బీజేపీకి ఇచ్చిన మరో మూడు విరాళాలు 6 ఏప్రిల్ 2021న రూ. 33 కోట్లు (ఏప్రిల్ 8న క్రెడిట్ అయింది), జనవరి 10, 2022న రూ. 40 కోట్లు (జనవరి 12న క్రెడిట్ అయింది), 12 డిసెంబర్ 2022న రూ.49 కోట్లు (డిసెంబర్ 16న క్రెడిట్ అయింది), 27 జనవరి 2023న రూ. 32 కోట్లు (జనవరి 31న క్రెడిట్ అయింది)గా ఉన్నాయి. మేఘా రెండో అత్యధిక ఎలక్టోరల్ బాండ్ల దాతగా ఉన్నది. 2019 నుంచి 2023 మధ్య రూ. 966 కోట్ల విలువైన బాండ్లను ఆ సంస్థ కొనుగోలు చేసింది.

ఆదిత్య బిర్లా గ్రూప్ ద్వారా

12 డిసెంబర్, 2022న ముంబయిలో కొనుగోలు చేసిన ఒక్కొక్కటి రూ. 1 కోటి చొప్పున 100 బాండ్ల ద్వారా బీజేపీ మరో పెద్ద సింగిల్ డే విరాళాన్ని పొందింది. ఆ రోజు బాండ్-కొనుగోలుదారుల డేటాబేస్‌ను పరిశీలిస్తే రూ. 1 కోటి విలువ చేసే 100 బాండ్లను ఒంటరిగా కొనుగోలు చేసిన కంపెనీ ఏదీ లేదు. అయితే, ఆదిత్య బిర్లా గ్రూప్‌నకు చెందిన అనేక సంస్థలు రూ. 100 కోట్లకు సమానమయ్యే రూ.1 కోటి బాండ్లను కొనుగోలు చేశాయి.

ఫ్యూచర్ గేమింగ్ అండ్ హెూటల్ సర్వీసెస్ నుంచి

ఈ సంస్థ యొక్క ప్రధాన వ్యాపారం లాటరీ. దీనిని శాంటియాగో మార్టిన్ స్థాపించారు. రూ. 1368 కోట్ల విలువైన ఎలక్టోరల్ బాండ్‌లతో, ఎలక్టోరల్ బాండ్ల పద్ధతి ద్వారా రాజకీయ పార్టీలకు అత్యధికంగా విరాళాలు అందజేస్తున్నది. ఫ్యూచర్ గేమింగ్ ద్వారా రూ.500 కోట్లకు పైగా వచ్చినట్టు డీఎంకే ఇప్పటికే ప్రకటించింది. అయితే, ఆ సంస్థ బీజేపీకి కూడా విరాళాలు ఇచ్చినట్టు తెలుస్తున్నది.

5 అక్టోబర్ 2021న చెన్నైలోని ఒక కంపెనీ నుండి రూ. 50 కోట్ల ఎలక్టోరల్ బాండ్‌లను అందుకున్నట్టు బీజేపీ రికార్డులను చూస్తే తెలుస్తున్నది. ఆ రోజు రూ. 1 కోటి విలువ చేసే 50 లేదా అంతకంటే ఎక్కువ బాండ్లను కొనుగోలు చేసింది ఫ్యూచర్ గేమింగ్ మాత్రమే. దీంతో ఆ నిధులు బీజేపీ వెళ్లినట్టు తెలుస్తున్నది.

అదేవిధంగా 5 జనవరి, 2022న చెన్నైలో కొనుగోలు చేసిన బాండ్ల నుంచి రూ. 50 కోట్లను పొందినట్టు వెల్లడైంది. ఆ రోజు 50 లేదా అంతకంటే ఎక్కువ రూ. 1 కోటి విలువ గల బాండ్లను కొనుగోలు చేసిన చెన్నైకి చెందిన ఏకైక కంపెనీ ఫ్యూచర్ గేమింగ్ కావటం గమనార్హం. వాస్తవానికి, కంపెనీ 100 బాండ్లను కొనుగోలు చేసింది. మిగిలిన విరాళాలు ఇతర పార్టీలకు వెళ్లే అవకాశం ఉన్నది.

డీఎల్ఎఫ్ నుంచి

బీజేపీ జాబితా ప్రకారం.. 7 ఏప్రిల్ 2022న, ఢిల్లీలో ఒక్కొక్కటి రూ. 1 కోటి చొప్పున 40 బాండ్‌లను కొనుగోలు చేసి ఆ పార్టీకి విరాళంగా అందించారు. ఆ రోజున బాండ్లను కొనుగోలు చేసింది ఢిల్లీ కేంద్రంగా పని చేసే రియల్ ఎస్టేట్ దిగ్గజం డీఎల్ఎఫ్ అని బాండ్ కొనుగోలుదారుల డేటాను చూస్తే అర్థమవుతున్నది.

మరికొన్ని ఇతర కంపెనీల ద్వారా

ఇక ఇదే జాబితాలో హల్దియా ఎనర్జీ లిమిటెడ్ కూడా ఉన్నది. 21 జనవరి 2023న, బీజేపీ.. కోల్‌కతాకు చెందిన ఒక సంస్థ నుంచి రూ. 45 కోట్ల రూపాయల విరాళాన్ని జాబితా చేసింది. బాండ్లను కొనుగోలు చేసిన కంపెనీల డేటాబేస్‌ను అధ్యయనం చేస్తే.. కోల్‌కతాకు చెందిన హాల్దియా ఎనర్జీ లిమిటెడ్ ఆ తేదీన ఒక్కొక్కటి రూ. 1 కోటి విలువైన 45 బాండ్లను కొనుగోలు చేసినట్టు వెల్లడైంది. 2019 నుంచి 2024 మధ్య మొత్తం రూ. 377 కోట్లను విరాళంగా అందించిన హల్దియా ఎనర్జీ లిమిటెడ్ మొత్తంగా ఎలక్టోరల్ బాండ్ల ద్వారా టాప్ 5 దాతలలో ఒకటిగా ఉన్నది.

గుజరాత్‌కు చెందిన టొరెంట్ పవర్ సంస్థ 7 జనవరి, 2022న, అహ్మదాబాద్‌లో ఒక్కొక్కటి రూ. 10 లక్షల చొప్పున 100 బాండ్లను కొనుగోలు చేయడం ద్వారా రూ.10 కోట్లు పొందింది. ఈ మొత్తాన్ని బీజేపీకి విరాళంగా ఇచ్చినట్టు అర్థమవుతున్నది. టోరెంట్ గ్రూప్‌నకు ప్రధాని మోడీతో మంచి సంబంధాలున్నాయి. క్విక్ సప్లై చైన్ ప్రయివేట్ లిమిటెడ్ నుంచి రూ.200 కోట్ల మేర విరాళాలు ఎలక్టోరల్ బాండ్ల ద్వారా అందినట్టు తెలుస్తున్నది.



సికింద్రాబాద్ జిల్లాను ఏర్పాటు చేయాలి

- సీఎంకు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ లేఖ

నవతెలంగాణ-బేగంపేట్

సికింద్రాబాద్‌ను ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేయాలని చేపట్టిన ఉద్యమానికి మద్దతు తెలపాలని కోరుతూ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఇటీవల ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే.. 7 అసెంబ్లీ నియోజకవర్గాలు, 40 జీహెచ్ఎంసీ డివిజన్‌లతో కూడిన సికింద్రాబాద్‌ను జిల్లాగా ఏర్పాటు చేయాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. ఆ లేఖ ప్రతిని సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షులు గుర్రం పవన్‌కుమార్‌కు శుక్రవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద అందజేశారు. తమ ఉద్యమానికి మద్దతు తెలుపుతూ జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను వివరిస్తూ ముఖ్యమంత్రికి లేఖ రాసిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాధన సమితి ప్రధాన కార్యదర్శి సాదం బాల్ రాజ్ యాదవ్, ఉపాధ్యక్షుడు శైలేందర్, సభ్యులు అశోక్, కష్ణ సాగర్ ముదిరాజ్, సునీల్, జగ్గయ్య ఉన్నారు.

భూకబ్జాదారులపై కేసులు నమోదు చేయాలి



- 174 సర్వే నెంబర్ భూమిని పేదలకు పంచాలి: వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి.వెంకట్
- గుడిసెవాసులకు పట్టాలివ్వాలి : వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య

నవతెలంగాణ బచ్చన్నపేట

ప్రభుత్వ భూములను కబ్జా చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి బి.వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం చిన్నరాంచర్ల గ్రామ శివారులో ఉన్న 174 సర్వే నెంబర్‌లో 8-16 గుంటల భూమిని బీఆర్ఎస్ నాయకుడు, జెడ్పీ చైర్‌పర్సన్ అంజయ్య కబ్జా చేసి రెవెన్యూ అధికారులను, హైకోర్టును తప్పుదోవ పట్టించి ఆ భూమిపై స్టేటస్కో ఆర్డర్ తీసుకొచ్చారని తెలిపారు. కబ్జా చేసిన వారిపై కేసు నమోదు చేసి.. ఆ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకొని పేదలకు పంచాలని డిమాండ్ చేశారు. 174 సర్వే నెంబర్ భూమిలో సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గుడిసెలు వేసుకున్న గుడిసెవాసులను శుక్రవారం వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర బృందం కలిసింది. స్థలాన్ని పరిశీలించింది. ఈ సందర్భంగా బి.వెంకట్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షల ఎకరాల ప్రభుత్వ భూమి రియల్ ఎస్టేట్ వ్యాపారులు, అధికార పార్టీకి చెందిన నాయకులు కబ్జాలు చేసి ఆక్రమించుకుంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరిస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఒకపక్క కేసులు ఎత్తేస్తామని చెప్పానే గుడిసెవాసులపై, సీపీఐ(ఎం) నాయకులపై అక్రమ కేసులు నమోదు చేస్తూ జైలుకు పంపడం కుటిల బుద్ధికి నిదర్శనమని విమర్శించారు.

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య మాట్లాడుతూ.. 174సర్వే నెంబర్‌పై ఉన్న స్టేటస్కోను రద్దు చేస్తూ జిల్లా రెవెన్యూ కోర్టు ఇచ్చిన ఆర్డర్ కాపీని తహసీల్దార్ జిల్లా కోర్టుకు అందించడంలో కాలయాపన చేశారన్నారు. ఇది పరోక్షంగా భూకబ్జాదారులకు సపోర్టు చేయడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందిరమ్మ రాజ్యంలో ఇండ్ల స్థలాల సమస్య ఉండదని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం గుడిసెలు వేసుకుని నివాసముంటున్న వారికి పట్టాలు ఇవ్వడంలో విఫలమైందన్నారు. గుడిసెల స్థలాలకు పట్టాలు ఇచ్చి.. ఇండ్ల స్థలాలు లేని వారికి స్థలం.. ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూములను కాపాడి పేదలకు పంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు, సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు విజేందర్, మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్, భూ పోరాట కమిటీ కన్వీనర్ పర్వత నరసింహులు, నాయకులు గొల్లపల్లి బాపురెడ్డి, రామగల అశోక్, అనెబోయిన శ్రీను, తాడెం రాములు అన్నేబోయిన రాజు తదితరులు పాల్గొన్నారు.



కేజ్రీవాల్ అరెస్టు దుర్మార్గం

- ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్
- బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించిన ఆప్ నాయకులు
- అరెస్టు చేసిన పోలీసులు

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో ఏ పాత్రలేని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడం దుర్మార్గం అని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. కేజ్రీవాల్ అరెస్టును నిరసిస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ శ్రేణులు శుక్రవారం హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించాయి. 'మోడీ హటావ్ - దేశ్ బచావ్', 'బీజేపీ విభజన రాజకీయాలు సిగ్గుచేటు', 'బీజేపీ భారత్ చోడో', 'పీఎం కేర్ ఫండ్స్, రాఫెల్ డీల్ డీమోనిటైజేషన్', 'బీజేపీని గద్దె దించాలి' అని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ బారికేడ్‌లను తోసుకుంటూ బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోకి చొచ్చుకెళ్లేందుకు కార్యకర్తలు ప్రయత్నించారు. దాంతో తోపులాట జరిగి పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అడ్డుకుని బలవంతంగా డాక్టర్ దిడ్డి సుధాకర్‌తోపాటు ఆప్ శ్రేణులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ దిడ్డి సుధాకర్ మాట్లాడుతూ.. కేంద్ర దర్యాప్తు సంస్థలు బీజేపీ చేతిలో ఉండి ప్రతిపక్ష నేతల అణచివేతకు ప్రధాన సాధనాలుగా మారాయని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఉత్తర భారత దేశంలో ఆప్ బలాన్ని చూసి భయంతోనే.. ప్రధాని మోడీ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్టు చేయించారని, దీని వెనుక బీజేపీ హస్తం స్పష్టంగా కనిపిస్తోందని అన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్‌ను బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులను వేటాడేందుకు ఉపయోగించుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో ప్రతిపక్షం, ప్రజాస్వామ్యం గొంతును అణచివేయడానికి మోడీ ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. తక్షణమే అరవింద్ కేజ్రీవాల్‌ను విడుదల చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆప్ కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, డా.అన్సారీ, ఎంఏ.మజీద్, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ విజయ్ మల్లంగి, మహిళా విభాగం అధ్యక్షులు హేమ జిల్లోజు, అధికార ప్రతినిధులు జావీద్, అక్షయ్, నేతలు మదన్ లాల్, హైదర్, టి.రాకేష్ సింగ్, మౌనిక పాల్గొన్నారు.



అయోధ్యలో సిటీ యూనియన్ బ్యాంక్ 800వ శాఖ ఏర్పాటు

హైదరాబాద్ : సిటీ యూనియన్ బ్యాంక్ తన 800 శాఖను ఆయోధ్యలో ఏర్పాటు చేసినట్లు ప్రకటించింది. ఇది తమ సంస్థకు ఓ గొప్ప మైలురాయి అని ఆ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. మరోవైపు సొసైటీలో తమ బ్యాంక్ 120వ ఏళ్లను పూర్తి చేసుకుంటుందని తెలిపింది. ఈ కొత్త శాఖ ప్రారంభోత్సవంలో సిటీ యూనియన్ బ్యాంక్ ఛైర్మన్ ఎం నారాయణన్, పారిశ్రామికవేత్త వినయ్ మనుచా, బ్యాంక్ మాజీ ఛైర్మన్ ఎస్ కమకోడి, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ కొనుగోళ్ల అవినీతిపై ఎందుకు విచారణ జరపట్లేదు?

- కమీషన్ల కోసం ఎక్కువ ధరకు విద్యుత్ కొనుగోలు
- ఎన్టీపీసీతో ఎందుకు ఒప్పందం చేసుకోవట్లేదు? : బీజేపీ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యుత్ కొనుగోళ్ల విషయంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడితే ఇప్పుడున్న కాంగ్రెస్ సర్కారు ఎందుకు విచారణ జరిపించడం లేదని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రశ్నించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చవకగా వచ్చే విద్యుత్‌ని కాదని కమీషన్ల కోసం ఇతర సంస్థల నుంచి ఎక్కువ ధరతో కొనుగోలు ఒప్పందాలు చేసుకున్నదని ఆరోపించారు.



పీపీఏలు కుదుర్చుకోవాలని గతేడాది అక్టోబర్ ఐదోతేదీన బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఎన్టీపీసీ లేఖరాస్తే పెడచెవిన పెట్టిందని విమర్శించారు. ఇదే విషయంపై కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు మీనమేషాలు లెక్కిస్తోందని ప్రశ్నించారు. రాష్ట్రంలో వేసవి మొదలవక ముందే కరెంటు కోతలు మొదలయ్యాయని తెలిపారు. రాత్రి సమయంలో రైతులు పొలాల వద్ద పాముకాట్లకు గురై చనిపోతున్నారనీ, దీనికి సీఎం రేవంత్‌రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్టీపీసీతో పీపీఏ కుదుర్చుకొని కరెంటు కోతలను అధిగమించవచ్చునని సూచించారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో 12 ఏండ్ల విద్యుత్ ఒప్పందాన్ని కుదుర్చుకుని తెలంగాణ డిస్కంలను అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేసిన బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తోందా? అని ప్రశ్నించారు. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ పవర్ ప్లాంట్లలో జరిగిన అవినీతిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. సమావేశంలో మీడియా ఇన్‌చార్జి ఎన్వీ సుభాష్, అధికార ప్రతినిధి పోరెడ్డి కిషోర్ పాల్గొన్నారు.



మిర్చిని కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకోనివ్వాలి

- కోల్డ్ స్టోరేజ్ ఎదుట మిర్చి రైతుల ధర్నా
- పోలీసుల జోక్యంతో ముగిసిన వివాదం

నవతెలంగాణ-కాశిబుగ్గ

మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీలో నిల్వ చేసుకోనివ్వడం లేదని వరంగల్ ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ సమీపంలోని చాముండి కోల్డ్ స్టోరేజ్ ఎదుట శుక్రవారం మిర్చి రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. మిర్చి పంటకు సరైన ధర లేకపోవడంతో మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీలలో నిలువ చేసుకుందామంటే వ్యాపారులు అవకాశం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీదుదారులు కోల్డ్ స్టోరేజీలను ఆక్రమించుకొని రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. కమీషన్లకు ఆశపడి రైతుల మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీలలో నిల్వ ఉంచుకోవడం లేదని, ఈ దోపిడీని అరికట్టాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. కాగా రైతుల ఆందోళన విషయం తెలుసుకున్న ఏనుమాముల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని కోల్డ్ స్టోరేజ్ యజమానులతో మాట్లాడి సుమారు 2వేల మిర్చి బస్తాలను కోల్డ్ స్టోరేజీలో పెట్టించడంతో రైతులు శాంతించారు.

మార్కెట్‌కు మూడ్రోజుల సెలవు

ఏనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు నేటి నుంచి మూడ్రోజులపాటు సెలవుంటుందని మార్కెట్ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి సంగయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం (నేడు) వారాంతపు యార్డు బంద్, ఆదివారం వారాంతపు సెలవు, సోమవారం హెూలీ పండుగ సందర్భంగా మొత్తం మూడ్రోజులపాటు సెలవు ఉంటుందని చెప్పారు. మంగళవారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు చారిత్రక అవసరం



- బీఆర్ఎస్ కార్యకర్తలు ఎవరికీ భయపడరు
- పేదల ఇండ్లపై బుల్డోజర్స్ ఎక్కుపెట్టిన ప్రభుత్వం : ఎమ్మెల్యే మల్లారెడ్డి

నవతెలంగాణ-బోడుప్పల్

పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు చారిత్రక అవసరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో శుక్రవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో మేయర్ జక్క వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. దేశంలోనే తెలంగాణను నెంబర్ వన్‌గా నిలిపిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. మల్కాజిగిరి పార్లమెంటులోని ఏడు శాసనసభ నియోజకవర్గాల్లో మొత్తం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పోరేషన్ల మేయర్లు, నాయకులు ఉన్నారన్నారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్‌ను అభివృద్ధిలో నెంబర్‌వన్‌గా నిలిపి దేశానికే ఆదర్శంగా నిలిపిన ఘనత మేయర్, పాలకవర్గానికే దక్కుతుందన్నారు. మేడ్చల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ బలంగా ఉందని.. ప్రత్యర్థులకు కనీసం క్యాడర్ లేదు, నాయకుడు లేడు, బూత్ ఏజెంట్ కూడా లేడని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలు సైనికులని.. ఎవరికీ భయపడరని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం గెలిచి 100 రోజులైనా ప్రజలకు ఇచ్చిన హామీలలో నెరవేర్చింది శూన్యం అని విమర్శించారు. కూల్చడంలో నెంబర్ వన్ ప్రభుత్వం కాంగ్రెస్ అని.. అందుకే గెలిచిన వెంటనే పేదల ఇండ్లపై బుల్డోజర్స్ ఎక్కుపెట్టిందని విమర్శించారు. మల్కాజిగిరిలో బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతున్న రాగిడి లక్ష్మారెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు.

రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తన రాజకీయ జీవితంలో అనేక సేవా కార్యక్రమాలు చేశానని, సేవా దృక్పథం, నిబద్ధతను చూసి బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఎంపీ అభ్యర్థిగా అవకాశం కల్పించారని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉండని అభ్యర్థులకు ఓటు వేయవద్దని, కులాలు, మతాల మధ్య చిచ్చు పెట్టి కొట్లాటలు పెట్టే పార్టీలను ఆదరించొద్దని అన్నారు. ఢిల్లీ పార్టీలను వదిలి తెలంగాణ ప్రజల పార్టీ బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని కోరారు. బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులను పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడానికి పార్టీ శ్రేణులు ఐక్యంగా కృషి చేయాలని కోరారు. మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్, కేటీఆర్, మల్లారెడ్డి నాయకత్వంలో తెలంగాణను బ్రహ్మాండంగా అభివృద్ధి చేసుకున్నామన్నారు. రాగిడి లక్ష్మారెడ్డి తన చారిటీ ట్రస్ట్ ద్వారా పేదలకు అనేక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. పీర్జాదిగూడ మున్సిపల్ కార్పోరేషన్‌లో లక్ష్మారెడ్డికి ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించి, కేసీఆర్ కేటీఆర్‌లకు గిఫ్ట్‌గా ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సుభాష్ నాయక్, మద్ది యుగేందర్ రెడ్డి, కొడే పోచయ్య మధుసూదన్ రెడ్డి, ఎంపల్ల అనంత రెడ్డి, దొంతిరి హరిశంకర్ రెడ్డి,కో ఆప్షన్ ఇర్ఫాన్, నాయకులు బైటింటి ఈశ్వర్ రెడ్డి, లేతాకుల రఘుపతి రెడ్డి, బండారి రవీందర్, బండి సతీష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన బీజేపీ, బీఆర్ఎస్

- సంపత్ కుమార్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పదేండ్లపాటు మాదిగలను మోసం చేశాయని ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఏ.సంపత్ కుమార్ విమర్శించారు. శుక్రవారం నాగర్ కర్నూల్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లు రవి హైదరాబాద్‌లోని సంపత్ కుమార్ ఇంటికి వెళ్లి ఆయనతో భేటీ అయ్యారు. అనంతరం వారిద్దరూ సీఎం రేవంత్ రెడ్డి ఇంటికి వెళ్లి ఆయన్ను కలిశారు. అనంతరం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సంపత్ కుమార్ మాట్లాడుతూ వర్గీకరణ కోసం కాంగ్రెస్ హయాంలో ఉషామెహ్రా కమిషన్‌ను వేసిన విషయాన్ని గుర్తుచేశారు. తనకు టికెట్ రాలేదనే బాధ లేదని చెప్పారు. రాజకీయ ప్రయోజనాల కోసం మాదిగల హక్కులను మందకృష్ణ మాదిగ ఉపయోగించుకుంటున్నారని విమర్శించారు. మాదిగలకు ఎప్పుడు అన్యాయం జరిగినా అధిష్టానానికి లేఖ రాస్తానని తెలిపారు.

ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలి

- మహేష్ కుమార్ గౌడ్



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో బీజేపీ భారీ కుంభకోణానికి పాల్పడిందని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి బుద్ధి చెప్పాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. దేశ చరిత్రలో ఇప్పటి వరకూ ఏ రాజకీయ పార్టీ కూడా ఆదాయ పన్ను కట్టిన చరిత్ర లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అకౌంట్లను సీజ్ చేసి డబ్బులు వాడుకోకుండా బీజేపీ కుట్రలు చేసిందని ఆరోపించారు. పెట్రోల్, గ్యాస్ ధరలను పెంచి కార్పొరేట్ సంస్థలను లాభం చేకూర్చిన ఆ పార్టీ.... మతం, దేవుళ్లు, అక్షింతల పేరుతో మరోసారి అధికారంలోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు.

కాంగ్రెస్‌లో తెలంగాణ లేబర్ పార్టీ విలీనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ లేబర్ పార్టీ కాంగ్రెస్ లో విలీనమైంది. శుక్రవారం గాంధీభవన్ లో నిర్వహించిన కార్యక్రమంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ సమక్షంలో లేబర్ పార్టీ అధ్యక్షులు రమేశ్, నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన గౌరవం, ప్రాధాన్యతనిస్తామని తెలిపారు.

ఆ ఎమ్మెల్సీలపై అనర్హత వేటేయండి..

- మండలి చైర్మెన్‌కు బీఆర్ఎస్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తమ పార్టీ నుంచి ఎన్నికై కాంగ్రెస్‌లో చేరిన ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, కూసుకుంట్ల దామోదరరెడ్డిపై అనర్హత వేటేయాలని బీఆర్ఎస్ శాసనసభాపక్షం... శాసనమండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డిని కోరింది. ఈ మేరకు గురువారం ఆయనకు పిటిషన్‌ను సమర్పించింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు ఎమ్ఎస్ ప్రభాకరరావు, యాదవరెడ్డి, శేరి సుభాష్‌రెడ్డి, ఆ పార్టీ ఎల్పీ కార్యాలయ కార్యదర్శి ఎమ్.రమేశ్‌రెడ్డి తదితరులు చైర్మెన్‌ను కలిశారు. పిటిషన్‌తోపాటు ఆ ఇద్దరు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరినట్టు తెలిపే ఆధారాలను వారు ఆయనకు సమర్పించారు.

ఆర్టీసీ కార్మికుల బాండ్ల డబ్బులను చెల్లించేలా చూడండి

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు ఎస్‌డబ్ల్యూయూ నేతల వినతి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్టీసీ కార్మికులకు బాండ్ల డబ్బులను చెల్లించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఎస్‌డబ్ల్యూయూ (ఐఎన్‌టీయూసీ అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి, అడిషనల్ జనరల్ సెక్రటరీ జి.అబ్రహం, కేటీ రెడ్డి, డీవీఎస్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు శుక్రవారం పూలే భవన్‌లో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వినతిపత్రాన్ని అందజేశారు. ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తగ్గించిన హెచ్ఆర్ఏను అమలు చేయడాన్ని ఆపాలని కోరారు. బాండ్ల డబ్బుల విషయంలో జాప్యానికి కారణాలు తెలుసుకుని చెల్లించే విధంగా చూస్తానని వారికి డిప్యూటీ సీఎం హామీనిచ్చారు. 1-4-2020 నుంచి హెచ్ఆర్ఏను తగ్గింపు నిలుపుదల అంశంపై ఎన్నికల కోడ్ ఉన్నందున తర్వాత ఆలోచిస్తామని తెలిపారు.

కిరణ్ మృతి ఐక్య ఉద్యమాలకు తీరని లోటు

- తెలంగాణ పబ్లిక్, ప్రయివేటు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఐఎఫ్‌టీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు వి.కిరణ్ మృతి ఐక్య ఉద్యమాలకు తీరని లోటు అని తెలంగాణ పబ్లిక్, ప్రయివేటు రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్(ఏఐఆర్‌టీడబ్ల్యూఎఫ్-సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.శ్రీకాంత్ అన్నారు. రెండేండ్లుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ వి.కిరణ్ గురువారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఆయన భౌతిక కాయాన్ని శ్రీకాంత్‌తో పాటు ఏఆర్‌టీడబ్ల్యూఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. అజయ్‌బాబు, కోశాధికారి కె. సతీష్, రాష్ట్ర నాయకులు లక్ష్మణ్ సందర్శించారు. పూలమాలలేసి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కిరణ్ 30 ఏండ్లుగా ఆటో కార్మికుల సమస్యలపై నిరంతరం పోరాటం చేశారనీ, ట్రాన్స్‌పోర్ట్ జేఏసీ కార్యక్రమంలో కూడా చురుగ్గా పాల్గొంటూ, కార్యక్రమంలో ముందుండే వారని శ్రీకాంత్ గుర్తుచేశారు. వారి మరణం ట్రాన్స్‌పోర్ట్ ఐక్య ఉద్యమాలకు తీరని లోటని చెప్పారు.

మానుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ దాడులు

- డాటా ఎంట్రీ ఆపరేటర్‌పై కేసు నమోదు

నవతెలంగాణ-మహబూబాబాద్

మానుకోట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడులు చేశారు. సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్, డాటా ఎంట్రీ ఆపరేటర్ ఆలేట్ వెంకటేష్‌పై కేసు నమోదు చేశారు. వరంగల్ జిల్లా ఏసీబీ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. దంతాలపల్లి మండల కేంద్రానికి చెందిన గూడగంటి హరీష్ తాను కొనుగోలు చేసిన భూమి రిజిస్ట్రేషన్ కోసం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సంప్రదించారు. రూ.19200 లంచంగా ఇవ్వాలని సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహమ్మద్, ఆపరేటర్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఈ క్రమంలో హరీష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించగా, వారు ఆకస్మిక దాడి చేశారు. హరీష్ నుంచి రూ.19200 లంచంగా తీసుకున్న వెంకటేష్ తన ప్యాంటు జేబులో పెట్టుకున్నాడు. ఈ క్రమంలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించగా దస్తావేజు లేక రిజిస్ట్రేషన్ కోసమిచ్చిన 1,72,000 రూపాయలు పట్టుబడ్డాయి. ఆ సొమ్మును కూడా సీజ్ చేసి తహసీల్దార్‌ను ఆపరేటర్‌ను అదుపులోకి తీసుకొని అరెస్టు చేసినట్టు ఏసీబీ అధికారులు తెలిపారు.

అక్రమ పోస్టింగ్‌లు

రాజకీయ పలుకుబడితో పైరవీలు

- 317 నిబంధనలు బేఖాతర్
- పోస్టుల కంటే అదనపు ఉపాధ్యాయుల కేటాయింపు
- రంగారెడ్డి జిల్లాలో 300 మంది అంతర్ జిల్లా ఉద్యోగులు
- స్థానికులకు అన్యాయం
- ఉద్యోగులకు ప్రమోషన్లు లేదు.. నిరుద్యోగులకు ఉద్యోగాలు కరువు



నవతెలంగాణ- రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్ర రాజధాని శివారు ప్రాంతమైన రంగారెడ్డి జిల్లాలో పోస్టింగ్ కోసం ఉద్యోగులు చేయని ప్రయత్నం ఉండదు. దీనికైనా తెగిస్తారు. ఎంతటి పైరవీలకైనా సిద్ధమవుతున్నారు. శివారు జిల్లాలైన నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్ ఉపాధ్యాయులు కొంత మంది నిబంధనలు బేఖాతరు చేసి ఇక్కడికి మకాం మార్చారు. పైరవీలతో రంగారెడ్డి జిల్లాలోనే పోస్టింగ్ పొందారు. 317 జీవో నిబంధనలను తుంగలో తొక్కి ఉద్యోగంలో చేరారు. దాంతో జిల్లాలోని సీనియర్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతున్నారు. వీరి రాకతో ఖాళీలు లేక నిరుద్యోగులకు సైతం పోస్టులు ఉండటం లేదు. ఇలా వచ్చిన వారిపై చర్యలు తీసుకుని స్థానికులకు న్యాయం చేయాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

పైరవీలతో రంగారెడ్డి జిల్లాలో పోస్టింగ్ తీసుకున్న ఇతర జిల్లాలకు చెందిన వారు సుమారు 300 మందికి పైగా ఉన్నారు. అయితే 317 జీవో ప్రకారం.. స్థానికత ప్రకారం పోస్టింగ్ ఇవ్వాల్సి ఉంటుంది. ఉపాధ్యాయ పోస్టులు స్కూల్ అసిస్టెంట్, సెకండ్ గ్రేడ్ టీచర్స్ పోస్టులు స్థానికత కిందికి వస్తాయి. ఉపాధ్యాయ పోస్టుల్లో దాదాపు స్థానికులకే అవకాశం ఉంటుంది. కానీ రంగారెడ్డి జిల్లాలో పైరవీ కారులదే పై చేయి అన్నట్టు ఉంది. జిల్లాల పునర్విభజనలో భాగంగా మహబుబ్‌నగర్ ప్రాంతం నుంచి కొన్ని మండలాలు రంగారెడ్డి జిల్లాలో కలిశాయి. దాంతో మహబుబ్‌నగర్‌లోని కొంత మంది సీనియర్ ఉపాధ్యాయులను రంగారెడ్డికి కేటాయించారు. అయితే సీనియార్టీని బట్టి మహబుబ్‌నగర్ నుంచి రంగారెడ్డికి రావాల్సిన వాటా ప్రకారం మొదటి విడతలో పోస్టులు కేటాయించారు. కానీ ఇక్కడితో ఆగకుండా మహబుబ్‌నగర్ జిల్లాకు చెందిన కొంత మంది ఉపాధ్యాయులు తమకు సీనియార్టీ ఉందని కోర్టుకు వెళ్లడంతో వారికి కూడా రంగారెడ్డి జిల్లాలో పోస్టింగ్ ఇచ్చారు. దీంతో రంగారెడ్డి జిల్లాలో అదనంగా పోస్టులు పొందారు. దీనిపై ఇప్పటి వరకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. ఇతర జిల్లాల నుంచి వివిధ కారణాలతో సుమారు 300 మంది ఉపాధ్యాయులు రంగారెడ్డిలో ఉన్నారని తెలిసింది.

పైరవీలతో పోస్టింగ్‌లు..

రంగారెడ్డి జిల్లా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు దగ్గరగా ఉండటంతో అందరి దృష్టి ఈ జిల్లాపైనే పడింది. దీంతో రాజకీయ పలుకుబడి ఉన్న ఉద్యోగులు పైరవీలు చేసి పోస్టింగ్ ఆర్డర్లు తెచ్చుకుంటున్నారు. దాంతో స్థానికులు నష్టపోతున్నారు. ఉదాహరణకు..

సరూర్‌నగర్ ప్రభుత్వం పాఠశాలలో శివారు జిల్లాకు చెందిన ఉపాధ్యాయుడు పోస్టింగ్ పొందాడు. ఆయనకు ఇక్కడ పోస్టింగ్ ఎలా వచ్చింది అన్నది ప్రశ్నార్థకం. దీనిపై విద్యాశాఖ అధికారులను ఉపాధ్యాయ సంఘాలు ప్రశ్నించినా సమాధానం లేదు. ఆయన ఓ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు. గత ప్రభుత్వానికి అనుబంధంగా ఉన్న సంఘానికి నాయకుడు కావడంతో ఆయన ఇక్కడ పోస్టింగ్ పొందారనే ఆరోపణలున్నాయి. ఇలా వందల సంఖ్యలో తమ పలకుబడితో పోస్టులు పొందినట్టు తెలిసింది.

అగెనెస్ట్ పోస్టుల్లో ఉపాధ్యాయులభర్తీ

జిల్లాలో 25 అగెనెస్ట్ పోస్టుల్లో ఉపాధ్యాయులను భర్తీ చేశారు. పైరవీలతో వచ్చిన ఉపాధ్యాయుడికి సంబంధించి సబ్జెక్టు పోస్టు ఖాళీ లేకపోయినా ఏదో ఒక సబ్జెక్టు పోస్టులో భర్తీ చేశారు. ఇంగ్లీష్ సబ్జెక్టు పోస్టు ఖాళీ ఉంటే.. మ్యాథ్స్ టీచర్‌ను తీసుకున్నారు. దీంతో చెప్పాల్సిన సబ్జెక్టు టీచర్ లేక విద్యార్థులు నష్టపోతున్నారు. ఇలా పైరవీలతో అనేక మంది జిల్లాలోకి ప్రవేశించారు. దాంతో స్థానిక ఉద్యోగులతోపాటు విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. అక్రమ చొరబాట్లతో టీచర్ పోస్టులు ఖాళీలు లేక నిరుద్యోగులు సైతం నష్టపోతున్నారు. గత ప్రభుత్వంలో జరిగిన లోటుపాట్లపై ప్రస్తుత ప్రభుత్వం అయినా దీనిపై దృష్టి సారించి అక్రమంగా వచ్చిన వారిపై చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

317 అక్రమ చొరబాటులపై చర్యలు తీసుకోవాలి
గోపాల్‌నాయక్, టీఎస్‌యూటీఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి



జిల్లా క్యాడెర్ సంఖ్య కంటే అదనంగా ఇతర జిల్లాల నుంచి వచ్చిన ఉద్యోగులకు పోస్టింగ్ ఇవ్వడంతో స్థానికులకు నష్టం జరుగుతోంది. స్థానిక ఉద్యోగులకు ప్రమోషన్లు లేకుండా పోయాయి. ఉద్యోగ ఖాళీలు లేక నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారు. 317 జీవో ప్రకారం ఉపాధ్యాయ పోస్టులు స్థానికులతో భర్తీ చేయాలి. ఇతర జిల్లాల నుంచి వచ్చిన వారిని వెనక్కి పంపిస్తే జిల్లాలో నిరుద్యోగులకు అవకాశాలు వస్తాయి.

ఆరు రోజుల ఈడీ కస్టడీకి కేజ్రీవాల్

- సుప్రీంలో పిటిషన్‌ను ఉపసంహరించుకున్న కేజ్రీవాల్
- 26న మోడీ నివాసం వద్ద ఆప్ ఘెరావ్
- తన జీవితం దేశానికే అంకితం అన్న కేజ్రీవాల్
- ఎన్నికల సంఘంతో ఇండియా ఫోరం నేతల భేటీ



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఆరు రోజుల పాటు (ఈనెల 28 వరకు) ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కస్టడీకి రౌస్ ఎవెన్యూ కోర్టు అనుమతిచ్చింది. శుక్రవారం వైద్య పరీక్షల అనంతరం కేజ్రీవాల్‌ను రౌస్ ఎవెన్యూ ప్రత్యేక కోర్టులో ప్రవేశ పెట్టారు. ఈ మేరకు మద్యం కుంభకోణంలో కేజ్రీవాల్ పాత్రపై ఈడీ కోర్టుకు వివరించింది. 28 పేజీల రిమాండ్ రిపోర్ట్‌ను ఈడీ కోర్టు ముందుంచింది. సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు ఈడీ తరపున వాదనలు వినిపించారు. ఈ కేసులో కేజ్రీవాల్ కింగ్‌పిన్ అని, మద్యం పాలసీ అమలులో ఆయన ప్రత్యక్షంగా పాల్గొన్నారని కోర్టుకు వివరించారు. 'ఇందులో సౌత్ గ్రూప్‌నకు అనుకూలంగా వ్యవహరించారు. ఇది రూ.వంద కోట్ల స్కామ్ కాదు, రూ.600 కోట్ల స్కామ్. ఇందులో కేజ్రీవాల్‌కు రూ.300 కోట్లు అందాయి. ఈ డబ్బే పంజాబ్, గోవా ఎన్నికల్లో ఖర్చుపెట్టారు. రూ.45 కోట్లు హవాలా ద్వారా గోవాకు పంపారు. ఆప్, సౌత్ గ్రూప్‌ల మధ్య విజయ్‌నాయర్ వారధిగా ఉన్నాడు. విజయ్ నాయర్ కంపెనీ నుంచి అన్ని ఆధారాలూ సేకరించాం. మా దగ్గర అన్ని ఆధారాలూ ఉన్నాయి' అని ఈడీ వివరించింది. ఈ కేసులో విచారణ నిమిత్తం కేజ్రీవాల్‌ను పది రోజులు కస్టడీకి కోరింది.

ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో నిందితుడిగా ఉన్న అరవింద్ కేజ్రీవాల్‌ను గురువారం రాత్రి 9.05 గంటలకు అరెస్టు చేశామని, 24 గంటల్లోపు ఆయనను కోర్టు ముందు హాజరుపరిచినట్లు ఈడీ పేర్కొంది. రిమాండ్ కోరుతూ దరఖాస్తు ఇచ్చామని, అన్ని నిబంధనలను పాటించి కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశామని ఈడీ అధికారులు కోర్టుకు వెల్లడించారు. కేజ్రీవాల్ అరెస్టుపై బంధువులకు కూడా సమాచారం అందించామని, అరెస్టుకు సంబంధించిన ఆధారాలను 28 పేజీల్లో రాతపూర్వకంగా అందజేశామని వివరించారు. అరెస్టు పంచనామా కూడా తమ వద్ద ఉందని ఈడీ తరపు న్యాయవాదులు కోర్టుకు వెల్లడించారుఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సీఎం అరవింద్ కేజ్రీవాల్ కీలకమైన వ్యక్తి అని, కొందరు వ్యక్తులకు మేలు చేసేందుకు డబ్బులు (లంచం) అడిగారని పేర్కొంది. ఇక ఈ కేసులోనే అరెస్టయిన ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం, ఆప్ నేత మనీష్ సిసోడియాకు బెయిల్ లభించలేదని న్యాయస్థానం దృష్టికి ఈడీ తీసుకెళ్లింది. ఈ కేసులో సహ నిందితురాలుగా ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కె.కవిత వాంగ్మూలాన్ని కూడా తీసుకున్నామని ప్రస్తావించింది. రెండు పర్యాయాలు నగదు బదిలీ జరిగిందని వివరించింది. సౌత్ గ్రూప్‌నకు లిక్కర్ పాలసీలో లబ్ది చేకూర్చేందుకు ముడుపులు తీసుకున్నారని తెలిపింది. లిక్కర్ పాలసీ రూపకల్పనలో భాగంగా ఎమ్మెల్సీ కవితను కేజ్రీవాల్ కలిశారని, కలిసి పని చేద్దామంటూ కవితతో సీఎం కేజ్రీవాల్ చెప్పారని ఈడీ పేర్కొంది. ఈ కేసుకు సంబంధించిన ఆధారాలలో ఫోన్ రికార్డ్స్ కూడా ఉన్నాయని కోర్టుకు ఈడీ తెలిపింది.

తన జీవితం దేశానికే అంకితం: కేజ్రీవాల్

తన జీవితం దేశానికే అంకితమని ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అన్నారు. మద్యం కుంభకోణం కేసులో ఈడీ అరెస్ట్ తర్వాత ఆయన తొలిసారి మీడియాతో మాట్లాడారు. ఎక్కడ ఉన్నా దేశం కోసం పనిచేస్తుంటానని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం ఆయనను ఈడీ అధికారులు ఢిల్లీలోని రౌస్ ఎవెన్యూ కోర్టులో హాజరుపరిచారు. ఆ సమయంలో కేజ్రీవాల్ కోర్టు లోపలికి వెళ్తూ.. 'నా జీవితం దేశానికి అంకితం. లోపల ఉన్నా బయట ఉన్నా దేశం కోసం పనిచేస్తుంటా' అని పేర్కొన్నారు.

సుప్రీంకోర్టులో పిటిషన్ ఉపసంహరణ

ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టును సవాల్ చేస్తూ ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించేందుకు సుప్రీంకోర్టు అంగీకరించింది. ఈ మేరకు కేజ్రీవాల్ పిటిషన్‌ను సీజేఐ ప్రత్యేక ధర్మాసనానికి కేటాయించారు. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ ఎంఎం సుందరేష్, జస్టిస్ బేలా త్రివేదిలతో కూడిన ప్రత్యేక ధర్మాసనం కేజ్రీవాల్ అరెస్టు పిటిషన్‌పై విచారణ జరపనుంది. అయితే ఇంతలోనే పిటిషన్‌ను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఉపసంహరించుకున్నారు. ఈ విచారణ ట్రయల్ కోర్టులో రిమాండ్ ప్రొసీడింగ్స్‌తో క్లాష్ అవుతుందని కేజ్రీవాల్ తరపు లాయర్లు అత్యున్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. దీని కారణంగా పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని కోరారు. ట్రయల్ కోర్టు తీర్పునకు అనుగుణంగా మరో పిటిషన్‌తో సుప్రీంకోర్టును ఆశ్రయించనున్నట్టు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సర్వోన్నత న్యాయస్థానం పిటిషన్ ఉపసంహరణకు అనుమతిచ్చింది.

ఢిల్లీలో ఆందోళనలు

ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడాన్ని ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా ఖండించింది. ఈనెల 26న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నివాసాన్ని ఘెరావ్ చేయాలని పిలుపునిచ్చింది. అరెస్ట్ నేపథ్యంలో బీజేపీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలకు పిలుపునిచ్చింది. ఈ నేపథ్యంలో ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా ఆప్ నేతలు ఆందోళన చేపట్టారు. పార్టీ నేతలు, కార్యకర్తలు ఢిల్లీలో ఉదయం నుంచి రోడ్లపైకి వచ్చి కేజ్రీవాల్ అరెస్టుకు నిరసనగా, బీజేపీకి వ్యతిరేకంగా ఆందోళనలు చేశారు. ఐటీవో కూడలి, డీడీయూ మార్గ్‌లోని ఆప్, బీజేపీ ప్రధాన కార్యాలయం సమీపంలో పెద్ద ఎత్తున నిరసనలు చేపట్టారు. దీంతో నిరసనకారులను పోలీసులు అడ్డుకున్నారు. ఆ ప్రాంతాల్లో 144 సెక్షన్ కింద నిషేధాజ్ఞలు విధించారు. ఆందోళనకారులను చెదరగొట్టారు. మంత్రులు అతిషీ, సౌరభ్‌తో సహా పలువురు కార్యకర్తలు, నేతలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఐటీవో వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సమయంలో ఢిల్లీ పోలీసులు తమను అదుపులోకి తీసుకున్నారని మంత్రి అతిషీ విమర్శించారు. 'ఐటీవో వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సమయంలో ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముందుగా వీళ్ళ తప్పుడు కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రిని అరెస్ట్ చేశారు. ఇప్పుడు శాంతియుతంగా ఆందోళన చేపడుతున్న వారిని కూడా అరెస్ట్ చేస్తున్నారు. ఇది ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడం కాకపోతే.. మరేమిటి..?' అని ఆమె పేర్కొన్నారు.మద్యం కేసులో ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్టుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలతో రాజధాని ఢిల్లీలో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరోవైపు ఆమ్ ఆద్మీ పార్టీ నిరసనల నేపథ్యంలో బీజేపీ ప్రధాన కార్యాలయం, ఈడీ కార్యాలయానికి వెళ్లే మార్గాలను అధికారులు మూసివేశారు. అక్కడ కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాటు చేశారు. అలాగే సెంట్రల్ ఢిల్లీలోని పలు రహదారులను మూసివేసి వాహనాల రాకపోకలను నిషేధించారు. డీడీయూ మార్గ్‌కు వెళ్లే రహదారిపై పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేశారు. దీంతో ఐటీవో చౌక్, రాజ్‌ఘాట్, వికాస్ మార్గ్‌ల దగ్గర భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడినట్లు అధికారులు తెలిపారు. మరోవైపు ఢిల్లీలోని ఐటీవో మెట్రో స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం వరకూ మూసివేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు.

ఈసీకి ఇండియా ఫోరం నేతల ఫిర్యాదు

ఇండియా ఫోరం నేతలు శుక్రవారం ఎన్నికల సంఘాన్ని కలిసి ఎన్నికల సమయంలో కేంద్ర సంస్థల దుర్వినియోగంపై వినతి పత్రం సమర్పించారు. నిష్పక్షపాతమైన ఎన్నికలను నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని వినతిపత్రంలో 15 ఉదాహరణలతో వివరించారు. దీన్ని అరికట్టాలంటే ఎన్నికల కమిషన్‌కు ఉన్న అధికారాలను వినియోగించాలని కోరారు. "వివిధ రాష్ట్రాల చీఫ్ సెక్రెటరీ, హోం సెక్రెటరీ, డీజీపీ సహా ఉన్నతాధికారులను నియంత్రించే, మార్చే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉంది. అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. కానీ రాజకీయ ప్రతీకార ఆయుధాలుగా మారిన ఈడీ, సీబీఐ, ఆదాయపు పన్ను శాఖ వంటి కేంద్ర సంస్థల అధికారులను నియంత్రించేందుకు ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవడం లేదు. కేంద్రంలోని అధికార పార్టీ స్వేచ్ఛగా ఎన్నికలను చెడగొట్టేందుకు ప్రయత్నిస్తోంది. ప్రతిపక్ష నేతలను, ముఖ్య మంత్రులను ట్రాప్ చేసేందుకు కేంద్ర ఏజెన్సీలు వ్యూహాలు పన్నుతున్నాయి. ప్రతిపక్ష పార్టీ నేతలపైనే వేటు పడింది. అధికార పార్టీకి చెందిన ఒక్క సభ్యుడిని కూడా అరెస్టు చేసేందుకు, విచారించేందుకు ఈ ఏజెన్సీలు సిద్ధంగా లేవు. రాజకీయ అవినీతితో కేంద్ర సంస్థలు పని చేస్తున్నాయి. ఎన్నికల ప్రకటన తరువాత ముఖ్యమంత్రిని అరెస్టు చేయడం ఇదే తొలిసారి. ప్రచార సమయంలో ఇలా చేయడం నిబంధనలకు విరుద్ధం. ప్రతిపక్ష పార్టీల నేతలపై వేధింపులు ఆపాలి" అని నేతలు డిమాండ్ చేశారు. కక్ష సాధింపు చర్యల జాబితాను కూడా అందజేశారు. ఈసీని కలిసిన వారిలో సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, టీఎంసీ నేత డెరిక్ ఓబ్రెయిన్, కాంగ్రెస్ నేతలు కెసి వేణుగోపాల్, అభిషేక్ మను సింఘ్వీ తదితరులు ఉన్నారు.

కృష్ణా ట్రిబ్యునల్ గడువు పొడిగింపు

- రాష్ట్రానికి లేఖ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆయా రాష్ట్రాల మధ్య జలవివాదాల పరిష్కారానికి ఏర్పాటైన కృష్ణా ట్రిబ్యునల్ కాలపరిమితిని వచ్చే సంవత్సరం జులై వరకు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర జలశక్తి శాఖ నోటిఫికేషన్ జారీచేసింది. అలాగే సంయుక్త కార్యదర్శి ఆనంద్‌మోహన్ రాష్ట్ర సాగునీటి పారుదల శాఖకు లేఖ రాశారు. 2004 ఏప్రిల్ రెండున ఏర్పడిన కృష్ణా ట్రిబ్యునల్ 2010 డిసెంబరు 30న కృష్ణా జలాల పంపిణీపై కేంద్రానికి నివేదిక సమర్పించింది. ఆ తీర్పుపై అభ్యంతరాలను వ్యక్తం చేస్తూ కేంద్ర ప్రభుత్వంతోపాటు భాగస్వామ్య రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర నదీజలాల వివాదాల చట్టంలోని సెక్షన్ 5(3) కింద 2011 మార్చి 29న దరఖాస్తు చేశాయి. దానిపై విచారణ జరపడానికి కేంద్ర ప్రభుత్వం 2012 నుంచి ప్రతియేటా ట్రిబ్యునల్ గడువును పొడిగిస్తూ వస్తున్నది. ఈ మధ్యలో ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని సెక్షన్ 89ని అనుసరించి కేంద్ర ప్రభుత్వం 2023 జులై ఆరున కొత్తగా ప్రతిపాదించిన విధివిధానాలపై విచారణ జరిపి, తదుపరి నివేదిక అందించడానికి ట్రిబ్యునల్ పదవీకాలాన్ని ఈ ఏడాది మార్చి 31వరకు పొడిగించింది.

కార్మికుల శ్రమ ఫలితమే సంపద సృష్టి

- అసమానతలను పెంచి పోషిస్తున్న కేంద్రం
- బడా కార్పొరేట్లకు అనుకూలంగా విధానాలు
- ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పార్టీలకు తాయిలాలు
- యూనియన్లు లేకుండా చేసే కుట్రే లేబర్ కోడ్‌లు: సీబీఎల్ 25 వసంతాల సిల్వర్‌జూబ్లీ ఉత్సవాల్లో సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

శ్రామిక వర్గం శ్రమ శక్తి వల్లే సంపద సృష్టించబడుతుందని, అదే దేశాభివృద్ధికి దోహద పడుతుందని సీఐటీయూ జాతీయ కోశాధికారి సాయిబాబు అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సీబీఎల్ కంపెనీలో ఏబీ ఇన్ బేవ్ ఇండియా ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) 25వ వసంతాల సిల్వర్ జూబ్లీ వేడుకల్ని శుక్రవారం స్థానిక పీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ.. దేశ జీడీపీలో కార్మికవర్గం పాత్ర కీలకమన్నారు. పారిశ్రామిక, సర్వీస్ రంగాల్లో కార్మికులు కష్టపడి పనిచేస్తున్న ఫలితంగానే సంపద వస్తుందన్నారు. ఈ సంపద అందరికీ అందాల్సి ఉండగా.. పాలకుల విధానాల వల్ల కొందరి వద్దే పోగవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పది శాతం ఉన్న కొద్ది మంది చేతిలో 58 శాతం సంపద పోగైందని, 90 శాతం ఉన్న పేద, దిగువ మధ్య తరగతి వద్ద కేవలం 15 శాతం సంపదే ఉందన్నారు. అసమానతల భారతదేశాన్ని పాలకులు సృష్టించారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్పాదక రంగంలో పెట్టుబడులు వస్తేనే సంపద సృష్టించడంతో పాటు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు, అనుబంధ ఉత్పత్తుల తయారీకి అవకాశముంటుందన్నారు. బడా కార్పొరేట్ శక్తులకు అనుకూల విధానాలను కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తుందన్నారు. మల్టీ నేషనల్ కంపెనీలకు దోచి పెడుతోందని, ఆ కార్పొరేట్ల వల్ల ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఏర్పడిందని అన్నారు. ప్రభుత్వాలు అనుసరించే విధానాల వల్ల లాభాలు గడిస్తున్న కంపెనీలు తిరిగి ఎలక్టోరల్ బాండ్ల రూపంలో పార్టీలకు తాయిలాలు ముట్టజెబుతున్నాయని చెప్పారు. ఇది రాజ్యాంగ విరుద్ధమని సుప్రీం కోర్టు చెబితే తప్ప ఎలక్టోరల్ బాండ్ల లోగుట్టు వెలుగు చూడలేదన్నారు. మరో పక్క కార్మికులు యూనియన్లు పెట్టుకోకూడదనే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను తెచ్చింన్నారు. కార్మికుల సంక్షేమం, పరిశ్రమల అభివృద్ధిని సీఐటీయూ కోరుకుంటుందన్నారు.

కార్మికుల పక్షాన యూనియన్: చుక్క రాములు

సీబీఎల్ పరిశ్రమలో 25 సంవత్సరాలుగా కార్మికుల పక్షాన నికరంగా నిలబడి కార్మికుల సంక్షేమం, పరిశ్రమ అభివృద్ధి కోసం పాటుపడింది సీఐటీయూ అని రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. నాలుగు యాజమాన్యాలు మారినప్పటికీ కార్మికులు మాత్రం సీఐటీయూ జెండా కిందనే ఐక్యంగా పని చేస్తున్నారన్నారు. 9 వేతన ఒప్పందాల ద్వారా కార్మికులకు మెరుగైన జీతభత్యాలు సాధించుకోగలిగామన్నారు. సీబీఎల్ కార్మికులు జీతభత్యాల కోసం పోరాడటమే కాకుండా కంపెనీ అభివృద్ధి కోసం అహర్నిషలూ కష్టపడుతున్నందునే 25 వసంతాల సిల్వర్ జూబ్లీ ఉత్సవాలు జరుపుకోగల్గుతున్నామన్నారు. అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టి ఇతర కంపెనీల కార్మికులకు ఆదర్శంగా నిలిచారన్నారు. సభకు ముందు కార్మికులతో కలిసి అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. పాతికేండ్లుగా కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపారంటూ "జయహో చుక్క రాములన్న" పేరుతో ప్రత్యేక సీడీని ఆవిష్కరించారు. ఒకే వేదికపై కంపెనీ యాజమాన్య ప్రతినిధులు, కార్మిక సంఘం నాయకులు ఆసీనులయ్యారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బి.మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు బాగారెడ్డి, ప్రసన్న, దేవరాజ్, నాగభూషణం, కంపెనీ ప్రతినిధులు జితేందర్, విజయ్, కె.రామ్‌మోహన్, పూర్వ ప్రతినిధులు వినయ్‌కుమార్‌రెడ్డి, డీవీరెడ్డి, అంజయ్య ప్రసాద్ పాల్గొన్నారు.

సీఏఏపై పోరు ఆగదు: కేరళ సీఎం విజయన్

కొజికోడ్ : సీఏఏ (పౌరసత్వ సవరణ చట్టం)ను అమలుచేయాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం, దేశం నుంచి రోహింగ్యా శరణార్థులను బయటకు పంపేందుకు వ్యూహాత్మకంగా పన్నిన ఎత్తుగడేనని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ విమర్శించారు. సీఏఏకు వ్యతిరేకంగా కొజికోడ్ బీచ్‌లో శుక్రవారం ఎల్‌డీఎఫ్ వేలాది మందితో నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు. శరణార్థుల పట్ల సార్వజనీన దృక్పథాన్ని సీఏఏ ఉల్లంఘిస్తోందని, దీనివల్ల ప్రపంచ దేశాల్లో భారత్ ఏకాకి అయ్యే పరిస్థితి వస్తుందన్నారు. పౌరసత్వానికి మతాన్ని ఒక ప్రామాణికంగా తీసుకొస్తూ మోడీ ప్రభుత్వం తీసుకున్న చర్యను ఐక్యరాజ్య సమితి, అమ్నెస్టీ ఇంటర్నేషనల్ సహా ప్రపంచ దేశాలు తీవ్రంగా ఖండించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.. కేవలం దేశ పౌరులకే కాకుండా ఇక్కడ నివసించే వారందరికీ రాజ్యాంగం సమాన హక్కులు కల్పించిందని, మతం ప్రాతిపదికన విభజించడాన్ని రాజ్యాంగం అనుమతించదన్నారు.

సీఏఏ జాతీయ పౌర పట్టిక అమలుకు తాము మద్దతిచ్చేది లేదని ప్రకటించిన మొదటి రాష్ట్రం కేరళ అని విజయన్ చెప్పారు. సీఏఏకు వ్యతిరేకంగా సుప్రీంను ఆశ్రయించిన మొదటి రాష్ట్రం కూడా కేరళేనని చెప్పారు. దేశంలో చాలా మంది ప్రజలు తమ భవిత్యవం కోసం ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని, తాము ఇక్కడ వుండగలమా లేదా అని వారు భయపడుతున్నారని అన్నారు.

సంఘ్ పరివార్ బెదిరింపులు కూడా ఈ భయానికి ఒక కారణమన్నారు. సీఏఏపై తన వైఖరిని కాంగ్రెస్ నాయకత్వం ఇంతవరకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ ర్యాలీ లోక్‌సభకు పోటీ చేస్తున్న ఎల్‌డీఎఫ్ అభ్యర్థుల ప్రచారానికి వేదికగా మారింది. ఎల్‌డీఎఫ్ అభ్యర్థులైన ఎలమారమ్ కరీమ్ ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా, కెకె శైలజ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు.

నాగోల్ డివిజన్‌లోని జైపూర్ కాలనీ షిరిడి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ 12వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య ఫెడరేషన్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త శుక్రవారం షిరిడి సాయి మందిరాన్ని సందర్శించారు. తర్వాత ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట చైర్మన్ కొలను వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొరివి జంగయ్య గుప్తా, కోశాధికారి రావుల రంజిత్ గౌడ్, వ్యవస్థాపక అధ్యక్షుడు గుణగంటి రాములు గౌడ్, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ- నాగోల్

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఎల్బీనగర్ -మహేశ్వరం
7
శనివారం | మార్చి 23, 2024 | www.navatelangana.com

ఆర్కేపురం డివిజన్ రామకృష్ణాపురం రోడ్ నంబర్ 2లోని ఓపెన్ ప్లాట్‌లో గత 15 రోజులుగా చెత్త కొండ పెరుగుతున్నట్లుగా పెరుగుతూనే ఉంది. దీని వలన చుట్టూ ఉన్న స్థానికులకు, ముఖ్యంగా చిన్న పిల్లలకు కలరా, మలేరియా, ఇతర అంటురోగాలు ప్రబలే ప్రమాదం ఉంది. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని కాలనీవాసులు కోరుతున్నారు. ఓపెన్ ప్లాట్ కావడంతో ఉదయం సమయంలోనే చెత్త వేసి వెళ్తున్నారు. అది కుక్కలు, దోమలకు నిలయంగా మారుతున్నదని స్థానికులు వాపోతున్నారు.



డంపు యార్డుగా మారిన ఓపెన్ ప్లాట్

నవతెలంగాణ - చైతన్యపురి

'మహాత్మ గాంధీ' కాలేజీలో ఫ్రెషర్స్ డే





నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్‌లోని మహాత్మా గాంధీ న్యాయ కళాశాలలో ఫ్రెషర్స్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ పార్లమెంట్ సభ్యులు మధు యాష్కీ, గౌడ్ హాజరై మాట్లాడారు. న్యాయ శాస్త్ర అభ్యాసంలో విద్యార్థులు తప్పనిసరిగా తరగతులకు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు న్యాయవృత్తిలో రాణించడానికి కృషి, పట్టుదల ఎంతో అవసరం అని అన్నారు. తెలుగు మాధ్యమాల్లో చదివి వచ్చిన విద్యార్థులు ఆంగ్ల భాషపై విషయ పరిజ్ఞానంపై పట్టు సాధించాలని సూచించారు. రాజ్యాంగాన్ని గౌరవించి సమాజంలోని అసమానతలను, అవినీతిని తొలగించడానికి కృషి చేయాలని కోరారు. సమాజంలో పోటీ తత్వం పెరిగిపోయిందని అందుకు ప్రతి న్యాయ శాస్త్ర విద్యార్థి తన విషయ పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని సూచించారు.

గౌరవ అతిథి ఉస్మానియా న్యాయకళాశాల సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ జీబీ రెడ్డి మాట్లాడుతూ.. అధ్యాపకులు ఇచ్చే శిక్షణలో మెలుకువలు నేర్చుకోవాలని అప్పుడే న్యాయ శాస్త్రంపైన విద్యార్థులు పట్టు సాధిస్తారని తెలిపారు. విద్యార్థులు సాంకేతికను, పరిజ్ఞానాన్ని, న్యాయ శాస్త్రాన్ని వివిధ అంశాలను కోర్టు తీర్పులను క్షుణ్ణంగా పరిశీలించి..అధ్యాయం చేయాలని సూచించారు.

కళాశాల సెక్రెటరీ గంగుల గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ తమ విద్యార్థులు సాధించిన అభివృద్ధి తమ కళాశాల అభివృద్ధికి కారణం అని అన్నారు. ఇటీవల జూనియర్ సివిల్ జడ్జిగా ఎన్నికైన మహాత్మ గాంధీ నాయక కళాశాల విద్యార్థి పివి హరీశ్‌ను ఈ సందర్భంగా గంగుల గోవర్ధన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతి కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్‌కేవై స్పెషల్ స్కూల్‌కు చెక్కు అందజేత

నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఆర్కేపురం కాలనీ రోడ్డు నెంబర్-4లో పి. శ్యామల దేవి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎస్ కే వై స్పెషల్ స్కూల్ (మానసిక బుద్ధి మాంద్యం గల విద్యార్థుల స్కూల్)కు రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి శుక్రవారం నిర్వాహకులకు 25వేల రూపాయల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో కూడా సహాయ సహకారాలు చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు నానవాల జ్ఞానేశ్వర్ యాదవ్, పెద్దపూర సైదులు, మాజీ సర్పంచ్ పాండు, వంగాల శ్రీకాంత్ రెడ్డి, విజయ్, జహంగీర్, విష్ణవ్, జగదీష్, శివ, స్కూల్ పర్యావేక్షకురాలు మాధవి రెడ్డి, టీచర్స్, జే. నిర్మల, యస్. వనజ, ఏ. సోనీ, మేఘమాల తదితరులు పాల్గొన్నారు.



జల్‌పల్లిలో డ్రయినేజీ నిర్మాణ పనులు ప్రారంభం

- కౌన్సిలర్ బుడుమాల యాదగిరి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని జల్ పల్లి గ్రామంలో జామా మసీదు నుండి వంద మీటర్ల దూరం వరకు హెచ్.ఎం.డి.ఏ.నిధులతో డ్రైనేజీ నిర్మాణ పనులు శుక్రవారం ప్రారంభమైనట్లు 16వ వార్డు కౌన్సిలర్ బుడుమాల యాదగిరి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం జల్‌పల్లి మున్సిపల్ పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించలేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎంతో కృషి చేస్తుందని కొనియాడారు. మున్సిపల్‌లోని అనేక కాలనీలలో ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు డ్రైనేజీలు, విద్యుత్ దీపాలు, ఇంటింటికీ తాగునీరు, సీసీ, బీటీ రోడ్లు వేయడానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ షేక్ జహంగీర్, నాయకులు వై.సుదర్శన్, చింతకింది నవీన్ కుమార్, కే.వెంకటేష్, వై.నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్

సిస్టంపై అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీలో శానిటేషన్ వర్కర్ల హాజరుకు సంబంధించి ఫేషియల్ రికగ్నిషన్ అటెండెన్స్ సిస్టం అమలు చర్యలలో భాగంగా మొబైల్ ద్వారా సంబంధిత యాప్‌లో హాజరు నమోదుపై ఏ.ఎం.హెచ్.ఓ లు, ఎస్.ఎఫ్.ఏ లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించి అవగాహన కల్పించారు. శుక్రవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఐటీ శాఖ ఆధ్వర్యంలో ఏ.ఎం.హెచ్.వోలు, ఎస్.ఎఫ్.ఏలకు వీడియో ఆధారితంగా అవగహన కల్పించారు. ఏ విధంగా అప్లికేషన్ను ఉపయోగించాలన్న విషయంపై వివరించారు. ఎంప్లాయి రిజిస్ట్రేషన్ ప్రక్రియ, ఎఫ్ఏ సెల్ఫ్ అటెండెన్స్ ప్రక్రియ, వర్కర్ల హాజరు ప్రక్రియలపై వివరించారు. జీహెచ్ఎంసీ ఎఫ్.ఆర్.ఎస్ మొబైల్ యాప్‌లో హాజరు తీసుకోవాలని, వన్ టైం రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఎస్ఎఫ్ఏ సెల్ఫ్ హాజరు తీసుకుని, ఆ తర్వాతే తనకు ఉద్యోగుల గ్రూప్ అటెండెన్స్ తీసుకోవాలని, ఉద్యోగులందరూ హాజరు క్యాప్చర్ చేయాలని సూచించారు.

ఈ యాప్‌లో నమోదు ప్రక్రియ ముఖ్యమైనదన్నారు. అనంతరం పలువురి సందేహాలను నివృత్తి చేయడంతో పాటు, ప్రాక్టికల్ గా మొబైల్ లో హాజరు నమోదు ఏ విధంగా చేయాలో నేర్పించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ పద్మజారాణి, ఐటీ ప్రతినిధులు, ప్రాజెక్టు లీడ్, ఏ.ఎం.హెచ్.వో లు, ఎస్ ఎఫ్ ఏ లు తదితరులు పాల్గొన్నారు.

జలమండలిలో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు



- హాజరైన పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్
- నేటి నుంచి 28 వరకు అవగాహన కార్యక్రమాలు
- నగరంలో తాగునీటికి కొరత లేదు
- ఎండీ సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ - సిటీబ్యూరో

జలమండలిలో ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమానికి పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి ఎం. దానకిశోర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 'రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ పిట్' సర్వే యాప్, శుక్రవారం నుంచి ఈ నెల 28 వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో అవగాహనా కార్యక్రమాలకు సంబంధించి కరపత్రాల్ని ఆవిష్కరించారు. అనంతరం దానకిశోర్ మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు నగరంలో ఇంకుడు గుంతలపై సర్వే చేపట్టాలన్నారు. ఇంటింటికీ వెళ్లి తనిఖీ చేయాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతరం ఎండీ సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ మన జీవితంలో నీరు ఎంతో ప్రాముఖ్యమైందన్నారు. హైదరాబాద్ నగరంలో ఎలాంటి నీటి కొరత లేదని పునరుద్ఘాటించారు. గతంలో సరఫరా చేసిన దాని కంటే ప్రస్తుతం అదనంగా 7 ఎంజీడీల నీరు అందిస్తున్నామని వెల్లడించారు. అవసరమైతే మరో 10 ఎంజీడీల నీరు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. అందువల్ల ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రాబోయే రెండేళ్ల వరకు తాగునీటి ఎద్దడి లేకుండా నగరానికి సరిపడా నీటిని తరలించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. నగరంలో నేటి నుంచి 28 వరకు నీటి విలువ పౌరులకు తెలిపేందుకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో పలు స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వామ్యమవుతున్నట్లు వివరించారు. జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ నీరు అనేది పరిమితమైన వనరు అన్నారు. అలాంటి ముఖ్యమైన వనరును అత్యంత జాగ్రత్తగా వినియోగించుకోవాలని సూచించారు.

నీటి సంరక్షణ, వాడకంలో అప్రమత్తంగా ఉండకపోతే నీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. భవిష్యత్తులో నీటిని సంరక్షించకపోతే తగిన మూల్యం చెల్లించుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఈడీ డా.ఎం. సత్యనారాయణ, ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ బాబు, రెవెన్యూ డైరెక్టర్ వీఎల్ ప్రవీణ్ కుమార్, టెక్నికల్ డైరెక్టర్ రవికుమార్, డైరెక్టర్ ఆపరేషన్స్-2 స్వామి, ఆస్కి అధ్యాపకురాలు స్నేహలత, సీజీఎంలు, జీఎంలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



భగత్ సింగ్ వర్ధంతిని

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలి

వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాండురంగాచారి

నవతెలంగాణ - చైతన్యపురి

భగత్ సింగ్ వర్ధంతిని రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని వర్కర్స్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రాయబండి పాండురంగాచారి డిమాండ్ చేశారు. కొత్తపేట చౌరస్తాలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిన్న వయస్సులోనే దేశ స్వాతంత్రం కోసం ఉరి కొయ్యలు ముద్దాడిన విప్లవకారులు భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ వర్ధంతులను ఈ నెల 23న తెలంగాణ అమరవీరుడు సిరిపురం యాదయ్య చౌరస్తా కొత్తపేటలో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర నాయకులు ఎస్.వి రాములు, కొప్పు యాదయ్య, రంగారెడ్డి జిల్లా కన్వీనర్ పూజారి శ్రీను పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి కార్పొరేటర్ సుజాతా నాయక్



నవతెలంగాణ - హస్తినాపురం

హస్తినాపురం డివిజన్ కార్పొరేటర్ బానోతు సుజాతా నాయక్ బీఆర్ఎస్ పార్టీని వీడి శుక్రవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంచార్జ్ దీప్ దాస్ మున్షీ, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు, పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి మధుయాష్కీ, గౌడ్, ఎల్బీనగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు జక్కిడి ప్రభాకర్ రెడ్డిల సమక్షంలో గాంధీ భవన్‌లో సుజాతా నాయక్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రవేశ పెట్టిన ఆరు గ్యారెంటీలకు ప్రజల నుండి విశేష స్పందన వస్తుందని హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి తోనే సాధ్యమని అన్నారు. డివిజన్ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ హస్తినాపురం అభివృద్ధికి కృషి చేస్తానని సుజాతా నాయక్ అన్నారు. వారి వెంట కాంగ్రెస్ నాయకులు గోపి రెడ్డి చంద్ర శేఖర్ రెడ్డి, పలువురు సీనియర్ నాయకులు ఉన్నారు.

తనిఖీల్లో రూ.10లక్షలు సీజ్



నవతెలంగాణ - సంతోష్‌నగర్

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు నిర్వహిస్తున్న వాహనాల తనిఖీల్లో నోట్ల కట్టలు దొరుకుతున్నాయి. మలక్‌పేట్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో ముసరంబాగ్ ఆఫీసర్ కాలనీ పార్క్ ఎస్బీఐ వద్ద శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో భాగంగా ఓ కారు డిక్కీలో రూ.10 లక్షలను షాఇనాయత్ గంజ్ పోలీసులు గుర్తించారు. వెంటనే రూ.10 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆ కారులో ఇంజాపూర్‌కు చెందిన అశోక్ కుమారుడు బొక్క సాయి చరణ్ ఉన్నాడు. అతడు ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి. సాయి చరణ్ రూ.10లక్షల నగదుకు సంబంధించిన సరైన పత్రాలను చూపించకపోవడంతో ఆ నగదును సీజ్ చేశారు. తర్వాత రిటర్నింగ్ ఆఫీసర్ ఇన్కమ్ టాక్స్ డిపార్ట్మెంట్‌కు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

బస్తీలల్లో యాక్షన్ ప్లాన్

- జీవీపీ పాయింట్స్ వద్ద మహిళా సంఘాల సభ్యులతో రంగోళి, ర్యాలీ కార్యక్రమాలు





నవతెలగాణ-సిటీబ్యూరో

జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ ఆదేశాల మేరకు పారిశుధ్యంపై జీహెచ్ఎంసీలోని అన్ని బస్తీలల్లో మహిళా సంఘాలు, సర్కిల్‌లోని శానిటేషన్ సిబ్బంది సమన్వయంతో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. జీహెచ్ఎంసీ పరిధిలో గుర్తించిన జీవీపీ పాయింట్స్ వద్ద మహిళా సంఘాల సభ్యులతో రంగోళి, ర్యాలీ కార్యక్రమాలతో కాలనీ, బస్తీ వాసులతో పలు అవగాహన కార్యక్రమాలను చేపట్టారు. శానిటేషన్ విభాగం గుర్తించిన జీవీపీ పాయింట్స్‌ను నిర్మూలించడానికి అన్ని బస్తీలలో పలు కార్యక్రమాలతోపాటు స్పెషల్ డ్రైవ్‌ను మార్చి 21 నుండి నిర్వహించాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆదేశించారు. బస్తీ యాక్షన్ ప్లాన్ ప్రకారం వారంలోని 7 పని దినాలలో జీవీపీ పరిసర ప్రాంతాల్లోని బస్తీవాసులతో స్వయం సహాయక సంఘాలతో స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, స్లమ్ ఫెడరేషన్స్‌తో కలిసి చెత్త వేయకుండా ఈ కార్యక్రమాలకు జీహెచ్ఎంసీ శ్రీకారం చుట్టింది. నగరంలోని చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులను గుర్తించి చెత్తను తీసుకెళ్లేవారికి, స్వచ్ఛ ఆటోలకు అనుసంధానం చేయాలని నిర్ణయించారు. ప్రతి బస్తీలో రోజు ర్యాలీలు, రంగోళి, అవగాహన కార్యక్రమాలు ప్రజల సహకారంతో మహిళా సంఘాలు, శానిటేషన్ సిబ్బంది చెత్త నిరూత్మలన కోసం ఈ కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేసి స్వచ్ఛ హైదరాబాద్ కోసం పాటుపడాలని కమిషనర్ కోరారు.

ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ డివిజన్ కమిటీ ఎన్నిక



నవతెలంగాణ - చైతన్యపురి

ఎల్బీనగర్ ఎస్ఎఫ్ఐ డివిజన్ నూతన కమిటీని చైతన్యపురిలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎన్నుకున్నారు. ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బి.శంకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్ఎఫ్ఐ ఎల్బీనగర్ డివిజన్ నూతన కమిటీని 15 మందితో ఎన్నుకున్నట్టు తెలిపారు. ఎల్బీనగర్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శిగా అరుణ్, స్టాలిన్, ఉపాధ్యక్షులుగా వేణు, జ్యోతి బాసు, సుమంత్, రమేష్, సహాయ కార్యదర్శిలుగా శివ, నవీన్, శ్రీకాంత్, మిగతా వారిని కమిటీ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు వివరించారు. విద్యారంగ సమస్యలపై, స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ విడుదల చేయడం కోసం ఉద్యమించాలని సూచించారు. భవిష్యత్ ఉద్యమాలు కార్యచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట ఎస్ఎఫ్ఐ రంగారెడ్డి జిల్లా సహాయ కార్యదర్శి గుండె శివకుమార్ తదితరులు ఉన్నారు.

'స్వయం ఉపాధితో యువత రాణించాలి'

నవతెలంగాణ - సంతోష్‌నగర్

ఉద్యోగాల కోసం నిరీక్షించకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని యువత రాణించాలని మేనేజింగ్ డైరెక్టర్ ప్రసాద్ మహేష్ అన్నారు. హైదరాబాద్ జిల్లా ఎల్బీనగర్ నియోజకవర్గం సైదాబాద్ చంపాపేట్ డివిజన్ పరిధిలోని ప్రెస్ కాలనీ సామా నర్సింహారెడ్డి గార్డెన్ ఎదురుగా ప్రధాన రహదారి పై నూతనంగా ఏర్పాటు స్పిన్ యునిసెక్స్ సెలూన్‌ను శుక్రవారం నిర్వాహకులతో కలిసి మేనేజింగ్ డైరెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వెరైటీలను వినియోగదారులకు అందించి, మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో విజయ్, నవీన్, పవన్, విష్ణు, పింటూ, మిథున్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శనివారం | మార్చి 23, 2024 | www.navatelangana.com

శాస్త్రీయ విద్యా ట్రస్ట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న బండారి



నవతెలంగాణ-కాప్రా

డాక్టర్ ఏఎస్‌రావు నగర్, డాక్టర్. హెూంమీజే బాబా, డాక్టర్.విక్రమ్ సారాబాయి సైన్‌టిఫిక్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ప్రారంభోత్సవానికి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. వారి వెంట మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, వెంకటేష్, ట్రస్ట్ బాధ్యులు సిద్ధార్థ్, సోమరాజు, గణేష్‌రావు, నాగేశ్వరావు, తదితరులున్నారు.

జవహర్ నగర్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించండి

- సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన మల్లెపూల శ్రీకాంత్ యాదవ్



నవతెలంగాణ-జవహర్‌నగర్

జవహర్ నగర్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని జవహర్ నగర్ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శుక్రవారం సీఎం నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్‌లో డంపింగ్ యార్డు సమస్య, జీవో 58,59, జూనియర్ కళాశాల, 100 పడకల ఆస్పత్రి, క్రీడా మైదానంతో పాటు పలు అంశాలను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను విన్న సీఎం ఇప్పటికే డంపింగ్ యార్డు సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం ఒక రూపకల్పన చేసిందని, త్వరలో పరిష్కారం చేస్తామని హామీ ఇచ్చినట్లు శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. సీఎం సహకారంతో జవహర్‌నగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని చెప్పారు.

ఇంటి నుంచే ఓటు

- వృద్ధులు, వికలాంగులకు అవకాశం
- ఏప్రిల్ 22 వరకు దరఖాస్తుల స్వీకరణ

నవతెలంగాణ-సిటీబ్యూరో

వృద్ధులు, వికలాంగులకు ఎన్నికల సంఘం ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. 85 ఏండ్లు పైబడిన వారు, వికలాంగులు.. ఎవరైతే పోలింగ్ బూతుకు వచ్చి ఓటు వేసేందుకు అవకాశం లేదో వారు తమ ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునే వెసులుబాటు ఉంది. ఇందు కోసం ఏప్రిల్ 22వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది. వారి దరఖాస్తులను పరిశీలించి అన్నీ సవ్యంగా ఉంటే వారు తమ ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తామని పేర్కొంది.

బీఎల్, తహశీల్దార్ కార్యాలయాల్లో..

మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 15,117 మంది 85 ఏండ్ల వయస్సుకు పైబడిన వారు, 26,119 మంది వికలాంగులు ఉన్నారు. వారి నుంచి ఎన్నికల అధికారులు దరఖాస్తులు స్వీకరిస్తారు. తహశీల్దార్ కార్యాలయాలు, బీఎల్‌ఓల వద్ద దరఖాస్తులను సిద్ధంగా ఉంచారు. ఆధార్, ఏపిక్ కార్డు నెంబర్లతో దరఖాస్తును బీఎల్‌ఓలకు లేదా తహశీల్దార్ కార్యాలయంలో ఎన్నికల అధికారులకు ఇవ్వాల్సి ఉంటుంది. ఆ దరఖాస్తు ఆధారంగా సదరు వ్యక్తి ఇంటి వద్ద నుంచి ఓటు వేసేందుకు అర్హుడా..? కాదా..? అనే విషయాన్ని పరిశీలిస్తారు. అర్హత ఉంటే అతడికి ఇంటి వద్ద నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తారు.


(ఫైల్) ఫొటో

హెూం ఓటింగ్ ఇలా..

పోలింగ్‌కు ముందుగానే దరఖాస్తుదారుల ఇండ్లకు రెవెన్యూ, పోలింగ్, పోలీస్ సిబ్బంది వెళ్లి ఇంటి వద్దనే వారు ఓటు వేసే విధంగా అవకాశం కల్పిస్తారు. బ్యాలెట్ పేపర్‌తో పాటు పోలింగ్ బాక్సును వెంట తీసుకెళ్లి అక్కడ సదరు వ్యక్తి ఓటు వేసిన తర్వాత బ్యాలెట్ బాక్సును అతని ముందు ఉంచుతారు. బ్యాలెట్ పేపర్‌ను ఆ బాక్స్‌లో ఓటరే స్వయంగా వేస్తారు. సిబ్బంది ఆ బాక్స్‌ను కార్యాలయంలో భద్రపరుస్తారు. కౌంటింగ్ రోజున ఆ బాక్స్‌ను తెరుస్తారు.

ఆన్‌లైన్‌లోనే ఓటరు నమోదు

18 ఏండ్లు నిండిన వారి ఓటరు నమోదుకు ఎన్నికల సంఘం మరో అవకాశం కల్పించింది. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేసిన ఎన్నికల సంఘం.. అర్హత ఉండి ఓటు హక్కు లేని వారు ఈ ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించింది. అయితే ఈ సారి కేవలం ఆన్ లైన్ ద్వారానే ఓటరు నమోదుకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇచ్చింది.

ఆఖరి అవకాశం..

పార్లమెంట్ ఎన్నికలకు ఇప్పటికే అధికారులు ఓటర్ల జాబితాను సిద్ధం చేశారు. మే 13వ తేదీన తెలంగాణలో పార్లమెంట్ ఎన్నికలు జరుగనున్నాయి. దేశ వ్యాప్తంగా జూన్ 4వ తేదీన కౌంటింగ్ నిర్వహించనున్నారు. ఆ నేపథ్యంలో అర్హులు ఓటు హక్కు నమోదు చేసుకునేందుకు అవకాశం ఉంది. ఏప్రిల్ 15వ తేదీని చివరి గడువుగా నిర్ణయించింది. ఇందులో ఓటు నవెదుతోపాటు మార్పులు, చేర్పులకు అకాశం ఇచ్చింది. గతంలో ఓటు నమోదుతో పాటు ఒక బూత్ నుంచి మరో బూత్‌కు, ఒక వార్డు నుంచి మరో వార్డుకు తదిత మార్పుల, చేర్పుల విషయంలో ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించేవారు. ప్రస్తుతం ఎన్నిక షెడ్యూల్ విడుదలైనందున కేవలం ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తులకు అవకాశం కల్పించింది.

అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఓటర్లు ఇలా.. (ఫిబ్రవరి 8 వరకు)

క్రమసంఖ్య	నియోజకవర్గం	ఓటర్లు
1.	మేడ్చల్	6,58,190
2.	మల్కాజిగిరి	4,99,536
3.	కుత్బుల్లాపూర్	7,12,759
4.	కూకట్‌పల్లి	4,71,878
5.	ఉప్పల్	5,33,544
6.	కంటోన్మెంట్	2,52,060
7.	ఎల్బీ నగర్	6,00,450
	మొత్తం	37,28,417

సీపీఐ(ఎం) కార్యాలయంలో ఏకే గోపాలన్ వర్ధంతి సభ



నవతెలంగాణ-కాప్రా

సీపీఐ(ఎం) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సీపీఐ(ఎం) నాయకుడు ఏకే గోపాలన్ వర్ధంతిని కమలానగర్‌లోని పార్టీ కార్యాలయంలో గొడుగు యాదగిరిరావు అధ్యక్షత శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు చంద్రశేఖర్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు ఎన్. శ్రీనివాస్ ఏకే గోపాలన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఏకే గోపాలన్ కేరళ ప్రజా ఉద్యమాలలో ప్రముఖ పాత్ర పోషించారన్నారు. స్వాతంత్ర పోరాటంలో, కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో కీలకంగా ఉన్నారని చెప్పారు. ఎన్నో సార్లు జైలు జీవితం గడిపారని తెలిపారు. పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికై ప్రజా సమస్యల ను పరిష్కరించారని పేర్కొన్నారు. కేరళలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ఈఎంఎస్ నంబూద్రిపాద్, ఏకే గోపాలన్ సిద్ధాంతాలు గట్టి పునాదులు ఏర్పడటానికి దోహదపడ్డాయని చెప్పారు. ఎమర్జెన్సీ కాలంలో జైల్లో ఉండే పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైయ్యారని తెలిపారు. శ్రీమన్నారాయణ మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై నిడారంబంగా జీవించే తత్వం అలవర్చుకుంటే ప్రతి పోరాటంలోనూ విజయం సాధిస్తారని తెలిపారు. అందుకు గోలపాన్ జీవితమే నిదర్శనమని చెప్పారు. ఆయన సతీమణి సుశీల గోపాలన్ సైతం ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ప్రజలను చైతన్యం చేశారని చెప్పారు. కార్యక్రమంలో శోభ, గౌసియా, లక్ష్మయ్య, చారి వెంకటేశ్వరరావు, ఉన్నీకృష్ణన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



నవతెలంగాణ-కాప్రా

డాక్టర్ ఏఎస్‌రావు నగర్‌లోని జామా మస్జిద్‌లో మహమ్మద్ రియాజ్ ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ముస్లింలు 30రోజులు కఠిన ఉపవాస దీక్షలు చేస్తూ ఎంతో నిష్ఠతో రంజాన్ పండగను జరుపుకుంటారని తెలిపారు. వారందరికీ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, డివిజన్ ప్రెసిడెంట్ కాసం మహిపాల్‌రెడ్డి, సెక్రటరీ కుమారస్వామి, ఎస్ఏ రహీమ్, రాజీరెడ్డి, భాషా, కరీం, అబ్దుల్ ఘనీ, బషీర్, హఫీజ్ మహమ్మద్ ఇక్బాల్, నాజుద్దీన్, మహమ్మద్ గౌసుద్దీన్, కాలనీ ప్రెసిడెంట్ తిలక్, సెక్రటరి సోమయ్య చారి, రాజమల్లు, లయన్ నాగన్న, లయన్ రాజు, లయన్ నాగేంద్ర ప్రసాద్, కాలనీ వాసులు, తదితరులున్నారు.

అంజయ్య మృతదేహానికి బొంతు శ్రీదేవి నివాళి



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లికి చెందిన అంజయ్య శుక్రవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ మృతుడి ఇంటికి వెళ్లి అంజయ్య పార్థివ దేహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలి పారు. ఆమె వెంట బాల్‌రెడ్డి, భానుచందర్, వెంకట్‌రెడ్డి, అరుణ, తదితరులున్నారు.

కిరణ్ మరణం కార్మిక లోకానికి తీరని లోటు



- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్. బాల మల్లేష్
- అంతిమ యాత్రలో పాల్గొన్న పలు ప్రజా సంఘాల నేతలు

నవతెలంగాణ - జవహర్‌నగర్

ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు కామ్రేడ్ కిరణ్ మరణం కార్మిక సమాజానికి తీరని లోటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్. బాల మల్లేష్ అన్నారు. శుక్రవారం జవహర్ నగర్‌లోని ప్రగతి నగర్ కాలనీలోని వారి నివాసంలో కిరణ్ మృతదేహానికి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ కోసం, కార్మిక లోకం కోసం చేసిన ఉద్యమాలను గుర్తు చేసుకున్నారు. అనంతరం జరిగిన అంతిమ యాత్రలో పలు కార్మిక, ప్రజా సంఘాల నాయకులతో కలిసి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోటపల్లి శంకర్, సీపీఐ మండల కార్యదర్శి దర్శనం యాదగిరి, మండల సహాయ కార్యదర్శి రాజేశ్వరి, ఏఐవైఎఫ్ నాయకులు లక్ష్మణ్, నాయకులు సహదేవ్, విజయ రెడ్డి, పద్మమ్మ, ఎల్లయ్య, మల్లిక, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ నీటి బొట్టు ఒడిసి పట్టాలి : శ్రీకాంత్

నవతెలంగాణ-బోడుప్పల్

భవిష్యత్తు అవసరాల కోసం ప్రతి నీటి బొట్టును ఒడిసి పట్టాలని, అప్పుడే భవిష్యత్తులో తాగు, సాగు నీటి కష్టాలు రాకుండా ఉంటాయని అరోరా కళాశాల డైరెక్టర్ శ్రీకాంత్ జట్ల అన్నారు. శుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ పరిధిలోని అరోరా పీజీ కాలేజీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. జల ప్రాముఖ్యత, జల వినియోగం, జలపొదుపుపై విద్యార్థులు పోస్టర్ ప్రెజెంటేషన్ వివరించారు. పరిశుభ్రమైన నీరు, పారిశుధ్యం, పొదుపుదల అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

మల్కాజిగిరి, కంటోన్మెంట్ అభ్యర్థులను గెలిపిద్దాం

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిని సునీత మహేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి మరో మారు కాంగ్రెస్ సత్తా చాటాలని మల్కాజిగిరి మాజీ శాసన సభ్యులు మైనంపల్లి హన్మంతరావు అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి పార్లమెంట్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీతా మహేందం రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, కంటోన్మెంట్ అసెంబ్లీ అభ్యర్థి శ్రీగణేష్, గద్దర్ వెన్నెల, కంటోన్మెంట్ మాజీ వైస్ చైర్మెన్ జయ ప్రకాష్‌తో కలిసి మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిగా పని చేయాలని మైనంపల్లి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయంలో అమలు జరుగుతున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల ప్రజలు సంతృప్తిగా ఉన్నారని తెలిపారు. ఈ సారి ప్రజల మద్దతు కాంగ్రెస్‌కే అన్నారు. ఈ రెండు స్థానాలలో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించుకుని సీఎం రేవంత్ రెడ్డికి కానుకగా ఇద్దామన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హరివిల్లులోని రంగుల కళలు నాలో ఉన్నాయి



- నటి, రచయిత్రి శ్రీజ సాధినేని

నవతెలంగాణ-కల్చరల్

హరివిల్లులో పలు రంగులు కళలకు తనలో ఉన్నాయని ప్రముఖ నటి శ్రీజ సాదినేని అన్నారు. ఆలూరి కల్చరల్ అండ్ సోషల్ ఆర్గనైజేషన్, ఫ్రెండ్షిప్ మినిస్ట్రీస్ నిర్వహణలో భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో హరివిల్లు అవార్డును అందుకు న్న శ్రీజ మాట్లాడుతూ.. తన తండ్రి నాగేశ్వర రావు హరికథా కళా కారుడని, తనకు ఆరేళ్ల వయ స్సులోనే సంగీతం, నటనలో శిక్షణ ఇప్పించారని తెలిపారు. తర్వాతి కాలంలో నటిగా, రచయిత్రిగా, ఇతర రంగాల్లో రాణించేందుకు దోహదపడ్డాయన్నారు.

కాంగ్రెస్‌ను బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలి



నవతెలంగాణ-అల్వాల్

మల్కాజిగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతం చేయాలని కాంగ్రెస్ నాయకులు నిమ్మ అశోక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మైనంపల్లి హనుమంతరావు పాత నివాసంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. లక్ష్మీ సాయి గార్డెన్‌లో నేడు నిర్వహించే మల్కాజిగిరి నియోజకవర్గ స్థాయి సర్వసభ్య సమావేశానికి కార్యకర్తలు భారీ సంఖ్యలో రావాలని సూచించారు. ప్రతి ఒక్కరూ కష్టపడి పార్టీని బూత్ లెవెల్ నుంచి పటిష్టం చేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీఎల్. యాదగిరి, బొబ్బిలి సురేందర్ రెడ్డి, రాజా సింహారెడ్డి, చిట్టిబాబు, లక్ష్మి కాంత్ రెడ్డి, కృష్ణాగౌడ్ భాస్కర్, శ్రీనివాస్ గౌడ్, నాగేశ్వరరావు, సూర్య కిరణ్, బలవంత రెడ్డి, శివకుమార్, కృష్ణారెడ్డి, అశోక్ కుమార్ ,ఉదయ్, దేవేందర్, శేఖర్, మధు, వెంకటేష్, దేవేందర్ ,శశాంక్ రెడ్డి, సంతోష్ సాగర్, శకుంతల నాయుడు, బబి త, గాయత్రి లక్ష్మి, కామేశ్వరి, సరోజ పాల్గొన్నారు.

టీఎక్స్ హాస్పిటల్‌లో సెకండ్ హార్ట్ ఎమర్జెన్సీ.. రిలీఫ్ సెంటర్ ప్రారంభించిన మెడికల్ డైరెక్టర్



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్‌లోని టీఎక్స్ హాస్పిటల్‌లో సెకండ్ హార్ట్ ఎమర్జెన్సీ రిలీఫ్ సెంటర్ (ఈఎంఆర్)ను మెడికల్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, మెడికల్ సూపరింటెండెంట్ అనురాధ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యవసర సమయాల్లో ప్రథమ చికిత్స అందించడంలో ఈఎంఆర్ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. ఈ సందర్భంగా టీఎక్స్ హాస్పిటల్స్ చైర్మెన్ డాక్టర్ కీర్తికర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎటువంటి అత్యవసర పరిస్థితికైనా అంకితభావంతో పని చేసే వైద్య నిపుణుల బృందం 24 గంటలు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో ముందుంటామని డాక్టర్ అర్చన తెలిపారు. దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సాటి మనిషికి సాయం చేయడంలో సంతృప్తి



నవతెలంగాణ-శామీర్‌పేట

ఆపదలో ఉన్న సాటి మనిషికి సాయ చేయడంలో సంతృప్తి ఉంటుందని యువ నాయకులు తుంకి రమేష్ అన్నారు. శామీర్‌పేట మండలం మజీద్‌పూర్ గ్రామానికి చెందిన వల్లపు కరుణాకర్ గత కొంత కాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. సమాచారం తెలుసుకున్న అదే గ్రామానికి చెందిన యువ నాయకులు తుంకి రమేష్ శుక్రవారం బాధితుడికి రూ.20 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో అబ్బగౌని వీరయ్య గౌడ్, మాజీ వార్డు సభ్యురాలు కోడూరి నర్మద, పాల్గొన్నారు.

శేఖర్ గౌడ్‌ను దూషించడం దారుణం



- తెలంగాణ ఉద్యమకారులు

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్య మకారుడు శేఖర్ గౌడ్‌ను బీఆర్ఎస్ నాయకుడు పరశురాంరెడ్డి అసభ్య పదజాలంతో దూషించడం దారుణమని మల్కాజిగిరికి చెందిన పలువురు తెలంగాణ ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేశారు. వారు శుక్రవారం శేఖర్ గౌడ్ ఇంటికి వచ్చి పరామర్శించారు. ఈ సందర్భంగా శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. పరశురాం రెడ్డిని వాట్సప్ గ్రూప్‌లో ప్రశ్నించినందుకు, తాగిన మైకంలో విచక్షణా రహితంగా దూషించాడని తెలిపారు. విచక్షణ కోల్పోయి 'నీ అంతు చూస్తా' అంటూ తీవ్ర పదజాలంతో దూషించాడని చెప్పారు. 137 పేరుతో ఉన్న వాట్సప్ గ్రూప్‌లో వాయిస్ మెసేజ్‌లతో అసభ్య పదజాలంతో తనను దూషించాడని వాపోయారు. గతంలో నీ కాళ్లు విరుగొట్టిచిన, అయినా నీకు బుద్ధి రాలేదు, త్వరలో నీ పని చేస్తానంటూ పరశురాం రెడ్డి, తనను హెచ్చరించాడని శేఖర్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. పరశురాంరెడ్డి పై పోలీసులకు ఫిర్యాదు చేస్తామని తెలిపారు. శేఖర్‌గౌడ్‌ను పరామర్శించిన వారిలో కృష్ణమూర్తి గౌడ్, సింగం సాయి, గోపాల్ ముదిరాజ్, గోపి యాదవ్, ఇప్పు శ్రీనివాస్ రెడ్డి, సుధా కర్ చారి ,సాగర్ గౌడ్, హేమంత్ చౌదరి, స్వామి గౌడ్, కుమార్, మచ్చేందర్, రంజిత్, రాజు, సందీప్ పాల్గొన్నారు.

ఆయుష్, పాలీ క్లినిక్స్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

- హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి



నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న ఆయుష్ క్లినిక్‌లు, పాలీ క్లినిక్‌లు, హాస్పిటల్స్, అల్లోపతి క్లీనిక్‌లు హాస్పిటల్స్ మాదిరిగా తప్పనిసరిగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం నుంచి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ జె.వెంకటి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయుష్ అంటే ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హెూమియో క్లినిక్‌లు, పాలీ క్లినిక్‌లు, హాస్పిటల్స్‌కు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని తెలిపారు. ఆయుర్వేద, యోగా, యునాని, సిద్ధ, హెూమియో వైద్యంలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను తెలంగాణ ప్రభుత్వ బోర్డు ఆఫ్ ఇండియన్ మెడిసిన్, పాస్‌పోర్టు ఆఫీస్ వెనుక, సికింద్రాబాద్ నందు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే క్లినికల్ ఎస్టాబ్లిషమెంట్ చట్టం ప్రకారం రిజిస్ట్రేషన్ చేసుకోనడానికి అర్హులు అనీ, ఆ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు కలిగి ఉన్న వారు మాత్రమే జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారికి రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు ఫారంలో పేర్కొన్న అన్ని సర్టిఫికెట్లను జతపరిచి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, హైదరాబాద్ జిల్లా, ప్యాట్నీ, సి కిం ద్రా బా ద్ లో దరఖాస్తులు సమర్పిస్తే 10 పని రోజుల్లో ఆయా సెంటర్లకు తాత్కాలిక రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను జారీ చేస్తామని, తదుపరి జిల్లా అధికారిక వెబ్‌సైట్ www. hyderabad.telangana.gov.in ప్రదర్శిస్తామని తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి కార్యాలయం, హైదరాబాద్ జిల్లా నోటీసు బోర్డులో ఉంచుతామనీ, ఆయా క్లీనిక్స్, పాలిక్లీనిక్స్, హాస్పిటల్స్‌పై ఏమైనా ఫిర్యాదులు ఉంటే 45 రోజుల్లో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారికి తెలియజేయాలని తెలిపారు. ఫిర్యాదులు లేకపోతే 45 రోజుల్లో తనిఖీ బృందాలతో తనిఖీ చేయించి, నివేదిక అందిన తర్వాత పర్మినెంట్ రిజిస్ట్రేషన్ (ఐదేండ్లకు) సర్టిఫికెట్లు జారీ చేస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ప్రతి క్లినిక్, పాలీ క్లినిక్, హాస్పిటల్స్, డయాగ్నొస్టిక్ సెంటర్, అల్లోపతి, ఆయుష్ తప్పని సరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనీ, లేదంటే క్లినికల్ ఎస్టాబ్లిషమెంట్ చట్టం పకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మల్కాజిగిరి పార్లమెంట్ స్థానానికి పట్నం సునీతామహేందర్ రెడ్డి పేరును కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేయడం హర్షించదం అభినంఙీయమని యుగంధర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షన శనివారం జరిగిన పార్లమెంట్ స్థాయి సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏ విధంగా అయితే కష్టపడ్డారో, ఇప్పుడు కూడా అదేవిధంగా కష్టపడి పని చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి మల్కాజిగిరి పార్లమెంటు అభ్యర్థి సునీతా మహేందర్ రెడ్డిని లక్ష ఓట్లతో మెజార్టీతో గెల్పించుకుంటాననీ తమ ధీమాను వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో ఫతేనగర్ డివిజన్ అధ్యక్షుడు కుక్కల రమేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బాలానగర్

చెరువులో పడి వ్యక్తి మృతి



నవతెలంగాణ - కూకట్‌పల్లి

భీముని కుంట చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ ఘటన పై సీఐ తెలిపిన వివరాల ప్రకారం... కూకట్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో భీముని కుంటలో పడి జానపాటి భాష (28) మృతి చెందాడని సమాచారం అందడంతో , భాష (28) తండ్రి జానపాటి బాలయ్య హెచ్ ఎంటి శాతవాహన నగర్‌లో వాచ్ మెన్‌గా పని చేస్తున్నాడు. అతని స్వస్థలం హస్తల్ పూర్ గ్రామం, వెల్దుర్తి మండలం, మెదక్ జిల్లా వాసి, ఇతను 21 వ తేదీ రాత్రి 12.10 కి మెడికల్ షాప్‌కి అని వెళ్లి తిరిగి రాలేదు. 22 వ తేదీ ఉదయం భీముని కుంటలో శవమై కనిపించాడు. సమాచారం అందడంతో. శవాన్ని వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించడం జరిగిందని, మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

మానవాళి మనుగడకు ప్రకృతిని కాపాడుకుందాం

- త్రివేణి పాఠశాలల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి
- భూమిని,ప్రకృతిని కాపాడే బృహత్తర కార్యక్రమం ఎర్త్ అవర్!
- ప్రకృతిని కాపాడుకుందాం భూమిని రక్షిద్దాం...ఎర్త్ అవర్ సందర్భంగా త్రివేణి విద్యార్థుల ప్రతిజ్ఞ!



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మానవాళి మనుగడకు ప్రకృతిని, భూమిని కాపాడుకోవాలని అందుకు ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని త్రివేణి పాఠశాలల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి విద్యార్థులకు సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం త్రివేణి పాఠశాల (చింతల్ బ్రాంచ్)లో మార్చి 23 న విశ్వవ్యాప్తంగా జరుపుకునే 'ఎర్త్ అవర్' సందర్భంగా శుక్రవారం పాఠశాల ప్రాంగణంలో "భూమిని రక్షిస్తాం భూతాపాన్ని తగ్గిస్తాం" అంటూ విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రతి సంవత్సరం దాదాపు 190 దేశాలలో పర్యావరణం పై అవగాహన కల్పించేందుకు ఉద్యమ స్థాయిలో ఆచరిస్తున్న నియమమే ఎర్త్ అవర్ అని ఇది ప్రతి సంవత్సరం మార్చి నెల ఆఖరి శనివారం రాత్రి 8:30 నుంచి 9:30 వరకు మన ఉపయోగించే విద్యుత్ పరికరాలు లైట్లు నిలిపి వేయడమే ఎర్త్ అవర్ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం పాఠశాల నిర్వాహకులు సుబ్బారావు, వెంకట్రావు, నళిని, ఉపాధ్యాయులు విద్యార్థులకు తెలుపుతూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ డాక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ భూమిని కాపాడుకోవడం మనందరి బాధ్యత అని, నీ వంతు నీవుగా కొంత చేసినట్లయితే సమాజమంతా చేసినట్లే అని, ఒకరొకరు కలిపితేనే సమాజం అవుతుందని తెలిపారు.అదే ఎర్త్ అవర్ ముఖ్య లక్ష్యమని తెలియజేశారు.విశ్వంలోని ప్రతి ఒక్కరూ ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ కాపాడుతూ భావితరాలకు గొప్ప సందేశం ఇవ్వాలని ఆకాంక్షించారు. ఇందులో భాగంగా విద్యార్థులందరూ సంతకాల సేకరణ కార్యక్రమంలో పాల్గొని మార్చి శనివారం రాత్రి గంట పాటు ఉపయోగించని విద్యుత్ ఉపకరణాలను ఆపివేసి భూమిని కాపాడుకునే యజ్ఞంలో అందరం బాధ్యత తీసుకుంటామని సంతకాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి క్రాంతి, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



నీటిని పొదుపుగా వాడుకోవాలి

- నీటి వృధాను అరికట్టినప్పుడే సత్ఫలితాలు
- ఇఎస్‌సీఐలో ఘనంగా ప్రపంచ నీటి దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రపంచ నీటి దినోత్సవం వేడుకలు ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గచ్చిబౌలిలోని ఇఎస్‌సీఐలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రిటైర్డ్ ప్రిన్సిపాల్ సెక్రటరీ, హైదరాబాద్ వాటర్ బోర్డు పూర్వ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.జగదీశ్వర్ మాట్లాడుతూ నీరు లేకుండా విశ్వంలో ఏజీవి మనుగడ సాధించలేదన్నారు. కొన్ని వేల సంవత్సరాల క్రితం మానవుడు ఆహారం కోసం పోరాటాలు చేసేవాడని గుర్తు చేశారు. దాంతో వారంతాఒక ప్రాంతం నుండి మరొక ప్రాంతానికి వలసలు వెళ్లే క్రమంలో జరిగే పోరాటంలో వందలాది మంది చనిపోయేవారని, మనిషి ప్రస్తుతం నీళ్ల కోసం పోరాటం చేయాల్సిన రోజులు వచ్చాయన్నారు. ఈరోజు ప్రపంచ దేశాల మధ్య నీటి కోసం యుద్ధాలు జరుగుతూన్నాయని, నీరు సమద్ధిగా వున్నపుడు వ్యక్తి ప్రవర్తనలో మార్పువస్తుందని అప్పుడే ప్రశాంతంగా వుంటారని అభిప్రాయపడ్డారు. మనిషి శరీరంలో 70 శాతం నీరుంటుందని, విశ్వంలో కూడా 70 శాతం నీరు ఉన్నప్పటికీ, అనూహ్యంగా పెరిగిన జనాభా అవసరాలకు తగినంత నీరు లభించనప్పుడు శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. ఒకప్పుడు చెన్నయ్‌లో నీటి సమస్య ఉంటే, ప్రస్తుతం బెంగళూరు నగరంలో నీటి సమస్య ఏర్పడిందన్నారు. హైదరాబాద్ నగరానికి నీటి కొరత లేకుండా ఉండటానికి తాను ఎండిగా వున్న సమయంలో అనేక ప్రాంతాలకు తాగునీటి పైప్ లైన్లను వేసిన సందర్భాన్ని గుర్తుచేసుకున్నారు. ఈరోజు నిర్మాణవుతున్న స్కై రైజ్ భవనాలకు తగినంత నీరు లభ్యం కావాలంటే ఆందరూ నీటిని పొదుపుగా వాడుకోవడం తప్పనిసరి అని జగదీశ్వర్ అన్నారు. అనంతరం ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియా డైరెక్టర్ జీ. రామేశ్వర రావు మాట్లాడుతూ ప్రపంచ నీటి దినోత్సవాలు ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నప్పటికీ, ప్రజలు నీటి పొదుపు పాటించినపుడు మాత్రమే ఈ ఉత్సవాలకు అర్థం ఉంటుందన్నారు. ప్రజలు నిర్లక్ష్యంతో 35 శాతం తాగునీరు వృథా అవుతుందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా వృథాను అరికట్టాలని కోరారు. తమ కాలేజీ ద్వారా వాటర్ రిసోర్సెస్ డెవలప్ మెంట్ కింద నీటి ప్రాముఖ్యతపై అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇప్పటికే వేలాది మంది యువతకు ఈ శాఖ ద్వారా అవహగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో పర్యావరణ విభాగానికి చెందిన అతనితో పాటుగా పలువురు ఫ్యాకల్టీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ జల దినోత్సవం



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

నీటిని వృధా చేయకుండా ఒడిసి పట్టుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ అన్నారు.ప్రపంచ జల దినోత్సవ సందర్భంగా శుక్రవారం సూరారం కాలనీ జిల్లా పరిషత్ ఉన్న పాఠశాల , నార్త్ సిటీ హై స్కూల్ సూరారం ఎక్స్ రోడ్ నందు సుమారు 500 మంది విద్యార్థులకు వర్షపు నీటిని పొదుపు ఎలా చేయాలనే విధంగా విద్యార్థులకు విషయంపై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది.చిన్న పిల్లలకు స్నానం చేయించేటప్పుడు పెద్ద వాటర్ టబ్‌లో, కూర్చోబెట్టి స్నానం చేయించి తదుపరి ఆ నీటిని మొక్కలకు వాడే విధంగా, మరియు ఇంట్లో అంట్లు తోమేటప్పుడు తోమిన బాసన్లను, వస్తువులను ఒక బకెట్ నీటిలో ముంచి తదుపరి ఇంకొక బకెట్లో నీటిలో ముంచి తీసినట్లైతే ఆ నీరు మొక్కలకు పోయవచ్చని, ప్రాక్టికల్ గా చేసి చూపించారు. బట్టలు ఉతికిన నీటిని కూడా బాత్రూంలో వాడుకోవచ్చు అని ప్రత్యక్షంగా పిల్లలతో చేయించడం జరిగింది. మనం స్నానం చేసేటప్పుడు జగ్గుతో పైన పోసుకునే నీరు 50 కూడా మన ఒంటిపై పడదని చెప్పడం జరిగింది. మరియు మన ఇంట్లో నీటిని తాగడానికి చిన్నపాటి గ్లాసులు వాడాలని పెద్ద గ్లాసుల వాడడం వల్ల మీరు వృధా అవుతుందని గమనించాలని తెలియజేశారు. దీనిని విద్యార్థులంతా అవగాహన చేసుకున్న తదుపరి భవిష్యత్తులో నీటిని వృధా చేయమని మా బంధువులకు మా తల్లిదండ్రులకు బోధిస్తామని ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమాన్ని పర్యావరణ ప్రేమికుడు రవీందర్ ముదిరాజ్, జిల్లా ఉన్నత పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, సమయాన్ని కేటాయించి 500 మంది విద్యార్థులకు అవగాహన కల్పించడం చాలా గొప్ప విషయమని విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, కొనియాడారు.

మల్కాజిగిరి పార్లమెంట్ సీటును గెలుస్తాం..

- ముఖ్యమంత్రికి బహుమతిగా ఇస్తాం
- కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్



నవతెలంగాణ-బాలానగర్

మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గం నుంచి గెలిచిన రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారని అలాంటి మల్కాజిగిరి పార్లమెంటు సీటును మరోసారి గెలిపించి ముఖ్యమంత్రికి కానుకగా ఇవ్వాలని కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మల్కాజిగిరి పార్లమెంటు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం శుక్రవారం బోయిన్‌పల్లిలోని జయలక్ష్మి గార్డెన్స్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో హాజరైన బండి రమేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి వేగంగా జరగాలంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మరింత బలపరచాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన నెల రోజులోనే కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి 159 ఎకరాల కంటోన్మెంట్ భూమిని రాష్ట్ర అవసరాలకు వినియోగించుకునేలా ఒప్పించడం గొప్ప విషయం అన్నారు. ఎన్నికల ప్రణాళికలో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు హామీలను మూడు నెలల్లోనే అమలు చేయడం గొప్ప విషయం అన్నారు. హైదరాబాద్ నగరం నాలుగు వైపులా విస్తరించాల్సి ఉందని అందుకోసం మల్కాజిగిరి వైపు ఐటీ కంపెనీలతో పాటు మల్టిలెవెల్ ఫ్లై ఓవర్లు, మెట్రో రైలు రావలసిన అవసరం ఉందన్నారు. దాదాపు రూ.38 లక్షల ఓటర్లు ఉన్న మల్కాజిగిరి పార్లమెంటు సీటు గెలవాలంటే కార్యకర్తలందరూ కలిసికట్టుగా కష్టపడి పనిచేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అధిక నిధులు కావాలంటే ఖచ్చితంగా రాష్ట్రం నుంచి ముందుగా గెలవాల్సిన సీటు మల్కాజిగిరి అన్నారు. అలాగే పార్టీలో పనిచేసే కార్యకర్తలు అందరిని గుర్తించి పార్టీ పరంగా ప్రభుత్వపరంగా తగిన గుర్తింపు నివ్వాలని రాష్ట్ర నాయకత్వానికి బండిరమేష్ సూచించారు.

మల్కాజిగిరి పార్లమెంట్‌పై గులాబీ జెండా ఎగరేస్తాం



- కార్పొరేటర్ కొలుకుల జగన్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ కోటపై గులాబీ జెండా ఎగరేస్తామని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మ రెడ్డిని భారీ మెజరీటితో గెలిపిస్తామని పార్టీ అధినేత కేసీఆర్‌కు బహుమానం అందజేస్తామని జగద్గిరిగుట్ట డివిజన్ కార్పొరేటర్ కొలుకుల జగన్ ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధి జగద్గిరిగుట్ట డివిజన్ మగ్దుమ్ నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు.గత పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి పేద మధ్యతరగతి ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలన 'ధనందాచుకో ప్రజలను దోచుకో' అన్నచందంగా మారిందని మూడు నెలల పాలనపైన ఈ రాష్ట్రం ఏమైతుందోనని ప్రజలు అయోమయానికి గురవుతున్నారన్నారు.ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను మభ్యపెడుతూ పాలకులు కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలే తగిన గుణపాఠం కాంగ్రెస్ కు చెప్తారని అందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.త్రిముఖ పోటీల్లో గులాబీ జెండా ఎగరేస్తామని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణ గడ్డమీద గులాబీ జెండా అది అందరికీ అండ అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ యువజన విభాగం నాయకులు కొలుకుల జైహింద్‌తోపాటు బీఆర్ఎస్ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ డే



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని సెయింట్ పీటర్స్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం స్పోర్ట్స్ డే సందర్భంగా రోజమ్మ మెమోరియల్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి ఆటల పోటీలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మర్రి లక్ష్మణ్ రెడ్డి, సెయింట్ మార్టిన్ కళాశాల చైర్మెన్ అథ్లెటిక్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ నేషనల్ మాస్టర్ మర్రి లక్ష్మణ్ రెడ్డి హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో పాల్గొనాలని , క్రీడల్లో పాల్గొన్నప్పుడు శరీర వ్యాయామంతో పాటు మానసిక ప్రశాంతత పెంపొందించుకోవచ్చన్నారు. తమ జీవితంలో స్విమ్మింగ్ ,సైక్లింగ్ల గురించి తన అనుభవాలను విద్యార్థులకు వివరించారు. ఏ ఆటలో అయినా సాధన ద్వారా విజయం సాధించవచ్చు అని సూచిం చారు. ప్రతి విద్యార్థికి అకడమిక్ సర్టిఫికెట్‌తో పాటు స్పోర్ట్స్ సర్టిఫికెట్ కూడా ఉండేలా చూసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. కె శ్రీలత మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల్లో చురుగ్గా పాల్గొనడం ద్వారా మానసిక బుద్ధి వికాసం పెరుగుతుందని ఆటలు కూడా విద్యార్థులకు చాలా ప్రాముఖ్యమైనవి అని, ఈ స్పోర్ట్స్ మీట్లో హైదరాబా దులోని ప్రతి కాలేజీ పాల్గొన్నాయని దీనిని వచ్చే సంవత్సరం జాతీయ స్థాయిలో నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యఅతిథిగా వచ్చిన మర్రి లక్ష్మణ్ రెడ్డిని ఉద్దేశించి మాట్లాడుతూ 81 సంవత్సరాల వయసులో ఎంతఫిట్‌గా ఉన్నారు. అనేది అది ఆటల ద్వారానే సాధ్యం అని తెలిపారు. అకడమిక్ డైరెక్టర్ సరోజ రెడ్డి మాట్లాడుతూ ఈ రాష్ట్ర స్థాయి పోటీలు మరిన్ని ఆటలను చేర్చి దీన్ని జాతీయ స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. ఆటల ద్వారా ఇన్స్పిరేషన్ ఉంటుందని ఇది జీవితంలో కూడా ఉపయోగ పడుతుందని తెలిపారు. కళాశాల సెక్రటరీ టి.వి రెడ్డి మాట్లాడుతూ ఆటల్లో పాల్గొనడం ద్వారా వివిధ కాలేజీల విద్యార్థులు తమ ఆటల్లోని నైపుణ్యాలను పంచుకోవచ్చు అని ఇలాంటి టోర్నమెంట్లు ప్రతి సంవత్సరం నిర్వహిస్తామని, మీ చదువు మీద శ్రద్ధ వహిస్తూ ఆటల్లో కూడా పాల్గొనాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ టి.బాలా రెడ్డి, సెక్రటరీ టి.వి రెడ్డి, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ బి భాస్కర్ రెడ్డి, పిఆర్‌ఓ రవి సుధాకర్, ఫిజికల్ డైరెక్టర్స్ డా.పి జె వి రత్నకుమార్, సుధాకర్, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

బీవీఆర్‌ఐటీ హైదరాబాద్‌లో పదో జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం



నవతెలంగాణ-దుండిగల్


కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లిలోని బీవీఆర్‌ఐటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజుల జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం, మేధాన్వేష్ 2 కె 24 ఘనముగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎలికో కంపెనీ వైస్ చైర్ పర్సన్ వనిత డాట్ల విచ్చేసి సందర్భంగా మాట్లాడుతూ, దేశానికి ప్రతిభ గల మహిళలు ఎంతో అవసరమని తెలిపారు. మహిళలు తమ కార్యస్థలములో దీర్ఘకాలిక లక్ష్యాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ రాష్ట్రాలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు ఉత్సాహముగా పాల్గొన్నారు. ఈ సాంకేతిక ఉత్సవంలో 30 కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు వివిధ సాంకేతిక పోటీలలో పాల్గొన్నారు. మొత్తానికి ఈ జాతీయ స్థాయి పోటీలకు 500 మంది ప్రస్తుత సాంకేతికపైన నిర్వహించిన వివిధ పోటీలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా కె. వి.ఎస్ సునీత మాట్లాడుతూ ఈ దశమ సాంకేతిక కార్యక్రమములో విభిన్నమైన పోటీలు నిర్వహిస్తున్నాము అని తెలిపారు. విద్యార్థులు తమ ప్రతిభను తెలిపి పోటీలలో విజయము చెందవలెనని ఆకాంక్షించారు. ప్రస్తుత సాంకేతికత అనుగుణముగా జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవం నిర్వహిస్తున్నాము అని తెలిపారు. మేధాన్వేష్ సమన్వయకర్త డా.అమ్రిత మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విభిన్నముగా నిర్వహిస్తున్నాము అని తెలిపారు. అన్ని రకాల సాంకేతికతల మీద విద్యార్థులకు అవగాహన కలిగేల ఈ మేధాన్వేష్ నిర్వహిస్తున్నాము అని తెలిపారు. ఈ సాంకేతిక ఉత్సవమునకు వివిధ కళాశాలల నుంచి స్పందన లభించినది అని తెలిపారు.

అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం




నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 జీడిమెట్ల డివిజన్ పరిధి రాఘవేంద్ర కాలనీ లో శ్రీ హరిహర క్షేత్ర అయ్యప్ప స్వామి దేవాలయంలో పంచలోహ శ్రీ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఆలయానికి విచ్చేసిన మాజీ మంత్రివర్యులు,బీజేపీ మల్కాజ్గిరి పార్లమెంట్ అభ్యర్థి శ్రీ ఈటెల రాజేందర్, బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు ప్రవీణ్ రెడ్డి, బీజేపీ కిసాన్ మోర్చా మేడ్చల్ అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు కొర్మిల్ల సంజీవ్ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, నర్సింహా రెడ్డి, చక్రి, నరేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, 132 డివిజన్ జీడిమెట్ల రిధిలోని రాఘవేంద్ర కాలనీలో శ్రీశ్రీశ్రీ పంచలోహ అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట మహిూ త్సవంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి పాల్గొన్నారు. కుత్బుల్లాపూర్ కైలాష్ హిల్స్ వాసులు రాష్ట్ర మహిళా కాంగ్రెస్ నాయకురాలు గంగుల అంజలి యాదవ్, కొలన్ హన్మంత్ రెడ్డి చేతుల మీదుగా ఆలయ అభివృద్ధి కోసం విరాళా న్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డిని శుక్రవారం నిజాంపేట్‌లోని వారి నివాసంలో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికల బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి సతీమణి శ్రీమతి రాగిడి రజినీ ,వారి కుమార్తె, సోదరి దంపతులు కలిశారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యక్షురాలు సబిత జలంధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-దుండిగల్

'నీరు తరిగే నిధి - పదిలపర్చుకోవడం మన విధి'



- హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి
- ఘనంగా వరల్డ్ వాటర్ డే సెలబ్రేషన్స్

నవతెలంగాణ-సిటీబ్యూరో

'నీరు తరిగే నిధి - పదిలపర్చుకోవడం మన విధి' అని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి తెలిపారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో 'వరల్డ్ వాటర్ డే' సెలబ్రేషన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట్ మాట్లాడుతూ ప్రజలకు నీటి ఎద్దడి వల్ల ఏర్పడే దుష్పరిణామాలను వివరించాలని వైద్యులు, సిబ్బందికి సూచించారు. ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతను నిర్మించుకోవడం, ఇంట్లోని నల్లాలను ఆఫ్ చేయడం, పైపు లీకేజీలకు వెంటనే మరమ్మతులను చేయటం ద్వారా నీటి వ్యర్థాలు ఆపేయవచ్చని తెలిపారు. వంట గది నుంచి వచ్చే వృథా నీటి ద్వారా పెరటి మొక్కలను పెంచటం, వర్షపు నీటిని నిల్వ చేసి అవసరాల కోసం వాడుకోవటం, మొక్కలను పెంచటం వంటి చర్యలను చేపట్టడం ద్వారా భావి తరాలకు జల వనరులను అందించవచ్చు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పద్మజ, డాక్టర్ రేవతి, డెమో రాములు, డిప్యూటీ డెమోలు వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఏప్రిల్ 8 నుంచి ఎస్ఏ-2 పరీక్షలు

నవతెలంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్ జిల్లా పరిధిలోని పాఠశాలల్లో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సమ్మేటివ్ అసెస్మెంట్ (ఎస్ఏ)-2 పరీక్షలు ఏప్రిల్ 8 నుంచి 19 వరకు జరగనున్నాయి. ఈనెల 12న పరీక్షలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎస్సీఈఆర్టీ విడుదల చేసిందని హైదరాబాద్ డీఈవో ఆర్.రోహిణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఒకటి నుంచి అయిదో తరగతి విద్యార్థులకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఆరు, ఏడు తరగతుల వారికి ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు జరుగుతాయని, అలాగే ఎనిమిదో తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3.45 వరకు, తొమ్మిదో తరగతి వారికి మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు. అనంతరం జవాబు పత్రాలను మూల్యాంకనం చేసి, ఏప్రిల్ 23న ఫలితాలు ప్రకటించాలని, అదే రోజు తల్లిదండ్రుల సమావేశాలు ఏర్పాటు చేసి మార్కుల రికార్డులపై సంతకాలు పేర్కొన్నారు. ఏప్రిల్ 24 నుంచి జూన్ 11 వరకు వేసవి సెలవులు ఉంటాయని ప్రకటించారు.

10

నవతెలంగాణ

సికింద్రాబాద్ - సనత్‌నగర్ - జూబ్లీహిల్స్

శనివారం | మార్చి 23, 2024 | www.navatelangana.com



ఓయూ ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విద్యార్థుల ఆధ్వర్యంలో ఇన్ఫినిటీ 2024 ను ఘనంగా నిర్వహించారు. పలువురు విద్యార్థులు వివిధ పరిశోధనలు ప్రాజెక్టు ద్వారా వివరించారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఏమర్జింగ్ టెక్నాలజీ లంక రమాదేవి ప్రసంగించారు. శశికాంత్, సుజిత్ రెడ్డి, భార్గవ్, వంశీ వర్ధన్, సూరజ్, రోహిత్ పాల్గొన్నారు. నవతెలంగాణ-ఓయూ



ఓయూ బీఎంఈ విద్యార్థులకు ఉద్యోగాలిస్తాం

- రాష్ట్ర వైద్యవిద్య పరిషత్ డెరైక్టర్ ప్రో.ఆర్వీ కర్ణన్

నవతెలంగాణ-ఓయూ

ఓయూ బయోమెడికల్ విద్యార్థులకు టీఎస్ ఎంఐడీసీ ద్వారా ఉద్యోగ ఉపాధి కల్పన కృషి చేస్తానని త్వరలోనే ఎంఓయూ చేసుకొనునట్టు జాతీయ హెల్త్ మిషన్ డెరైక్టర్ , రాష్ట్ర వైద్య విద్య పరిషత్ డెరైక్టర్, ఐఏఎస్ ఆర్వీ కర్ణన్ హామీ ఇచ్చారు. శుక్రవారం ఓయూ బయో మెడికల్ ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 23వ, మెడిటెక్ 2024 కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా విద్యార్థులు వైద్య విద్య విధానంలో వస్తున్న నమూనాలు ప్రదర్శించారు. దానిలో దివ్యాంగులకు సంబంధించిన వీల్ చైర్, పార్కింగ్ సన్ డిసీజు కొనుగోలు చేసిన షూస్ లాంటివి అలరించాయి. కార్యక్రమంలో మెడిసిన్ మెడికల్ ప్రొడక్ట్ సీఈఓ కెడి. వఖిల్, ప్రిన్సిపాల్ ప్రో.చంద్రశేఖర్,హెడ్ ప్రో.మాలిని, కో ఆర్డినేటర్ ప్రో.డి.సుమన్, డా.శ్రీనివాస్, డా.విద్యా సాగర్, విద్యార్థి నిర్వాహకులు సందీప్, జశ్వంత్, సరయు విద్యార్థులు పాల్గొన్నారు.



సింపొజియాలతో విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు రెట్టింపు

- ఎన్.ఫణి కౌండిన్య

నవతెలంగాణ-ఓయూ

విద్యార్థుల్లో ఇలాంటి సింపొజియాల ద్వారానే వారిలో దాగివున్న సృజనాత్మక ఆలోచనలు రెట్టింపు అవుతాయని.. దానికి ఇవి గొప్ప వేదికగా ఉంటాయి అని భారత్ ఫోర్జ్ లిమిటెడ్ (కళ్యాణి గ్రూప్), అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.ఫణి కౌండిన్య అన్నారు. శుక్రవారం ఓయూ ఇంజనీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో ఎరో స్పెస్ థీమ్‌తో ఏర్పాటు చేసిన 21వ మెకరిన 2024 కార్యక్రమంలో ఆయిన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. తానూ ఇదే విభాగం ఇదే ఈవెంట్ కు స్టూడెంట్ కన్వీనర్‌గా ఉన్నట్టు గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఓయూ వీసీ ప్రో.రవీందర్ , ప్రిన్సిపాల్ ప్రో.పి.చంద్రశేఖర్, హెడ్ ప్రో.ఎం.చంద్రశేఖర్ రెడ్డి లు వివిధ అంశాలపై ప్రసంగించారు. 2 రోజుల జాతీయ సింపొజియాల్లో పలు కళాశాలల విద్యార్థులు పలు మోడల్స్ ప్రదర్శించారు. కార్యక్రమంలో ఆలూమిని అధ్యక్షుడు డా.డివికె, ఫ్యాకల్టీ అడ్వైజర్ డా.టి.నాగవేణి ,విద్యార్థులు కన్వీనర్ పి.అనురాగ్, కో కన్వీనర్ శశికాంత్ రెడ్డి, సుమ, ఆదిత్యలక్ష్మణ్, మౌనిక, అనునై, విద్యార్థులు. త్రీడి ప్రిం టింగ్, ఆర్‌ఏసీ వర్క్ షాప్, ఐసీ ఇంజన్ వర్క్ షాప్ లాంటి ఈవెంట్స్ ఆకట్టుకున్నాయి.



చంద్రయాన్ థీమ్‌తో ఆకృతి 2024

నవతెలంగాణ-ఓయూ



రానున్న 10 సంవత్సరాల్లో ఎలక్ట్రానిక్స్‌దే ఉపాధి కల్పన రంగాల్లో రారాజు అని, ఈ రంగం ఎంతో గొప్పగా అభివృద్ధి చెందుతుందని ఔట్ స్టాండింగ్ సైంటిస్ట్ అండ్ గ్రూప్ డెరైక్టర్ (ఆర్ ఎఫ్ సీకేర్స్), ఆర్‌సీఐ, హైదరాబాద్ డీఆర్‌డీఓ డా.డి.ఆర్.జహా గిరిధర్ అన్నారు. ఓయూ ఈసీసీ విభాగం విద్యా ర్థుల ఆధ్వర్యంలో తెలంగాణ టూరిజం సహాయంతో చంద్రయన్ థీమ్‌తో ఏర్పా టు చేసిన ఆకృతి 2024లో అయిన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. నేడు ఏరో స్పెస్, ఎలాంటి రంగాల్లో అయినా ఎలక్ట్రానిక్స్ వెన్నుముక అన్నారు. హైదరాబాద్ ఏరో స్పెస్, డిఫెన్స్ లాంటి రంగాల్లో హబ్ గా ఉందన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల విద్యార్థులు యంత్ర, రోబోటిక్ ఈవెంట్స్, ప్రాకల్పన లాంటి ఈవెంట్స్ ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రో.చంద్రశేఖర్, ఫ్యాకల్టీ అడ్వైసర్ డా.యం.శ్యామ్ సుందర్, విభాగం హెడ్ డా.రామకృష్ణ, విద్యార్థులు సాయి చంద్ర, రాకేష్, నిఖిల్, శిశిర, శ్రీజుతి పాల్గొన్నారు.

కె. నవీన్ కుమార్‌కు పీహెచ్‌డీ



నవతెలంగాణ-బంజారా హిల్స్

విల్లా మేరీ డిగ్రీ కాలేజ్ ఫర్ ఉమెన్‌లో కామర్స్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్న కె. నవీన్ కుమార్‌కు భోపాల్‌లోని రవీంద్రనాథ్ ఠాగూర్ విశ్వవిద్యాలయం "మెర్జర్స్ అండ్ అక్విజిషన్స్, యాన్ ఎంపిరికల్ స్టడీ ఆఫ్ ది ప్రీ అండ్ పోస్ట్ ఫైనాన్షియల్ పెర్ఫార్మెన్స్" అనే అంశంపై చేసిన పరిశోధనలో పీహెచ్డీని శనివారం ప్రదానం చేసింది. భారతదేశంలో ఫార్మాస్యూటికల్ పరిశ్రమ అతనికి డాక్టర్ మనాలి ఉపాధ్యాయ మార్గనిర్దేశం చేసి భోపాల్‌లోని రవీంద్రనాథ్ ఠాగూర్ విశ్వవిద్యాలయంలో డాక్టర్ దీప్తి మహేశ్వరి సహ-మార్గదర్శిగా ఉన్నారు.



హైదరాబాద్‌లోని నిలోఫర్ ఆస్పత్రి వద్ద పలువురు యువకులు అల్పాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లతీఫ్, సాయి కిరణ్, సతీష్, వినయ్, సన్నీ తదితరులు పాల్గొన్నారు. నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇక రాత్రి వేళల్లోనూ ట్యాంకర్ల డెలివరీలు

- వేసవి కార్యాచరణపై పురపాలక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ సమీక్ష
- నైట్ షిఫ్ట్‌లో పనిచేసేందుకు సిబ్బంది, పర్యవేక్షణకు ఇన్ ఛార్జి నియామకం
- ట్యాంకర్ బుకింగ్ తగ్గించుకోవడానికి ప్రత్యేక కార్యాచరణ



నవతెలంగాణ-సిటీబ్యూరో

జలమండలి వేసవి కార్యాచరణపై పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దానకిశోర్ సమీక్ష నిర్వహించారు. ఖైరతాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈ సమీక్షా సమావేశానికి ఎండీ సుదర్శన్ రెడ్డితో పాటు డైరెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిశోర్ మాట్లాడుతూ ఫిబ్రవరి నెలలోనే భూగర్భ జలాలు అడుగంటిపోయిన కారణంగానే జలమండలి ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందన్నారు. అంతే తప్ప నీటి సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదని స్పష్టం చేశారు. నగరంలోని ప్రధానంగా 4 డివిజన్లలో (డివిజన్- 15, 6, 9, 18) ట్యాంకర్ల డిమాండ్ బాగా ఉందని మొత్తం బుకింగ్స్‌లో 73 శాతం ఇక్కడి నుంచే వస్తున్నట్టు గుర్తించామన్నారు. గతేడాది ఇదే నెల సరఫరా చేసిన నీరు కంటే ఈ ఏడాది అదనంగా మరో 10 ఎంజీడీల నీరు సరఫరా చేసినట్లు వెల్లడించారు. ఈ ఏప్రిల్ నాటికి అదనంగా మరో 12 ఎంజీడీల జలాలు సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు వివరించారు. ఇక నుంచి రాత్రి సమయాల్లోనూ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రి సమయాల్లో పనిచేసేందుకు సిబ్బందిని సమకూర్చుకోవాలన్నారు. అదనపు షిఫ్ట్ వేసి, నీరు సరఫరాచేసే ఏర్పాట్లు చేయాలన్నారు. పగటి వేళల్లో గృహ అవసరాలకు, రాత్రి వేళ కమర్షియల్ అవసరాలకు ట్యాంకర్లను డెలివరీ చేయాలని సూచించారు.

తుపాకీతో బెదిరించిన దొంగలు అరెస్టు

నవతెలంగాణ-బేగంపేట్



బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రసూల్‌పూర జైన్ కాలనీలో తల్లీకూతుళ్ల వ ధైర్యం ప్రదర్శించి దొంగలపై తిరగబడ్డ ఘటన సంచలనం రేపిన సంగతి తెలిసిందే. ఇంట్లో దోపిడీకి వచ్చిన దొంగలను తరిమితరిమి కొట్టారు ఆ తల్లీకూతుళ్లు. ఈ ఘటనకు సంబంధించిన ఇద్దరు దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు వారిని రిమాండ్ కు తరలించామని నార్త్ జోన్ డీసీపీ రోహిణి ప్రదర్శిని తెలిపారు. శుక్రవారం మీడియాకు వివరాలను వెల్లడించారు. ఘటన స్థలిలోనే ఒకరిని పట్టుకొగా,సుశీల్‌ను ఖాజీపేటలో పట్టుకున్నట్టు తెలిపారు. వారి నుంచి తుపాకీ,రబ్బర్ బుల్లెట్,కత్తులను స్వాధీనం చేసుకున్నారు. ఉత్తర ప్రదేశ్‌కు చెందిన సుశీల్ కుమార్,ప్రేమ చంద్ర లు హైదరాబాద్ ఎం ఎస్ మక్తాలో నివాసం ఉంటున్నట్టు పోలీసులు తెలిపారు.గత ఏడాది దీపావళి సమయంలో ఇంటిని శుభ్రం చేసే పని నిమిత్తం వారం రోజుల పాటు ఆ ఇంట్లో పని చేశారన్నారు. ఇంట్లో దొంగతనం చేయాలనే ఉద్దేశంతో పక్కా ప్రణాళిక ప్రకారం గురువారం మధ్యాహ్నం సమయంలో కొరియర్ బాయ్స్ లాగా ఇంటికి వచ్చినట్టు తెలిపారు. సుశీల్ కుమార్ హెల్మెట్ ధరించి,ప్రేమ చంద్ర మాస్క్ ధరించి ఇంట్లోకి ప్రవేశించి దోపిడి చేయాలనుకున్న క్రమంలో అమిత మెహ్తా, ఆమె కూతురు ప్రతిఘటించారు.

సునీతా రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి



- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

నవతెలంగాణ-కంటోన్మెంట్

మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గం సీఎం రేవంత్ రెడ్డి గెలిచిన నియోజకవర్గం అని ఇక్కడి నుంచి ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి సునీతా రెడ్డిని గెలిపించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు శుక్రవారం తిరుమలగిరి జయలక్ష్మి గార్డెన్‌లో జరిగిన కాంగ్రెస్ మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గ నాయకుల సమావేశంలో మంత్రి పాల్గొని మాట్లాడారు. మల్కాజిగిరి నియోజకవర్గానికి ఎంతో చరిత్ర ఉందని చెప్పారు. ఈసారి ఈ నియోజకవర్గం నుంచి సునీత రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరి వర్ధన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్లమెంటు నియోజకవర్గ అభ్యర్థి, వికారాబాద్ జెడ్పీ చైర్మన్ సునీత మహేందర్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, మైనంపల్లి హనుమంతరావు, జంగయ్య యాదవ్, బండి రమేష్, పరమేశ్వర్ రెడ్డి, కొలను హనుమంత రెడ్డి, నర్సారెడ్డి, సుధీర్ రెడ్డి శ్రీ గణేష్, చంద్రశేఖర్ ,వెన్నెల కార్యకర్తలు పాల్గొన్నారు.

25న కబేళాలు, రిటైల్ బీఫ్ షాపుల మూసివేత

- జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్

నవతెలంగాణ-సిటీబ్యూరో

హెూలీ సందర్భంగా ఈ నెల 25న జీహెచ్ఎంసీ పరిధిలో గల పశువుల కబేళాలు, రిటైల్ బీఫ్ షాపులను మూసివేయడం జరుగుతుందని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. పశువుల కబేళాలు, రిటైల్ బీఫ్ షాపుల మూసివేత ఆదేశాలను అమలు చేయడంలో వెటర్నరీ, ఆయా మున్సిపల్ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

రహమత్ నగర్ కార్పొరేటర్‌పై ఫిర్యాదు

నవతెలంగాణ-జూబ్లీహిల్స్



దళితుల ఇల్లు కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న ఓ రహమత్ నగర్ నివాసికి అండగా నిలిచి, దళిత మహిళపై తన కుమారునిపై దౌర్జన్యం చేస్తున్నాడనిరహమత్ నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పై మధురానగర్ పోలీస్ స్టేషన్‌లో దళిత సంఘాల నాయకులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో పేర్కొన్న వివరాల ప్రకారం గద్వాల శారద బాయి అనే మహిళ తన భర్త చనిపోవడంతో తన కుమారుడు రఘుతో కలిసి రహమత్ నగర్ శాంతినికేతన్ స్కూల్ వద్ద నివసిస్తున్నది. తన ఇంటి పక్కన కొంత ఖాళీ స్థలాన్ని పక్కనే నివసిస్తున్న బుచ్చయ్య అనే వ్యక్తి ఆక్రమించి, తన ఇంటి స్థలంలో కలుపుకొని ఎలాంటి అనుమతులు లేకుండా ఆరు అంతస్తుల ఇల్లు నిర్మాణం చేపట్టాడు. ఈ విషయమై శాంతాబాయి టౌన్ ప్లానింగ్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదు. కోర్టును ఆశ్రయించగా కోర్టు శాంతాబాయికి అనుకూలంగా తీర్పు ఇస్తూ, శాంతాబాయి స్థలమును ఆక్రమించిన బుచ్చయ్య పై చర్యలు తీసుకొని, అదేవిధంగా అక్రమంగా ఆరంతస్తులు నిర్మించిన బుచ్చయ్య ఇంటిని కూల్చివేయాలని జీహెచ్ఎంసీ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఈనెల 20 బుధవారం 11 గంటలకు జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ నోడల్ ఆఫీసర్లు, పటాన్‌చెరు, శేర్లింగంపల్లి డిప్యూటీ కమిషనర్ లు సిబ్బందితో వచ్చి అక్రమ నిర్మాణాన్ని తొలగించేందుకు ప్రయత్నం చేశారు. విషయం తెలుసుకున్న రహమత్‌నగర్ కార్పొరేటర్ సీ ఎన్ రెడ్డి (బీఆర్ఎస్ పార్టీలో ఉండి ఇటీవల కాంగ్రెస్ లోకి మారారు) తన అనుచరులు 40 మందిని తీసుకొని వచ్చి, నిర్మాణాన్ని కూల్చవద్దని అధికారులకు చెప్పారు. కోర్ట్ ఆర్డర్ ఉందని చెప్పినా వినకుండా రహమత్ నగర్‌లో ఇంకా కొంత మంది అక్రమంగానే అంతస్తులు కట్టారని, వారి ఇండ్లు కూల్చిన తరువాత బుచ్చయ్య ఇల్లు కూల్చాలని ఫిర్యాదు చేసిన శారదాబాయితో, అధికారులతో వాగ్వాదానికి దిగాడు. అధికారులు ఏమి చేయలేక అక్రమంగా కట్టిన అంతస్తులను పూర్తిగా తొలగించకుండా, ఫస్ట్ ఫ్లోర్లో స్లాబ్ కొంత భాగం గ్యాస్ కట్టర్‌తో కట్ చేసి కింద పడ వేసి వెళ్లిపోయారు. అనంతరం శాంతాబాయిని, ఆమె కుమారుడిని మీ అంతు చూస్తానని బెదిరించాడని, తనకు నా కుమారునికి కార్పొరేటర్, అతని అనుచరుల నుంచి ప్రాణహాని ఉందని, దళిత సంఘాల నాయకులతో కలిసి రహమత్ నగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. అనంతరం ఫిర్యాదు చేశారు. దళితులమైన తమకు న్యాయం జరిగే వరకూ పోరాటం చేస్తామని, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ పై కేసు నమోదు చేసి కార్పొరేటర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు. ఫిర్యాదు కాపీలను ఏసీపీ, డీసీపీలకు, ఎస్సీ, ఎస్టీ కమిషనర్‌కు, అదే విధంగా హ్యూమన్ రైట్స్ లో కూడా అందజేశారు. దళిత సంఘ నాయకులు సాయి మాదిగ, అరుణ్ కుమార్, విజయ్, తరుణ్, విశాల్, దళిత నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదు పై మధురానగర్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్ రెడ్డిని నవతెలంగాణ వివరణ కోరగా ఫిర్యాదు స్వీకరించామని, ఎలాంటి సెక్షన్ల పై కేసు నమోదు చేయలేదన్నారు. ఫిర్యాదు చేసిన మహిళ ఏసీపీ, డీసీపీకి ఫిర్యాదు కాపీలు ఇచ్చారని, అధికారుల ఆదేశాల మేరకు కేసు విచారించి కార్పొరేటర్ పై చర్యలు తీసుకుంటామని, బాధిత మహిళకు తప్పకుండా న్యాయం చేస్తామని తెలిపారు.

సోషల్ మీడియాలో మంచితో పాటు చెడు ఉంది


- ఫిల్మ్ క్రిటిక్స్ అసోషియేషన్ సత్కార సభలో మీడియా అకాడమీ చైర్మెన్ కె.శ్రీనివాస్ రెడ్డి



నవతెలంగాణ-బంజారాహిల్స్

గొంతులేని సామాన్యుల భావ వ్యక్తీకరణకు సోషల్ మీడియా వేదిక ఎంతో దోహదపడుతుందని, అయితే కొందరు ఇదే అదనుగా భావిస్తూ, హద్దు,అదుపు లేకుండా స్వేచ్ఛ పేరిట ఉచ్చరించడానికి వీలుకాని భాషను ఉపయోగిస్తున్నారని, ఇలాంటి వాటిని కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్ కె. శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఫిల్మ్ నగర్ లోని,ఫిల్మ్ ఛాంబర్లో, టీయూడబ్ల్యూజే అనుబంధ సంస్థ అయిన ఫిల్మ్ క్రిటిక్స్ (సినిమా బీట్ జర్నలిస్టుల) అసోసియేషన్ నిర్వహించిన ఆత్మీయ సత్కార కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎక్కువ నీతి, నిజాయితీ, నిర్భీతితో పనిచేస్తూ, ప్రజల గొంతుకగా నిలబడే మీడియా సంస్థలకు, జర్నలిస్టులకు తాత్కాలికంగా కష్టాలు ఎదురైనా, భవిష్యత్తులో ఖచ్చితంగా మంచిరోజులే ఉంటాయన్నారు. మీడియాను తమ చేతుల్లోకి తీసుకుంటున్న బడా వ్యాపార, వాణిజ్య వేత్తలు వత్తి ధర్మాన్ని విస్మరిస్తూ, ఇష్టానుసారంగా వ్యవహరించడం సహించరానిదన్నారు. దాదాపు ఆరు దశబ్దాల నుంచి పనిచేస్తున్న ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్‌కు నాటి నుండి నేటి వరకు తాము సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నట్టు తెలిపారు. నాడు దేశోద్దారక భవన నిర్మాణానికి ఫిల్మ్ క్రిటిక్స్ అసోసి యేషన్ అందించిన సహకారం చిరస్మరనీయమన్నారు. కాగా,ం ాష్ట్రంలో జర్నలి స్టుల సమస్యల పరిష్కారానికి సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా ఉన్నారని,ఎన్నికల నోటిఫికేషన్ ముగిసిన వెంటనే సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో తాను సమావేశమై, దశల వారీగా వీలైనంత తొందరలో వాటి పరిష్కారానికి కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ప్రస్తుతం 23 వేల అక్రిడేషన్ కార్డులు కలిగిన జర్నలిస్టులు ఉన్నారని గతంలో బంజారాహిల్స్, జూబ్లీహిల్స్ గోపన్నపేట,పెట్ బషీర్‌బాగ్ ఇతర ప్రాంతాలలో స్థలాలు కేటాయించిన విషయం తెలిసిందేనని.. ఉచితంగా ఏదీ రాదు కచ్చితంగా ప్రభుత్వం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతుందన్నారు. ఆ విధమైన ఎక్సర్‌సైజ్ కొనసాగుతుందని తెలిపారు.

ప్రముఖ దర్శకులు తమ్మిరెడ్డి భరద్వాజా మాట్లాడుతూ నాడు ఉమ్మడి రాష్ట్రంలో ప్రెస్ అకాడమీకి తొలి చైర్మెన్ గా సమర్థవంతంగా సేవలను అందించి, నేడు తెలంగాణ మీడియా అకాడమీ చైర్మెన్‌గా శ్రీనివాస్ రెడ్డి బాధ్యతలు చేపట్టడం ద్వారా ఆ పదవికి మరింత గౌరవం పెరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. విరాహత్ అలీ మాట్లాడుతూ, తమ సంఘానికి ఎంత చరిత్ర ఉందో ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ కు అంతే చరిత్ర ఉందన్నారు.నాటి నుండి నేటి వరకు తమ సంఘానికి అనుబంధగా పని చేస్తూ, సినిమా బీట్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ కషి చేయడం అభినందనీయమన్నారు. సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్ ప్రభు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో తెలుగు డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వీర శంకర్,ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి ప్రసన్న కుమార్,ఐజేయు జాతీయ కార్యవర్గ సభ్యులు కె. సత్యనారాయణ,వయోధిక జర్నలిస్టుల సంఘం అధ్యక్షులు లక్ష్మణ్ రావు, ఫిల్మ్ క్రిటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురేష్,లక్ష్మీనారాయణ,సహాయ కార్యదర్శి అబ్దుల్,కోశాధికారి హేమసుందర్, ఈసీ మెంబర్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నిర్మాణ రంగాల్లో విశేష అభివృద్ధి : ఓయూ వీసీ

నవతెలంగాణ-ఓయూ

నిర్మాణ రంగాల్లో తెలంగాణ దేశం ఎంతో అభివృద్ధి చెందిందని.. ఇంకా చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఓయూ వీసీ ప్రో.రవీందర్ అన్నారు. ఓయూ సివిల్ ఇంజి నీరింగ్ విభాగం విద్యార్థులు ఏర్పాటు చేసిన నిర్మాణ్ 2024లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. కార్యక్రమంలో విద్యార్థులు నిర్మాణ సంస్థలో రంగాల్లో వస్తున్న మార్పులు చేర్పులు ప్రదర్శించారు. ఇక మూసిని శుద్ధి చేస్తే సుందరీకరణ చేస్తే ఎలాగ ఉంటుందో ప్రాజెక్టు ద్వారా గొప్పగా వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రో.పి.చంద్రశేఖర్, హెడ్ ప్రో.రాజశేఖర్, కన్వీనర్ డి.రాజశేఖర్ రెడ్డి, విద్యార్థులు డా.శ్రీనాథ్, ఉదయ్ కిరణ్, సాయి ప్రచేతన్, నీరజ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆటలు క్రమశిక్షణకు, ఐక్యతకు తోడ్పడతాయి

- ఏసీబీ జాయింట్ డైరెక్టర్ వైవీఎస్ సుధీంద్ర



నవతెలంగాణ-బేగంపేట్

ఆటలు యువతకు ఐక్యతను, క్రమశిక్షణను పెంచడానికి చాలా ఉపయోగపడుతాయనిఏసీబీ జాయింట్ డైరెక్టర్ వైవీఎస్ సుధీంద్ర(ఎస్పీ) అన్నారు. అలాగే మంచి నాయకత్వ లక్షణాలు పెంచాతాయని తెలిపారు. భగత్ సింగ్ స్మారక యువజనోత్సవల్లో భాగంగా డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ షేనాయ్ ప్లే గ్రౌండ్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ ముఖ్య అతిథిగా ఏసీబీ జాయింట్ డైరెక్టర్ సుధీంద్ర (ఎస్పీ), హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు డాక్టర్ హరి నారాయణ హాజరై టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సుధీంద్ర మాట్లాడుతూ భగత్ సింగ్ వర్ధంతి సందర్భంగా ఆటలు నిర్వహించడం శుభ పరిణామం అన్నారు. భగత్ సింగ్ దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన గొప్ప స్వాతంత్రోద్యమ నాయకుడు అని అన్నారు. శారీరకంగా ,మానసికంగా అభివద్ధి కావడానికి క్రీడలు ఉపయోగ పడతాయని తెలిపారు. బయట చాలా పోటీ ప్రపంచం ఉందని, దానికి అనుగుణంగా ముందుకు వెళ్లాలన్నారు, డాక్టర్ హరినారయణ మాట్లాడుతూ యువత అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్నారు. యువత తప్పుడు మార్గాలల్లో వెళ్లవద్దన్నారు. డీవైఎఫ్ఐ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.మహేందర్ మాట్లాడుతూ భగత్ సింగ్ దేశం కోసం అతి చిన్న వయసు లోనే తున ప్రాయంగా ప్రాణాలను అర్పించారున్నారు. దేశ స్వాతంత్ర్యం కోసం కుల ,మతాలకు అతీతంగా పోరాడి సాతంత్ర్యం తీసుకొస్తే నేడు రాజకీయాల కోసం యువతలో ఐక్యత లేకుండా చెయ్యడం కోసం కొందరు అనేక కుట్రలు చేస్తున్నారని.. వారి మాయలో పడకుండా భగత్ సింగ్ స్ఫూర్తి తో యువత దేశ అభివద్ధి కోసం ఐక్యంగా ఉండాలని సూచించారు. నగరంలో అట స్థలాలు లేకపోవడంతో యువత తప్పుడు మార్గాలల్లో వెళన్నారని ఆవేదన వ్యక్తం చేశారు ప్రభుత్వాలు ఆట స్థలాలు ఏర్పాటు చెయ్యాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, దినకర్, వెంకటేష్, రాజు, రమేష్, ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

కేర్ హాస్పిటల్స్‌లో డయాబెటిక్ ఫుట్ అండ్ వుండ్ కేర్ క్లినిక్ ప్రారంభం



నవతెలంగాణ-బంజారా హిల్స్

మధుమేహ రోగుల్లో ఏ చిన్న సమస్య వచ్చినా కష్టమే. ముఖ్యంగా పాదాల పుండ్లు అనేది ఓ విపత్తు లాంటిది. వీటితో బాధపడేవారి సంఖ్య క్రమంగా పెరిగిపోతుండటంతో బంజారాహిల్స్‌లోని కేర్ హాస్పిటల్స్‌లో కేర్ ఔట్ పేషెంట్ విభాగంలో శుక్రవారం డయాబెటిక్ ఫుట్, వుండ్ క్లినిక్‌ను సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ నేషనల్ పోలీస్ అకాడమీ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ అమిత్ గార్గ్, కేర్ హాస్పిటల్స్ గ్రూప్ సీఈవో జస్దీప్ సింగ్ చేతుల మీదుగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా అమిత్ గార్గ్ మాట్లాడుతూ.. ఫుట్ అండ్ వుండ్ కేర్ క్లినిక్ డయాబెటిక్ ఫుట్ కాంప్లికేషన్స్ ఉన్న వ్యక్తులకు అవగాహన పెంచడం, సమగ్ర సంరక్షణ అందించడం కోసం అంకితభావంతో చేస్తున్న కృషిని చూడటం సంతోషదాయకంగా ఉందన్నారు. కేర్ హాస్పిటల్స్, కేర్ వాస్క్యులర్ డిపార్ట్‌మెంట్‌ను ఆయన అభినందించారు. సీఈఓ మిస్టర్ జస్దీప్ సింగ్ మాట్లాడుతూ.. డయాబెటిక్ పాదాల గాయాలతో ఉన్న వ్యక్తులకు అవగాహన పెంచడానికి డయాబెటిక్ ఫుట్ అల్సర్‌ల నుంచి సంరక్షణ పొందడానికి ఈ క్లినిక్ అందుబాటులోకి రావడం వల్ల రోగి రాగానే అవసరమైన న్యూరోపతి, డాప్లర్ స్టడీ తదితర అన్ని రకాల వైద్యసేవలను ఈ క్లినిక్‌లోనే నిర్వహించి వాటికీ సంబంధించిన రిపోర్టులు సైతం అప్పటికప్పుడే అందజేస్తుండటంతో వాటిని తీసుకుని రోగులు వెంటనే వైద్యులను సంప్రదిస్తున్నారు. దీంతో ఒకే రోజులో రోగులకు వైద్యపరీక్షలతో పాటు చికిత్స కూడా అందుతుందని ఆయన చెప్పారు. క్లినికల్ డైరెక్టర్ డిపార్ట్‌మెంట్ ఆఫ్ కేర్ వాస్క్యులర్, వాస్క్యులర్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ వాస్క్యులర్ సొసైటీస్ డాక్టర్ పి.సి గుప్తా మాట్లాడుతూ ప్రస్తుతం 40 ఏండ్లు దాటిన వారిలో సైతం డయాబెటిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయన్నారు. ప్రతీ 10 మందిలో ఆరుగురు షుగర్ వ్యాధితో బాధపడుతున్నారని.. రోజురోజుకూ ఈ వ్యాధిగ్రస్తుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రతీ 20 సెకన్లకు,మధుమేహం ఉన్న ఎవరైనా ఒక అవయవాన్ని కోల్పోతున్నారని చెప్పారు. దేశంలో డయాబెటిక్ ఫుట్ అల్సర్లు, విచ్ఛేదనలకు సంబంధించిన సమస్య తీవ్రత పెరగడంతో కేర్ ఔట్ పేషెంట్ విభాగంయందు వాస్క్యులర్ అండ్ ఎండోవాస్క్యులర్ సర్జన్‌లు, ఇంటర్వెన్షన్ రేడియాలజిస్ట్‌లు, ప్లాస్టిక్ అండ్ డయాబెటిక్ ఫుట్ సర్జన్‌లు, వుండ్ కేర్ నర్సులు, క్లినికల్ సైకాలజిస్ట్‌లు, ప్రొసైథాటిక్‌లజిస్ట్‌లు, అనస్థీషియాలజిస్టులు, మల్టీడిసిప్లినరీ టీమ్‌తో డయాబెటిక్ ఫుట్ అండ్ వుండ్ కేర్ క్లినిక్ సేవలను అందిచడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డయాబెటిక్ సర్జన్ మల్రెడ్డి, డాక్టర్ రాధిక మల్ రెడ్డి, రీజెన్సీ క్రమిక్స్ లిమిటెడ్ చైర్మెన్ డాక్టర్ జి ఎన్ నాయుడు, క్లినికల్ డైరెక్టర్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ కేర్ రాస్క్యులర్ డాక్టర్ రాహుల్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రంజిత్ రెడ్డి ని ఆయన నివాసంలో కలిసిన జూబ్లీహిల్స్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్. ఈ సందర్భంగా తప్పకుండా చేవెళ్ల కాంగ్రెస్ ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలుస్తారని ఆయనను నవీన్ యాదవ్ అభినందించారు. నవతెలంగాణ - జూబ్లీహిల్స్



జూబ్లీహిల్స్, ఫిలింనగర్ రోడ్ నెంబర్ 36,37,38,45,86 లలో జీహెచ్ఎంసీ పన్ను అధికారులు పన్ను చెల్లించని జూబ్లీహిల్స్ సొసైటీ కార్యాలయంతో పాటు వివిధ వాణిజ్య,వ్యాపార కార్యాలయాలను సీజ్ చేసి వాటిని తాత్కాలికంగా మూసివేశారు. నవతెలంగాణ - బంజారా హిల్స్

బార్కాస్ కమ్యూనిటీ ఆస్పత్రిలో
బాత్రూంలు శుభ్రంగా ఉంచాలి..

- కాంట్రాక్ట్ కార్మికులకు పెండింగ్ వేతనాలు తక్షణం చెల్లించాలి..
- ఐద్వా, డీవైఎఫ్ఐ నాయకులు
- ఐద్వా, డీవైఎఫ్ఐ సౌత్ జిల్లా సర్వే లో వెలుగులోకి వచ్చిన పలు సమస్యలు



నవతెలంగాణ - ధూల్ పేట్

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు..? సిబ్బంది సమస్యలు.. ? తెల్సుకోవడానికి హైదరాబాద్ సౌత్ జిల్లా ఐద్వా, డీవైఎఫ్ఐ, బృందం శుక్రవారం చాంద్రాయణ గుట్ట నియోజకవర్గం లోని బార్కస్ కమ్యూనిటీ హాస్పిటల్ లో సిబ్బందిని, పేషెంట్ల ను కలిసి సర్వే నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ ఆస్పత్రిలో శానిటేషన్,ఇతర సేవలకు గాను పనిచేస్తున్న 24 మంది కాంట్రాక్ట్ కార్మికులకు గత 4 నెలలుగా వేతనాలు రాక అప్పులు చేసుకొని రోజువారీ జీవిత అవసరాలు వెళ్లతీసుకుంటున్నామని వారు ఆందోళన చెందారు. వారి సమస్యలు ఐద్వా, డీవైఎఫ్ఐ బృందం నాయకులు పి.శశికళ, ఏ.కృష్ణ, ఎం.మహేష్ లకు చెప్పారు. అక్కడ రోజూ సగటున 300 మందికి పైగా ఓ.పి. పేషంట్లు చికిత్సలు పొందుతున్నారు. ప్రసూతి విభాగం లో ఇన్ పేషంట్లుగా ఉంటున్న వారికి మూత్ర శాలలు, శుభ్రంగా లేకపోవడం తీవ్రమైన సమస్యగా మారిందని వాపోతున్నారు. జనరల్ సర్జన్ వైద్యుడి పోస్ట్ భర్తీ, తదితర సమస్యలను వైద్య అధికారులు తక్షణం పరిష్కరించాలని పి.శశికళ, ఏ.కృష్ణ లు డిమాండ్ చేశారు. అనంతరం యు.పి.హెచ్.సి. బార్కాస్ ను సందర్శించి అక్కడి సమస్యలను తెలుసుకున్నారు. ఇక్కడ కాంట్రాక్ట్ మెడికల్ ఆఫీసర్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న డాక్టర్‌కు 3 నెలలు గా వేతనాలు పెండింగ్ లో ఉన్నాయనీ, వైద్య సిబ్బంది కొరత, ఇరుకైన భవనం వల్ల పేషెంట్లకు అసౌకర్యంగా ఉంద న్నారు. తదితర సమస్యలను పరిష్కరించాలని, పేద ప్రజల కు మెరుగైన వైద్యం అందించాలని వారు అధికారులను కోరారు. జిల్లా వైద్యాధికారులు కనీసం 3 నెలలకోసారి అయినా క్షేత్ర స్థాయిలో పర్యటించి ఎప్పటికప్పుడు సమస్యలు అధ్యయనం చేసి పరిష్కరించాలని పలు సమస్యలు దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొన్నిరోజుల లో ఇతర ఆస్పత్రుల సమస్యల అధ్యయనం పూర్తయ్యాక జిల్లా వైద్యాధికారు లను కలిసి వినతిపత్రం ఇస్తామని తెలిపారు. అధికారులు స్పందించకపోతే బాధితులతో కలిసి ఆందోళన చేపడతామని వారు పేర్కొన్నారు.



కలెక్టరేట్‌లో పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

నవతెలంగాణ-సిటీబ్యూరో

కలెక్టరేట్ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మీటింగ్ హాల్‌లో వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టరేట్ నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కలెక్టరేట్‌లోని అన్ని విభాగాలు తమ తమ కార్యాలయాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా అధికారులు ప్రతిరోజు తమ కార్యాలయ గదులు, ప్రాంగణాలను పరిశుభ్రంగా ఉండేలా అందంగా తీర్చిదిద్దాలన్నారు. కలెక్టరేట్ ఎంట్రన్స్ గేట్ వద్ద నీరు నిల్వ ఉండకుండా చూడాలని, వాహనాలు క్రమపద్ధతిలో ఉంచాలని తెలిపారు. కలెక్టరేట్‌ను నిరంతరం పర్యవేక్షించేలా నలుగురు హోంగార్డులను నియమించామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధికారులు డీఆర్వో వెంకట చారి, ఏవో సదానందం, ఎస్.సురేందర్, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ నాగలక్ష్మి, డీబీసీడీవో జి. ఆశన్న, డీఎస్‌వోఆర్ కేశవులు, ఈడీ ఎస్సీ కార్పొరేషన్ కె. రమేష్, టీఎస్‌సీడబ్ల్యూఐడీసీ డిప్యూటీ ఈఈ నర్సింహా రావు, డీడీ ఎస్సీ కార్పొరేషన్ పి.యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లోకి
జీహెచ్ఎంసీ మేయర్..?

కార్యకర్తలతో చర్చించిన తర్వాతే తుది నిర్ణయం

నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి దీపా దాస్ మున్షీ, సీఎం రేవంత్ ప్రత్యేక సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఖైరతాబాద్ డీసీసీ రోహిన్ రెడ్డి శుక్రవారం హైదరాబాద్‌లోని ఎంపీ కేకే ఇంటికి వెళ్లి ఆయనతో పాటు ఆయన కూతురు విజయలక్ష్మితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని కాంగ్రెస్ పార్టీలోకి రావాలని ఆహ్వానించినట్టు తెలుస్తోంది. ఈ భేటీ అనంతరం మేయర్ విజయలక్ష్మి కాంగ్రెస్ పార్టీలో చేరికపై క్లారిటీ ఇచ్చారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలోకి రావాలని దీపాదాస్ మున్షీ ఆహ్వానించారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లాలా లేదా అన్న విష యంపై కార్యకర్తలతో చర్చిస్తానన్నారు. కార్యకర్తలతో చర్చించిన తర్వాతే చేరికపై నిర్ణయం తీసుకుంటానని స్పష్టం చేశారు. కార్యకర్తలకు చెప్పకుండా ఎలాంటి నిర్ణయం తీసుకోనని ఆమె తేల్చి చెప్పారు.

లోకసభ ఎన్నికలు ముంచుకోస్తున్న తరుణంలో బీఆర్ఎస్, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌కు వరుసగా షాక్‌లు తగులుతున్నాయి. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దాంతో బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి రోజురోజుకి దిగజారిపోతుంది. ఆ పార్టీ ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. పార్టీ మారే వారు మారిపోతున్నారు. మొత్తానికి ఇప్పటివరకు ఆ పార్టీతో కొనసాగిన కీలక నేతలు ఒక్కొక్కరుగా సైడ్ అయిపోతున్నారు. కాంగ్రెస్‌లోకి క్యూ కడుతున్నారు. తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేం దర్, చేవెళ్ల సిట్టింగ్ ఎంపీ రంజిత్‌రెడ్డి, వికారాబాద్ జిల్లాపరిషత్ చైర్మెన్ సునితా మహేందర్‌రెడ్డి హస్తం గూటికి చేరి.. లోక్ సభ సీట్లు సైతం దక్కించుకున్నారు. ఈనేపథ్యంలో కేకే, మేయర్ విజయలక్ష్మి కాంగ్రెస్ నేతలతో కలిసి చర్చించడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఇదిలావుంటే కేకే మాత్రం తాను పార్టీ మారడం లేదని పేర్కొన్నారు. గతంలో కాంగ్రెస్‌లో పనిచేసినందున దీప్‌దాస్ మున్షితో ఉన్న పరిచయంతో ఇంటికి వచ్చారని, సాదరంగా ఆహ్వానించానని, ఈ భేటీ సందర్భంగా దేశంలో రాష్ట్రంలో ప్రస్తుతమున్న రాజకీయ పరిస్థితులపై చర్చించినట్టు పేర్కొన్నారు. మరోవైపు జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి మాత్రం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షి ఆహ్వానం మేరకు.. కాంగ్రెస్‌లో చేరికపై త్వరలో స్పష్టతనిస్తానని, అదికూడా కార్యకర్తలతో చర్చించిన తర్వాతే చేరికపై నిర్ణయం తీసుకుంటానని మేయర్ స్పష్టం చేశారు. అయితే నేడు(శనివారం) కాంగ్రెస్‌లో మేయర్ చేరనున్నారని తెలుస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో మేయర్ తో పాటు మరో 10 మంది బీఆర్ఎస్ కార్పొరేటర్లు చేరనున్నట్టు సమాచారం.

ఓయూలో ఘనంగా టెక్నో నెన్స్ 2024



నవతెలంగాణ-ఓయూ

ఉస్మానియా యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లోని ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం విద్యార్థుల ఆధ్వర్యంలో టెక్నో నెన్స్ 2024ను ప్లాటినం జూబ్లీ వేడుకలో భాగంగా నిర్వహించారు. ఇది ఎలక్ట్రికల్ విభాగంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా, కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. గోపాల్ టి.కె కృష్ణ, పూర్వ విద్యార్థి 1968 బి.ఇ. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్, కృష్ణా ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ అధ్యక్షుడు, అయోవా స్టేట్, యు ఎస్ ఎ , ముషారఫ్ అలీ ఫరూఖీ,ఐఏఎస్ హైదరాబాద్ చైర్మెన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ , టీఎస్ఎ , హైదరాబాద్ ఈ వేడుకకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు సమయాన్ని వృథా చేయవద్దని బోధిస్తూ మనల్ని మనం నమ్ముకోవడం ఆపవద్దని చెప్పారు. ఈ వేడుకకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ ప్రొ. పి.చంద్ర శేఖర్. యూజీసీ డీన్ ప్రొ.జి. మల్లేశం మాట్లాడుతూ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలు అలవార్చుకోవాలని ఎలాంటి సమస్యనయినా పరిష్కరించే విధంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమ సమన్వయకర్తలు హెడ్ ప్రొ. విద్యాసాగర్, అధ్యాపక ప్రొ.బి. మంగు, డా. ఎస్. విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల మేధాశక్తిని ప్రదర్శించడానికి ఇది ఒక వేదికని దీనిద్వారా విద్యార్థులను పరిశోధన, అనేక రంగాలలో వారిని ప్రోత్సహించడానికి ఉపయోగపడుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రొ. జి. యేసురత్నం, ప్రొ. సతీష్ కుమార్, విద్యార్థి సమన్వయకర్తలు ఆర్. అభినవ్ రెడ్డి, యం. కార్తికేయ,కె. శ్రీనివాస్ పర్యవేక్షించారు. ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ గొప్ప చరిత్రను జరుపుకోవడమే కాకుండా, రెండు రోజుల పాటు టెక్నికల్ సింపోజియాకు వేదికగా నిలిచింది.



'గొల్లకురుమలను విస్మరిస్తే బొంద పెడతాం'

నవతెలంగాణ-బంజారాహిల్స్

తెలంగాణలో 18 శాతం జనాభా కలిగిన గొల్ల కురుమ లను రాజకీయ పార్టీలు దగా చేస్తున్నాయని యాదవ కురుమల రాజ్యాధికార ఐక్య వేదిక ఆరోపించింది. తమ ఓట్లతో అధికారం చేపట్టి పదవుల విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నాయని మండిపడింది. తెలంగాణలో గొల్లకురుమల మద్దతుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ,ఇప్పుడు పదవుల విషయంలో మాత్రం గాలికొదిలేసిందనివిమర్శించింది.లోక్ సభ సీట్లతో పాటు నామినేటెడ్ పదవుల్లో గొల్ల కురమలకు సముచిత స్థానం కల్పించాలని డిమాండ్ చేసింది. గొల్ల కురుమలను విస్మరించే పార్టీలకు లోక్ సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'మేమెంతో మాకంత' నినాదంతో యాదవ,కురుమల రాజ్యాధికార ఐక్య వేదిక రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వక్తలు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. ఈ సదస్సుకు హాజరైన వివిధ పార్టీలనేతలు,వివిధ సంఘాల నేతలు గొల్లకురుమలకు సముచిత స్థానం కల్పించాలని తీర్మానించి భాగస్వామ్యులయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సింహాద్రి యాదవ్ , ప్రొఫెసర్ బీనవేని రామ యాదవ్, క్యామ మల్లేష్ యాదవ్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, అల్ ఇండియ యాదవ మహాసభ రమేష్ యాదవ్ , మేకల కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

టీఎక్స్ హాస్పిటల్స్ అండ్ సెకండ్ హార్ట్ ఎమర్జెన్సీ రిలీఫ్ సెంటర్



నవతెలంగాణ-బంజారాహిల్స్

టీఎక్స్ హాస్పిటల్స్ అండ్ సెకండ్ హార్ట్ ఎమర్జెన్సీ రిలీఫ్ సెంటర్ (ఈఎంఆర్) గ్రాండ్ ప్రారంభోత్సవంతో అత్యవసర వైద్య సంరక్షణలో ఒక ముఖ్యమైన మైలురాయిని దాటింది. ప్రిన్సిపల్ చీఫ్ మెడికల్ డైరెక్టర్ డా.సి.కె.వెంకటేశ్వర్లు, డివిజనల్ రైల్వే మేనేజర్ లోకేష్ విష్ణోయ్,చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్.కె.అనురాధతో సహా గౌరవనీయులైన ప్రముఖులు హాజరై అందుబాటు ప్రావీణ్యతతో కూడిన అత్యవసర వైద్య సేవల ప్రాముఖ్యతను తెలియజేశారు. డాక్టర్ అనురాధ మాట్లాడుతూ అత్యవసర సమయాల్లో పునరుజ్జీవనం,ప్రథమ చికిత్స గాయాల నిర్వహణతో సహా కీలకమైన సహాయాన్ని అందించడంలో ఈఎంఆర్ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. డాక్టర్ సి కె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎమర్జెన్సీ,అత్యవసర వైద్య అవసరాలను సమర్థవంతంగా నిర్వహిస్తే ప్రాణాలను కాపాడుకోవడం సులభతరమని తెలిపారు. అనంతరం ఆసుపత్రి చైర్మెన్ డాక్టర్ కీర్తికర్ రెడ్డి మాట్లాడుతూ ఎటువంటి అత్యవసర పరిస్థితికైనా నిరాడంబరమైన సహాయాన్ని అందజేస్తూ అంకితభావంతో కూడిన వైద్య నిపుణుల బందంతో 24 గంటలూ ఎమర్జెన్సీ అత్యవసర సదుపాయాన్ని అందిస్తామని అన్నారు. టీఎక్స్ హాస్పిటల్స్ సెకండ్ హార్ట్ ఫిజియో ఫౌండేషన్ భాగస్వామ్యంతో స్థాపించబడిన సహకార ప్రయత్నాలకు నిదర్శనం అన్నారు. సెకండ్ హార్ట్ ఫిజియో ఫౌండేషన్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న డా.అర్చన,ఆరోగ్య సంరక్షణ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడంలో ప్రాముఖ్యతను వివరిస్తూ, సమాజ సంక్షేమం పట్ల వారికున్న బాధ్యతను తెలిపారు. లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ (320 ఏ) వేణు గోపాల్‌తో కలిసి నిర్వహించబడిన ఈ కార్యక్రమం సమాజ సేవలో తమ పాత్ర ఎంత కీలకమైనదో ఉదాహరణగా చెప్పవచ్చు, బాలాజీ కాచిగూడ స్టేషన్ డైరెక్టర్,జగన్ మోహన్ రెడ్డి, స్టేషన్ హెల్త్ ఇన్‌స్పెక్టర్,టి ఎక్స్ ఆస్పత్రి,కాచిగూడ శాఖ కార్య నిర్వహణ అధికారి , అంకితభావంతో పని చేసి ఆస్పత్రి సేవా భావాన్ని వ్యక్తపరుస్తారని సి ఓ ఓ శ్రీకాంత్ వొడ్నాల తెలిపారు.



నారీ శక్తికి వందనం

- బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ

నవతెలంగాణ-బేగంపేట్

తుపాకీతో వచ్చిన వారిపై పోరాడిన మహిళల ధైర్య సాహసాలు ఎంతో అద్భుతమని బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటెల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ కొనియాడారు. గురువారం బేగంపేట జైన్ కాలనీలో ఓ ఇంట్లోకి చొరబడిన దుండగులు తుపాకీతో బెదిరించగా సాహసించిన తల్లీ కూతుళ్లు వారిపై ఎదురు దాడి చేయగా వారు పారిపోయిన ఘటన సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. ఈ మేరకు శుక్రవారం వారు ఇంటికి వెళ్లి తల్లీ కూతుళ్లను శాలువతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. దోపిడీ చేయాలని ప్రయత్నిస్తే తల్లి అమిత, కూతురు భవి దొంగలను నిలువరించి పోలీసులకు అప్పగించారని.. ఈ నారీ శక్తికి వందనం అన్నారు. వీరి సాహసం, ధైర్యానికి మొక్కాలని.. ఇక్కడికి వచ్చి వీరిని సన్మానించారు. హైదరాబాద్ పోలీస్ కూడా వేగంగా స్పందించి పారిపోతున్న వారిని పట్టుకున్నారని వారికి అభినందనలు తెలిపారు. తెలంగాణ పోలీస్ అనేక విషయాల్లో నైపుణ్యం సంతరించుకున్నారని చెప్పారు. హైదరాబాద్ కాస్మోపాలిటన్ సిటీ అని.. అనేక రాష్ట్రాల వారు ఇక్కడ జీవిస్తున్నారని తెలిపారు. పటిష్ట భద్రత ఉన్నా ఇలాంటివి జరగడం బాధాకరం అన్నారు. ప్రశాంతమైన ఈ కాలనీ చౌరస్తా లో వైన్ షాప్ ఓపెన్ చేశారని.. అక్కడే ఓపెన్ బార్ లా పెట్టి తాగుతూ ఉండడం వల్ల మహిళలు నడవలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వైన్ షాప్ దగ్గరే తాగే పద్ధతి బంద్ పెట్టాలని డిమాండ్ చేశారు. దీనిమీద ఫిర్యాదు చేస్తామన్నారు. అలాగే కొంతమంది యువకులు ఇక్కడ ఆకతాయి పనులు చేస్తున్నారని కంప్లయింట్ చేస్తున్నారని.. దానిని కూడా అరికట్టాలన్నారు. తమ పార్లమెంట్ నియోజకవర్గం పరిధి లో వస్తుంది కాబట్టి బాధ్యత గల వ్యక్తిగా వీరికి భరోసా ఇవ్వడానికి వచ్చామన్నారు

ఎపెర్టో లూసెంట్‌ను అందుబాటులోకి తెచ్చిన ఫ్యూజి ఫిల్మ్



నవతెలంగాణ-బంజారాహిల్స్

ఫ్యూజిఫిల్మ్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఓపెన్ ఎంఆర్ఏ యంత్రం 'ఎపెర్టో' లూసెంట్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపింది. శుక్రవారం బంజారా హిల్స్ హైయత్ ప్యాలస్ హొటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని ఫ్యూజిఫిల్మ్ ఇండియా హెల్త్ కేర్ బిజినెస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ చందర్ శేఖర్ సిబల్ వెల్లడించారు. దాంతో వైద్య నిపుణులు స్పష్టమైన, ఖచ్చితమైన రోగనిర్ధారణ సమాచారాన్ని పొందడానికి వీలు కల్పిస్తుందన్నారు. తొలుత దీన్ని అమీర్‌పేట్‌లోని విజయా డయాగ్నస్టిక్ సెంటర్‌లో ఏర్పాటు చేశామన్నారు. ఎపెర్టో లూసెంట్ అనేది ఒక కొత్త తరం ప్రైమ్ ఓపెన్ పరికరమన్నారు. ఇది ఐపి-రాపిడ్ అనే అత్యాధునిక టెక్నిక్తో పని చేస్తుందన్నారు. దీనివల్ల స్కానింగ్ సమయం గణనీయంగా తగ్గడంతో పాటు, ఇమేజ్ నాణ్యత అత్యద్భుతంగా ఉంటుందన్నారు. విజయ డయాగ్నస్టిక్ సెంటర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శేషాద్రి వాసస్ మాట్లాడారు.

బీసీ ఓవర్సీస్ స్కాలర్ షిప్‌ల సంఖ్యను పెంచాలి



నవతెలంగాణ-ఓయూ

బీసీ ఓవర్సీస్ సాలర్‌షిప్‌లు మంజూరై విదేశాల్లో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులకు వెంటనే నిధులు విడుదల చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్ర వెంకటేశంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ. పెండింగ్‌లో ఉన్న నిధుల విడుదల జాప్యం వల్ల స్వదేశంలో ఉన్న తల్లిదండ్రులు,విదేశాల్లో ఉన్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. బీసీల జనాభా తగ్గట్టు విదేశీవిద్య సాలర్‌షిప్‌ల సంఖ్యను 300 నుంచి కనీసం 2,000 మందికి పెంచాలని కోరారు.ఈ కార్యక్రమంలో తాడికొండ విక్రమ్, ఇంద్రం పాల్గొన్నారు.

మల్లయ్య భట్టుకు సత్కారం



నవతెలంగాణ-ఓయూ

తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఎండీగా నియమితులైన మల్లయ్య బట్టును శుక్రవారం వారి చాంబర్ లో రాష్ట్ర బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సదావారి సాయితేజ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. రానున్న రోజులలో గవర్నమెంట్ స్కూల్స్ గాని రెసిడెన్షియల్ స్కూల్స్ గాని కేజీబీ స్కూల్స్ గాని బిల్డింగ్‌లకు ఎక్కడెక్కడ అయితే గవర్నమెంట్ బిల్డింగ్స్ లేవో ఆ ప్రాంతంలో బిల్డింగ్ సాంక్షన్ చేసి పేద విద్యార్థులకు విద్యనందించేందుకు కృషి చేయవలసిందిగా కోరారు. రాజేష్ శ్రీకాంత్ మహేష్ ప్రభాకర్ విద్యార్థి నాయకులు పాల్గొన్నారు.

కీర్తి పురస్కారం అందుకున్న డా.చేగోని రవికుమార్

నవతెలంగాణ-ధూల్‌పేట్



ప్రభుత్వ సిటీ కళాశాలలో గ్రంథాలయ పాలనాశాస్త్ర సహాయ ఆచార్యులుగా సేవలందిస్తున్న డా.చేగోని రవికుమార్ తెలుగు విశ్వవిద్యాలయం కీర్తి పురస్కారం అందుకున్నారు. రవి కుమార్ గత 20 సంవత్సరాలుగా గ్రంథాలయ శాస్త్రంలో కృషి చేస్తూ విశిష్టమైన గ్రంథాలయాల చరిత్రను వెలికి తీస్తున్నారు. ఈ గ్రంథాలయాల విశేషాలను వ్యాసాల రూపంలో అందిస్తున్నారు. గ్రంథాలయ ఉద్యమంపై వారు రెండు పుస్తకాలు వెలువరించారు. రవికుమార్ కృషిని గుర్తించి 2022 సంవత్సరా నికి గాను పర్వతనేని గంగాధరరావు రాష్ట్రస్థాయి (రెండు తెలుగు రాష్ట్రాలలో గ్రంథాలయ శాస్త్రంలో చేసిన కృషిగాను) కీర్తి పురస్కారం తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఉప కులపతి ఆచార్య తంగేడు కిషన్ రావు, రిజిస్ట్రార్ బట్టు రమేష్, చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్, డాక్టర్.రత్న ప్రభాకర్, డాక్టర్.యాదయ్య, డాక్టర్.భాస్కర్, డాక్టర్.శంకర్ తదితరులు అభినందించారు.

స్త్రీలు, పిల్లలకు పోషకాహారం ప్రధానం

నవతెలంగాణ-ధూల్‌పేట్



స్త్రీలు, పిల్లలకు పోషక ఆహారం ప్రధానం అని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విద్యాలయం పూర్వ అధ్యక్షులు డాక్టర్ విజయ ఖాదర్ అన్నారు. డాక్టర్. బాల భాస్కర నేతృత్వంలో ప్రభుత్వ సిటీ కళాశాల స్త్రీ సాధికారిత విభాగం నిర్వహిస్తున్న 3 రోజుల అంతర్జాతీయ మహిళ సదస్సులో రెండవ రోజు ఆరోగ్యం పోషణ అనే అంశం పై పలువురు ప్రసంగించారు. మొదటిగా ఆయన తమ కీలక ఉపన్యాసంలో పోషక ఆహారంతో పాటు స్త్రీలు, పిల్లలు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం పిల్లలకు, మహిళలకు ప్రవేశ పెడుతున్న అనేక పథకలను గూర్చి వివరించారు. మిత్ర మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ బెంగుళూర్ ఓఎస్డబ్ల్యు డీ సభ్యులు డాక్టర్ కరణం రమేశ్ కుమార్ పర్యావరణ ప్రభావం అంటువ్యాధులు అనే అంశం పై ప్రసం గించారు. ఢిల్లీ విశ్విద్యాలయం ఏఎస్ఆర్డీ కాలేజ్ నుండి ప్రొఫెసర్ సునీత భగత్ ఎక్స్ ప్లోరేషన్ ఆఫ్ సింథటిక్ స్ట్రాటజీస్ అండ్ బయోలాజికల్ అసెస్మెంట్ అనే అంశంపై ప్రసంగించారు.



కాంగ్రెస్‌లో చేరికలు



నవతెలంగాణ-అంబర్‌పేట

బీఆర్ఎస్ సీనియర్ నాయకులు తొలునూరి కృష్ణగౌడ్ కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. అంబర్‌పేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ క్రియాశీలంగా వ్యవ హరించిన కృష్ణగౌడ్ శుక్రవారం డీడీ కాలనీలోని మాజీ ఎంపీ వి.హనుమంత రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కృష్ణగౌడ్ మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రధాన అనుచరిగా ఉండేవారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత గౌరవం ఉంటుందని వీహెచ్ అన్నారు. కాంగ్రెస్ అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తానని ఈ సందర్భంగా కృష్ణగౌడ్ తెలిపారు. కృష్ణగౌడ్ వెంట దీలిప్, నరేష్ తదితరులున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు మాజీ కార్పొరేటర్ పి.జ్ఞానేశ్వర్ గౌడ్ ఆర్.లక్ష్మణ్ యాదవ్, గరిగంటి రమేష్, శంభుల శ్రీకాంత్ గౌడ్, నారా యణ స్వామి, గడ్డం లక్ష్మణ్గౌడ్, దిడ్డి రాంబాబు, పొలినేని రామ్మోహన్ రావు, గడ్డం శ్రీధర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ కర్ణన్‌కు ధన్యవాదాలు

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ ఆర్.వి కర్ణన్ కలిసి రెండు నెలల వేతనాలు చెల్లించినందుకు పుష్ప గుచ్చం అందించి ధన్యవాదాలు తెలిపామని ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రెసిడెంట్ ఎం.నరసింహ చెప్పా రు. ప్రతి నెల 1వ తేదీన క్రమం తప్పకుండా ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్స్, సెకండ్ ఏఎన్ఎంలుకు ప్రతి నెల వేతనాలు వచ్చే విధంగా, 7 నెలల పీఆర్సీ ఎరియర్స్ బకాయిలు చెల్లించాలని వినతి పత్రం ఆయనకు అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం రాష్ట్ర ప్రెసిడెంట్ ఏం నరసింహ, ఏఐటీయుసీ ప్రధాన కార్య దర్శి ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్స్ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బాలసుబ్రమణ్యం, సెక ండ్ ఏఎన్ఎంలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ.శ్యామల, సెకండ్ ఏఎన్ఎంలు కోశాధికారి పద్మ, తస్వీర్ సుల్తానా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

మూల వాసుల సిద్ధాంతాన్ని ప్రచారం చేసేందుకు అవగాహన చైతన్య యాత్ర

- విశ్వజన కళా మండలి వ్యవస్థాపక అధ్యక్షులు డా.మాస్టర్ జీ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశంలోని మూల వాసుల అస్థిత్వం ప్రమాదంలో పడిందని, దీన్ని కాపా డుకునేందుకు విశ్వజన కళా మండలి మూల వాసుల సిద్ధాంతాన్ని ప్రచారం చేసేందుకు ఐదు విభాగాలకు మండలి నూతనంగా ఐదుగురు సభ్యులను నియమించిందని, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక, తాత్విక, రాజకీయ రంగా లలో ఈ ఐదుగురు సభ్యులు తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా ప్రచారం చేయ నున్నారని విశ్వజన కళా మండలి వ్యవస్థాపక అధ్యక్షులు డా.మాస్టర్ జీ తెలిపారు. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతినిధులు తలకొక్కుల రాజు, పుల గాజుల జంగయ్య, సంధ్యపోగు రాజశేఖర్, పోతరాజు నర్సింహారాజు కళా మండలిలో నూతనంగా ఎన్నికైనట్టు ఆయన తెలిపారు. మాన్యశ్రీ కాన్షిరాం జయంతిని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీ నుంచి ఏప్రిల్ 14వ తేదీ వరకు డా.బి.ఆర్.అంబేద్కర్ జయంతి వరకు మూల వాసుల మాసోత్సవ, మాతా పితా అవగాహన చైతన్య యాత్రను ఈ ఐదుగురు సభ్యులు తెలుగు రాష్ట్రాలలో విస్తృతంగా ప్రచారం చేస్తారని ఆయన చెప్పారు.

రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- కార్పొరేటర్ విజయకుమార్ గౌడ్



నవతెలంగాణ-అంబర్‌పేట

రోడ్ల అభివృద్ధికి అధికారులు ప్రత్యేక దృష్టి సారించి స్పీడ్ బ్రేకర్లు వేయా లని ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అంబర్‌పేట కార్పొరేటర్ ఇ. విజయ్ కుమార్ గౌడ్ అన్నారు. శుక్రవారం అంబర్‌పేట డివిజన్ పరిధిలోని దుర్గా నగర్ లో స్థానిక అధికారులతో కలిసి రోడ్లను పరిశీలించి ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అవసరాల దృష్టిలో పెట్టుకొని భవిష్యత్తులో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్ర మంలో స్థానిక నాయకులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన వారికి సముచిత స్థానం కల్పిస్తాం

- తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ దీప దాస్ మున్షి

నవతెలంగాణ-అంబర్‌పేట



ఖైరతాబాద్ సెంట్రల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు డాక్టర్ రోహిణి రెడ్డి ఆధ్వర్యంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి సీడబ్ల్యూసీ సభ్యురాలు తెలంగాణ ఇన్‌చార్జీ దీపదాస్ మున్షీ తోలుపునూరి కృష్ణ గౌడ్ కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవ స్థానం కల్పి స్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, సీనియర్ నాయకులు గరిగంటి రమేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

సమాజంలో అంగన్‌వాడీల పాత్ర కీలకం

- గర్భిణీలు పోషకాహారం తీసుకునేలా చూడాలి
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





నవతెలంగాణ-సిటీబ్యూరో

ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పాటులో అంగన్‌వాడీ టీచర్ల పాత్ర అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. మహిళ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా సాధి కారత కేంద్రం, పోషణ్ పక్వాడ కార్యక్రమం మారేడుపల్లి భగవతి రెసిడెన్సిలో నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారం భించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్యవం తమైన సమాజం ఏర్పాటుకు అంగ న్‌వాడీ టీచర్లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న చట్టల గురించి అవగాహన కలిగి ఉండాలన్నా రు. గృహహింస, ఫోక్సో చట్టలపై ప్రజలందరికీ అవగాహన కలిగించాలని సూచించారు. గర్భిణీలు, పిల్ల లు పోషక విలువలు ఉన్న ఆహారం, మిల్లెట్స్ తీసుకోవాల న్నారు. గర్భిణీలకు శ్రీమంతం, 6 నెలల పిల్లలకు అన్నప్రాసన చేశారు. పీసీపీఎన్‌డీటీ, బాల్య వివాహాలు, చైల్డ్ అ బ్యూస్, పోషణ్ యాక్ట్, సైబర్ క్రైమ్, గృహ హింస తదితర చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడబ్ల్యూవో అక్కేశ్వర్‌రావు, సీడీపీవో లు సునంద, కౌన్సిలర్, అడ్వకేట్ శైలజ, భవాని, సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఢిల్లీ జేఎన్‌యూలో ప్రజాస్వామ్య హత్యను ఖండించండి

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్

నవతెలంగాణ-హిమాయత్‌నగర్



ప్రజాస్వామ్యాన్ని, క్యాంపస్ ఎన్నికలను నిర్వీర్యం చేసేందుకు జేఎన్‌యూ అడ్మినిస్ట్రేషన్ చర్యను ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్ తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ తీవ్రంగా ఖండించింది. శుక్రవారం హిమాయత్ నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ జేఎన్‌యూఎస్‌యు ఎన్నికల్లో ప్రధాన కార్యదర్శి పదవికి లెఫ్ట్ యూనిటీ అభ్యర్థి కామ్రేడ్ స్వాతి సింగ్ చివరి నిమిషంలో అనర్హత వేటు పడిందని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నామినేషన్, పరిశీ లన ప్రక్రియలో ఎలాంటి వివాదాలు తలెత్తలేదని, చట్టవిరుద్ధమైన పద్ధతిలో అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడం జేఎన్‌యులోనే కాకుండా భారతదేశం అంతటా ప్రజాస్వామ్య స్ఫూర్తిని ఖూనీ చేసే ప్రయత్నమన్నారు. ఎన్నికలను మన దేశంలో ప్రజాస్వామ్య పండుగగా భావిస్తారని, బీజేపీ నేతృత్వంలోని పాలన ప్రజాస్వా మ్యాన్ని, పారదర్శకతను పూర్తిగా దెబ్బతీసిందని ఆరోపించారు. 2024 లోక్ సభ ఎన్నికలకు ముందు జరిగే జేఎన్ యూఎస్ యు ఎన్నికలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, వామపక్ష ఐక్యత విజయం ప్రజలకు రాజకీయ సందేశాన్ని పంపుతుం దన్నారు. ఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్న పరిపాలనకు తెలుసని, ప్రజాస్వామ్యం, వామపక్షాల విజయాన్ని అడ్డుకునేందుకు ఆర్ఎస్ఎస్, బీజేపీ ఏ స్థాయికైనా వెళ్లొచ్చని, కుటిల చర్యలకు పాల్పడతాయని స్వాతి సింగ్ నామినేషన్ రద్దుతో అది రుజువైందన్నారు.పోలింగ్‌కు కేవలం ఏడు గంటల ముందు అభ్యర్థిత్వాన్ని రద్దు చేయడం ప్రజావ్యతిరేక మితవాద శక్తి అందుకున్న ఆదేశాల ఆధారంగా పరి పాలన, ఎన్నికల సంఘం పని చేస్తున్నాయని రుజువు చేస్తుందని, స్వాతి సింగ్ స్క్రూటినీ ప్రక్రియను క్లియర్ చేసినందున, క్యాంపస్ నుండి ఆమె రస్టికేషన్‌ను హైకోర్టు రద్దు చేసినందున, ఎన్నికల చివరి గంటల్లో ఆమె నామినేషన్‌ను రద్దు చేయడానికి తార్కిక లేదా బలమైన కారణం లేదని, ఎన్నికలను ఆర్ఎస్ఎస్ విద్యార్థి విభాగం ఏబీవీపీకి అనుకూలంగా మార్చేందుకే రద్దు ఉత్తర్వులు జారీ చేశారని ఆరోపించారు.తొలిదశ నుంచి ఎన్నికలను నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని, క్యాంపస్ లోపల హింస, ద్వేషాన్ని ప్రచారం చేసే ఏబీవీపీని ఓడించడానికి జేఎన్ యూ విద్యార్థులు సిద్ధంగా ఉన్నారని, ఆర్ఎస్ఎస్ మద్దతు ఉన్న పరిపాలనకు తెలుసని, దేశం ఇప్పుడు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి స్వేచ్ఛాయుతమైన ఎన్నికలను చూస్తోందని తెలిపారు.దేశంలోని విద్యార్థులు, అభ్యుదయ, ప్రజాస్వామ్య లౌకిక శక్తులు ప్రజాస్వామ్య వ్యతిరేక చర్యను ఖండించి, జేఎన్ యూ భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించే పోరాటంలో పాల్గొనాలని తాము కోరుతున్నామని వారు తెలిపారు.

భూగర్భ జలాలను పెంపొందించుకోవాలి

- జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ డీప్యూటీ కమిషనర్ మొయినుద్దీన్



నవతెలంగాణ-ముషీరాబాద్

భూగర్భ జలాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని జీహెచ్‌ఎంసీ ముషీరాబాద్ డీప్యూటీ కమిషనర్ మొయినుద్దీన్, టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జీ హాఫిజ్ అన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గంలో ప్రజలకు రాబోవు వేసవి కాలం నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీహెచ్‌ఎంసీ డీప్యూటీ కమిషనర్ మోయినుద్దీన్, టౌన్ ప్లానింగ్ ఇన్‌చార్జీ హాఫిజ్ హాజరై మాట్లాడుతూ ప్రతి ఇంట్లో ఇంకుడు గుంతలు కట్టుకో వాలని, నీటి సంరక్షణ కచ్చితంగా పాటించాలని సూచించారు. చిన్నప్పటి నుంచే విద్యార్థులు నీటి పొదుపుపైన అవగాహన పెంపొందించుకోవాలని, నీటి నాణ్యా త, అవసరం, నీటి యొక్క విలువ, నీటి శాతాలు మన భూమి మీద ఏ మేరకు ఉన్నాయో తదితర వివరాలు వెల్లడించారు. వేసవి కాలం నీటి ఎద్దడి సమస్య తీవ్రంగా ఉంటుందని ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకుంటే నీటి సమస్యను పరిష్కరించుకోవచ్చని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటకుండా చూసు కోవడం వలన రాబోవు తరాలకు నీటి ఎద్దడి లేకుండా చేయవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

యోచన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం, దుస్తుల పంపిణీ



నవతెలంగాణ-ముషీరాబాద్

యూత్ కాంగ్రెస్ నాయకుడు ఎం.అరవింద్ కుమార్ యాదవ్ జన్మదిన వేడుకలు శుక్రవారం ముషీరాబాద్ నియోజకవర్గంలో ఘనంగా నిర్వ హించారు. యోచన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు జానకి సుధాకర్, గాంధీనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బాబ్జి ఆధ్వర్యంలో అరవింద్ కుమార్ యాదవ్ జన్మదినం సందర్భంగా యోచన స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు జానకి సుధాకర్ జీహెచ్‌ఎంసీ కార్మికులకు దుస్తులు, చీరల పంపిణీతో పాటు అన్న దానం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అరవింద్ కుమార్ యాదవ్ హాజరై కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శీలం సత్య నారాయణ, గుర్రం శంకర్, జయేందర్ బాబు, సికింద్రాబాద్ డిసిసి ప్రధాన కార్యదర్శులు బంటారం యాదగిరి గౌడ్, జగదీశ్ బాబు, డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడి, బాబ్జీ, వెంకట్ గోవింద్, వెంకట్ రావు, బాల కుమార్, నర్సింగ్ రావు, భాస్కర్ రెడ్డి, మధుమతి, సురేందర్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్ 1,2,3,4 పోస్టులు పెంచాలి

- టీచర్ పోస్టులు 25 వేలకు పెంచాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు,ఎంపీ ఆర్.కృష్ణయ్య

నవతెలంగాణ-ముషీరాబాద్



గ్రూప్ 1,2,3,4 పోస్టులు పెంచి టీచర్ పోస్టు లు 25 వేలకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, ఎంపీ ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. శుక్రవా రం విద్యానగర్ బీసీ భవన్‌లో ఐక్యవేదిక అధ్యక్షులు అనంత య్య మహిళా నాయకురాలు కరుణశ్రీ అధ్యక్షతన నిరుద్యో గుల సదస్సు నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంపీ ఆర్ కృష్ణయ్య హాజరై మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఒకే దఫా రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడానికి ఆదేశాలు జారీ చేయడం గొప్ప విషయమన్నారు, ప్రభుత్వ అధికారులు కొందరు డైరెక్టర్ రిక్రూమెంట్ కోటా కింద భర్తీ చేయాల్సిన గ్రూప్ వన్ టూ త్రీ ఫోర్ సర్వీస్ ఉద్యోగాలను నామ మాత్రపు లెక్కించి ప్రతిపాదనలు పంపారని తెలిపారు. గ్రూప్ వన్ సర్వీస్ కింద పది సంవత్సరాలుగా పోస్టులు భర్తీ చేయలేదు, గ్రూప్-2 సర్వీస్ కింద ఆరు సంవత్సరాలుగా నోటిఫికేషన్ లేదని తెలిపారు. ఈ పది సంవత్సరాల కాలం లో ఎంతమంది రిటైర్ అయ్యారు, ఎంతమందికి ప్రమో షన్లు వచ్చాయని లెక్కించి పూర్తిస్థాయిలో భర్తీ చేయాల న్నారు. గ్రూప్ వన్ సర్వీస్ కింద 53 పోస్టులు ప్రకటించారని డైరెక్టు రిక్రూమెంట్ కోటా పోస్టు కరెక్ట్ గా లెక్కిస్తే 1600లకు పైగా వస్తాయన్నారు. టీచర్ పోస్టులు పదకొండు వేలు భర్తీ చేస్తామన్నార గానీ వాస్తవానికి 25 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటన్నిటిని భర్తీ చేయడానికి టీచర్ పోస్టులను 25 వేలకు పెంచాలన్నారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, జిల పెల్లి అంజి, నంద గోపాల్, రామకృష్ణ, ఉదయ్ ,వాణి ,లావణ్య, బుచ్చయ్య, కళ్యాణి, స్వరూప, తదితరులు పాల్గొన్నారు.

'న్యాయవాదుల సంక్షేమం కోసం రూ.5 వేల కోట్లు కేటాయించాలి'



- రాష్ట్ర న్యాయవాదుల జేఏసీ డిమాండ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

దేశ వ్యాప్తంగా ఉన్న న్యాయవాదుల సంక్షేమం, అభి వృద్ధి కోసం రూ.5 వేల కోట్లు కేటాయించాలని తెలంగాణ రాష్ట్ర న్యాయవాదుల జేఏసీ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసి న మీడియా సమావేశంలో జేఏసీ అధ్యక్షులు ఎస్.శ్రీనివాస్ యాదవ్, కన్వీనర్ బాతుల కృష్ణ, కో-కన్వీనర్ మాదారం మంజుల మాట్లాడుతూ న్యాయవాదుల సంక్షేమం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.200 కోట్లు కేటాయించి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వం న్యాయవాదుల సంక్షేమా నికి రూ.100 కోట్లు కేటాయిస్తామని ప్రకటించి, ఇంత వరకు నిధులు అందించలేదని ఆరోపించారు.గత బీఆర్ ఎస్ ప్రభుత్వం న్యాయవాదులకు తీరని అన్యాయం చేసిందని, న్యాయవాదులకు రక్షణ లేకుండా పోయిందని, ప్రభుత్వ సహకారం తమకు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వచ్చే లోక్ సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, రాష్ట్రంలోని 17 లోక్ సభ స్థానాలను గెలిపిస్తామని చెప్పారు. రాష్ట్రంలోని జూనియర్ న్యాయవాదులకు నెలకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో జేఏసీ సంయుక్త కార్యదర్శి జి.రామారావు, మీడియా కో-ఆర్డినేటర్ ఇందిరపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ ఇతర విభాగాల్లో జరుగుతున్న అవినీతిపై పోరాటం చేస్తాం..

- చేతన సొసైటీ ఫర్ మెడికల్ అండ్ హెల్త్ అండ్ ఆల్ డిపార్టుమెంట్స్



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

మెడికల్ అండ్ హెల్త్, ఇతర విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేతన సొసైటీ నీ స్థాపించామని తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఎస్‌కే ప్రసన్న, ప్రధాన కార్యదర్శి సైఫాబేగం అన్నారు. శుక్రవారం చేతన సొసైటీ రాష్ట్ర కార్యాలయంలో చేతన సొసైటీ ఫర్ మెడికల్ అండ్ హెల్త్ ఆల్ డిపార్టుమెంట్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. వైద్య ఆరోగ్యశాఖ , ఇతర విభాగాల్లో జరుగుతున్న అవినీతిపై రాజీ లేని పో రాటం చేస్తామన్నారు. హెల్త్ డిపార్ట్‌మెంట్, అన్ని డిపార్టు మెంట్‌లో సీనియార్టీని పరిగణంలోకి తీసుకోకుం డా ప్రమో షన్లు కల్పిస్తున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. పలు విభాగాల్లో ప్రమోషన్లలో అక్రమాలు, అక్రమమార్గం లో ఉద్యోగ పదోన్నతులు, ఉద్యోగులపై వేధింపులు గురి చేస్తున్న ట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. .వైద్య ఆరోగ్య శాఖ, ఇతర ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్, పించనర్స్ ఉద్యోగస్తు లకు ఎలాంటి సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకువస్తే సంబం ధిత అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారాన్ని కృషి చేస్తామన్నారు. ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, పించ నర్స్, ఇతర విభాగాల్లోని ఉద్యోగస్తులు సమస్యలు ఉంటే ఈ నెంబర్ 9505554646, 98663 55940 లను సంప్ర దించాలన్నారు.

మాస్టర్స్ ఇన్ ఆప్టోమెట్రీ (పోస్టుగ్రాడ్యేషన్)లో టాపంగ్‌గా సి. దీపిక

నవతెలంగాణ-ముషీరాబాద్



మహారాష్ట్ర పుణెలోని భారతీ విద్యాపీఠ్ విశ్వ విద్యాల యంలో మాస్టర్స్ ఇన్ ఆప్టోమెట్రీ (పోస్ట్రాడ్యేషన్)లో ఉత్తమ టాపర్ (ప్రథమ) స్థానంలో నిలిచిన నగరానికి చెందిన సి. దీపికకు మహారాష్ట్ర గవర్నర్ డా.రమేశ్ బైస్ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్ విశ్వాజిట్కధం, వీసీ డా. వివేక్ చేతుల మీదుగా మాస్టర్స్ డిగ్రీ పట్టాను అందుకున్నారు. దేవరకొండ జిల్లా కోర్టు న్యాయమూర్తి పొట్ట చెన్నయ్య, ఇంటర్నేషనల్ టేబుల్ టెన్నిస్ ఎంపైర్, డిఫెన్స్‌మెటలర్జి రీసెర్చ్ ల్యాబరేటరీ విశ్రాంత అధికారి చిన్నెట్టి బాబురావు, నాంపల్లి క్రిమినల్ కోర్టు సీనియర్ న్యాయవాది విజయలక్ష్మి, సాఫ్‌వేర్ సీనియర్ మేనేజర్ భువనచంద్ర, విద్యుత్తు అకౌంట్స్ అధికారి పీఎం రాజు, దీపిక తల్లి సుజాత లు ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా బాబు రావు మాట్లాడుతూ పేద పిల్లలకు తన సొంత ఖర్చులో లైబ్రరీని నిర్మించి సేవ లందించానన్నారు. ఆడపిల్లల చదువులో సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. ఈ సందర్భంగా దీపిక మాట్లాడుతూ తన తల్లి ప్రేరణతో కష్టపడి చదివి, అనేక అడ్డంకులను ఎదుర్కొని ఉన్నత స్థానంచేరుకోవడం ఎంతో సంతోషం కలిగించిందన్నారు. పేదలకు ఉచితంగా కంటి శస్త్ర చికిత్సలు చేసి నగరానికి మంచి పేరు తీసుకొస్తానన్నారు.

సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియోషన్ సెక్రటరిగా డీ.హర్షవర్ధన్ ఎన్నిక



నవతెలంగాణ-ధూల్‌పేట్

పాతబస్తీ సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియోషన్ ఎన్నికలు శుక్రవారం సందడిగా కొనసాగాయి. ఈ ఎన్ని కల బరిలో పలువురు న్యాయవాదులు నిలిచారు. ఈ పోటీల బరినుంచి పలువురు న్యాయవాదులు స్వచ్ఛంద గా తప్పుకోవడంతో సెక్రటరి ఎన్నిక ఏకగ్రీవ తీర్మానం జరిగింది. దీంతో బరిలో నిలిచిన ఇద్దరు న్యాయవాదులు మిగిలిపోవడంతో వారిని పలువురు న్యాయవాదులు యూనానిమస్‌గా ఎన్నుకున్నారు. ఎన్నికల్లో న్యాయవా దులు డి.హర్షవర్ధన్ సెక్రటరిగా, జాయింట్ సెక్రటరిగా బి.రాజేష్‌కుమార్, లైబ్రరి సెక్రటరి సుదాంషు కుమార్, కోషాదికారిగా టీ.విషాల్‌సింగ్, క్రీడా విభాగం సెక్రటరి గా సైదిరెడ్డి తదితరులను ఎన్నుకున్నారు. పలువురు న్యాయవాదులు బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు నూతనంగా ఎన్నుకోబడిన వారికి శాలువా పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా సెక్రటరి హర్ష వర్ధన్ మాట్లాడుతూ.. న్యాయవాదులు ఎదుర్కోంటున్నా న్యాయ పరమైన సమస్యలను పరిష్కారం కోరకు ప్రభుత్వం దృష్టి తీసుకుని వెళ్తుతానని హామిచ్చారు.

'25 నుంచి 98వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలు'



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

ఈ నెల 25, 26, 27వ తేదీలలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత తొలి సారిగా 98వ శ్రీ సనాతన వేదాంత జ్ఞాన సభలను నగరంలోని ఆర్పీఐ రోడ్డులో గల ఎస్వీఆర్ కన్వెన్షన్ హాల్ లో నిర్వహిస్తున్నామని హైదరాబాద్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ, ద్వాదశ జ్యోతిర్లింగాల ఆర్యవైశ్య నిత్యాన్న సత్రం ట్రస్ట్, శ్రీ మలయాళ స్వామి భక్త బృందం తెలిపాయి. ఈ మేరకు శుక్రవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో జ్ఞాన సభలకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీ వ్యాసాశ్రమ వ్యాస పీఠాధిపతులు శ్రీ పరిపూర్ణానందగిరి స్వామి, శ్రీ అసంగానందగిరి స్వామి, మహాసభ అధ్యక్షులు సరాబు లక్ష్మణ్ గుప్త కన్వీనర్ కాసెట్టి పాండు గుప్త తదితరులు మాట్లాడుతూ ఈ జ్ఞాన సభలకు వివిధ ప్రాంతాల నుంచి పీఠాధిపతులు, మఠాధిపతులు, స్వామిజీలు, 100 మందికి పైగా మాతాజీలు ఒకే వేదికపై నుంచి ప్రవచనాలు చేస్తారని చెప్పారు.ఈ మూడు రోజుల పాటు భక్తులకు భోజన, అల్పాహారం సౌకర్యం కల్పిస్తున్నా మని, కుల, మతాలకు అతీతంగా జరిగే ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ఇట్ల చేద్దాం



చేదుగా ఉంటుందని చాలా మంది కాకరకాయ తినడానికి ఇష్టపడరు. ఈ చిట్కా ఫాలో అయితే కాకరకాయలో చేదు తగ్గుతుంది. కాకరకాయ కూరలో సోంపు గింజలు, బెల్లం వేస్తే చేదును లాగేస్తుంది. కూర రుచిగా ఉంటుంది.



భార్యా భర్తల మధ్య..?

ఐద్వా అదాలత్
సెల్: 9490098024

ఈ మధ్య కాలంలో పెట్స్ (పెంపుడు జంతువులు) పెంచుకోవడం ఓ ట్రెండ్‌గా మారిపోయింది. కుక్కలు, పిల్లులు, చిలకలు, పక్షులు వంటి వాటిని చాలా మంది ఇష్టంగా పెంచుకుంటున్నారు. మనసు బాగోలేక పోయినా, ఏమీ తోచకపోయినా, బోర్ కొట్టినా పెట్స్‌తో కాసేపు ఆడుకుంటే మనసుకు ఎంతో ప్రశాంతంగా అనిపిస్తుంది. వాటితో సమయం గడుపుతుంటే కాస్త సేదతీరినట్టు, మన ఆప్తులతో గడుపుతున్నట్టు ఉంటుంది. కొంత మంది వాటిని ఇంట్లో సభ్యులుగా చూసుకుంటారు. అయితే ఇంట్లో ఉన్న సభ్యులందరికీ నచ్చితేనే ఆ ఆనందాన్ని పొందగలరు. లేదంటే వాటి వల్ల కొన్ని సమస్యలు కూడా వస్తాయని ఈ వారం ఐద్వా అదాలత్ చదివితే అర్థమవుతుంది.

32 ఏండ్ల స్వరూప్ ప్రైవేట్ ఉద్యోగి. ఇంట్లో 70 ఏండ్ల అమ్మ ఉంటుంది. ఆమెకు బి.పి, షుగర్, సమస్యలతో పాటుగా ఈ మధ్య కాలంలో గుండెకు సంబంధించిన సర్జరీ కూడా చేయించారు. భార్య స్వప్నకు 30 ఏండ్లు ఉంటాయి. వాళ్ళకు పెండ్లయి ఐదేండ్లు అవుతుంది. ఇప్పటి వరకు పిల్లలు లేరు. పిల్లల కోసం ట్రీట్‌మెంట్ చేయించుకుంటున్నారు. కానీ వారి మధ్య అంత అన్యోన్యత లేదు. దానికి కారణం స్వప్న ఇష్టంగా పెంచుకునే కుక్కపిల్ల(మిక్సీ).

మిక్సీ అంటే స్వప్నకు చాలా ఇష్టం. అది పెండ్లి కాకముందు నుండి ఆమెతోనే ఉండేది. పెండ్లి తర్వాత రెండు మూడు రోజులు తన వద్ద ఉంచుకొని పంపించేది. రెండేండ్లకు స్వప్న దాన్ని తనతో పాటు తీసుకొచ్చుకుంది. 'ఎందుకు దాన్ని ఇక్కడ పెట్టుకోవడం, మీ అమ్మ వాళ్ళ ఇంటికి పంపించేసెయ్' అని భర్త అంటే 'ఇంట్లో ఒక్కదాన్నే ఉంటే బోర్‌గా అనిపిస్తుంది. మనకు పిల్లలు కూడా లేరు కదా! అందుకే నేను మిక్సీని ఇక్కడే పెట్టుకుంటాను. మీకెవరికీ ఎలాంటి ఇబ్బందీ లేకుండా చూసుకుంటాను' అంది.

స్వరూప్‌కు పెట్స్ అంటే అంతగా ఇష్టం లేదు. పైగా వాటిని పెంచుకుంటే కొన్ని రకాల వ్యాధులు వస్తాయని, వాటి గురించి ప్రత్యేకంగా కొంత సమయం కేటాయించాలని, ఇల్లు మొత్తం పాడు చేస్తాయని అతను వాటికి దూరంగా ఉంటాడు. వాటి దగ్గర ఒకరకమైన వాసన వస్తుంది. అది అతనికి అసలే నచ్చదు. అయినా స్వప్న కోసం ఒప్పుకున్నాడు. కానీ మిక్సీకి కొన్ని పద్ధతులు నేర్పించలేదు. అది వచ్చి వీళ్ల బెడ్‌పైనే పడుకుంటుంది. స్వరూప్‌ను స్వప్న పక్కన పడుకోనీయదు. ఇంట్లో ఎక్కడ పడితే అక్కడ 1,2 చేస్తుంది. దాంతో ఇల్లంతా ఒకటే వాసన. సోఫాపైన కూడా అలాగే చేస్తుంది.

'మిక్సీ వల్ల ఎవరికీ ఎలాంటి ఇబ్బంది రాకుండా చూసుకుంటానన్నావు. ఇప్పుడు చూడు అది ఇల్లు మొత్తం పాడు చేస్తుంది. మన ఇంటికి రావడానికి ఎవరూ ఇష్టపడడం లేదు. అమ్మకు కూడా చాలా ఇబ్బందిగా ఉంటుంది. పైగా ఈ మధ్యనే సర్జరీ అయ్యింది. దీని వల్ల ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

మిక్సీని కొద్ది రోజులు మీ అమ్మ వాళ్ళ ఇంట్లో వదిలి పెట్టిరా, లేకపోతే దాని కోసం బయట ఒక చిన్న పెట్ హౌస్ కట్టిస్తాను. దాన్ని అందులో పడుకోబెట్టు. లేదంటే నేను నీకు కొన్ని రోజులు దూరంగా ఉండాల్సి వస్తుంది. అందరూ పిల్లలు ఎందుకు కలగడం లేదూ అంటున్నారు. ఆస్పత్రికి వెళ్ళి మందులు వాడుతున్నా ఉపయోగం లేదేంటి అని బంధువులంతా అడుగుతున్నారు. ఎన్ని మందులు తిన్నా మన మధ్య సంబంధం లేనప్పుడు పిల్లలు ఎలా పుడతారు? ఇప్పటికే నా వయసు 32. ఇంకా లేట్ చేస్తే పిల్లలు పుట్టడమే కష్టంగా మారుతుంది. నీకైనా నాకైనా చాలా సమస్యలు వస్తాయి. అర్థం చేసుకో' అని స్వరూప్ ఎంత చెప్పినా స్వప్న అతని మాటలు పట్టించుకోవడం లేదు.

మిక్సీ అయితే స్వరూప్‌ను అసలు స్వప్న పక్కన కూర్చోనీయదు, తాకనీయదు. ఇలాంటి సమస్యతో ఇబ్బంది పడుతున్న స్వరూప్ ఐద్వా అదాలత్ వద్దకు వచ్చి 'మీరే ఎలాగైనా స్వప్నకు అర్థమయ్యేలా చెప్పాలి. మిక్సీ కోసం ప్రత్యేకంగా పెట్ హౌస్ కట్టిస్తాను' అన్నాడు.

స్వప్నను పిలిచి మాట్లాడితే 'నా జీవితంలో స్వరూప్ కంటే ముందు నుండే మిక్సీ ఉంది. ఆయనకు మిక్సీ నాతో ఉండటం ఇష్టం లేకపోతే నన్ను వదిలేయమనండి. విడాకులు ఇవ్వమని చెప్పండి. అంతేగానీ నేను మాత్రం మిక్సీని వదిలి ఉండలేను. అదంటే నాకు ప్రాణం. దాని కోసం నేనేమైనా చేస్తాను. నా జీవితంలో మిక్సీ ఉంటే చాలు. ఇక నాకు ఎవ్వరూ అవసరం లేదు. నాకు మా అమ్మానాన్నలకంటే కూడా మిక్సీ అంటేనే ఎక్కువ ఇష్టం. దాన్ని వదిలి ఉండటం అనేది జరిగే పని కాదు. అందుకే నాతో పాటే తెచ్చుకున్నాను. పెండ్లికి ముందే నేను స్వరూప్‌ను అడిగాను. అప్పుడు 'సరే తెచ్చుకో నాకెలాంటి ఇబ్బంది లేదు' అని చెప్పి ఇప్పుడు నన్ను ఇంత దూరం తీసుకొచ్చాడు' అంటూ బాధపడింది.

ఇద్దరి మాటలు విన్న తర్వాత స్వరూప్‌తో 'మీరు కూడా మిక్సీని అలవాటు చేసుకోండి. దాన్ని అప్పుడప్పుడు వాకింగ్‌కి తీసుకెళ్ళడం, స్నానం చేయించడం లాంటివి చేయండి. ఇలా చేస్తే మిక్సీ మీకు దగ్గరవుతుంది' అని చెప్పాము. అలాగే స్వప్నతో 'పెట్స్‌ను పెంచుకోవడం తప్పేం కాదు. కానీ అది మీ ఇద్దరి మధ్య కొన్ని సమస్యలు తెచ్చిపెడుతుంది. వాటిని నువ్వు పట్టించుకోవడం లేదు. పైగా దానికి నువ్వు కొన్ని పద్ధతులు నేర్పలేదు.

1,2 కోసం బయటకు వెళ్ళేటట్టు ట్రైనింగ్ ఇవ్వాలి. అలా చేయకపోవడం వల్లనే ఈ సమస్యలన్నీ. లేదంటే కచ్చితంగా మీకు ఆరోగ్య సమస్యలు వస్తాయి. స్వరూప్ దీని కోసం ప్రత్యేకంగా ఒక గది ఏర్పాటు చేస్తానంటున్నాడు. రాత్రి పూట దాన్ని అక్కడే పడుకోబెట్టు. అది స్వరూప్‌ను నీ దగ్గరకు రానీయడం లేదు. భార్యాభర్తల మధ్య ఇబ్బందులు వస్తున్నా నువ్వు దానికే ప్రాధాన్యం ఇస్తున్నావు. ఇది కరెక్ట్ కాదు. మిక్సీ నీతో ఎన్ని రోజులు ఉంటుంది. నీకు జీవితాంత తోడుండేది నీ భర్త, పిల్లలు. మరి పిల్లల కోసం మీరు ప్రయత్నించాలంటే మిక్సీ దానికి అడ్డుగా ఉంది. మేము చెబుతున్నది నీ సంతోషం కోసమే కాబట్టి బాగా ఆలోచించి నిర్ణయం తీసుకో' అని చెప్పాము.

దానికి స్వప్న 'మీరు చెప్పింది నిజమే మేడమ్. స్వరూప్ దాని కోసం ప్రత్యేక గది ఏర్పాటు చేస్తాననే అంటున్నాడు. ఇకపై దాన్ని ఆ గదిలోనే ఉంచుతాను' అని చెప్పి ఇద్దరూ వెళ్ళిపోయారు. మళ్ళీ ఆరు నెలల తర్వాత తిరిగి వచ్చి 'మేడమ్ ఇప్పుడు నాకు రెండో నెల' అని సంతోషంగా చెప్పింది. వాళ్ళతో పాటు మిక్సీని కూడా తీసుకొచ్చారు. స్వరూప్ కూడా దాన్ని అలవాటు చేసుకొని ఇద్దరూ సంతోషంగా ఉంటున్నారు.

- వై వరలక్ష్మి
9948794051

మొబైల్ ఫోన్లతో జర జాగ్రత్త..!



నిద్రపోయే ముందు ఫోన్ చూస్తూ పడుకోవడం చాలామందికి అలవాటైపోయింది. ఫోన్ చూస్తూనే నిద్రపోతున్నారు. దీనివల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయని పలు పరిశోధనలు వెల్లడించాయి. మొబైల్ ఫోన్ల వల్ల ప్రాణాలకే ముప్పు వాటిల్లుతుంది. అదెలాగో తెలుసుకుందామా..?!

- మొబైల్ ఫోన్ల నుంచి వచ్చే లైటింగ్ మెదడును ఉత్తేజపరుస్తుంది. మొబైల్ ఫోన్లు పక్కనే ఉంటే నిద్రపట్టడం కష్టమవుతుంది. మొబైల్ ఫోన్‌ల నుంచి వచ్చే కాంతి మెదడులోని మెలటోనిన్ హార్మోన్ ఉత్పత్తిని తగ్గిస్తుంది. ఈ హార్మోన్ నిద్ర లేకుండా చేయటంలో సహాయపడుతుంది.
- మొబైల్ ఫోన్ నుంచి వెలువడే కాంతిలో రేడియేషన్ ఉంటుంది. ఇది క్యాన్సర్‌కు దారితీసే అవకాశం ఉంది. ఇదే విషయాన్ని పలు అధ్యయనాలు కూడా తెలిపాయి. అలాగే మొబైల్ ఫోన్ లైటింగ్‌తో తలనొప్పి వచ్చే అవకాశాలెక్కువ. ఈ కాంతి కంటి సమస్యలకు కూడా కారణమవుతోంది.

రాత్రి వేళల్లో మొబైల్ ఫోన్ మీ పక్కన లేకుండా ఉండేందుకు కొన్ని చిట్కాలు

- మొబైల్ ఫోన్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ మీ పడకగదిలోకి తీసుకురావద్దు.
- నిద్రపోయే ముందు మొబైల్ ఫోన్‌ను ఫ్లయిట్ మోడ్‌లోకి సెట్ చేసుకోండి.
- నిద్రపోయే ముందు మొబైల్ ఫోన్ రింగ్‌టోన్ లేదా నోటిఫికేషన్ టోన్‌లను బంద్ చేయండి.
- మీరు పడుకునే ప్రాంతంలో మొబైల్ ఫోన్‌ను ఛార్జింగ్ పెట్టొద్దు. మీకు దూరంగా ఎక్కడైనా ఛార్జింగ్ పెట్టండి. ఫోన్‌కి రాత్రంతా ఛార్జింగ్ పెట్టి అలానే వదిలేస్తే మొబైల్ బ్యాటరీ సామర్థ్యం తగ్గే అవకాశం ఉంది.

రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ.. దూతిగూడెం, అంతమ్మగూడెం గ్రామాల్లో వందల ఎకరాల్లో పైర్లు ఎండిపోయాయని, ఒకవైపు కరువు, మరోవైపు పాలకుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. లోఓల్టేజీ విద్యుత్ కారణంగా మోటర్లు కాలిపోతున్నాయన్నారు. ఒక్కో రైతు ఎకరానికి రూ.25 నుంచి రూ.30వేలు పెట్టుబడి పెట్టి ఆగమయ్యారన్నారు. జిల్లాకు ఇద్దరు మంత్రులు ఉండి కనీసం పంట పొలాలను పరిశీలించిన పాపాన పోలేదన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో సుమారు లక్ష ఎకరాలు పంటలు ఎండిపోయి రైతులు కన్నీరు కారుస్తుంటే.. కనీసం వారికి ధైర్యం ఇచ్చే పరిస్థితిలో మంత్రులు లేరని విమర్శించారు. పంటకు మంచి ధర ఇప్పించి.. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. పంట నష్టంపై మంత్రివర్గ సమావేశం ఏర్పాటు చేసి రైతులకు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో యాదాద్రి భువనగిరి జిల్లా జడ్పీ చైర్మెన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ నాయక్, మాజీ ఎమ్మెల్యే బూడిది భిక్షమయ్య గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, కొలుపుల అమరేందర్, ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, వైస్ ఎంపీపీ పాక వెంకటేశం, ప్రజాప్రతినిధులు తదితరులు ఉన్నారు.

కేకే ఇంటికి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీ

(మొదటిపేజీ తరువాయి)

కేకే, మేయర్ విజయలక్ష్మి కూడా కాంగ్రెస్ నేతలతో మంతనాలు సాగించటం గమనార్హం. మరో వైపు.. తాను పార్టీ మారడం లేదని కేకే స్పష్టం చేశారు.

మోడీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులపై నేడు నిరసన కార్యక్రమాలు

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య, డీజీ నరసింహారావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎన్ బాల మల్లేష్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రమ, ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, ఎస్‌యూసీఐ(సీ) నాయకులు తేజ, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు కోటేశ్వరరావు, సీపీఐ (ఎంఎల్) నాయకులు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం వారు సంయుక్తంగా ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వ నిరంకుశ ధోరణులను తీవ్రంగా ఖండించారు. దీన్ని వ్యతిరేకిస్తూ శనివారం రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలను నిర్వహించేందుకు నిర్ణయించామని తెలిపారు. అందులో భాగంగా శనివారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్‌లోని ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నిరసన కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తూ, ప్రజాతంత్ర హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. స్వచ్ఛందంగా పనిచేసే సంస్థలైన ఈడీ, ఐటీ, సీబీఐలను తమ జేబు సంస్థలుగా వాడుకుంటున్నదని తెలిపారు. బీజేపీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చట్ట ఉల్లంఘనలు జరుగుతున్నా పట్టించుకోకుండా, బీజేపీయేతర రాష్ట్రాల్లో మాత్రం కక్షపూరితంగా వ్యవహరిస్తూ ప్రతిపక్ష పార్టీల నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తున్నదని పేర్కొన్నారు. ఇందులో భాగంగానే ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్‌తోపాటు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితలను అరెస్టుల పర్వం కొనసాగించిందని విమర్శించారు. మరోవైపు ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన బ్యాంక్ అక్కౌంట్లను సీజ్ చేసి ఎన్నికల్లో దెబ్బతీయాలని చూస్తున్నదని తెలిపారు. ఇలాంటి నిరంకుశ విధానాలను తిప్పికొట్టాలనీ, శనివారం జరిగే నిరసన కార్యక్రమాల్లో పాల్గొని జయప్రదం చేయాలని ప్రజలకు వారు విజ్ఞప్తి చేశారు.

భారత స్టార్టప్‌లకు పైసల కష్టాలు

(మొదటిపేజీ తరువాయి)

విదేశీ, స్వదేశీ పెట్టుబడి సంస్థల్లోని ఆరుగురు ఎగ్జిక్యూటివ్‌లు, ఇద్దరు సీఈఓలను ఇంటర్వ్యూ చేసింది. ప్రస్తుత ఏడాది జనవరి, ఫిబ్రవరిలో భారత స్టార్టప్‌లు 900 మిలియన్ డాలర్ల (రూ.7500 కోట్లు)ను సేకరించాయి. ఇది ఆరేండ్ల కనిష్ట స్థాయి కావడం గమనార్హం. కాగా 2023లో 8 బిలియన్ల (రూ.64వేల కోట్లు) నిధులు సమీకరించాయని వెంచర్ ఇంటెలిజెన్స్ డేటా చూపిస్తోంది. ఇది 2021లో సేకరించిన రికార్డు 36 బిలియన్లు లేదా 2022లో 24 బిలియన్లకు చాలా దూరంగా ఉంది. గతేడాది భారతీయ స్టార్టప్‌లకు మూడింట రెండు వంతుల నిధులు తగ్గాయని సీబీఇన్‌సైట్స్ డేటా వెల్లడించింది. అమెరికాలోని స్టార్టప్‌లలో 36 శాతం తగ్గుదలతో పోల్చితే భారత స్టార్టప్‌లు చాలా వెనుకబడి పోయాయి. ప్రస్తుత వాతావరణంలో స్టార్టప్‌ల్లో పెట్టుబడుల ద్వారా పెద్ద రాబడిని పొందగలమని తాను భావించడం లేదని కార్తిక్ రెడ్డి పేర్కొన్నారు.

పేటీఎం షేర్లు 80 శాతం మేర పడిపోవడం, ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ విలువ 22 బిలియన్ల నుంచి 2 బిలియన్ల దిగువకు పడిపోవడం భారత స్టార్టప్‌లపై సానుకూలాంశాలను దెబ్బతీశాయని నిపుణులు భావిస్తున్నారు. ఈ రంగంలో ఫండింగ్ తగ్గిపోవడంతో పాటు భారీగా ఉద్యోగాలు ఊడుతోన్న విషయం తెలిసిందే. స్టార్టప్‌లకు నిధుల మద్దతులో బీజేపీ ప్రభుత్వం సరైన విధానాన్ని అనుసరించకపోవడం, బడా కార్పొరేట్లకు కొమ్ము కాయడం వల్లే అవి ఒత్తిడిలోకి జారుకుంటున్నాయనే విమర్శలు పెరుగుతున్నాయి.

సిగరెట్టు ప్యాకెట్లలో డ్రగ్స్

(మొదటిపేజీ తరువాయి)

డ్రగ్స్ కంట్రోల్ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో సుమారు రూ.9 కోట్ల రూపాయల విలువ చేసే 90.48 కిలోల మేపిడ్రీన్ డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. పదేండ్ల నుంచి ఈ డ్రగ్‌ను తయారు చేసి విదేశాలకు తరలిస్తున్నట్టుగా అధికారుల పరిశీలనలో తేలింది. ఈ వ్యవహారానికి సూత్రధారులైన సత్యనారాయణ రెడ్డి, సుధాకర్ రెడ్డి, కస్తూరి రెడ్డిని డ్రగ్స్ కంట్రోల్ అధికారులు అరెస్టు చేశారు. సిగరెట్టు ప్యాకెట్లలో పెట్టి విదేశాలకు డ్రగ్స్‌ను తరలిస్తున్నట్టు గుర్తించారు. ఇందులో కొంత వరకు హైదరాబాద్ నగరంలో కూడా సప్లై అవుతున్నట్టు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు..

(మొదటిపేజీ తరువాయి)

డా చేయాలనే ఏకైక సంకల్పంతో కేంద్రంలోని బీజేపీ వ్యవహరి స్తోందని విమర్శించారు. ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టులు ఇదే విషయాన్ని రుజువు చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇందుకోసం ఈడీ, సీబీఐ, ఐటీ తదితర కేంద్ర దర్యాప్తు సంస్థలను మోడీ సర్కారు పావులుగా వాడుకుంటోందని విమర్శించారు.

బీఆర్ఎస్ అభ్యర్థుల ప్రకటన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

మరో రెండు లోక్‌సభ స్థానాలకు బీఆర్ఎస్ తన అభ్యర్థులను ప్రకటించింది. నాగర్ కర్నూల్ సీటుకు మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌ను, మెదక్‌కు మాజీ ఐఏఎస్ అధికారి, ఎమ్మెల్సీ పి.వెంకట్రామిరెడ్డి పేరును బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఖరారు చేసి, ప్రకటించారు.

మే 7 నుంచి ఎప్‌సెట్

(మొదటిపేజీ తరువాయి)

నిర్వహించాలని ఉన్నత విద్యామండలి తొలుత నిర్ణయించింది. మే 13న రాష్ట్రంలో పార్లమెంటు ఎన్నికల పోలింగ్ నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ప్రకటించింది. దీంతో ఎప్‌సెట్ రాతపరీక్షల తేదీలను ఉన్నత విద్యామండలి మార్చింది. మే ఏడు నుంచి 11వ తేదీ వరకు ఎప్‌సెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రి శుక్రవారం సవరణ షెడ్యూల్‌ను విడుదల చేశారు. మే ఏడు, ఎనిమిది తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం రాతపరీక్షలను, అదేనెల తొమ్మిది నుంచి 11 వరకు ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. జూన్ నాలుగు, ఐదు తేదీల్లో నిర్వహించే ఐసెట్ రాతపరీక్షల షెడ్యూల్‌లో మార్పులు చేశామని పేర్కొన్నారు. అదేనెల నాలుగున పార్లమెంటు ఎన్నికల ఫలితాలు విడుదల అవుతున్నందున జూన్ ఐదు, ఆరు తేదీల్లో ఐసెట్ రాతపరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు.

ఎప్‌సెట్, ఐసెట్ రాతపరీక్షల షెడ్యూల్

సెట్	పాత తేదీలు	కొత్త తేదీలు
ఎప్‌సెట్	మే 9 నుంచి 12 వరకు	మే 7 నుంచి 11 వరకు
	మే 9, 10 తేదీల్లో ఇంజినీరింగ్	మే 7,8 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ
	మే 11,12 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మసీ	మే 9 నుంచి 11 వరకు ఇంజినీరింగ్
ఐసెట్	జూన్ 4,5 తేదీల్లో	జూన్ 5,6 తేదీల్లో

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అమరుల దినోత్సవాన్ని నేడు సేవ్ డెమోక్రసీ డేగా పాటిద్దాం

- సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం సేవ్ డెమోక్రసీ డేగా పాటిద్దామని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కేఎం) పిలుపునిచ్చింది. ఈ మేరకు ఎస్‌కేఎం రాష్ట్ర కన్వీనర్లు టి సాగర్, పశ్య పద్మ వి ప్రభాకర్, మండల వెంకన్న మామిడాల బిక్షపతి, కొండల్, పెద్దారపు రమేష్, జక్కుల వెంకటయ్య ప్రమీల, నాగిరెడ్డి, బాలమల్లేష్, ఆర్ వెంకట్రాములు, రామకృష్ణ, గోనె కుమారస్వామి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

ప్రతిపక్షాలే లక్ష్యంగా...

(మొదటిపేజీ తరువాయి)

కొనసాగిస్తున్నది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసు ఇందులో భాగమేనని విశ్లేషకులు చెప్తున్నారు. ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆప్ అధినేత కేజ్రీవాల్, ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, తెలంగాణ ఎమ్మెల్సీ కవితలు ఈ కేసులో అరెస్టైన విషయం విదితమే. ఇప్పుడు ఈ అంశం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. కేజ్రీవాల్, కవితల అరెస్టులతో ఢిల్లీ, తెలంగాణల్లోనే కాకుండా యావత్ దేశంలో రాజకీయంగా ప్రయోజనం పొందొచ్చనీ, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ఇది ప్రచారాస్త్రంగా మలుచుకోవచ్చని బీజేపీ భావించింది. అయితే, ఈ అంశం కాషాయపార్టీకి రివర్స్‌ఫైర్ అయ్యే అవకాశం ఉన్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ప్రతిపక్షం బలంగా లేకపోవటంతో..

భారత్ వంటి అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రతిపక్షం అత్యంత కీలకమైనది. గత రెండు దఫాల ఎన్డీయే పాలనలో ప్రధాన ప్రతిపక్షం బలంగా లేదు. ప్రతిపక్ష స్థానానికి కావాల్సిన సీట్లను సైతం కాంగ్రెస్ గెలవలేకపోయింది. ఇక లోక్‌సభలో తమకు ఉన్న బలం చూసుకొని బీజేపీ రెచ్చిపోయిందనీ, అనేక ప్రజా వ్యతిరేక, మత విద్వేష బిల్లులను తీసుకొచ్చి చట్టాలుగా మార్చిందని రాజకీయ విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు.

టార్గెట్ 'ఇండియా' కూటమి

రాబోయే ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా 'ఇండియా' కూటమి ఏర్పడింది. కాంగ్రెస్, ఆప్, డీఎంకే, సీపీఐ(ఎం), సీపీఐ, జేడీ(యూ), జేఎంఎం ఎన్సీపీలు అందులో కీలకంగా ఉన్నాయి. అయితే, బీహార్‌లో జేడీ(యూ)ను దూరం చేసి.. నితీశ్‌కి మద్దతు పలికిన బీజేపీ అక్కడ సంకీర్ణ ప్రభుత్వానికి బీజం వేసింది. ఇటు మహారాష్ట్రలోని కీలక ఎన్సీపీ పార్టీలో కాషాయపార్టీ చీలిక తెచ్చింది. జార్ఖండ్ సీఎం, జేఎంఎం నాయకుడు హేమంత్ సొరెన్‌ను ఇదే ఈడీ అరెస్ట్ చేసింది. ఇక ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ఆప్‌పై కన్నేసిన బీజేపీ.. ఈడీ సహాయంతో కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేయించగలిగింది. అయితే, కేజ్రీవాల్ అరెస్ట్‌పై దేశ ప్రజల నుంచి బీజేపీ ఆశించిన స్పందన రాకపోగా.. బీజేపీ వ్యవహార శైలిపై తీవ్ర అసంతృప్తిని తెప్పిస్తున్నదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

ఎలక్టోరల్ బాండ్ల నుంచి దృష్టి మరల్చేందుకే..

బీజేపీకి విరాళాలిచ్చిన 487 మందిలో మొదటి 10 మంది విరాళాలు దాదాపు రూ. 2,119 కోట్లుగా ఉన్నాయి. బాండ్ కొనుగోళ్లలో ఎక్కువ వాటా పెద్ద ప్రయివేట్ దాతల నుంచే ఉన్నాయి. ఎలక్టోరల్ బాండ్ల సమస్యను ఇప్పటివరకు సుప్రీంకోర్టు పరిష్కరించిన విధానం, దాని నుంచి ప్రజల దృష్టిని మరల్చటానికి బీజేపీ ప్రయత్నించిందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఇందులో భాగంగా, అవినీతికి వ్యతిరేకంగా తాము పోరాడుతున్నామనే ఆలోచన కలిపించే ప్రయత్నంలో భాగంగా ప్రతిపక్షాలకు వ్యతిరేకంగా దర్యాప్తు సంస్థలను, ముఖ్యంగా ఈడీని మోడీ సర్కారు ఆయుధంగా వాడుతున్నదని వారు అంటున్నారు.

బీజేపీ పాలనలో పెరిగిన ఈడీ దాడులు

2005-2014 మధ్య, యూపీఏ హయాంలో ఈడీ దాదాపు 112 సోదాలు నిర్వహించింది. 104 ఫిర్యాదులను కలిగి ఉన్నది. అయితే 2015-2022 మధ్య, బీజేపీ ప్రభుత్వ హయాంలో ఈడీ సోదాలు 3010 కాగా.. 888 వరకు ఫిర్యాదులు ఉన్నాయి. కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నాయకులపై 100కు పైగా సోదాలు జరిగాయి. బీజేపీ, ఇతర పార్టీల నుంచి ఆ పార్టీలోకి వెళ్లిన నాయకులు, దాని మిత్రపక్షాలపై వచ్చిన ఆరోపణలను మాత్రం ఈడీ పట్టించుకోకపోవటం గమనార్హం. ఈడీ ద్వారా మొత్తం కేసుల్లో 95 శాతం ప్రతిపక్ష నాయకులపై నమోదు చేయబడ్డాయని రాజకీయ విశ్లేషకులు కొన్ని గణాంకాలను ఉదహరిస్తున్నారు.

కేవలం రాజకీయ ప్రత్యర్థుల మీద మాత్రమే కాదు.. అన్ని రకాల విమర్శకులపైనా కేంద్ర ఏజెన్సీ సంస్థలు విరుచుకుపడుతున్నాయి. ఫ్యాక్ట్‌చెక్ వెబ్‌సైట్ ఆల్ట్ న్యూస్ సహ వ్యవస్థాపకుడు మహ్మద్ జుబైర్‌ను సుప్రీంకోర్టు విడుదల చేయటానికి ముందు మోడీ సర్కారు ఆయనను జైలుకు వెళ్లేలా చేసిందనీ, బీబీసీ, భాస్కర్ మీడియా గ్రూప్‌లపై ఐటీ శాఖ దాడులు చేసిందని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అలాగే, గతేడాది ఆక్స్‌ఫామ్ ఇండియా, ఇండిపెండెంట్ అండ్ పబ్లిక్-స్పిరిటెడ్ మీడియా ఫౌండేషన్, సెంటర్ ఫర్ పాలసీ రీసెర్చ్ కార్యాలయాలపై ఐటీ అధికారులు దాడులు చేశారు. ఎన్జీవోలు, మరికొన్ని పరిశోధన థింక్ ట్యాంక్‌లకు విదేశీ నిధులు అందకుండా ఎఫ్‌సీఆర్ఏ, 2010 లైసెన్సులను మోడీ సర్కారు రద్దు చేసిందని విశ్లేషకులు, మేధావులు, సామాజికవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మోడీ జేబు సంస్థగా ఈడీ

(మొదటిపేజీ తరువాయి)


ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును ఖండించారు. "ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును మేము చాలా తీవ్రంగా ఖండిస్తున్నాము. ఇది చట్టవిరుద్ధమైన చర్య. ఇది పూర్తిగా రాబోయే ఎన్నికల రాజకీయాలచే ప్రేరేపించబడింది. ప్రతిపక్షాలను వేటాడేందుకు అధికార పార్టీ చాలా స్పష్టంగా ఈడీని ఒక అస్త్రంగా ఉపయోగిస్తోంది. ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడంతో, ప్రతిపక్ష నాయకులను వేధించడంతో ప్రతిపక్షాన్ని బలహీనపరచాలని కుట్ర పన్నుతుంది" అని అన్నారు."ఎన్నికల షెడ్యూల్ విడుదల అయింది. ఎన్నికల ప్రచార సమయంలో ముఖ్యమంత్రులను అరెస్టు చేస్తున్నారు. ఇది పూర్తిగా ఆమోదయోగ్యం కాదు. మా పార్టీ కూడా దీనికి వ్యతిరేకంగా నిరసన తెలుపుతోంది. మేమూ ఆప్ నిరసనలో పాల్గొంటాం. అరెస్టును వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము" అని ఆమె అన్నారు. కేజ్రీవాల్ కుటుంబాన్ని ఎవరినీ కలవడానివ్వకపోవడం "అసంబద్ధం, చట్టవిరుద్ధం" అని పేర్కొన్నారు.ఎలక్టోరల్ బాండ్లపై స్పందించిన బృందా కరత్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) డేటాను ముందుగానే విడుదల చేసి ఉండేదని, "అత్యంత అవినీతిమయమైన వ్యవస్థ"ని అమల్లోకి తెచ్చినందుకు బీజేపీని నిందించారని విమర్శించారు. "మేము చేయలేము. మాకు మరో మూడు నెలలు కావాలి అని సుప్రీంకోర్టును మోసం చేయడానికి ప్రభుత్వం, పాలక పక్షం సిగ్గులేని ప్రయత్నాలు పూర్తిగా తప్పుదోవ పట్టించే అబద్ధమని తేలింది" అని అన్నారు. "డేటా అంతా అయిపోయింది, అంటే ఎస్‌బీఐ వద్ద ఈ డేటా అంతా ఉంది. ఫిబ్రవరిలో కోర్టు మొదటి ఆర్డర్ ఇచ్చినప్పుడు వారు మూడు నెలల క్రితమే దీన్ని చేయగలరు" అని కరత్ అన్నారు. "బీజేపీ ప్రభుత్వ అత్యంత సందేహాస్పద లావాదేవీలను బహిర్గతం చేసిన తరువాత, క్విడ్ ప్రోకో, అవినీతికి పాల్పడిన, దాడులు చేసిన కంపెనీల నుంచి విరాళాలు తీసుకోవడం, ఆపై ఆ కేసులను స్తంభింపజేయడం, కేవలం ఈసిని డబ్బు సంపాదించడానికి ఒక సాధనంగా ఎలా ఉపయోగించబడుతుందో స్పష్టం చేస్తుంది" అని ఆమె అన్నారు. "కంపెనీలు పార్టీలకు, ప్రధానంగా అధికార పార్టీకి డబ్బులిచ్చాయి. ఇదో రకం దోపిడీ. ఉదాహరణకు, మైనింగ్ కంపెనీలు ఆదివాసీల గురించి పట్టించుకోవడం లేదు. ఇప్పుడు మైనింగ్ కంపెనీలు ఈజీగా చెప్పుకునేలా కోట్లాది రూపాయలు చెల్లించినట్లు తెలిసింది. ఇదే మోడీ ప్రభుత్వ వ్యాపార విధానం" అని ఆమె విమర్శించారు. బీజేపీ నాయకత్వంలో ప్రజాస్వామ్యాన్ని తారుమారు చేసే అత్యంత అవినీతి వ్యవస్థ అమల్లోకి వచ్చిందని కరత్ అన్నారు. "ఆలస్యమైనప్పటికీ సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవడం మాకు సంతోషంగా ఉంది" అని అన్నారు.

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ కింగ్స్ X ఢిల్లీ క్యాపిటల్స్
వేదిక : ముల్లాపూర్
సమయం : మ॥ 3.30

కోల్‌కత X హైదరాబాద్
వేదిక : ఈడెన్‌గార్డెన్స్
సమయం : రా॥ 7.30
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..





సన్‌రైజర్స్‌కు తొలి సవాల్

• హైదరాబాద్, కోల్‌కత ఢీ నేడు

కోల్‌కత : 2023 డిసెంబర్, ఐపీఎల్ ఆటగాళ్ల వేలం. ఆసీస్ స్పీడ్‌స్టర్ పాట్ కమిన్స్ రికార్డు స్థాయిలో రూ.20.5 కోట్ల ధరకు సన్‌రైజర్స్ గూటికి చేరాడు. ఆ రికార్డు ఎంతోసేపు నిలువలేదు. రెండు గంటల్లోనే ఆసీస్‌కే చెందిన మరో పేసర్ మిచెల్ స్టార్క్ బద్దలు కొట్టాడు. రూ.24.75 రికార్డు ధరతో స్టార్క్‌ను నైట్‌రైడర్స్ దక్కించుకుంది. ఇప్పుడు ఐపీఎల్ 17 సీజన్ తమ తొలి మ్యాచ్‌లోనే మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్ ముఖాముఖి ఫైట్‌కు సిద్ధమయ్యారు. ఐపీఎల్ వేలంలో రికార్డు ధర సొంతం చేసుకున్న ఈ ఆటగాళ్లు తొలి మ్యాచ్‌లో జట్టుకు ఏ విధంగా విజయాన్ని అందిస్తారో చూడాలి. కోల్‌కత నైట్‌రైడర్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ గత సీజన్‌లో ఆశించిన ఫలితాలు సాధించలేదు. ప్రధానంగా ఇరు జట్లకు ఓ బలమైన నాయకత్వం కొరవడింది. పాట్ కమిన్స్ సారథ్యంలో సన్‌రైజర్స్ విజయంతో వేట మొదలెట్టేందుకు చూస్తుండగా.. గౌతం గంభీర్ శిక్షణ సారథ్యంలో నైట్‌రైడర్స్ సైతం సానుకూల ఆరంభంపై కన్నేసింది. హైదరాబాద్, కోల్‌కత మ్యాచ్ నేడు రాత్రి 7.30 గంటలకు ఆరంభం కానుంది. ఆ నలుగురు ఎవరు? : సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు విదేశీ ఆటగాళ్ల ఎంపిక కత్తిమీద సాము కానుంది. గత సీజన్ కెప్టెన్, ఎస్ఏ20లో సన్‌రైజర్స్ విజయసారథి ఎడెన్ మార్క్‌రామ్ ఈ సీజన్‌లో తుది జట్టులో నిలిచేది అనుమానంగా మారింది. పాట్ కమిన్స్, డ్యాషింగ్ ఓపెనర్ ట్రావిశ్ హెడ్ ఇద్దరు ఖాయం. హెన్రిచ్ క్లాసెన్, గ్లెన్ ఫిలిప్స్, ఎడెన్ మార్క్‌రామ్, మార్కో జాన్సెన్, వానిందు హసరంగ మిగతా రెండు స్థానాలకు పోటీపడుతున్నారు. స్వదేశీ ఆటగాళ్లలో బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో మెరుగైన ప్రదర్శన ఎవరు చేస్తున్నారనే అంశంలో నాయకత్వం ఓ అంచనాకు వస్తే.. అప్పుడు విదేశీ బ్యాటర్లు, బౌలర్లలో ఎవరిని ఎంచుకోవాలనే సందిగ్ధతకు తెరపడే అవకాశం ఉంది. సహజంగానే స్పిన్‌కు అనుకూలించే ఐపీఎల్ పిచ్‌లపై వానిందు హసరంగను వదిలేసి సన్‌రైజర్స్ బరిలోకి దిగుతుందా అనేది ఆసక్తికరంగా మారింది.

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 17వ సీజన్ ఆరంభ మ్యాచ్‌లో డిఫెండింగ్ చాంపియన్ చెన్నై సూపర్‌కింగ్స్ బోణీ కొట్టింది. ఆరంభ మ్యాచ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై సాధికారిక విజయం నమోదు చేసింది. తొలుత ముస్తాఫిజుర్ రెహమాన్ (4/29) బంతితో నిప్పులు చెరుగగా.. ఛేదనలో బ్యాటర్లు సమిష్టిగా కదం తొక్కారు. 174 పరుగుల లక్ష్యాన్ని 18.4 ఓవర్లలోనే ఊదేసిన సూపర్‌కింగ్స్ 6 వికెట్ల తేడాతో గెలుపొందింది. అనుజ్ రావత్ (48), దినేశ్ కార్తీక్ (38) మెరుపులతో తొలుత రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 173 పరుగులు చేసింది. ఇక ఐపీఎల్ ఆరంభ వేడుక అభిమానులను అలరించింది. ఏఆర్ రెహమాన్ బాణీలు, అక్షయ్ కుమార్, టైగర్ ష్రాఫ్ నృత్య ప్రదర్శనలతో చెపాక్ స్టేడియం హోరెత్తింది.




సూపర్‌కింగ్స్ బోణీ

- ముస్తాఫిజుర్ 4 వికెట్ల జోరు
- రాణించిన రచిన్, జడేజా, దూబె

తొలి మ్యాచ్‌లో బెంగళూర్‌పై గెలుపు

నవతెలంగాణ-చెన్నై

చెన్నై సూపర్‌కింగ్స్ బోణీ కొట్టింది. ఐపీఎల్ 17 సీజన్ ఆరంభ మ్యాచ్‌లో అదిరే విజయం సాధించింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌పై 6 వికెట్ల తేడాతో గెలుపొందిన డిఫెండింగ్ చాంపియన్ చెపాక్‌లో సూపర్ షో చేసింది. 174 పరుగుల ఛేదనలో సూపర్‌కింగ్స్ బ్యాటర్లు సమిష్టిగా రాణించారు. అరంగేట్ర బ్యాటర్ రచిన్ రవీంద్ర (37, 15 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్స్‌లు) ధనాధన్ ఆరంభం అందించాడు. అజింక్య రహానె (27, 19 బంతుల్లో 2 సిక్స్‌లు), కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ (15, 15 బంతుల్లో 3 ఫోర్లు), డార్లీ మిచెల్ (22, 18 బంతుల్లో 2 సిక్స్‌లు) సమయోచిత ఇన్నింగ్స్‌లతో మెరిశారు. ఇంపాక్ట్ ఆటగాడు శివం దూబె (34 నాటౌట్, 28 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్)) ఆరంభంలో నెమ్మదిగా ఆడినా ఆఖర్లో జోరందుకున్నాడు. రవీంద్ర జడేజా (25 నాటౌట్, 17 బంతుల్లో 1 సిక్స్) తోడుగా ఛేదనను అలవోకగా ముగించాడు. అంతకుముందు తొలుత బ్యాటింగ్ చేసిన రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 173 పరుగులు చేసింది. యువ బ్యాటర్ అనుజ్ రావత్ (48, 25 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), దినేశ్ కార్తీక్ (38 నాటౌట్, 26 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) సూపర్ భాగస్వామ్యంతో బెంగళూర్‌కు మంచి స్కోరు అందించారు. ముస్తాఫిజుర్ రెహమాన్ (4/29) దెబ్బకు 78/5తో కష్టాల్లో కూరుకున్న ఆర్సీబీని రావత్, కార్తీక్ జోడీ 50 బంతుల్లో 95 పరుగుల భాగస్వామ్యంతో నిలబెట్టింది.



ఆదుకున్న రావత్ :

టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న బెంగళూర్‌కు ఓపెనర్లు శు భారంభం అందించారు. కెప్టెన్ డుప్లెసిస్ (35, 23 బంతుల్లో 8 ఫోర్లు), విరాట్ కోహ్లి (21) తొలి వికెట్‌కు 41 పరుగులు జోడించారు. కానీ ముస్తాఫిజుర్ వరుస వికెట్లతో బెంగళూర్‌ను వణికించాడు. ఇన్నింగ్స్ ఐదో ఓవర్లో డుప్లెసిస్, రజత్ పాటిదార్ (0)ను అవుట్ చేసి గట్టి దెబ్బ కొట్టాడు. గ్లెన్ మాక్స్‌వెల్ (0) డకౌట్‌తో ఆర్సీబీ శిబిరం ఢీలా పడింది. ఈ దశలో కోహ్లి, కామెరూన్ గ్రీన్ (18, 22 బంతుల్లో 1 ఫోర్) ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఇన్నింగ్స్ 12వ ఓవర్లో ముస్తాఫిజుర్ మళ్లీ పంజా విసిరాడు. కోహ్లి, గ్రీన్‌లను డగౌట్‌కు చేర్చాడు. 78/5తో కష్టాల్లో కూరుకున్న బెంగళూర్ 100 పరుగులు చేయటం కష్టమే అనిపించింది. ఈ దశలో అనుజ్ రావత్ (48), దినేశ్ కార్తీక్ (38 నాటౌట్) బెంగళూర్‌ను ఆదుకున్నారు. ఈ జోడీ 50 బంతుల్లోనే 95 పరుగులు జోడించారు. చివరి ఐదు ఓవర్లలో ఏకంగా 71 పరుగులు పిండుకున్నారు. తుషార్ దేశ్‌పాండే వేసిన ఇన్నింగ్స్ 18వ ఓవర్లో అనుజ్ రావత్ విశ్వరూపం చూపించాడు. మూడు సిక్సర్లు, ఓ ఫోర్ సహా ఆ ఓవర్లో 25 పరుగులు పిండుకున్నాడు. దీంతో ఆర్సీబీ 173 పరుగులు చేసింది.

సంక్షిప్త స్కోరు వివరాలు :

రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ : 173/6 (రావత్ 48, కార్తీక్ 38, ముస్తాఫిజుర్ 4/29, చాహర్ 1/37)

చెన్నై సూపర్ కింగ్స్ : 176/4 (రచిన్ రవీంద్ర 38, శివం దూబె 34, రహానె 27, కామెరూన్ గ్రీన్ 2/27)

పంత్ పునరాగమనం

నేడు పంజాబ్‌తో ఢిల్లీ ఢీ

చండీగఢ్ : 2024, మార్చి 23. భారత స్టార్ క్రికెటర్ రిషబ్ పంత్ కెరీర్‌లో గుర్తుండిపోయే రోజు!. తీవ్ర రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిన రిషబ్ పంత్ సుమారు 15 నెలలు కఠిన రిహాబిలిటేషన్ అనంతరం తిరిగి క్రికెట్ మైదానంలోకి అడుగుపెడుతున్నాడు. డిసెంబర్ 2022 కారు ప్రమాదం తర్వాత రిషబ్ పంత్ ఆడుతున్న తొలి మ్యాచ్ ఇదే కానుంది. ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న రిషబ్ పంత్.. తొలి మ్యాచ్‌ను పంజాబ్ కింగ్స్‌తో ఆడనున్నాడు. రిషబ్ పంత్ పునరాగమనానికి సరికొత్త స్టేడియం ముల్లాపూర్‌లో సిద్ధమైంది. మహారాజ యాదవీంద్ర సింగ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం తొలిసారి ఐపీఎల్ మ్యాచ్‌కు వేదిక కానుంది. సుమారు 40 ఎకరాల సువిశాల ప్రదేశంలో అత్యాధునిక సౌకర్యాలతో పంజాబ్ క్రికెట్ సంఘం (పీసీఏ) ఈ స్టేడియాన్ని నిర్మించింది. ఈ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ ఏడు హోమ్ మ్యాచుల్లో ఐదు ఇక్కడే జరుగనున్నాయి. పంజాబ్, ఢిల్లీ మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు ఆరంభం కానుంది.





భారత్‌కు కఠిన డ్రా

థామస్, ఉబెర్ కప్ డ్రా విడుదల

చెంగ్డూ (చైనా) : ప్రతిష్టాత్మక థామస్, ఉబెర్ కప్‌లో టీమ్ ఇండియాకు కఠిన డ్రా ఎదురైంది. థామస్ కప్ డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగుతున్న భారత మెన్స్ జట్టు బలమైన ఇండోనేషియాతో కలిసి గ్రూప్ దశలో పోటీపడుతుండగా.. మహిళల టీమ్ అగ్రజట్టు చైనాతో కలిసి గ్రూప్ దశలో తలపడనుంది. థామస్, ఉబెర్ కప్ ఏప్రిల్ 27 నుంచి మే 5 వరకు చైనాలోని చెంగ్డూ వేదికగా జరుగుతాయి. ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బిడబ్ల్యూఎఫ్)తో కలిసి నిర్వాహకులు శుక్రవారం డ్రా విడుదల చేశారు. థామస్ కప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత్ సహా 14 సార్లు విజేత ఇండోనేషియా ఒకే గ్రూప్‌లో ఉన్నాయి. థాయ్‌లాండ్, ఇంగ్లాండ్‌తో కలిసి భారత్, ఇండోనేషియా గ్రూప్-సిలో చోటుచేసుకున్నాయి. 2022 థామస్ కప్ ఫైనల్లో ఇండోనేషియాపై విజయంతోనే భారత్ విజేతగా అవతరించిన సంగతి తెలిసిందే. ఇక ఉబెర్ కప్‌లో సైతం భారత జట్టుకు కఠిన డ్రా ఎదురైంది. గ్రూప్-ఏలో అగ్రజట్టు, 15సార్లు విజేత చైనాతో పాటు భారత్ ఆడనుంది. కెనడా, సింగపూర్ సైతం గ్రూప్-ఏలో చోటుచేసుకున్నాయి. ఉబెర్ కప్‌లో భారత మహిళల జట్టు 1957, 2014, 2016లో సెమీఫైనల్స్‌కు చేరుకుంది. ఇదే మహిళల జట్టుకు ఈ టోర్నీలో అత్యుత్తమ రికార్డు.

థామస్ కప్ డ్రా

గ్రూప్-ఏ : చైనా, దక్షిణ కొరియా, కెనడా, ఆస్ట్రేలియా
గ్రూప్-బి : జపాన్, చైనీస్ తైపీ, జర్మనీ, చెచెన్యా
గ్రూప్-సి : ఇండోనేషియా, భారత్, థాయ్‌లాండ్, ఇంగ్లాండ్
గ్రూప్-డి : డెన్మార్క్, మలేషియా, హాంగ్‌కాంగ్, అల్జీరియా.

ఉబెర్ కప్ డ్రా

గ్రూప్-ఏ : భారత్, చైనా, కెనడా, సింగపూర్
గ్రూప్-బి : థాయ్‌లాండ్, చైనీస్ తైపీ, మలేషియా, ఆస్ట్రేలియా
గ్రూప్-సి : జపాన్, ఇండోనేషియా, హాంగ్‌కాంగ్, ఉగాండ
గ్రూప్-డి : దక్షిణ కొరియా, డెన్మార్క్ యుఎస్ఏ, మెక్సికో

ట్రెసా, గాయత్రి ఓటమి


స్విస్ ఓపెన్ బ్యాడ్మింటన్



బసెల్ (స్విట్జర్లాండ్) : ఇటీవల ఆకట్టుకునే ప్రదర్శన చేస్తున్న భారత డబుల్స్ జోడీ ట్రెసా జాలి, పుల్లెల గాయత్రి స్విస్ ఓపెన్ నుంచి నిష్క్రమించారు. స్ఫూర్తిదాయక ప్రదర్శనతో క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న ఎనిమిదో సీడ్ అమ్మాయిలు.. సెమీస్ దారిలో ఆస్ట్రేలియా షట్లర్లు మపాస, ఎంజెలా జంట చేతిలో వరుస గేముల్లో ఓటమి చెందారు. 35 నిమిషాల పాటు సాగిన మహిళల డబుల్స్ క్వార్టర్‌ఫైనల్లో ట్రెసా, గాయత్రి జోడీయ 14-21, 15-21తో నిరాశపరిచారు. తొలి గేమ్‌లో 6-6 వరకు పోటీ ఇచ్చిన మన అమ్మాయిలు ఆ తర్వాత అంచనాలను అందుకోలేదు. ఇక రెండో గేమ్‌లో ఆది నుంచి వెనుకంజలోనే నిలిచారు. వరుస గేముల్లో సెమీఫైనల్ బెర్త్ చేజార్చుకుని టోర్నీ నుంచి నిష్క్రమించారు. మహిళల సింగిల్స్‌లో స్టార్ షట్లర్, నాల్గో సీడ్ పి.వి సింధు ప్రీ క్వార్టర్‌ఫైనల్లోనే ఓటమి పాలైన సంగతి తెలిసిందే. జపాన్ షట్లర్ తొమోక చేతిలో 21-16, 19-21, 16-21తో మూడు గేముల మ్యాచ్‌లో సింధు పోరాడి ఓడింది. మిక్స్‌డ్ డబుల్స్ ప్రీ క్వార్టర్స్‌లో సిక్కి రెడ్డి, సుమీత్ రెడ్డి జంట సైతం 11-21, 14-21తో నెదర్లాండ్స్ జోడీ చేతిలో పరాజయం పాలయ్యారు.

నవచిత్రం

టిల్లు స్క్వేర్ రిలీజ్‌కి రెడీ



సిద్ధు జొన్నలగడ్డ

'డీజే టిల్లు' చిత్రంతో 'టిల్లు'గా ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు సిద్ధు జొన్నలగడ్డ. ఈ చిత్రం యువత, సినీ ప్రియుల్లో కల్ట్ ఫాలోయింగ్‌ను సంపాదించుకుంది. దాంతో ఈ చిత్రానికి సీక్వెల్‌గా వస్తున్న 'టిల్లు స్క్వేర్' కోసం అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రకటనతోనే ఈ సీక్వెల్ పై భారీ అంచనాలు ఏర్పడ్డాయి. 'రాధిక', 'టికెటే కొనకుండా', 'ఓ మై లిల్లీ' పాటలతో పాటు ఇతర ప్రచార చిత్రాలు విడుదలై సినిమాపై అంచనాలను ఆకాశాన్నంటేలా చేశాయి.

తాజాగా ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలను పూర్తి చేసుకుంది. దీంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచారు మేకర్స్. సినిమా చూసిన తర్వాత సెన్సార్ సభ్యులు ఆద్యంతం వినోదభరితంగా ఉండే చిత్రాన్ని అందించడానికి చిత్ర బృందం చేసిన ప్రయత్నాన్ని మెచ్చుకున్నారు. ముఖ్యంగా టిల్లు పాత్ర, అతను పలికే సంభాషణలు వారిని ఎంతగానో అలరించాయి. సెన్సార్ బోర్డు ఈ చిత్రానికి 'యు/ఏ' సర్టిఫికేట్ ఇచ్చింది. 'టిల్లు స్క్వేర్' చిత్రం 'డీజే టిల్లు'ను మించిన విజయాన్ని సాధిస్తుందని మేకర్స్ ఎంతో నమ్మకంగా ఉన్నారు. టిల్లు అభిమానులతో పాటు అన్ని వర్గాల ప్రేక్షకులు మెచ్చేలా వినోదభరితంగా ఈ చిత్రాన్ని రూపొందించామని పేర్కొన్నారు.

ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటించింది. ఆమె తన కెరీర్‌లో తొలిసారిగా లిల్లీ అనే బోల్డ్ క్యారెక్టర్‌ను పోషించింది. సిద్ధు జొన్నలగడ్డ ఈ చిత్రానికి కథనం, సంభాషణలు అందించగా, మల్లిక్ రామ్ దర్శకత్వం వహించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై సూర్యదేవర నాగవంశీ ఈ చిత్రాన్ని నిర్మించారు. నవీన్ నూలి ఈ చిత్రానికి ఎడిటర్‌గా వ్యవహరించారు. ఈ డబుల్ ధమాకా ఎంటర్‌టైనర్ టిల్లూ స్క్వేర్ ఈనెల 29న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.

గోవాలో దేవర పాట




రాజు సుందరం, కొరటాల శివ, ఎన్టీఆర్

ఎన్టీఆర్, కొరటాల శివ కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ బడ్జెట్ పాన్ ఇండియా మూవీ 'దేవర' పార్ట్ 1. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తోంది. బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ కీలక పాత్రలో నటిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతున్న ఈ చిత్రం మొదటి భాగాన్ని తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో దసరా సందర్భంగా అక్టోబర్ 10న ప్రపంచ వ్యాప్తంగా భారీ ఎత్తున రిలీజ్ చేస్తున్నారు. రీసెంట్‌గా ఈ మూవీ కొత్త షెడ్యూల్ గోవాలో ప్రారంభమైంది. ఇప్పటికే అక్కడ చిత్రీకరణను చేసిన సంగతి తెలిసిందే. ఈ సినిమా నుంచి వస్తోన్న అప్‌డేట్స్‌తో రోజు రోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మేకర్స్ మరో ఆసక్తికరమైన అప్ డేట్‌తో అందర్నీ సర్‌ప్రైజ్ చేయడంతోపాటు ఈ సినిమా నుంచి వర్కింగ్ స్టిల్స్ విడుదల చేశారు. ఇందులో ఎన్టీఆర్‌తో పాటు దర్శకుడు కొరటాల శివ, రాజు సుందరం మాస్టర్ సరికొత్త లుక్‌తో కనిపిస్తున్నారు. రాజు సుందరం కొరియోగ్రఫీలో ఈ చిత్రానికి సంబంధించిన మాంటేజ్ సాంగ్ చిత్రీకరణ గోవాలో జరుగుతుంది. ఎన్టీఆర్‌ను సరికొత్త పాత్రలో చూడటానికి ఆయన అభిమానులు, ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

నందమూరి కళ్యాణ్ రామ్ సమర్పణలో ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్స్‌పై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

మారుతీ నగర్‌లో ఫేమస్ అంటే నేనేలే...




రావు రమేష్

రావు రమేష్ కథానాయకుడిగా టైటిల్ రోల్ పోషించిన సినిమా 'మారుతీ నగర్ సుబ్రమణ్యం'. లక్ష్మణ్ కార్య దర్శకత్వం వహించారు. రావు రమేష్ సరసన ఇంద్రజ నటించారు. అంకిత్ కొయ్య, రమ్య పసుపులేటి, హర్షవర్ధన్ కీలక పాత్రధారులు.

పీబీఆర్ సినిమాస్, లోకమాత్రే సినిమాటిక్స్ సంస్థలపై ఈ సినిమా రూపొందుతోంది. బుజ్జి రాయుడు పెంట్యాల, మోహన్ కార్య నిర్మాతలు. ఇటీవల విడుదల చేసిన ఫస్ట్ లుక్ ఫెంటాస్టిక్ రెస్పాన్స్ అందుకుంది. ఇప్పటి వరకు సినిమా చరిత్రలో ఎవరూ చేయని విధంగా ప్రేక్షకులతో క్యూఆర్ కోడ్ స్కాన్ చేయించి, ఫస్ట్ లుక్ విడుదల చేసింది చిత్ర టీమ్. తాజాగా సినిమా టైటిల్ సాంగ్ విడుదల చేశారు. 'మారుతీ నగర్ లో ఫేమస్ అంటే నేనేలే...అందరూ ఇదే మాట అంటారులే..' అంటూ సాగిన ఈ గీతాన్ని సెన్సేషనల్ క్రేజీ సింగర్ రామ్ మిరియాల ఆలపించారు. కళ్యాణ్ నాయక్ అందించిన బాణీకి అందరూ పాడుకునేలా చక్కటి సాహిత్యం అందించారు భాస్కరభట్ల. లోధా మ్యూజిక్ యూట్యూబ్ ఛానల్‌లో సాంగ్ రిలీజ్ అయ్యింది. సినిమాలో రావు రమేష్ క్యారెక్టరైజేషన్ వివరిస్తూ సాగిందీ 'మారుతీ నగర్ సుబ్రమణ్యం' టైటిల్ సాంగ్. చుట్టుపక్కల ప్రజలు సలహాలు ఇచ్చినా పట్టించుకోనని, తనకు అదృష్టం తక్కువ ఉంది గానీ, త్వరలో మహారాజ యోగం పడుతుందని చెప్పే పాత్రలో హీరో కనిపించనున్నారు.

ఈ సందర్భంఆ దర్శక, నిర్మాతలు మాట్లాడుతూ, 'లుంగీలో రావు రమేష్ గారి లుక్ బావుందని వాట్సాప్, సోషల్ మీడియాలో ఎంతో మంది మెసేజెస్ చేశారు. ఆయన్ను చూస్తే నేటివ్ ఫీలింగ్ వచ్చిందన్నారు. సినిమా సైతం అలాగే ఉంటుంది. వినోదంతో పాటు మంచి కథ, భావోద్వేగాలు సైతం సినిమాలో ఉన్నాయి. త్వరలో ట్రైలర్, సినిమా విడుదల తేదీలు వెల్లడిస్తాం' అని చెప్పారు.

వాస్తవ కథతో ఆడు జీవితం



పృథ్వీరాజ్ సుకుమారన్ నటించిన 'ది గోట్ లైఫ్' (ఆడు జీవితం) సినిమా ఈ నెల 28న పాన్ ఇండియా స్థాయిలో మలయాళంతో పాటు హిందీ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమాను బెన్యామిన్ రాసిన గోట్ డేస్ నవల ఆధారంగా అవార్డ్ విన్నింగ్ డైరెక్టర్ బ్లెస్సీ రూపొందించారు. మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ఈ సినిమాను తెలుగు స్టేట్స్‌లో రిలీజ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఈ సినిమా ప్రీ రిలీజ్ ప్రెస్ మీట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో పృథ్వీరాజ్ సుకుమారన్, డైరెక్టర్ బ్లెస్సీ, హాలీవుడ్ యాక్టర్ జిమ్మీ జీన్ లూయిస్, మైత్రీ నుంచి నిర్మాత వై రవి శంకర్, శశి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ మాట్లాడుతూ, 'ఇటీవల వరదరాజ మన్నార్ అనే కింగ్ క్యారెక్టర్‌లో సలార్‌తో మీ ముందుకు వచ్చాను. ఇప్పుడు ఈ సినిమాతో నజీబ్ అనే స్లేవ్ క్యారెక్టర్‌తో తెరపైకి రాబోతున్నాను. వరదరాజ మన్నార్ పూర్తిగా ప్రశాంత్ నీల్ ఇమాజినేషన్. కానీ ఈ సినిమా వాస్తవంగా జరిగిన కథ. నజీబ్ మన మధ్యే సజీవంగా ఉన్నాడు. 90వ దశకంలో జీవనోపాధి కోసం గల్ఫ్ దేశాలకు వలస వెళ్లిన వ్యక్తి అతను. ఈ ప్రయాణంలో తను ఎదుర్కొన్న కష్టాలను వివరిస్తూ రాసిన పుస్తకమే గోట్ డేస్. తెలుగులో మైత్రీ మూవీ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. ఇది నా కెరీర్‌లో ఎంతో ముఖ్యమైన సినిమా అని రవికి మెసేజ్ పంపాను. ఆయన డన్ సార్ అంటూ రిప్లై ఇచ్చారు. తమిళంలో రెడ్ జయింట్, కన్నడలో హెూంబలే ఫిలింస్, నార్త్ లో నా ఫ్రెండ్ అనిల్ రిలీజ్ చేస్తున్నారు. రియల్ లైఫ్ ఇన్సిడెంట్స్ తో చేసిన సినిమా ఇది. సినిమా చూస్తున్న ప్రతి ఒక్కరూ ఆ ఎమోషన్స్ ఫీల్ అవుతారు. టెక్నికల్‌గా బ్రిలియంట్‌గా ఉంటుంది' అని అన్నారు.

'ఈ సినిమాను తెలుగులో ఈ నెల 28న రిలీజ్ చేస్తున్నాం. ఇలాంటి వండర్ ఫుల్ ఫిల్మ్‌ను మా సంస్థ నుంచి డిస్ట్రిబ్యూట్ చేస్తుండటం గర్వంగా ఉంది. కొత్త తరహా సినిమాలు కావాలని కోరుకునే వారికి సమాధానంగా ఈ సినిమాను చెప్పుకోవచ్చు. పృథ్వీరాజ్ సుకుమారన్ మల్టీ టాలెంటెడ్. మెగాస్టార్ తెలుగులో రీమేక్ చేసిన లూసిఫర్ సినిమాను మలయాళంలో ఆయన దర్శకత్వంలో రూపొందించారు. ఆయన నటించిన మరో గ్రేట్ ఫిల్మ్ ఇది. ఈ సినిమా తెలుగులో తప్పకుండా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది' అని నిర్మాత వై రవి శంకర్ చెప్పారు.

మా జీవితాలను మార్చిన సినిమా



ఎస్‌కెఎన్, మారుతి, శ్రేయాస్ శ్రీనివాస్

ఇప్పుడు రీ రిలీజ్ ట్రెండ్ నడుస్తోంది. ఆ కోవలోనే 2012, మార్చి 23న విడుదలై యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ కుర్రకారుని ఆకట్టుకుని సంచలన విజయం సాధించిన చిత్రం ఈ రోజుల్లో చిత్రాన్ని మళ్లీ విడుదల చేస్తున్నారు మేకర్స్.

సినిమా విడుదలైన 12 సంవత్సరాలకు మళ్లీ అదే రోజు అంటే మార్చి 23నే ఈ చిత్రం రీరిలీజ్ కావడం విశేషం. ఎన్నో సంచలనాలకు తెరలేపిన ట్రెండ్‌సెట్టర్ ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌ను మళ్లీ చూడాలని అందరూ కోరుకుంటున్నారు. గుడ్ సినిమా గ్రూప్ బ్యానర్ పై క్రియేటివ్ దర్శకుడు మారుతీ డైరెక్షన్లో వచ్చిన సినిమా 'ఈ రోజుల్లో'. శ్రీనివాస్, రేష్మ ముఖ్య పాత్రల్లో నటించిన ఈ సినిమాకి జేబి సంగీతం అందించాడు. ఎస్‌కేఎన్, శ్రేయాస్ శ్రీనివాస్ ఈ సినిమాను నిర్మించారు. ఈ చిత్రం రేపు విడుదల కానున్న సందర్భంగా పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మారుతి, ఎస్‌కెఎన్, శ్రేయాస్ శ్రీనివాస్ మాట్లాడుతూ, 'చాలా చిన్న బడ్జెట్‌తో సరదాగా చేసిన సినిమా ఇది. మా జీవితాలను మార్చిన సినిమా ఇది. గత 12 సంవత్సరలుగా మా ముగ్గురి జర్నీ కూడా ఎంతో సక్సెస్‌ఫుల్‌గా కంటిన్యూ అవుతోంది. ఈ సినిమా చాలా మందికి స్ఫూర్తినిచ్చింది. అందుకే ఈ చిత్రాన్ని మళ్లీ విడుదల చేస్తున్నాం' అని తెలిపారు.

కుటుంబ బంధాల నేపథ్యంలో..

సుహాస్, కార్తీక్‌రత్నం, రుహానిశర్మ, విరాజ్ అశ్విన్ ముఖ్యతారలుగా రూపొందుతున్న చిత్రం 'శ్రీరంగనీతులు'. ప్రవీణ్‌కుమార్ వీఎస్ఎస్ దర్శకుడు. రాధావి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై వెంకటేశ్వరరావు బల్మూరి ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఏప్రిల్ 12న చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రాన్ని పంపిణీ దారుడు, నిర్మాత ధీరజ్ మొగిలినేని ప్రపంచవ్యాప్తంగా విడుదల చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రం నుండి 'ఎక్కడవుండాలని.. ఎక్కడున్నావో.. ఏమీ అవుదామని.. ఏమీ అయ్యావో..' అనే లిరికల్ సాంగ్ విడుదల చేశారు మేకర్స్. శ్రీమణి సాహిత్యం అందించిన ఈ పాటకు హర్షవర్ధన్ రామేశ్వర్ సంగీతం అందించారు.



రుహానీ శర్మ

హారికా నారాయణ్ ఆలపించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, 'మానవ సంబంధాల గురించి, నేటి యువత మనస్తత్వాల గురించి, ప్రేమ గురించి కాన్సెప్ట్ ఓరియెంటెడ్‌గా కొనసాగే పాట ఇది. యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రంలో సినిమాలో ఉండే ఆసక్తికరమైన కథ, కథనాలను ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తూనే మనసుకు హత్తుకుంటాయి. కొత్తదనంతో పాటు పూర్తి కమర్షియల్ అంశాలతో రూపొందించిన చిత్రమిది అన్నారు.

నిర్మాత మాట్లాడుతూ,'నేటి యువత ఆలోచనలు, కుటుంబ బంధాలు..ఎంటర్‌టైన్‌మెంట్ ఇలా అన్ని అంశాల కలయికతో దర్శకుడు చిత్రాన్ని అందర్ని అలరించే విధంగా తెరకెక్కించాడు. తప్పకుండా చిత్రం అందరి ఆదరణ పొందుతుందనే నమ్మకం ఉంది. ఏప్రిల్ 12న మా చిత్రాన్ని అన్ని హంగులతో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం' అని తెలిపారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

కేజ్రీవాల్ అరెస్టు అక్రమం



- విపక్షాలను లొంగదీసుకోవడం, వినకుంటే బెదిరింపులు
- బీజేపీ మళ్లీ గెలిస్తే రేవంత్‌రెడ్డినీ వదలదు
- శాశ్వత అధ్యక్షునిగా ఉండేందుకు మోడీ కుట్ర
- గుజరాత్ సీఎంగా ఉన్నపుడే ఆయన్ను వదిలిన ఈడీ
- ఎన్నికల బాండ్లపై సుప్రీం విచారణకు ఆదేశించాలి
- మోడీ సహా అందరిపైనా కేసు పెట్టాలి
- ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలను కాంగ్రెస్ కలుపుకుపోవాలి : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను ఈడీ అరెస్టు చేయడం అక్రమమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విమర్శించారు. రూ.లక్ష కోట్ల అవినీతికి పాల్పడిన ఏపీ సీఎం జగన్‌ను వదిలేసి, రూ.వంద కోట్ల వ్యవహారంలో కేజ్రీవాల్‌ను అరెస్టు చేయడం సమంజసం కాదన్నారు. దీన్నిబట్టి ప్రతిపక్షాల పట్ల ప్రధాని మోడీ ఎలా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోందని చెప్పారు. ప్రతిపక్షాలను లొంగదీసుకోవడం, వినకపోతే ఈడీ, సీబీఐ, ఐటీ దాడులు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలను హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని మఖ్దూంభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ అనుకున్నట్టుగానే వచ్చే ఎన్నికల్లో 400 సీట్లు సాధిస్తే ఏ రాష్ట్రంలోనూ విపక్షాలను బతకనివ్వబోదనీ, చివరికి రేవంత్‌రెడ్డినీ వదలబోదనీ ఆందోళన వ్యక్తం చేశారు. హిట్లర్, ముస్సోలిని, ఫాసిజం, నాజీయిజం అన్నీ కలబోసిన వ్యక్తి మోడీ అని అన్నారు. దేశాన్ని హిందూ రాష్ట్రంగా మార్చి శాశ్వత అధ్యక్షునిగా మారేందుకు మోడీ కుట్ర చేస్తున్నారని చెప్పారు. అందులో భాగంగానే ఎన్నికల ముందు సీఏఏను తెచ్చారని అన్నారు. మోడీ అధికారంలోకి వచ్చాక బీజేపీ నేతల్లో ఒక్కరినీ ఎందుకు అరెస్టు చేయలేదన్నారు. సిసోడియాను చేసినప్పుడే కవితను ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. బీజేపీ, బీఆర్‌ఎస్ మధ్య అవగాహన ఉన్నందునే అరెస్టు చేయలేదన్నారు. కేజ్రీవాల్ లొంగుతారని ఇన్ని రోజులు వేధించారనీ, బెదిరించారని గుర్తు చేశారు. లొంగకపోవడం వల్లే అరెస్టు చేశారన్నారు. ఎన్నికల బాండ్లను సీపీఐ, సీపీఐ(ఎం) వ్యతిరేకించాయని గుర్తు చేశారు. మిగతా పార్టీలు బందిపోట్లలా సొమ్మును దోచుకున్నాయని విమర్శించారు. ఇందుకు సంబంధించి మోడీ సహా ఇతరులపై కేసులు పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. బాండ్ల రూపంలో వచ్చిన అక్రమ సంపాదనపై సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణకు ఆదేశించాలని కోరారు. 2013లో ఐటీ దాడులు నిర్వహిస్తే అప్పటి గుజరాత్ సీఎం నరేంద్రమోడీకి బిర్లా కంపెనీ రూ.24 కోట్లు, సహారా కంపెనీ రూ.40 కోట్లు చెల్లించినట్టుగా ఆధారాలు లభించాయని చెప్పారు. దీనిపై ఈడీ ఎందుకు విచారణ చేపట్టలేదని ప్రశ్నించారు. ఈ కేసులో మోడీపై ఈడీ కేసు నమోదు చేయకుండా ఎందుకు వదిలిపెట్టిందని విమర్శించారు. అమిత్ షా కొడుకు జైషా రూ.50 కోట్లతో వ్యాపారం మొదలు పెట్టి, ఏడాదిలోనే 16 వేల రెట్లు రూ.80 వేల కోట్లకు ఎలా పెరిగారని ప్రశ్నించారు. సుజనాచౌదరి లాంటి వారు బీజేపీలో చేరగానే పవిత్రులయ్యారా? అని అడిగారు. ఆ పార్టీలో లేకుంటే అపవిత్రులా?అని ప్రశ్నించారు. బీజేపీ ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో ఇండియా కూటమి భాగస్వామ్య పార్టీలను కాంగ్రెస్ కలుపుకునిపోవాలని సూచించారు. బీహార్, తమిళనాడు పరిణామాలను చూసి నేర్చుకోవాలనీ, లేదంటే కాంగ్రెస్ కకావికలం అవుతుందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పని అయిపోయిందన్నారు. దుర్మార్గమైన బీజేపీ కంటే బీఆర్‌ఎస్ ఉండటమే రాష్ట్రానికి మేలని చెప్పారు.

బీజేపీకి 270 సీట్లు దాటవు : అజీజ్‌పాషా

బీజేపీకి 400 సీట్లు రావనీ, 270 దాటబోవని సీపీఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా అన్నారు. కేజ్రీవాల్ అరెస్ట్ ప్రభావం బీజేపీపై పడుతుందన్నారు. సీఏఏ తర్వాత ఎన్నార్సీ, ఎన్పీఆర్‌ను కూడా అమలు చేస్తారని చెప్పారు. మతం ఆధారంగా పౌరసత్వం రాజ్యాంగ వ్యతిరేకమని విమర్శించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ : చాడ

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్‌రెడ్డి విమర్శించారు. ప్రతిపక్షాలను, ప్రశ్నించే గొంతులను లేకుండా చేస్తోందన్నారు.

ఎన్నికల సీట్ల సర్దుబాటు అంశంలో కాంగ్రెస్ ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో ఉండాలని సూచించారు. బీజేపీని ఓడించడమే లక్ష్యంగా ముందుకెళ్లాలని కోరారు. పంట నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలనీ, ఎకరాకు రూ.20 వేల నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పల్లా వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ, కళవేణి శంకర్, బాలనర్సింహా, ఈటి నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

మాస్కో సిటీహాల్‌లో కాల్పులు...40 మంది మృతి

- ఐదుగురు దుండగుల దుశ్చర్య

మాస్కో: మాస్కోలో రద్దీగా ఉంటే సిటీహాల్ కాల్పులతో దద్దరిల్లింది. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపు దుండగులు తెగబడ్డారు. అక్కడ కచేరి జరుగుతుండగా.. ఐదుగురు దుండగులు అమాంతంగా కాల్పులు జరిపారు..40 మంది చనిపోయినట్టు ప్రాథమిక సమాచారం. అయితే మృతుల సంఖ్య ఎక్కువగానే ఉండవచ్చని ప్రత్యక్ష సాక్షులు అంటున్నారు. గాయపడ్డ వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. సిటీహాల్‌లో కాల్పులు జరిగాయన్న వార్తతో..మృతుల కుటుంబాలు రోదనలతో అక్కడికి చేరుకున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జల సంక్షోభంతో జగడాలే !

- 220 కోట్ల మందికి మంచినీళ్లు కరువు
- నీటి కొరత తొలి బాధితులు బాలికలు, మహిళలే
- సగం జనాభాకు తాగు నీటి కొరతే : ఐక్యరాజ్య సమితి నివేదిక వెల్లడి

ఐక్యరాజ్య సమితి : అంతర్జాతీయంగా పెరుగుతున్న నీటి కొరత మరిన్ని ఘర్షణలకు ఆజ్యం పోస్తోంది. ఫలితంగా అస్థిరతకు దారితీస్తోందని ఐక్యరాజ్యసమితి ఒక నివేదికలో హెచ్చరించింది. శాంతిని పెంపొందింపచేయాలంటే పరిశుద్ధమైన నీరు అనేది కీలకమైన అంశమని పేర్కొంది. ఐక్యరాజ్య సమితి జలాభివృద్ధి నివేదిక 2024 శుక్రవారం విడుదలైంది. శాంతి సౌభాగ్యాలకు నీరు అనే శీర్షికతో ఈ నివేదికను వెలువరించారు. ఆర్థిక వ్యవస్థలు, జనాభాలు పెరుగుతుండడంతో జల వనరులపై తీవ్ర ఒత్తిడి పెరుగుతోందని, దాదాపు 220 కోట్ల మందికి పరిశుద్ధమైన తాగునీరు అందుబాటులో లేని పరిస్థితులు ప్రస్తుతం నెలకొన్నాయని పేర్కొంది. 350 కోట్ల మంది ప్రజలకు సురక్షితమైన పారిశుధ్యం అందుబాటులో లేదని వెల్లడించింది.

నీటి కొరతకు మొదటి బాధితులు బాలికలు, మహిళలేనని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో నీటిని తీసుకురావడం ప్రధానంగా మహిళల బాధ్యతగా వుంటుందని, అందువల్ల అక్కడ ఇబ్బందులు పడేది వారేనని తెలిపింది. సుదూర ప్రాంతాల నుండి ఇంటి అవసరాల కోసం నీరు తీసుకురావడం, దానికోసం అనేక గంటలు వెచ్చించడం, పైగా సురక్షితమైన పారిశుధ్యం కరువవడం ఇవన్నీ బాలికలు పాఠశాలను మానేయడానికి దారి తీస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది.నీటి కొరతలతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు పెచ్చరిల్లడమే కాకుండా ప్రాథమిక హక్కులకు కూడా తీవ్రమైన ముప్పుగా పరిణమిస్తుందని ఈ నివేదిక విడుదల సందర్భంగా యునెస్కో చీఫ్ ఆండ్రీ అజులే వ్యాఖ్యానించారు. గాజాలో తాజా, పరిశుభ్రమైన తాగు నీరు అందుబాటులో లేకుండా ఇజ్రాయిల్ అనేక ఆంక్షలను విధిస్తోంది. పైగా శుద్ధమైన నీరు లేని పక్షంలో వైద్య చికిత్సకు కూడా ఇబ్బందులు ఎదురవుతాయని ఐక్యరాజ్య సమితి సంస్థలు సుదీర్ఘ కాలంగా హెచ్చరిస్తూనే వున్నాయి. నీటి కొరత వల్ల వలసలు కూడా పెరుగుతాయని, ఇలా నిర్వాసితులు ఆశ్రయం ఏర్పరచుకున్న ప్రాంతాల్లో జల వనరులపై ఒత్తిడి పెరుగుతుందని నివేదికలో పేర్కొన్నారు.

టాటా ఎఐఎ నుంచి రైజింగ్ ఇండియా ఫండ్

ముంబయి : జీవిత బీమా సంస్థల్లో ఒకటైన టాటా ఎఐఎ లైఫ్ ఇన్సూరెన్స్ (టాటా ఎఐఎ) కొత్తగా టాటా ఎఐఎ రైజింగ్ ఇండియా ఫండ్‌ను విడుదల చేసినట్లు ప్రకటించింది. ఈ కొత్త ఫండ్ ఆఫరింగ్ (ఎన్ఎఫ్ఒ) మార్చి 31 వరకు తెరిచి ఉంటుందని.. అదే రోజు యూనిట్ల జారీ ఉంటుందని పేర్కొంది. తమ సంస్థ ఫండ్స్‌లో పెట్టుబడి పెట్టడం ద్వారా ఈక్విటీ మార్కెట్ దీర్ఘకాలిక వృద్ధి సంభావ్యత నుండి తమ వినియోగదారులు ప్రయోజనం పొందుతున్నారని టాటా ఎఐఎ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ హర్షద్ పాటిల్ తెలిపారు. 2024 ఫిబ్రవరి ముగింపు నాటికి సంస్థ మొత్తం ఆస్తి (ఎయుఎం) రూ.96,532 కోట్లుగా ఉందన్నారు.

వర్ధన చేతికి ఐఎస్ఎఫ్‌సి స్కూల్ పోర్టుపోలియో

హైదరాబాద్ : భారత్‌లో విద్యా రంగానికి ఫైనాన్స్ చేసే స్కూల్ ఫైనాన్స్ కంపెనీ (ఐఎస్ఎఫ్‌సి)కి చెందిన స్కూల్ పోర్టుపోలియోను స్వాధీనం చేసుకున్నట్లు ఎన్‌బిఎఫ్‌సి వర్ధనా ఫైనాన్స్ తెలిపింది. ప్రయివేటు పాఠశాలలు, విద్యార్థులకు ఉన్నత విద్యను అభ్యసించడానికి వర్ధన రుణాలు అందిస్తుంది. తమ నిర్ణయం ఈ రంగంలో కీలకమైన మలుపును సూచిస్తుందని వర్ధన ఫైనాన్స్ పేర్కొంది. ఈ స్వాధీనంతో దేశంలోని 4 లక్షల ప్రయివేటు పాఠశాలలకు మద్దతునందించనున్నట్లు వర్ధన సిఇఒ, కో ఫౌండర్ స్టేవ్ హర్డ్‌గ్రవ్ తెలిపారు.

సన్ రైజర్స్ భాగస్వామిగా ఆరుణ్ ఐస్‌క్రీమ్స్

హైదరాబాద్ : టి20 కప్ 2024 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు అధికారిక ఐస్‌క్రీమ్ భాగస్వామిగా అరుణ్ ఐస్‌క్రీమ్స్ వ్యవహరించనున్నట్లు ఆ సంస్థ తెలిపింది. ఈ భాగస్వామ్యం తమకు ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుందని అరుణ్ ఐస్‌క్రీమ్స్ పేర్కొంది. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందించాలనే తమ నిబద్ధతను ఈ భాగస్వామ్యం బలపరుస్తుందని తెలిపింది. ఈ ఒప్పందంలో టి20 కప్ 2024 సీజన్ అంతటా సన్‌రైజర్స్ హైదరాబాద్ ఆటగాళ్ల లీడ్ హెల్మెట్లు, టోపిలపై అరుణ్ ఐస్‌క్రీమ్స్ లోగోను ప్రదర్శించనున్నామని పేర్కొంది.

ఇఎస్ఎఎఫ్ ఎస్ఎఫ్‌బి ఖాతాదారులకు కేర్ హెల్త్ సేవలు

న్యూఢిల్లీ : కార్పొరేట్ ఎజెన్సీ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు ఇఎస్ఎఎఫ్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, కేర్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలు తెలిపాయి. దీంతో వినియోగదారులకు విస్తృత శ్రేణిలో ఆర్థిక పరిష్కారాలను అందించాలనే లక్ష్యంతో ఈ భాగస్వామ్యం కుదుర్చుకున్నట్లు పేర్కొన్నాయి. తమ వినియోగదారులకు ఆరోగ్య బీమా పరిష్కరాలను అందించడానికి ఈ ఒప్పందం దోహదం చేయనుందని ఇఎస్ఎఎఫ్ ఎస్ఎఫ్‌బి ఎండి, సిఇఒ కె పౌల్ థామస్ తెలిపారు.

బడిలో కీచక ఉపాధ్యాయుడు

- గుడ్‌టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పిస్తుండగా..
- బయటపెట్టిన ప్రైమరీ విద్యార్థులు: ఫోక్సో చట్టం కింద కేసు నమోదు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడు కీచకుడిగా మారాడు. ప్రాథమిక పాఠశాల విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట్ మండలం జప్తి జానకంపల్లిలో ఆలస్యంగా శుక్రవారం వెలుగుజూసింది. ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జప్తి జానకంపల్లిలో గల ప్రాథమిక పాఠశాలలో గురువారం షీ టీమ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదే స్కూల్లో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గుండార ప్రవీణ్.. తమ పట్ల ప్రవర్తిస్తున్న తీరును పలువురు విద్యార్థినులు షీ టీమ్ దృష్టికి తీసుకెళ్లారు. షీ టీమ్ సమాచారంతో శుక్రవారం గ్రామానికి చేరుకున్న డీఎస్పీ శ్రీనివాస్ విచారణ చేపట్టగా.. కీచక ఉపాధ్యాయుడి నిర్వాకం బయట పడింది. కొన్ని రోజులుగా ఉపాధ్యాయుడు విద్యార్థుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నట్టు తేలింది. అతనిపై ఫోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. డీఎస్పీ వెంట ఎల్లారెడ్డి సీఐ రవీందర్ నాయక్, ఎస్ఐ రాజు ఉన్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు ప్రవీణ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.

'ట్రాన్స్‌జెండర్ల సంక్షేమ' సమావేశం వాయిదా

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ట్రాన్స్‌జెండర్ల సంక్షేమం కోసం పనిచేస్తున్న ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలతో, స్వచ్ఛంద సంస్థలతో శనివారం జరగాల్సిన సమావేశాన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్టు తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్య కార్యదర్శి ఎస్.గోవర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశం నిర్వహించే తదుపరి తేదీని త్వరలో తెలియజేస్తామని శుక్రవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

రైళ్ల నిర్వహణలో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించండి

- దక్షిణ మధ్య రైల్వే జీఎం ఏకే జైన్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రైళ్ల నిర్వహణలో భద్రతా నియమాలను కచ్చితంగా పాటించాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ ఏకే జైన్ సిబ్బంది, అధికారులకు సూచించారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో జోన్‌వ్యాప్తంగా రైలు కార్యకలాపాల భద్రత, సమయపాలన, పలు ట్రాఫిక్ సౌకర్యాల పనుల పురోగతిపై సమీక్షా సమావేశం జరిగింది. ఇందులో దక్షిణ మధ్య రైల్వే అదనపు జనరల్ మేనేజర్ ఆర్. ధనంజయులుతో పాటు అన్ని శాఖల ప్రిన్సిపల్ హెడ్స్‌తో పాటు సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ మొత్తం ఆరు డివిజన్ల డివిజనల్ రైల్వే మేనేజర్‌లు (డీఆర్ఎం) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. రైళ్లను సురక్షితంగా నడిపేందుకు భద్రతా విధానాలను కచ్చితంగా పాటించాలనీ, లోకో పైలెట్లు, అసిస్టెంట్ లోకో పైలెట్లు, గార్డులు తదితరులంతా భద్రతా సంబంధిత సిబ్బందికి తరచుగా క్షేత్ర తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. జోన్‌లో పొగను గుర్తించే పరికరాలు, అగ్నిమాపక పరికరాలు తదితర అగ్నిమాపక నిరోధక భద్రతా వస్తువుల లభ్యతను సైతం సమీక్షించారు. అత్యవసర పరిస్థితుల్లో సరిపడా నిల్వలు ఉండేలా చూడాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రయాణీకుల భద్రత కోసం నాన్-ఇంటర్‌లాకింగ్ లెవల్ క్రాసింగ్ గేట్ల వద్ద వాయిస్ లాగర్ సౌకర్యాలను కల్పించడంపై కూడా ఆయన నొక్కి చెప్పారు. తదనంతరం మెయిల్,ఎక్స్‌ప్రెస్ రైలు సమయపాలనపై చర్చించుతూ , ట్రాక్ సామర్థ్యాన్ని పూర్తిగా వినియోగించుకొని సమయపాలనను మెరుగుపరచుకోవాలని అధికారులకు సూచించారు. రైలు కార్యకలాపాలలో జోన్ యొక్క సమయపాలన గణనీయమైన మెరుగుదలకు సాక్ష్యమిచ్చేలా



నగటు వేగాన్ని మెరుగుపరచడానికి కచ్చితమైన ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. రన్నింగ్ స్టాఫ్ పనివేళలపై సమీక్షించి, సిబ్బందికి తమ విధులను సజావుగా నిర్వహించేందుకు, సురక్షితమైన పని పరిస్థితులు ఉండేలా పనివేళలపై ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

సరకు లోడింగ్, అన్‌లోడ్ చేయడానికి అదనపు లూప్ లైన్ల ఏర్పాటు, హాల్ట్ స్టేషన్లను క్రాసింగ్ స్టేషన్లుగా మార్చడం , పొడవైన లూప్ లైన్ల ఏర్పాటు వంటి ట్రాఫిక్ సౌకర్యాల పనుల పురోగతిని కూడా సమీక్షించారు. నిర్దేశిత సమయానికి ముందే పూర్తి చేసేలా పనులను వేగవంతం చేయాలని డివిజనల్ రైల్వే మేనేజర్లను ఆదేశించారు. అమృత్ భారత్ స్టేషన్ల పథకం కింద అమృత్ స్టేషన్ల ప్యాసింజర్ సౌకర్యాలు పునరాభివద్ధి పనులకు సంబంధించి జరుగుతున్న అభివద్ధి పనుల స్థితిగతులపై డివిజనల్ రైల్వే మేనేజర్ల తో చర్చించారు.

రైతు ఆత్మహత్యలు మళ్లీ మొదలయ్యాయి

మా పార్టీలో గెలిచి కాంగ్రెస్‌లోకి వెళితే చెప్పుదెబ్బలు తప్పవు :బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

గత బీఆర్‌ఎస్ పాలనలో ఆగిపోయిన రైతుల ఆత్మహత్యలు మళ్లీ మొదల్యయాయని ఆ పార్టీ ఎమ్మెల్యే, రైతు బంధు సమితి మాజీ అధ్యక్షులు పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. 2014కు ముందు రైతుల ఆత్మహత్యలుండేవనీ, 2014 నుంచి బీఆర్‌ఎస్ తీసుకున్న చర్యలతో అవి ఆగిపోయాయని ఆయన తెలిపారు. తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మళ్లీ రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిలోకి నెట్టబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎం.శ్రీనివాస్ రెడ్డి, బీఆర్‌ఎస్ ఎస్టీ సెల్ రూప్‌సింగ్‌లతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. అకాలవర్షాలు, వడగండ్ల కారణంగా రెండు లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగినా అంచనా వేయడం లేదనీ, రైతులను పరామర్శించడం లేదని ఆయన విమర్శించారు. గత ప్రభుత్వం పంట నష్టం అంచనా వేయలేదంటూ విమర్శిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు వచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వం రైతు బంధు కోసం కేటాయించిన రూ.7,500 కోట్లు వారికి వేయకుండా ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసి ఆపారని పల్లా ఈ సందర్భంగా విమర్శించారు. అందరికీ రైతు బంధు డబ్బులు వేయాలని ఆయన డిమాండ్ చేశారు. కాంగ్రెస్ గద్దెనెక్కాక రూ.16,500 కోట్లు అప్పులు చేశారనీ, ఆ డబ్బులు ఏమయ్యాయని ప్రశ్నించారు. రూ.500 బోనస్ ఇచ్చి వడ్లు కొనాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ పాలనలో రైతులు వరి, మిర్చి అత్యధికంగా పండించారనీ, పత్తి విషయంలో మూడో స్థానానికి చేరుకున్నామని తెలిపారు.

చెప్పుదెబ్బలే...

బీఆర్‌ఎస్‌లో గెలిచి కాంగ్రెస్‌లోకి వెళుతున్న నేతలను ప్రజలు చెప్పులతో కొడతారని పల్లా హెచ్చరించారు. అక్రమాలు చేసేందుకే అధికార పార్టీలోకి వారు వెళుతున్నారని ఆరోపించారు. వారి అక్రమాలను బీఆర్‌ఎస్ బయటపెడుతుందని హెచ్చరించారు.

గొల్లకురుమలకు సముచిత స్థానం కల్పించాలి

- విస్మరించే పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో బుద్ధిచెబుతాం :
- యాదవ, కురుమల రాజ్యాధికార ఐక్యవేదిక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ జనాభాలో 18 శాతంగా ఉన్న గొల్లకురుమలకు రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని యాదవ, కురుమల రాజ్యాధికార ఐక్య వేదిక డిమాండ్ చేసింది. విస్మరించే పార్టీలకు లోక్‌సభ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించింది. కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ సీట్ల కేటాయింపులోనూ, నామినేటెడ్ పదవుల్లోనూ గొల్లకురుమలకు న్యాయం చేయాలని



డిమాండ్ చేసింది. శుక్రవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'మేమేంతో.. మాకంత' నినాదంతో యాదవ కురుమల రాజ్యాధికార ఐక్య వేదిక ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.

అందులో ప్రొఫెసర్ సింహాద్రి యాదవ్, ప్రొఫెసర్ బీసవేని రామయాదవ్, క్యామ మల్లేష్, దూదిమెట్ల బాలరాజు యాదవ్, అల్ ఇండియా యాదవ మహాసభ రమేష్ యాదవ్, మేకల కృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ..తమ సామాజిక తరగతి ఓట్లతో అధికారం చేపట్టి పదవుల విషయంలో మాత్రం నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణలో గొల్లకురుమల మద్దతుతో అధికారం చేపట్టిన కాంగ్రెస్ పార్టీ నామినేటెడ్ పదవులు కేటాయింపులో అన్యాయం చేసిందనీ విమర్శించారు. లోక్ సభ సీట్లతో పాటు నామినేటెడ్ పదవుల్లో వారికి సముచిత స్థానం కల్పించాలని కోరారు.

మద్యం పాలసీ కేసులో కాంగ్రెస్ హైకమాండ్ దారి వేరు..

- బీజేపీకి బీ టీమ్ లీడర్‌గా రేవంత్ రెడ్డి :మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

మద్యం పాలసీ కేసులో ఈడీ, సీబీఐ వ్యహరిస్తున్న తీరుపై రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకులు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలు స్పందిస్తున్న తీరుకు పూర్తి వ్యతిరేకంగా పీసీసీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, ఎమ్మెల్యే టి హరీష్‌రావు విమర్శించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రేవంత్ రెడ్డి తీరు చూస్తుంటే బీజేపీకి బీ టీం లీడర్‌గా మాట్లాడుతున్నారు తప్ప.. జాతీయ కాంగ్రెస్‌కు రాష్ట్ర ప్రతినిధిగా వ్యవహరిస్తున్నట్టుగా లేదని పేర్కొన్నారు. ఖర్గే, రాహుల్ నాయకత్వంలో పనిచేయడం లేదనీ, కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకంగా, బీజేపీకీ, మోడీకి అనుకూలంగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు. మద్యం కేసు విషయంలో బీఆర్‌ఎస్ చెబుతున్న విషయాన్నే ఖర్గే , రాహుల్ చెప్పారని గుర్తు చేశారు.

మోడీ ప్రభుత్వం కేంద్ర దర్యాప్తు సంస్థలను తమకు అనుకూలంగా మార్చుకుందనీ, లిక్కర్ స్కామ్ పేరుతో రాజకీయ వేధింపుల కోసం దర్యాప్తు సంస్థలను వాడుకుంటున్నదని తెలిపారు. ఈ విషయాన్ని ఏఐసీసీ కూడా బలపరిచిందని పేర్కొన్నారు. లిక్కర్ స్కామ్ అనేది పూర్తిగా కల్పితమనీ, కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను ఉపయోగించి రాజకీయ ప్రత్యర్థులపై తప్పుడు కేసులు పెడుతున్నదని వాపోయారు. వివిధ పార్టీల నేతలను అక్రమంగా అరెస్టులు చేస్తున్నారంటూ ఖర్గే, రాహుల్. ఆరోపిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు మాత్రం ఏఐసీసీ నాయకులు మాట్లాడిన దానికి విరుద్ధంగా మాట్లాడుతున్నారని తెలిపారు. లిక్కర్ స్కామ్ జరిగిందనీ, అందులో నిందితులను అరెస్టు చేయటం ఆలస్యమైందంటూ వ్యాఖ్యానిస్తున్నారని తెలిపారు.

రేవంత్ రెడ్డి కాంగ్రెస్ మనిషి కాదనీ, ఆరెస్సెస్ భావజాలం నిండి ఉన్న మోడీ మనిషి అని తాము ముందు నుంచీ చెప్తున్నామని గుర్తు చేశారు. సీఎం రేవంత్ తాను కాంగ్రెస్‌లో ఉన్న విషయాన్ని మర్చిపోయి.. కేవలం బీఆర్‌ఎస్‌ను రాజకీయంగా ఇబ్బంది పెట్టేందుకే బీఆర్‌ఎస్ పై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు.

8 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్ర శాసనసభకు గతేడాది నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన ఎనిమిది మంది ఎమ్మెల్యలకు హైకోర్టు నోటీసులిచ్చింది. బీఆర్‌ఎస్ తరఫున ఎమ్మెల్యేలుగా గెలిచిన గద్వాల ఎమ్మెల్యే కష్ణమోహన్‌రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, అసిఫాబాద్ ఎమ్మెల్యే కోవా లక్ష్మి, జూబ్లీహిల్స్ ఎమ్మల్యే మాగంటి గోపీనాథ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కాంగ్రెస్ తరఫున గెలిచిన మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యన్నం శ్రీనివాసరెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, కొత్తగూడెం నుంచి సీపీఐ తరఫున గెలిచిన ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావులకు నోటీసులు జారీ చేసింది. వాళ్లపై పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థులు వేసిన కేసులను విచారించిన న్యాయూమర్తులు, వాళ్లకు నోటీసులు జారీ చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించారు. విచారణను వాయిదా వేశారు. మరో నలుగురు ఎమ్మెల్యేల ఎన్నికలను సవాల్ చేసిన పిటిషన్లను హైకోర్టు విచారణ చేయనుంది. బీఆర్‌ఎస్ తరఫున కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు, ఖానాపూర్ ఎమ్మెల్యే ఎ. బొజ్జు, కాంగ్రెస్ తరఫున గెలించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఎమ్మెల్యే రాంబాస్ మాలోత్ ఎన్నికలను సవాల్ చేసిన పిటిషన్లు విచారిస్తుంది.

పరిహారం ఇవ్వకపోతే కోర్టుకు రావాలి-హైకోర్టు

కోర్టు ఆదేశాల తర్వాత కూడా భూపరిహారం చెల్లించని యాదాద్రి-భువనగిరి జిల్లా కలెక్టర్, ఆర్డీవో, ఎమ్మార్వోలకు హైకోర్టు ధిక్కరణ నోటీసులు ఇచ్చింది. 3 వారాల్లోగా పరిహారం చెల్లించాలనీ, లేదంటే ఏప్రిల్ 12న జరిగే విచారణకు అధికారులు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. తుర్కపల్లి మండలం గోపాలపల్లిలో పాఠశాల, వాటర్ ట్యాంక్, బస్టాండ్‌ల కోసం గతంలో సేకరించిన భూమికి పరిహారం చెల్లించాలని రెండేళ్ల క్రితం ఆగస్టులో తీర్పును అమలు చేయలేదంటూ గోపాలపల్లికి చెందిన రహీముద్దీన్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి శుక్రవారం విచారించి ఉత్తర్వులు జారీ చేశారు. విచారణను ఏప్రిల్ 1కి వాయిదా వేశారు.

గుడి,బడుల దగ్గర బార్‌పై వివరణ ఇవ్వండి-హైకోర్టు

హైదరాబాద్, హయత్‌నగర్ నుంచి సాహెబ్‌నగర్‌కు వెళ్లే మెయిన్‌రోడ్‌లో నివాస ప్రాంతంలో బార్ అండ్ రెస్టారెంట్‌కు అనుమతి ఇవ్వడంపై వివరణ ఇవ్వాలని ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సాయి యువ బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటుకు అనుమతిపై కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులైన చీఫ్ సెక్రటరీ, ఎక్సైజ్, హోం శాఖల ముఖ్య కార్యదర్శులు, జీహెచ్ఎంసీ, ఎక్సైజ్ శాఖ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, రాచకొండ పోలీసు కమిషనర్, హయత్‌నగర్ ఎస్ఏహెచ్ఓలను ఆదేశించింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ అలోక్ అరథే, జస్టిస్ జె.అనిల్‌కుమార్లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

తమ కాలనీ నివాసాల మధ్య ప్రధాన రహదారిపై బార్ అండ్ రెస్టారెంట్ ఉందనీ, దీంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నామంటూ ఆరో తరగతి స్టూడెంట్ ఆర్.వైష్ణవి హైకోర్టుకు లేఖ రాసింది. ఆ లేఖను హైకోర్టులో సుమోటో పిల్‌గా పరిగణించి విచారణ చేపట్టింది. బార్ అండ్ రెస్టారెంట్‌కు 70 మీటర్ల దూరంలోనే పాఠశాలలు, కాలేజీలు ఉన్నాయి. శివాలయం కూడా ఉంది. వద్ధాశ్రమం కూడా ఉంది. టుటోరియల్స్ కూడా ఉన్నాయి. సీబీఐ కాలనీ, సిద్ధి వినాయక కాలనీ, ధరణి కాలనీ, అనంతవేణి నగర్ వాసులతో ఆ ప్రాంతం రద్దీగా ఉంటుంది. కోచింగ్‌కు వెళ్లేప్పుడు ఒంటిరిగా వెళ్లేందుకు స్టూడెంట్స్ ఇబ్బందులు పడుతున్నారు. కోచింగ్ సెంటర్లలో సాయంత్రం 5 నుంచి తరగతులుంటాయి. కోచింగ్ సెంటర్లకు పిల్లలను ఒంటరిగా పంపడానికి పేరెంట్స్ ఇష్టపడటం లేదు. అక్కడి ఆలయానికి వెళ్లడానికి భక్తులు ముఖ్యంగా మహిళలు ఇబ్బందులు పడుతున్నారు. సీనియర్ సిటిజన్స్ నిత్యావసరాల కోసం బయటకు రాలేకపోతున్నారు. పాలు, కూరగాయలు వంటి నిత్యవసరాలకు వెళ్లడానికి ఆసక్తి చూపడంలేదు. కొందరు మద్యం సేవించి వీరంగం చేస్తున్నారు. జనావాసాల మధ్య మద్యం దుకాణంపై తగిన చర్యలు తీసుకోవాలి.. అని లేఖలో వైష్ణవి ఆ లేఖలో పేర్కొన్నారు.

జెన్‌కో ద్వారానే విద్యుదుత్పత్తి కేంద్రాల నిర్మాణం - టీఎస్‌పీఈజేఏసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను జెన్‌కో ద్వారానే నిర్మించాలని టీఎస్‌పీఈ జేఏసీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీకి విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు వినతి పత్రాన్ని సమర్పించారు. రామగుండం థర్మల్ పవర్ స్టేషన్‌ను మూసేసి, సుమారుగా 580 ఎకరాల స్థలాన్ని సింగరేణికి అప్పగించారని వారు తెలిపారు. అక్కడ సింగరేణి ద్వారా విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించేందుకు సూచన ప్రాయంగా ఆలోచిస్తున్న నేపథ్యంలో వేలాది మంది ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థైన జెన్‌కోను కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం నిర్మించబోయే నూతన ప్రాజెక్టులన్నింటినీ జెన్‌కో ద్వారానే నిర్మించాలని డిమాండ్ చేశారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను గత కాంగ్రెస్ ప్రభుత్వమే ప్రభుత్వ రంగంలో కొనసాగించి, ప్రజలకు మేలు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో తెలంగాణ విద్యుత్ జేఏసీ నాయకులు వెంకటేశ్వర్లు, రత్నాకర్ రావు, ప్రభాకర్ గౌడ్, బీసీ రెడ్డి, వజీర్ , పి.సదానందం, కే.కుమారస్వామి, సంపత్ రెడ్డి, కుమారస్వామి, కరుణాకర్ రెడ్డి, తులసీ నాగరాణి, నెహ్రూ , రామగుండంకు చెందిన శంకరయ్య, శ్రీనివాసు తదితర నాయకులు పాల్గొన్నారు. సీఎండీ స్పందిస్తూ జేఏసీ నాయకుల విజ్ఞప్తి మేరకు జెన్‌కో సంస్థకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.